# మహమ్మదీయ మహాయుగము

(ప్రథమ భాగం)



954.02
VEN

కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, ఎం.ఏ

C2

# మహమ్మదీయ చరిత్రము

ప్రథమభాగము


గ్రంథకర్త:

కీ. శే. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, ఎం. ఏ.

Edited & Revised by

Sri Nelaturi Venkataramanaiah

(one time Reader in History, University of Madras)



DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY

N10027

MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10,027



ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ.

ఆదర్శ ప్రచురణ :
పునర్ముద్రణ
వేయి ప్రతులు
జనవరి, 1964.

వెల: 5-00

ముద్రణ :
'వెంకటరత్నా'
విజయవాడ-2.

111 AOUA102B139

కీ. శే. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు ఎం. ఏ.,

VA

VB

# పీఠిక

ఒక సంవత్సరముక్రింద నీ గ్రంథముయొక్క ప్రథమ భాగము. 'హిందూ మహాయుగ'మను ప్రథమ భాగమును నది ప్రాసియుంటిని. ఆ గ్రంథ మచ్చు పడిన యైదునెలలలోనే వేయి ప్రతులను అందఱును ఆదరం వ్యయమయ్యెను. అందుచే రెండవ చుట. కూర్పు రెండునెలలక్రింద నచ్చువేయిం చితిమి. నేఁటివఱకు రెండవకూర్పుయొక్క యైదువందల ప్రతులమ్మడు పోయినవి. అనేక విద్వాంసు లీ గ్రంథమును గుఱించి తమ యనుకూలాభిప్రాయములను దెల్పిరి. చెన్న పురి విశ్వవిద్యాలయపువారు(University of Madras) ఈ గ్రంథములోని కొన్ని భాగములు 1909 వ సంవత్సరపు ప్రవేశ పరీక్షకుఁ (Matriculation) బఠనీయములు (Text) గా నేర్పఱిచిరి. ఇట్టి గ్రంథముయొక్క ప్రథమభాగమును గుఱించి నా కన్ని విధములను ప్రోత్సాహమే కలిగినందున నీ ద్వితీయ భాగమును ప్రాసి ప్రకటింప సాహసించితిని.

ఈ గ్రంథమందలి విషయములు.

ఈ భాగమునకు 'మహమ్మదీయ మహాయుగ' మని పేరు. మొదటిభాగమగు 'హిందూ మహా యుగము' నందు మహమ్మదీయులీ దేశ మునకు వచ్చువఱకును జరిగిన కథా

భాగమున్నది. ఈ భాగమునందు ముసల్మాను లీ దేశమునకు మొదట వచ్చినప్పటి నుండియు (క్రీ. శ. 664) మోగల ప్రభుత్వ మంతరించువఱకును (1806) హిందూదేశములో జరిగిన చరిత్రాంశములు వర్ణింపఁబడినవి.

ఈ భాగ మూఱు ప్రకరణములుగా విభజింపఁబడినది. మొదటి ప్రకరణములో ముసల్మానుల పూర్వవృత్తాంతమును వా రీ దేశమునకు మొదట వచ్చినప్పటినుండియు స్థానేశ్వర యుద్ధములో (క్రీ. శ. 1163) హిందూదేశ స్వాతంత్ర్యమును హరించువఱకునుగల వృత్తాంత ముండును. రెండవ ప్రకరణమునందు అఫ్గానుల ప్రభుత్వము వర్ణింపఁబడినది. ఈ సుల్తానులు డిల్లీపట్టణమును క్రీ. శ. 1206 మొదలు 1526 వఱకు నేలిరి. మూఁడవ ప్రకరణములో మోగలాయి చక్రవర్తుల రాజ్యపరిపాలనముయొక్క వృత్తాంతము గలదు. నాల్గవ ప్రకరణములో బహమనీరాజుల వృత్తాంతమును, అందుండి పుట్టిన (1) బెరీద్ శాహి (బేదర్), (2) ఇమాం శాహి (వరాడ్), (3) నిజాంశాహి (అహమద్‌నగర్), (4) ఆదిల్ శాహి (విజాపుర్), (5) కుతుబ్ శాహి (గోలకొండ) అనెడి యైదు రాజ్యముల కథలును జెప్పఁబడినవి. ఇదివఱకు వ్రాయఁబడిన చరిత్రగ్రంథముల ననుసరించిన యెడల ఈ రెండవభాగ మీ నాల్గు ప్రకరణములతోముగిసి యుండవలయును. కాని 'మహమ్మదీయ మహాయుగ'మనఁగా

మహమ్మదీయులచరిత్ర మాత్రమని యర్థముగాదు. ఇదికాల సూచకమైన యొక గుఱుతు. ఈ కాలమునందు హిందూదేశ మందు హిందూ రాజ్యము లనేకములు ప్రబలెను. ముసల్మాన్ రాజ్యమునకుఁ ప్రబల ప్రతిస్పర్థులయిన ఈ రాజుల యశో గానము చేసినఁగాని ఈ కాలపుచరిత్ర పూర్తిగా వర్ణించితి మని చెప్పుట తప్పు. వైభవాదికములలో ఢిల్లీ రాజ్యమును గూడ మించినట్టి విజయనగరసామ్రాజ్యమును గుఱించి యిప్పటి చరిత్ర గ్రంథములలోఁ బదిపంక్తులు వ్రాయుదురు! ఇది మిక్కిలి యన్యాయము. నే నట్లు చేయనొల్లక హిందూ రాజుల పౌరుషాదులను మహమ్మదీయుల పౌరుషాదులతోఁ బాటు వర్ణించినాఁడను.

మహమ్మదీయులను మొదటినుండియు నుత్తరమున నెదిరించినవారు రాజపుత్రులు; దక్షిణమునందు నడ్డగించిన వారు విజయనగరరాజులు. కావున వీరి చరిత్రలను సవిస్తరముగా నైదవ యాఱవ ప్రకరణములలో వర్ణించినాఁడను. మహారాష్ట్రుల చరిత్రకూడ నిందు రావలసినదే. కాని యాచరిత్ర కొద్దిలో వ్రాయుట కిష్టములేక యిందు విడిచి వేసినాఁడను. ఈ గ్రంథము యొక్క మూఁడవ భాగము నందు మహారాష్ట్రుల చరిత్ర సవిస్తరముగా వర్ణింపఁబడును. ఇదివఱ కనుకొన్నట్లు ఈగ్రంథము మూఁడుభాగములలోఁ గాక నాలుగుభాగములలోఁ బూర్తిచేయఁబడును. మూఁడవ భాగములో మహారాష్ట్రుల చరిత్రయు, నాల్గవభాగములో బ్రిటిషు ప్రభుత్వమును వర్ణింపఁబడును.

హిందువులు ముసల్మానులకు సామాన్యముగా వశులుకాకైరి. వారు తురుష్కులను బూర్తిగా

ఆ కాలములోని హిందువు లేమిచేసిరి?

సార్వభౌమత్వ మనుభవింపనీయ లేదు. ఒకానొకప్పు డోడిపోయినను మరలఁ బ్రోత్సాహము తెచ్చుకొని తమ స్వాతంత్ర్యమును సంపాదించు చుండిరి. దీనిని గుఱించి నేను చెప్పుటకంటెను విఖ్యాత చరిత్ర లేఖకుండగు డాక్టర్ డబ్ల్యు. డబ్ల్యు. హంటర్ వ్రాసిన యంశము లిచ్చట నుదాహరించుట మంచిదనితలఁచియట్లు చేయుచున్నాఁడను:—

మహమ్మదీయ దిగ్విజయ మసంపూర్ణమైనది.

'మహమ్మదీయులకు హిందూదేశము సులభముగా స్వాధీన మయ్యెనని సామాన్యముగా జను లనుకొను మాట నమ్మఁదగిన చరిత్రాంశము కాదు.... మహమ్మదీయులు హిందూదేశమంతయు నెప్పు డును

వారివిజయ మల్పకాలవర్తి యైనది.

జయింపలేదు. గొప్ప రాజ్యములను హిందూరాజులే యెల్లప్పుడు నేలుచుండిరి. మహమ్మదీయ ప్రభుత్వము మహోన్నత దశయందున్నప్పుడు కొందఱు హిందూరాజపుత్రులు డిల్లీశ్వరునకుఁ గప్పము కట్టుచు నాతని యాస్థానమునకుఁ దమరాయబారులఁ బంపుచుండిరి. కాని డిల్లీశ్వరుల కీయ సంపూర్ణ సార్వభౌమత్వమునూడ నూట యేఁబది యేండ్లయినను (1560_1707) దక్కినదికాదు. ఇంతలోనే హిందువులు

దేశ సైన్యజయమును మరల ప్రారంభించిరి. రాజపుత్ర స్థానములోని శౌర్యాగ్ని ఢిల్లీరాజ్యమును దక్షిణమునుండి ముట్టడి వేయుచుండెను. వాయవ్యదిక్కున సిక్కులను మత సంఘమువారు క్రొత్త వీరులుగామాఱిం

హిందువులు ముసల్మానుల యొద్దనుండి తమ దేశమును మరల సంపాదించిరి. 1707-1761.

జొచ్చిరి. ప్రిందిజాతులవారియుద్ధసామర్థ్యమునకు, బ్రాహ్మణుల రాజనీతినైపుణ్యం బునుజతపఱిచి మరాటావారు హిందూదేశమునం దంతటను దురుష్కరాజులు తమకుం గప్పములు కట్టునట్లుగాఁ జేయుచుండిరి. ప్రస్తుతము మన మూహాచేయఁ గలిగి సంతవఱిచికు జూడఁగా నింగ్లీషువారీ శతాబ్ది ప్రారంభంబున నడ్డపడి యుండని యెడల మోగలరాజ్యము హిందువుల స్వాధీనమై యుండును.' *

---

* "The popular notion that India fell an easy prey to the Mussalmans is opposed to historical facts.....At no time was Islam triumphant throughout the whole of India. Hindu dynasties always ruled over large areas. At the height of the Muhammadan power, the Hindu princes paid tribute and sent agents to the Imperial Court. But even this modified supremacy of Delhi did not last for 150 years (1560-1707). Before the end of that brief period, the Hindus had begun the work of re-conquest. The Hindu chivalry of Rajputana was closing in upon Delhi from the south; the religious confederation of the Sikhs was growing into a military power on the north-west. The Mahrattas had combined the fighting powers of the low-castes with the statesmanship of the Brahmins, and were subjecting the Muhammadan kingdoms throughout all India to tribute. As far as can now be estimated, the advance of the English power at the beginning of the present century alone saved the Mogul Empire from passing to the Hindus."—Dr. W. W. Hunter's "Indian Empire", 3 rd Edition, p. 323.

ఇట్లు హిందువులు మహమ్మదీయులతో సమానముగా బోరాడిరి. కావున మహమ్మదీయమహాయుగచరిత్రలో రెండుభాగములుకలవు. ఒకటి:మహమ్మదీయు లీ దేశమును గెలుచుట. రెండవది: వారిని హిందువులెదిరించుట. ఈ రెండుభాగములను వ్రాసినఁగాని చరిత్ర పూర్తికానేరదు. నేను నిష్పక్షపాతబుద్ధితో నీ రెండుభాగములను వర్ణించుటకు యత్నించినాఁడను. పూర్వచరిత్రకారు లొకభాగమును మాత్రమువ్రాసిరి. ఈకాలపు కథాభాగము వ్రాయునప్పుడివఱకుఁజరిత్రలు వ్రాసినవారు మహమ్మదీయులదిగ్విజయములను,హిందువుల పరాజయములను మాత్రము వర్ణించిరి. హిందువులకుఁ గలిగిన జయములును వారోడిపోయిన యుద్ధములలోఁ జూపిన యద్వితీయశౌర్యసాహసస్వదేశాభిమానములును,వారి పరాజయములకుఁగల మోసము మొదలయిన కారణములును జక్కఁగ వర్ణించినవారుకారు. స్థానేశ్వరములో పృథ్వీరాయలకుఁబరాభవము గలిగెనందురేకాని యందుకుఁగారణములయినగృహభేదమిత్రద్రోహములఁజెప్పరైరి. ఘతేపూర్ సిక్రీలో బాబర్ సంగరాణాను ఓడించెనని వ్రాయుదురేగాని, యందు బాబర్ చేసినమోసమును, ఒక రాజపుత్రుఁడు చేసిన దేశద్రోహమును వర్ణింపరు ! తుదకు

పూర్వచరిత్రకారులేక దేశపు వ్రాతలు వ్రాసిరి.

హిందువుల కీర్తిప్రదము లగు పరాజయములు (Glorious defeats) కూడఁ జక్కఁగ వివరించినవారు కారు.

బహుయుద్ధములలోహిందువు లభిమన్యునివలెఁ బోరాడి యాశూరునివలెనే మోసమునకు లోనై

హిందువుల పరాజయము లభిమన్యుని పరాజయములవంటివి.

పరాజితులయిరి. భారతమునందు నభిమన్యు వధ ప్రకరణము ప్రాయునప్పుడు కవి, కర్ణ దుశ్శాసనాదుల శౌర్యమును మాత్రము వర్ణించి, యభిమన్యుని యుద్ధకౌశలమును వర్ణింప అభిమన్యుఁడు కౌరవులచేఁ జచ్చెనని ప్రాసినఁజాలునా? చాలదు గదా? భారతములో నభిమన్యుని యుద్ధము ప్రధానముగాని యాతని చావుకాదు. అయినను ఇదివఱకు హిందూ దేశ చరిత్ర ప్రాసినవా రందఱును అభిమన్యుఁడు చచ్చెనందురు; అతని పౌరుషము వర్ణింపరు. నే నదియు సవిస్తరముగా వర్ణించితిని. ఇదియ వారికిని నాకును గల భేదము.

ఇదివఱకు హిందూ దేశ చరిత్రప్రాసిన మహమ్మదీయులు కొన్ని యసత్యములను ప్రాసినారు. ఇట్టి

ముసల్మాను చరిత్రకారులు కొన్ని విపరీతములు ప్రాసిరి.

యసత్యములను నే నచ్చటచ్చటఁజూపియున్నాను. ముఖ్యముగా నాఅవతరణములో ఫెరిస్తాయను చరిత్రకారుడుఁ

వ్రాసిన యంశములను సప్రమాణముగాఖండించియున్నాను. ఈ చరిత్రకారుఁడు కృష్ణదేవరాయలు పుట్టుటకుఁబూర్వమే నూటయిరువది యేండ్లక్రింద నాతఁ డుండెనని వ్రాసినాఁడు! కృష్ణరాయని కాలము వర్ణించుటలోనాతనిపేరైన నుదాహరించిన వాఁడు కాఁడు!!

ఇందలి విశేషములు.

ఇదివఱకు నింగ్లీషులోనేమి యితర భాషలలో నేమి మహమ్మదీయ ప్రభుత్వ చరిత్ర వ్రాసినవారందఱును ఫెరిస్తా మొదలయిన మహమ్మదీయచరిత్రకారుల ననుసరించియే వ్రాసినారు. ఇతర చరిత్రకారులఁ బాటించిన వారుకారు. అందుచే చరిత్రలన్నియుఁ బక్షపాతభూయిష్ఠము లయి యున్నవి. ప్రతివాది మాటయే వినక వాది చెప్పిన మాటలన్నియు నమ్మియిచ్చిన తీర్పెట్లుండును? నేనీ యాచారమును విడిచి అందఱి చరిత్రకారులు చెప్పినమాటలను గ్రహించినాఁడను. ఇదినఱి పున్న చరిత్రలలోని యన్ని యంశములను గ్రహించుటయే గాక సంస్కృతము, తెలుఁగు, మరాటీ, హిందీ భాషలలోని చరిత్ర గ్రంథములందలి విషయములును, ఇతర గ్రంథములలోని చరిత్ర విషయికము లగు నంశములును ఇందు నుదాహరించి యున్నాఁడను. కావున మనము సాధారణముగాఁ జదివెడి యితర చరిత్రగ్రంథములలో లేని యనేకాంశము లిందుఁ జదువరులు చూడఁగలరు.

ఇంగలి నూతనాంశములలోఁ గొన్నింటి నిచ్చట నుదా
హరించుచున్నాఁడను.(1) మహమ్మద్ గజ్నీ యను వానిని
అనంగపాలుఁ డోడించిన నసూచారము
నూతన చరిత్రాంశ (21 వ పుట చూడుఁడి),(2) మహమ్మద్
ములు. గోరీని పృథ్వీరాయ లేడుసారులు పట్టు
కొని యేడుమాఱులు ప్రాణదాన మొసఁగుట (31 పుట),
(3)స్థానేశ్వర యుద్ధములో జరిగిన మోసము(34-35 పుటలు)
(4) ఔరంగ్ జేబును అయిదారుమా ర్లోడించి స్వతంత్రుఁ
డైన ఛత్రసాల్ రాజువృత్తాంతము(171వ పుట),(5)అక్బ్రన్న
మాదన్నగార్ల చరిత్ర (254 పుట), (6) అక్బరు నోడించిన
వీరాబాయి చరిత్ర (294 పుట), ఇవిగాక యచ్చటచ్చట
నూతనాంశము లనేకములు కలవు. వానినన్నిటిఁ బేర్కొనుట
యనావశ్యకము.

నూతనాంశములని పైని పేర్కొనినవానిలో మొదటి
ది యు,నాల్గవది యు,నైదవది యునగు చరిత్రాంశములు ముఖ్య
ములైనవియుఁ గేవల నూతనము లయినవి
అందు ముఖ్యము యునై యున్నవి మొదటిది: గజ్నీ మహా
మదు డనెడి మూఁడు. మూర్ఖులైన మూఁడు మూఁకలు హిందూదేశము
నకు వచ్చినను హిందువుల నోడించెనేకాని యోడిపోలేదని
యిదివఱకు వ్రాసిన చరిత్రకారులందఱును వ్రాసియున్నారు.

ఇది నిజముకాదు.ఇతఁడు హిందువులచే నోడింపఁబడుటయే కాక అనంగపాలునిచేఁ బూర్తిగఁబరాభవింపఁబడె (Vanquished) నని నేను అల్‌బిరూనీ వ్రాఁతనుబట్టియే చూపినాను. అల్‌బిరూనీయొక్క చరిత్రలోని యీ భాగము ఎలియట్‌చే రచింపఁబడిన చరిత్రలో (Elliot's History of India as told by its own Historians, Vol II, pp. 12 & 404) భాషాంతరీకరింపఁబడినను ఇతర చరిత్రకారులు దీనిని గప్పిపెట్టిరి, పెల్లడి చేయరైరి. నాల్గవది:అవరంగజేబు నోడించిన చత్రసాలు రాజుకథ చరిత్రకారులకు నూతనాంశము. ఇది 'భారతవర్ష్' అను మరాటీ పత్రికలోనుండి గ్రహింపఁబడినది. ఈ భారతవర్షాధిపతిగాను బుందేల్‌ఖండములోని చరిత్రసాధనముల ననుసరించియీ కథాభాగమును వ్రాసియున్నారు. అయిదవది: ఇఁక నక్కన్న మాదన్న గార్లను గూర్చిన చరిత్రాంశములుగూడ నేను నూతనముగా గనుఁగొన్నవే. ఇందుఁ గొన్ని స్వయముగను మిత్రులవలనను హైద్రాబాదు రాజ్యములోఁ దెలిసికొనిన విషయములును,కొన్ని మహారాష్ట్రభాషలోని శివాజిచరిత్రనుండియు, గొన్ని 'ప్రెస్‌లిస్టు ఆఫ్ డాక్యుమెంట్స్ ఇన్ ది పోర్టు సెంట్ జార్జి' అను పొత్తమునుండియుఁ గనుఁగొనిన విషయములును వగును. అక్కన్న మాదన్నలను పేళ్ళుగలవా రెన్నఁడును గోలకొండలో నుండలేదని మైసూరులోఁ బూర్వచరిత్ర

శోధనాధికారి యగు మిస్టర్ టైన్ ఇండియన్ ఆంటిక్వేరిలో వాదించెను! కావున అక్కన్న మాదన్నగార్లను గుఱించిన యీ నూతన పరిశోధనము లాంధ్రుల కామోదావహము లగును గాక.

టైని హిందువుల కనుకూలముగా జెప్పిన యంశము

లను బట్టి నేని చరిత్రలోఁ బక్షపాత

ఈగ్రంథము నిష్పక్ష బుద్ధితోఁదురుష్కులను గూర్చి సత్యాం
పాతబుద్ధితో వ్రాయఁ శములను వ్రాయక, వారినిగుఱించి
బడినది. మంచి వ్రాయవలసివచ్చినప్పుడు దానిని

వదలితి నని కొందఱూహించెదరేమో. అట్లనుకొనుట తప్పు
నేనీ చరిత్ర వ్రాయుటలో 'అయంనిజఃపరోవా' యన్న భేదము
పాటింపలేదు. నిష్పక్షపాతబుద్ధితోఁ దురుష్కులు వ్రాసిన
యంశముల నుదాహరించి నాఁడను. ఏ యంశములను వదల
లేదు. ఆ మీఁద ఆ యంశము లసత్యములని తోచినప్పుడ
దియు వ్రాసితిని. ఇంతియ. నాయకుఁడు తురుష్కుఁడన్న
మాత్రమున నే నెచ్చటను పూజ్యపూజా వ్యతిక్రమము సల్ప
లేదు. తురుష్కవీరులను, సత్ప్రభువులను, సన్మంత్రులను
వారు తురుష్కు- లన్న భేదము లేక మనస్ఫూర్తిగాఁ బొగడి

యున్నాను. గజ్నీ మహమూదు స్వభావ

సమబుద్ధికి నుదా వర్ణన (22 వ పుట), నాసిరుద్దీన్ మహ
హరణములు. మూద్ (44 వ పుట), గ్యాసుద్దీన్

బల్బన్ (45-46 వ పుటలు), ఫిరోజ్‌తుఘ్లుక్ (68 వ పుట) బాబర్ స్వభావము (85 వ పుట), అక్బర్ (93 వ పుట), వజీర్ మహమ్మద్ గవాన్ (209 వ పుట), చాందబీబీ (221 వ పుట), స్వామిభక్తి పరాయణుఁడగు అబ్దుల్ రజాకు (263 వ పుట), మొదలయిన ప్రకరణములు చూచితి రేని, నా నిష్పక్షపాతబుద్ధి వెల్లడికాఁగలదు. తుదకు హిందువులకుఁ బరమ విరోధియగు 'ఔరంగజేబుయొక్క యోగ్యత' (177 వ పుట) వర్ణించుటలో నాతని దుర్గుణముల వర్ణించు పంక్తులు కొంచెముగను సద్గుణముల వర్ణించుపంక్తులెక్కుడుగను వ్రాసియున్నాఁడను.

ప్రస్తుతము హిందూదేశములో ముసల్మానుల సఖ్యతను గుఱించి చర్చ జరుగుచున్నది. దానిని

ప్రస్తుతపు హిందూ ముసల్మాను లన్న దమ్ములు.

గుఱించి మహమ్మదీయ మహోయుగ చరిత్రకారుఁడనగు నా యభిప్రాయము తెలుపుట యావశ్యకము. పూర్వమొక ప్పుడు హిందూ ముసల్మానులు పోరాడుచుండిరి గనుక వా రెప్పుడును స్నేహితులు కానేరరనుట లోకానుభవము లేని వారు చెప్పవలసిన మాట. దేశములోని జనులు రైలుబండి పెట్టెలోని మనుష్యుల వంటివారు. క్రొత్తవాఁడు పెట్టె తలుపు తెఱువవచ్చినపుడు లోని వారందఱును వానితో ఘోరముగా బోరుదురు. వాఁడు లోనికి రాఁగానే వాడును

వానితో బోరినవారును స్నేహితు లగుదురు. ఇదియు దేశము లోని జనుల పద్ధతి. మొదట నీ దేశమునకునార్యులువచ్చిరి. వా రనార్యులతో ఘోరముగా బోరిరి. తరువాత వారం దఱును గలిసి స్నేహితులవ లె నుండుట నేర్చిరి. తరువాత హూణశకపల్లవాదులు వచ్చిరి. హిందువులు వారితో ఘోర ముగాబోరిరి. తుద కందఱును గలిసిపోయిరి. మహారాష్ట్రులు ద్రావిడదేశముమీదికి దండెత్తిపోయి తంజావూరిలో రాజ్య మును స్థాపించిరి. అప్పు డఱవవారును మహారాష్ట్రులును బోరిరి. కాని తరువాత స్నేహితు లైరి. కావున మహమ్మదీ యులును పైని వర్ణింపఁబడిన ఆర్యశక మహారాష్ట్రుల వంటి వారు. ముసల్మాను లీ దేశవాసు లయినందునఁ బ్రస్తుతమున హిందూముసల్మాను లన్నదమ్ములు. పూర్వమందు మరాటా వారు బంగాళమును దోఁచుకొనిరని ప్రస్తుత కాలమందలి బంగాళీవారు మరాటావారిని ద్వేషించుట యెంత హాస్యా స్పదమో, పూర్వ మౌరంగజేబు హిందువులను బాధపెట్టె ననియు, అళియ రామరాజు తురుష్కుల బాధపెట్టెననియు నిప్పటి హిందూ ముసల్మానులు పోరాడుటయంతేహాస్యాస్ప దము. కావున హిందువులు ముసల్మానుల కష్టసుఖములు తమవిగానే యెంచవలయును. ముసల్మానులును అట్లే నడచు కొనవలయును. అందువలన నుభయులకును మేలు కలుగఁ గలదు. లేనియెడల నుభయులకును నష్టము సంభవించునను టకు సందేహము లేదు.

ఇదివఱకు మనము చరిత్రలన్నియు నింగ్లీషులోఁ జదువు

శబ్దోచ్చారణ

చున్నందున హిందూముసల్మానుల పేళ్లు సరిగా నుచ్చరించుట లేదు. తెలియక కొన్ని మూఱులును, విరగఁబాటు (ఫ్యాషన్) అని కొన్ని సారులును, తప్పుటుచ్చారణలు చేయుచున్నాము. ఈ గ్రంథములో నట్టి యుచ్చారణలను దిద్ది సరియైన యుచ్చారణల వ్రాయ యత్నించినాఁడను. కావునఁ జదువరులకు నా యుచ్చారణలు క్రొత్తవిగాఁ గానవచ్చును ఉదాహరణార్థమై కొన్ని శబ్దముల నిచ్చట నిచ్చుచున్నాను:—

| ఇదివఱకున్న యుచ్చారణ. | ఈ గ్రంథమునందలి యుచ్చారణ. |
|---|---|
| డియోగిర్ | దేవగిరి |
| బేబర్ | బాబర్ |
| బండల్ ఖఁడ్ | బుందేల్ ఖండ్ |
| బీరార్ | బరాడ్ లేక వరాడ్ |
| బీజపుర్ | విజాపురము లేక బిజాపురము |
| ఔధ్ | ఔధ్ |
| ఔరంగజీబ్ | ఔరంగజేబ్ |
| ఏదిల్ శాహి | ఆదిల్ శాహ |
| సేలిమ్ | సలీమ్ |
| జాడ్‌పుర్ | జోధపూర్ లేక యోధపురము. |

ఈ చరిత్ర వ్రాయుటలో నాకు సాధన భూతంబు లగు గ్రంథముల నిచ్చటఁ బేర్కొనియెదను. ఈ చరిత్ర లోని విషయములను (1) పరదేశీయులు చరిత్రసాధనములు. వ్రాసిన యంశములు (2) హిందువ్రాసిన యంశములు అని విభాగింప వచ్చును. మొదటి భాగమునకు నాకు నింగ్లీషు చరిత్ర గ్రంథములు ముఖ్యాధారములు. మిల్లు, హంటర్, వీలర్, కీలర్, ఎల్‌ఫిన్‌స్టన్, లెత్‌బ్రిజ్, లేపూల్, బర్నియర్, కెనెడియను గ్రంథకారులు వ్రాసినగ్రంథములలోఁ గొన్ని సంస్కరణీయములగు విషయములున్నను ఆ గ్రంథములు చరిత్రాభ్యాసము చేయు వారికి మిక్కిలి యుపయోగకరములు; అత్యావశ్యకములు. వీరందఱును మహమ్మదీయ చరిత్ర కారుల ననుసరించిరి. ఎలియట్టుచే రచింపఁబడిన 'హిస్టరీ ఆఫ్ ఇండియా ఆస్‌టోల్డ్ బై ఇట్స్ ఓన్ హిస్టోరియన్స్' (History of India as toldby its own Historians) అను గ్రంథమును, బ్రిగ్స్ ఫెరిస్టా యను గ్రంథమును నాకుఁ జాల సాహాయ్యము చేసినవి. ఈ విషయమును గుఱించి చెన్నపట్టణములోనున్న. కానిమరా పుస్తకాలయములో నున్న యింగ్లీషుగ్రంథము లనేకములు చూచినాఁడను. వానిననన్నిటి నిచటఁ బేర్కొనుట యనావశ్యకము.

ఇంగ్లీషు సాధనములు.

ఇంగ్లీషువారు వ్రాసిన చరిత్రగ్రంథములలో ముఖ్యముగా రెండింటిని గుఱించి మనము వారియెడఁ గృతజ్ఞులమై

యుండవలయును. టాడ్ చే వ్రాయఁ
బడిన రాజస్థాన చరిత్ర యొక యద్వి
తీయ గ్రంథరాజము. రాజపుత్ర స్థాన

అందు ముఖ్యమై నవి రెండు.

ములో దొరకిన సాధనముల నన్నిటి ననుసరించి యీ చరిత్ర వ్రాయఁబడినది. హిందూదేశమునందు నభిమానము గలవా రందఱును దప్పక దీనిని చదువవలయును. ఈ గ్రంథమును తెలుఁగుభాసకు సర్ వాల్ టర్ స్కాట్టులగు బ్రహ్మశ్రీ చిలక మర్తి లక్ష్మీనరసింహముగారు (రాజమహేంద్రవరము), చక్కని శైలిని దెనిఁగంచియున్నారు. తెలుగువా రీ గ్రంథ మును మిక్కిలి సన్మానింతురుగాత. మిస్టర్ రాబర్ట్ స్యూయెల్ దొరగారిటీవల 'ఫర్గాటస్ ఎంపయర్' (విస్మృత సామ్రాజ్యము) అని పేరుపెట్టి విజయనగర చరిత్రమును ప్రకటించిరి. నన్నిజ్, పేయిస్ అనుపేళ్ళుగల పోర్చుగీసువా రిద్దఱు కృష్ణదేవరాయల కాలమందు విజయనగరమునకుఁ బోయి యచ్చటి యాచారములను గుఱించియు నాదేశపు చరిత్రయు వ్రాసి తమ దేశములలోని చరిత్రకారునికిఁ బంపి యుండిరి. అవి మూఁడువందల యేఁబది సంవత్సరములవఱకు నచ్చటనో పడియుండి నేఁటికి సిన్ హార్ లోప్ అను విద్వాం సుని పరిశ్రమము వలన వెలువడినవి. ఆ చరిత్రాత్మక భాగ ములనే ఇంగ్లీషులో భాషాంతరీకరించి స్యూయెల్ దొరగా రీ విస్మృతసామ్రాజ్యమును రచించిరి. ఇందు బరదేశీయు లును సమకాలీనులును అగు పోర్చుగీసువారిచే వ్రాయఁ బడిన యంశము లున్నందున నవి విశ్వాసపాత్రములు. పర దేశీయులకు హిందుపులయెడఁ బక్షపాత ముండుటకుఁ గార

ణము లేదు. కావున నీ పోర్చుగీసు చరిత్రకారులు వ్రాసి
యుంచిన యంశములు పక్షపాతబుద్ధితోఁ దురుష్క చరిత్ర
కారులు వ్రాసిన యసత్య చరిత్రాంశములను ఖండించు
టకుఁ బ్రబలసాధనములై యున్నవి. ఈ గ్రంథము ననుస
రించియే తెలుఁగులో బ్రహ్మశ్రీ చిలుకూరు వీరభద్రరావు
పంతులుగారు 'జీర్ణకర్ణాట'మను 'కృష్ణరాయ చరిత్ర' రచించి
యున్నారు అదియు నాంధ్రులచే నాదరింపఁబడుటకుఁ దగి
నది పెరిస్తా చెప్పినంశములును, నన్నిజ్ పెయిన్ వ్రాసిన
యంశములును తెనిఁగింపవలసి వచ్చినప్పుడు మరల భాషాంత
రము చేయక యీ గ్రంథములోని భాషాంతరమునే యంగీక
రించి యున్నాను. విజయనగరమునుగూర్చి 'నెవర్ టుబి
ఫర్గాటన్ ఎంపయర్' అను చక్కని గ్రంథ మొకటి బ్రహ్మశ్రీ
బీ. సూర్యనారాయణరావు, బి. ఏ. గారిచే రచింపఁబడియె.
దానినిగూడ నే నుపయోగించుకొంటిని.

రెండవభాగమును గుఱించి యనఁగా హిందుప్రులు
చెప్పు కథాభాగమును గుఱించి నేను చూచిన గ్రంథముల
విషయమై వ్రాయనలసి యున్నది. మన
ఇతరసాధనములు. వాండ్రకుఁ చరిత్రవ్రాయు నలవాటు
లేనందున నీ విషయమై యొక్కఁడు
గ్రంథములు లేవు. అయినను గొన్నికలవు. వాని నుపయో
గించు కొనకుండుటయే మనతప్పు. మహారాష్ట్రభాషలోని
ముసల్మానీరియాసత్' అను గ్రంథమును, బఖిర్ అనఁబఁడు,
పూర్వచరిత్రవిషయిక గ్రంథములును, పృథ్వీరాజు విష
యమై 'పృథ్వీరాజరాసా' యను హిందీ గ్రంథములోని

అచ్చుపడిన భాగములును, 'పృథ్వీరాజచవాణ' అను మహా రాష్ట్ర చరిత్రయు, రాజపుత్రులను గుఱించి 'రాజపుత్రస్తాన్ చాఖితిహాస్' అను మహారాష్ట్రగ్రంథమును, బాట్ అనఁ బడు భట్టాజుల హిందీకవిత్వములును, విజయనగర చరిత్రను గుఱించి 'కృష్ణరాజ విజయము', 'నరపతి విజయము' అను తెలుఁగు గ్రంథములును, 'అచ్యుత రాయాభ్యుదయ' మను సంస్కృత కావ్యమును, చెన్నపురిలోని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందున్న స్థానిక చరిత్రలును, చూచి నాఁడను. ఇవి యన్నియుఁ జరిత్రవిషయిక గ్రంథములు. అట్లు చరిత్రగ్రంథములుకానట్టి 'జైమినిభారతము,' 'వరాహ పురాణము,' 'మనుచరిత్ర,' 'పారిజాతాపహరణము,' 'వసు చరిత్ర,' 'కళాపూర్ణోదయము,' 'తపతీసంవరణోపాఖ్యానము' మొదలయిన యాంధ్ర ప్రబంధములలోని కృత్యాదిపద్య ములు నా కపరిమిత సాహాయ్యమును చేసినవి. ఇవి చరిత్ర విషయికమైన బంగారపు గనులని నా తాత్పర్యము. కులీ కుతుఁబ్‌షాహ కృష్ణరాయలయొద్దనుండి పనగల్లు, కొండ వీడు దుర్గములను దీసికొనెననియు హిందువు లోడిరనియు మహమ్మదీయచరిత్రకారులు వ్రాసిరి. ఈ యంశము లసత్య ములని చూపుటకు 'తపతీసంవరణోపాఖ్యానము'ను, 'కళా పూర్ణోదయము'ను లక్షరూపాయల విలువగల సాహాయ్యము చేసినవని చదువరు లాప్రకరణముఁ జూచి తెలిసికొనఁగలరు.

ఆదవాని కల్యాణమర్గములను రామరాజు జయించిన విష యమై శ్లేషపూర్వకముగా వసుచరిత్రలోఁ జెప్పిన పద్య ములు సాధారణజనులకుఁ గావ్యవర్ణనలవలెనున్నను తెలిసిన

వారికిఁ జరిత్ర విషయిక దివ్యరత్నములని తోఁపక మానవు. కావున మనకావ్యముల నన్నిఁటిని మనవారిఁకమిూదఁగావ్యములుగాఁ గాక చరిత్రసాధనములుగాఁ జూడ నభ్యసించిన యెడలఁ తెలుఁగుదేశపుఁజరిత్ర యెంతయో వెలువడఁగలదు.

ఇవిగాక చెన్నపురిలోని క్యాన్నిమరా లైబ్రరీలోనున్న 'ప్రెస్ లిస్ట్ ఆఫ్ డాక్యుమెంట్స్ ఇన్ ఫోర్ట్ సెంట్ జార్జ్' అను నదియు, ఇండియన్ అంటిక్వేరిలోను, 'ఎపిగ్రాపియా ఇండికా' యను దానిలోను ప్రకటింపఁబడిన పురాతన శాసనములును చరిత్రశోధనములో నాకు నింతంత యనరాని సాహాయ్య మొనర్చినవి.

బ్రహ్మశ్రీ వీరేశలింగముగారి 'ఆంధ్రకవులచరిత్ర'యు, శ్రీమతి భండారు అచ్చమాంబయక్కగారి 'అబలా సచ్చరిత్రరత్నమాల'యు నాకుఁ గొంతవఱకుఁ దోడ్పడినవి.

ఈప్రకార మింగ్లీషు సంస్కృతము తెలుఁగు హిందీ మహారాష్ట్ర భాషలలోఁ గల చరిత్రవిషయమైన ముఖ్య గ్రంథములు నా కీ గ్రంథము వ్రాయుటకుఁ దోడ్పడిన సాధనములు. ఈ గ్రంథకర్తలయెడ నేను గృతజ్ఞుఁడనైయున్నాఁడను.

ఈ గ్రంథములోని పటములనుగుఱించి కొంచెము వ్రాయవలసియున్నది. వ్యయప్రయాసలకోర్చి విజ్ఞానచంద్రికా మండలి వారీ గ్రంథమునకు ననేక పటములు చేర్చి గ్రంథముయొక్క శోభ హెచ్చించిరి. అందు నాఱుదిమ్మ్లలు (Blocks) మ-రా-రా-శ్రీ, బి. సూర్యనారాయణరావు, బి. ఏ., యమ్. ఆర్. ఏస్. గారు మాకిచ్చిరి. అందులకై వారి కనేక వందనము లాచరించుచున్నారము.

ఈ గ్రంథమందుఁ గల మహాపురుషుల పటములలో మొదటిది శ్రీకృష్ణరాయలవారిది. దీనియుత్పత్తి తెలుపుట యావశ్యకము. శ్రీ రాయలవారు దక్షిణ కృష్ణరాయలపటము. దిగ్విజయ యాత్రకు వెడలినపుడు తిరుప తిలో స్వామివారినిదర్శించి యిద్దఱు భార్యలతోఁ గూడి స్వామికిఁ గానుక లర్పించి, తానును తనభార్యలగు చిన్నాదేవి తిరుమలదేవులును స్వామియెదుట భక్తులవలె నిలిచి యున్నట్లు పంచలోహములతోఁ బోఁత పోయఁబడిన విగ్రహములను వేయించిరి. తిరుపతి దేవా లయములోనున్న రాయలప్రతిమయే యిటీవల ననేకులచేఁ బ్రకటింపఁబడిన కృష్ణరాయల పటములకు మాతృక. తిరు పతిలోనున్న ప్రతిమ వైష్ణవభక్తునివలె నెత్తి మీఁదఁగుళ్లాయి మొదలయినవి గలిగియుండుటచేఁ జూచుటకు నందముగా లేదు. ముఖవికాసము మాత్రము రమ్యముగా నున్నది. కావున ఆ ముఖ వికాసమును గ్రహించి పూర్వపుఁ జరి త్రలో నున్న రాయలవర్ణనమును ననుసరించి ఆ పటమును శిరోభూషణాదులచే నలంకరించి మొదట బ్రహ్మశ్రీ, బి. సూర్యనారాయణరావుగారు తాముప్రకాసిన 'ఎప్పుడును మఱవఁదగని సామ్రాజ్యము' (Never-to-be-forgotten Empire) అను గ్రంథములోఁ బ్రకటించిరి. ఈ పటమునె గుఱ్ఱముమీఁదఁ గూర్చుండఁబెట్టి బ్రహ్మశ్రీ సోమనాథరావు గారు తాము రచించిన 'కృష్ణరాయ చరిత్ర' మను కావ్య ములో నవొచ్చెత్తించిరి. హైద్రాబాదు పట్టణములోని 'శ్రీకృష్ణదేవ కాకూంధ్రభాషానిలయము' వారు శ్రీ సూర్య నారాయణరావుగారి పటమును అనుసరించియే యొక పెద్ద

పటమును వ్రాయించి తమ యాలయములో నుంచిరి. ఆపటముయొక్క ఛాయాప్రతిబింబమునే మే మిగ్రంథము నందుఁ బ్రకటించినారము. ఇది యీపటముయొక్క పూర్వ వృత్తాంతము.

రాజపుత్ర పటములు.

పృథ్వీరాజు, రాణా ప్రతాపసింగ్, ఠాకుర్ దుర్గాదాస్ ఈ శూరులపటము లుత్తర హిందూదేశమం దచ్చుపడిన పటములనుబట్టి వ్రాయఁబడినవి.

మోగల్ చక్రవర్తుల పటములు.

మోగల్ చక్రవర్తుల పటములు సామాన్యముగాఁ బాఠశాలలలోఁ జదివెడి గ్రంథములనుండి గ్రహింపఁబడినవి.

కృతజ్ఞతా విషయము.

గ్రంథ మచ్చుపడునప్పుడు నేను చెన్నపట్టణములో నుండుటకు వీలులేకపోయినను ఆ లోప మేమియు లేకుండ నచ్చుచిత్తులు (Proof sheets) దిద్దుట మొదలయిన యావశ్యక సాహాయ్యము చేసినందులకుఁ బ్రస్తుత మానంద ముద్రాక్షరశాలలలోఁ బ్రకటింపఁ బడుచున్న యాంధ్రభారతము యొక్క యతిశ్రేష్ఠమైన కూర్పునకు సంపాదకులగు శ్రీమాన్ తం. తేవప్పెరుమాళ్ళయ్యగారి యెడ నే నెంతయుఁ గృతజ్ఞుఁడ నై యున్నాఁడను.

ఇట్లు:

1. సుంకువారి అగ్రహారము,
   చింతాద్రి పేట.
   చెన్నపట్టణము.
   8-12-08.

కొమర్రాజు లక్ష్మణరావు.

# మనవి

ఈ గ్రంథ పునర్ముద్రణలో కొన్ని మార్పులు జరిగినవి. గ్రంథకర్తగారి పీఠికను మార్చరాదను తలంపుతో దానిలో నెట్టి సవరణలు చేయలేదు. ఈ గ్రంథము యొక్క పూర్వపు ప్రతులలో నున్న మొదటి ప్రకరణము ఈ ముద్రణ మొదటి ప్రకరణముగాను, రెండవ ప్రకరణము రెండవ ప్రకరణముగాను, మూడవ ప్రకరణము ఐదవప్రకరణముగాను, నాలుగవ ప్రకరణము మూడవ ప్రకరణముగాను, ఐదవ ప్రకరణము ఆఱవ ప్రకరణముగాను, ఆఱవప్రకరణము నాల్గవ ప్రకరణముగాను మార్పు చేయుట జరిగినది. అందు చేత పీఠికలో నుదహరింప బడిన పేజీల క్రమ సంఖ్యలో కూడా మార్పులు జరిగినవి. అటినిషయములను ప్రస్తుత ముద్రణలోని పుట సంఖ్య నుదాహరించుచు పునరుక్తిక రించుచున్నాము.

xi పేజి

(1). మహమ్మదు గజ్నీయను వానిని అనంగ పాలుఁడోడించిన సమాచారము (మొదటిభాగం 21వపుట చూడుఁడు). (2) మహమ్మద్ గోరీని పృథ్వీరాయ లేదు సారులు పట్టుకొని యేడుమాఱులు ప్రాణదాన మొసగుట (మొదటి భాగం 29పుట), (3) స్థానేశ్వర యుద్ధములో జరిగిన మోసము (మొదటి భాగము 34 - 35 పుటలు), (4) ఔరంగ్‌జేబును అయిదారు మార్లోడించి స్వతంత్రుడైన

ఛత్రసాల్ రాజు వృత్తాంతము (రెండవభాగము 77 పుట), (5) అక్కన్న మాదన్నగార్ల చరిత్ర (మొదటిభాగము 134 పుట).

xiii పుట

గజ్నీ మహమూదు స్వభావవర్ణన (మొదటిభాగం 22వ పుట), నాసిరుద్దీన్ మహమూద్ (మొ. భా. 41వ పుట), గ్యాసుద్దీన్ బల్బన్ (మొ. భా. 43వ పుట), ఫిరోజ్ తుఘ్లుక్ (మొ. భా. 67వ పుట), బాబర్ స్వభావము (రెం. భా. 8వ పుట), వజీర్ మహమూద్ గవాన్ (మొ. భా. 92వ పుట), చాందబీబీ (మొ. భా. 103వ పుట), అబ్దుల్ రజాకు (మొ. భా. 143వ పుట), 'ఔంగ జేబుయొక్క యోగ్యత' (రెం. భా. 82వ పుట).

పై నుదహరించిన మార్పులను జదువరులు గమనించ గోరుతున్నాము.

ఈ గ్రంథములో మహాపురుషుల పటము లెక్కవగా సమకూరసందున ముద్రింపలేనందుకు జదువరులు మన్నింతురుగాక.

ఇట్లు,
ప్రకాశకులు.

# విషయసూచిక

## మొదటి భాగము

### మొదటి ప్రకరణము


ముసల్మానులయుత్పత్తి, వారీదేశమునకువచ్చుట — పుట
మహమ్మద్ — 5
మహమ్మదీయమతప్రచారము — 8
మహమ్మదీయ మొదటిదాడులు, గజ్నీవంశము — 12
సబక్తగీన్, గజ్నీమహమూదు — 13
గోరీవంశము, శహాబుద్దీన్‌మహమ్మద్‌గోరి — 23
అప్పటిరాజపుత్రరాజ్యములు, కనోజ్ — 24
అన్హిల్‌పురభీమదేవుడు, మేవాడ్ రాజ్యము — 26
అజ్మీర్ దిల్లీరాజ్యములు — 27
స్థానేశ్వరమహాయుద్ధము — 33
పారతంత్ర్యప్రారంభము — 35


### రెండవ ప్రకరణము

#### అఫ్గాన్ రాజులు


బాలసవంశము, కుతుబుద్దీన్ — 38
షమ్సుద్దీన్ అల్తమష్, మోగలులు — 39
చెంగిస్‌ఖాన్, సుల్తానారజియా — 40
నాసిరుద్దీన్ మహమ్మూద్ — 41
గ్యాసుద్దీన్‌బల్బన్ — 43
కైకుబాద్ — 45
ఖిల్‌జీవంశము, జలాలుద్దీన్ ఖిల్‌జీ — 46
అల్లాఉద్దీన్ దక్షిణమునుజయించుట — 47
అల్లాఉద్దీన్ ఖిల్‌జీ — 50
రతనభోర్‌జయించుట — 51
చితోడ్‌గడమును దీసికొనుట, దక్షిణదేశపు దండయాత్ర — 51

| | |
|---|---|
| అల్లాఉద్దీనునిగర్వము, రాజ్యములోనితిరుగుపాటులు | 53 |
| అల్లాఉద్దీన్ స్వభావము | 54 |
| ముబారిక్ ఖిల్‌జీ | 56 |
| ఖుస్రో లేక నసూర్ఉద్దీన్ | 58 |
| తుఘ్‌లఖ్ వంశము గ్యాస్‌ఉద్దీన్ తుఘ్‌లఖ్ | 58 |
| ఓరగలుమీఁదికి దండెత్తుట | 59 |
| తుఘ్‌లఖాబాద్, గ్యాస్‌ఉద్దీన్‌మరణము, మహమద్ తుఘ్‌లఖ్ | 60 |
| రాజ్యములోని యవ్యవస్థ | 62 |
| రాజధానిని మార్చుట | 62 |
| రాగినాణెములను బంగారు నాణెములుగ వాడుట | 63 |
| చీనాదేశముమీఁదికి దాడి | 64 |
| రాజ్యములోని తిరుగుబాటులు | 64 |
| స్వతంత్రరాజ్యములు, ఇబ్నుభతూతా | 66 |
| ఫిరోజ్‌తుఘ్లఖ్, జనులకు హితప్రదము లగుపనులు | 67 |
| ఈతఁడుప్రాసిన యాత్మచరిత్ర | 69 |
| హిందూమతద్వేషము | 71 |
| వృద్ధావస్థ, తరువాతి బాదుషాలు | 71 |
| చంగీజ్‌ఖానుని వంశజులు | 73 |
| తయమూర్‌లంగ్ | 74 |
| హిందూదేశముమీఁదికివచ్చుట | 74 |
| తయమూర్‌యొక్క స్వభావము | 76 |
| తయమూర్‌తరువాతిహిందూదేశము | 77 |
| సయ్యద్‌వంశము | 78 |
| లోదీవంశము | 78 |
| సింహావలోకనము | 79 |
| మతద్వేషము | 80 |
| గ్రామసంఘములు, వర్తకము | 81 |

## మూడవ ప్రకరణము

## దక్షిణములోనిమహమ్మదీయరాజ్యములు


బహమనీరాజ్యము, హసన్‌గంగూ అల్లాఉద్దీన్‌షాహ 84
మహమ్మద్‌షాహ 86
మహమూద్‌షాహ 88
ఫిరోజ్‌షాహ 89
అహమ్మద్‌షాహవల్లి 90
అల్లాఉద్దీన్‌షాహ 91
రెండవమహమ్మద్‌షాహ, వజీర్‌మహమ్మద్‌గవాన్ 92
మహమ్మద్‌గవానునియోగ్యత 96
మహమ్మూద్‌షాహ 98
బేదర్‌లోని బేర్‌ద్‌షాహి 99
వరాడ్‌దేశములోనిఇమాంషాహి 99
అహమ్మదనగరపునిజాంషాహి 100
చాందబీబీ 103
మలిక్‌అంబర్ 110
విజాపురములోని ఆదిల్‌షాహ 112
గోలకొండలోని కుతుబ్‌షాహి, పూర్వపీఠిక 121
దేశభాషాభివృద్ధి 127
మీర్‌జుమ్లా 130
అక్కన్నమాదన్నగార్లు 134
రామదాసు 140
గోలకొండరాజ్యవినాశము 140


## నాల్గవ ప్రకరణము

## విజయనగరసామ్రాజ్యము


సామ్రాజ్యస్థాపనము 149
హరిహరరాయులతమ్ములు 151

| | |
|---|---|
| మాధవవిద్యారణ్యులు | 152 |
| విద్యానగరనిర్మాణము | 154 |
| బుక్కరాయలు | 157 |
| మాధవమంత్రి | 161 |
| తురుష్కులు వ్రాసినవిషయములు | 163 |
| బుక్కభూపతియోగ్యత | 178 |
| రెండవ హరిహరరాయలు | 179 |
| హరిహరరాయని యోగ్యత, ఫెరిస్తాకత | 183 |
| రాయలకుటుంబము, రెండవబుక్కరాయలు లేకమొదటిదేవరాయలు | 185 |
| ప్రథమ యుద్ధము | 187 |
| రెండవ యుద్ధము | 190 |
| మూఁడవ యుద్ధము | 191 |
| భాషాభివృద్ధి | 191 |
| రెండవ దేవరాయలు | 193 |
| తురకల వ్రాఁతలు | 194 |
| రెండవ రాయలు | 197 |
| మల్లికార్జున రాయలు, విరూపాక్ష రాయలు | 198 |
| ప్రథమ వంశావసానము, సాళ్వనరసింహరాజు | 200 |
| విజయనగర వైభవము | 207 |
| తుళువవంశము | 214 |
| నరసరాజు | 215 |
| కృష్ణదేవరాయలు జననము | 222 |
| కర్ణాటకుఁడా? తెలుగువాఁడా? | 223 |
| రాజ్యాభిషేకము | 224 |
| మంత్రితిమ్మరుసు | 225 |
| రాయలవారిదక్షిణదిగ్విజయయాత్ర | 227 |
| పూర్వదిగ్విజయయాత్ర | 229 |
| రాయచూరుదండయాత్ర | 233 |

| | |
|---|---|
| మహమ్మదీయవృత్తాంతము | 239 |
| రాయలవిద్యామహిమ | 242 |
| శిల్పకళాభివృద్ధి | 249 |
| రాజధానివర్ణన | 251 |
| రాజ్యవిస్తారము, రాజ్యవైభవము | 256 |
| రాయలమనశ్శరీరంబులు | 258 |
| రాయలకుటుంబము, చరమదశ | 259 |
| అచ్యుతదేవరాయలు | 261 |
| సదాశివరాయలు | 276 |
| రామరాజుపరిభుత్వము | 282 |
| ఆదిల్‌షాహతోవైరము | 285 |
| పోర్చుగీసువారితోసంది | 285 |
| తురుష్కుల కాశ్రయమిచ్చుట, ఆదిల్‌శాహతో మరలఁబోరుట | 286 |
| తమ్ములతిరుగఁబడుట | 288 |
| నిజాముతోవైరము: ఆదిల్‌శాహతోస్నేహము | 288 |
| తురుష్కరాజుల నగౌరవించుట | 293 |
| నవాబులందఱునేకమగుట | 293 |
| హిందూసైన్యములరాక, తాళికోటమహాయుద్ధము | 295 |
| విజయనగరవినాశము | 298 |
| తరువాతిరాజులు | 299 |
| పరిశిష్టము | 315 |
| కృష్ణరాయలతల్లి కులకాంతయే: భోగకాంతకాదు | 316 |
| సలకముతిమ్మయ | 317 |

5

# మహమ్మదీయ మహోయుగము

## మొదటి ప్రకరణము.

### ముసల్మానుల యుత్పత్తి : వారి దేశమునకు వచ్చుట.

హిందూదేశమునకు, బశ్చిమమున అరబస్థానమును దేశ మొకటి గలదు. దానిని నింగ్లీషులో నరేబియా యనియెదరు. హిందూస్థానము నకును, అరబస్థానమునకును నడుమ 500 మైళ్ళ వైశాల్యము గల సముద్రమున్నది. దీనికి, బ్రస్తుత మరబ్బీసముద్రమని పేరు. దీనికి, బూర్వకాలమందు రత్నాకరమనియు, బశ్చిమసముద్రమనియు, బేళ్ళుం డెను. క్రీస్తుశకమునకు యాఱువ శతాబ్దమందు ననగా నేటికి, బదునాలుగువందల సంవత్సరములకు, బూర్వ మీ యరబస్థానములోని జను లనాగరికులుగా నుండిరి. ఇతరదేశములతో సంబంధము లేక తమ దేశములోనైనను నొక్కచోట నుండక మేత దొరకినచోటికెల్లదమ పశువుల, దోలుకొనిపోవుచు నూరుద్రిమ్మరులవలె, దిరుగుచుండిరి. ఆ దేశములోని మక్కాయను పట్టణముమాత్రము వైభవదశయం దుండెను. అచ్చట, గాబాయను ప్రసిద్ధికెక్కిన దేవాలయము కలదు. అందు మున్నూటయఱువది విగ్రహము లుండెను. ఆ దేశవాసులందఱు నా విగ్రహముల భక్తితో, బూజించుచుండిరి.

### మహమ్మద్.

వైని వర్ణింప, బడిన స్థితిలోనున్న యరబస్థానమందలి మక్కా పట్టణమున మహమ్మదీయ మతస్థాపకుడగు మహమ్మద్ క్రీ.శ. 570 లో జన్మించెను. చిన్ననాటనుండియు నీత, డీశ్వరభక్తితోను, ధర్మ చింతనతోను గాలము, గడపుచుండెను. ఇరువదియెదవయేట నీతడు సిరియాప్రాంతమునకు, బోయి యచ్చట, క్రైస్తవమత సిద్ధాంతములను

నేర్చుకొనెను.నలువదవయేట నాతఁడు తనకు నీశ్వరసాక్షాత్కారమయ్యె నని చెప్పి, యేకేశ్వరమతము నొకదానిని బోధచేయఁదొడఁగె. అదియే మహమ్మదీయమతము. మహమ్మదు దానికి 'ఇస్లామ్' అనఁగాఁ దరణో పాయమార్గ మనియు, ఆ మతమును స్వీకరించిన వారికి 'ముసల్మాను' లనియుఁ బేళ్ళు పెట్టెను. "ఈశ్వరుఁడొక్కఁడు; ఆతని దూత మహ మ్మదు; విగ్రహారాధనము చేయఁగూడదు. మద్యపానము చేయరాదు" అనునవి యామతములోని ముఖ్యసిద్ధాంతములు. ఈతని నూతనమత మును గొందఱు స్వీకరింపసాగిరి. కాని మక్కాపట్టణములోని కాబా దేవాలయమందున్న విగ్రహములఁ బూజింపఁగూడదని యాతఁడు బోధ చేయుటవలన నాతనికి శత్రువు లెక్కువయిరి. వారాతనిఁ జంపుటకు యత్నించిరి. అందుచే నాతఁడు క్రీ. శ. 622 లో మదీనా యను పట్టణమునకుఁ బాఱిపోయెను. ఈ ప్రసంగమును సూచించుటకు నప్పటి నుండి హిజరీయను శక మొకటి ప్రారంభింపఁబడినది. 'హిజరా' యనఁగాఁ బాఱిపోవుట.

మదీనాకుఁ బోయినపుడు మహమ్మ దేఁబదిమూఁడు సంవత్సర ముల వయస్సు కలిగియుండెను. అచ్చటికిఁ బోయినతరువాత నాతఁడు స్వమతాభివృద్ధి మిక్కిలియుత్సాహముతోఁ జేయసాగెను. అచ్చటఁ బెద్ద మసీదొకటి కట్టించెను. అది యిప్పటికిని 'మసీద్ ఉల్ నబీ' యను పేరిటఁ బరగుచున్నది. అందు మహమ్మదు సమాధి కలదు. మదీనాలో నీమతాభివృద్ధి పరిబలముగా జరుగఁజొచ్చినను, అనేక జనులవలన నాత నికిఁ గలుగుచున్న బాధయు హెచ్చఁదొడఁగెను. ఖురేష్ అనఁబడు జను లాతని శిష్యులను నెక్కుడుగాఁ బీడింపసాగిరి. అందుచే నాతఁడు చేతఁ గతి పట్టవలసినవాఁ డాయెను. ఇంతవఱకు నాతఁడు శాంతముగా ధర్మోపదేశము చేసెను.కాని పరమతస్థులవలనఁ దనశిష్యులకుఁ గలుగు చున్న బాధఁజూచి యాతఁడు తన శిష్యుల కిట్లు బోధించెను. "ఇదివఱకు శాంతచిత్తముతోడను నమ్రిభావముతోడను మతోపదేశము చేయఁబడి నది. కాని లోకులు మిక్కిలి దురాగ్రహము కలవారు. పూర్వపు మతోప దేశకులు చెప్పినమాటలు వారు విన్నవారు కారు. కావున నిఁక ముందు

మీ బోధ వినినివారితో గతి చేత బూని పోరుడి. యుద్ధమందు జయ ప్రాప్తియగునేని శత్రువులధనము మీకు దొరకును;మరణము ప్రాప్తించె నేని పుణ్యముగలిగి స్వర్గద్వారములు మీకై తెఱవబడును." ఈ యుప దేశము ననుసరించి మహమ్మదనుయాయు లందఱును సాత్వికవృత్తిని బరిత్యజించి రాజసవృత్తికి దగిన క్షాత్రతేజమును స్వీకరించిరి ! పిల్లి వంటి క్షుద్రజంతువుగూడ మిక్కిలి బాధ కలినపుడు మానవునిమీదికి దిరుగబడునని మన మెఱిగినదియే. అట్టే యప్పుడు బలహీనులై, సాధుస్వభావమును గల మహమ్మదీయులు పరులబాధ నోర్వలేక యుద్ధము చేసిబూని శూరులయి, క్రమక్రమముగా వృద్ధిజెంది యూరోప్ ఆసియా ఖండములలోని యనేకదేశములను గెలువగలిగిరి ! అనగా నప్పటి ముసల్మానులను బాధపెట్టినవారు తమనాశమునకు గారకు లగుటయేకాక లోకమునందలి యనేక మతములయొక్కయు, దేశములయొక్కయు స్వాతంత్ర్యమును నాశనముచేయు మహాశక్తిని బుటించినవారైరి.

క్రమముగా సైన్యములజేర్చుకొని మతాభివృద్ధికై మహమ్మదు యుద్ధములు జేయుచు దనధర్మమును రాజ్యమును అభివృద్ధి చేయ దొడగెను. యుద్ధములో దొరకిన ధనమును సైనికులందఱును పంచు కొనవలసినదని యీశ్వరాజ్ఞయైనట్లు మహమ్మదు తెలుపగా సైనికులు ద్విగుణితోత్సాహులయి పోరాడసాగిరి. అందుచే మతాచార్యపదమును, మహారాజపదమును మహమ్మదునకు సులభముగా ప్రాప్తమయ్యెను. పారసీక రాజయిన రెండవ ఖుస్రూ, రూమ్ రాజయి ఇస్తంబూల్ రాజ ధానిగాగల హెరాక్లిటస్, మిసర్ (ఈజిప్ట్) దేశపు రాజు, మొదలయిన పరరాజులయొద్దకి దనదూతలచేత తన మతమును స్వీకరింపుడని శ్రీముఖములఁ బంపెను. పైని బేర్కొనినరాజులలో మొదటివాడుతప్ప కడమయిద్దఱు నాయుత్తరములు నాదరించిరి. కాని మొదటివాడగు పార సీకపురాజుమాత్రి మాయుత్తరమును చించివైచెను. ఆ సమాచారము తెలిసి "నా శ్రీముఖమును వాడు చించినట్లే వాని రాజ్యమును నా సైన్య

ములు చించివేయునుగాత" మని మహమ్మదు పలికెను. ఇది పారసీకులకును, మహమ్మదీయులకును గలిగిన వైరముయొక్క బీజము.

తరువాత మహమ్మదు ప్రబలసైన్యముఁ జేర్చుకొని మక్కా పట్టణమును స్వాధీనము చేసికొనెను. అచ్చటఁ గాబా యను మందిరములోనున్న మూఁడువందలయఱువది విగ్రహములను విధ్వంసము చేసెను. అప్పటినుండియు నా కాబా మందిరము మహమ్మదీయుల ప్రార్థన మందిరమై, యన్నింటికంటెను పరమ పూజ్యస్థానమయ్యెను. హిందువులకుఁ గాశీక్షేత్రము విశ్వేశ్వరదేవాలయమునువలె మహమ్మదీయులకు మక్కా క్షేత్రమును కాబా మందిరమును ముక్తిప్రదములగు స్థలములని నమ్మిక.

మక్కా స్వాధీనముచేసికొనిన పిదప మహమ్మదు రూమ్ (టర్కీ) దేశముమీఁదికి బెక్కుసారులు దండెత్తిపోయి యందలి యనేక ప్రాంతములను జయించెను. ఒకదాడిలో నాతని శరీరమునకు నన్నారోగ్యత ప్రాప్తించెను. ఈలోకములోని ముఖ్యమతకర్తలలో నొక్కఁడగు మహమ్మదు, తన కవసానకాలము ప్రాప్తించినదని తెలిసికొని యప్పుడు తన శిష్యులనందఱికి ధర్మోపదేశముఁ జేసి, అరబస్థానములో నొక విగ్రహారాధకుని నైనను ఉండనీయవలదని యాజ్ఞాపించి, "యీమతము మిక్కిలి యభివృద్ధిఁజెంది మీరు శాశ్వతకీర్తి గలవారగుదురుగాత" మని యాశీర్వదించి, తన భార్యలలోఁ దనకు నత్యంత ప్రియురాలగు అయేషా బీబీ యను నామె మందిరములో నామెతొడమీఁదఁ దలపెట్టుకొని క్రీ. శ. 632 లో నొక శుక్రవారమునాఁడు కీర్తిశేషుఁ డయ్యెను.

## మహమ్మదీయ మత ప్రచారము

మహమ్మదు మరణానంతరమున నాతని మతపీఠమునకును, రాజ్యపీఠమునకును నధిపతులయినవారికి 'ఖలీపా' లని పేరు. వీరి పీఠమునకు 'ఖిలాఫ' తని పేరు. ఈ ఖిలాఫత్పీఠము క్రీ. శ. 632 మొదలు 660 వఱకు మదీనాలోను, 660 మొదలు 750 వఱకు డమాస్కస్ పట్టణ

ములోను, 750 మొదలు 1258 వఱకు బగ్దాడ్‌లోను ఉండెను. ఈ పీఠాధిపతులగు ఖలీఫాలు తమ మతమును యుద్ధమూలకముగా నానా దేశముల వ్యాపింపఁజేసిరి. వీరి యరబ్ సైన్యములయొక్క మతావేశము వారి స్త్రీల ప్రోత్సాహముకతన ద్విగుణితమయ్యెను. అప్పటి యరబ్ స్త్రీలు తమ పతులతో యుద్ధమునకుఁ బోయి వారి శ్రమలో సగము పంచుకొందురు; తమ వీరరసయుతగానములచే వారి శౌర్యమును బ్రజ్వలింపఁజేయుదురు. విజయముచేకొనిన వారి యానందమును దమ సాహచర్యముచే నెన్నియో మడంగులు హెచ్చింతురు !! ఇట్టి సుశీల లగు స్త్రీలకుఁ బరాజయమునొంది నల్లఁబాటిన ముఖముఁ జూపుటకు వెఱచి యరబ్‌వారు ప్రాణములకైన నాశపడక పోరాడుచుండిరి. అందుచే వారికి నెచ్చటను జయమే కలుగఁజొచ్చెను. మొదటి ఖలీఫా యగు అబూబకర్ (632 - 634) అనువాని కాలమున నాతని సేనాని యగు ఖాలేద్ అనువాఁడు ధనసంపన్నమైన డమాస్కస్ పట్టణము స్వాధీనముచేసికొనియె. రెండవ ఖలీఫాయగు ఉమర్ (634 - 644) అనువాఁడు పీఠమెక్కిన సంవత్సరముననే జరుసలేమ్ పట్టణమును గెలిచెను. ఈ పట్టణమునందుఁ గ్రైస్తవుల మూలాచార్యుఁడగు ఏసు క్రీస్తుయొక్క సమాధి కలదు.అందుచేఁ గ్రైస్తవమతస్థులగు యూరోప్ దేశములోని రాజులకును మహ్మదీయులకును వందల సంవత్సరముల వఱకును మతసంబంధమైన యుద్ధములు (crusades) జరిగెను. కాని జరుసలెం పట్టణముమాత్రము మహమ్మదీయుల చేతినుండి పోయి నదికాదు ! ఈ రెండవ ఖలీఫాకాలములోనే సిరియా,పరిశియా, ఈజిప్ట్ దేశములఁ దురుష్కులు గెలిచి యచ్చటఁ దమమతమును రాజ్యమును స్థాపించిరి. ఈజిప్ట్ (మిసర్) దేశముయొక్క రాజధానియగు అలెగ్జాండ్రియా పట్టణములో నొక గొప్ప పుస్తకభండార ముండెను. దానిని మహమ్మదీయులు తగులఁబెట్టి లోకమునకు నింతంతయని చెప్పుటకు వీలులేనంతనష్టముఁజేసిరి. మూఁడవ ఖలీఫాయగు ఉస్మాన్ అనువాఁడు గొప్ప సముద్రసేనను సిద్ధపఱచి భూమధ్య సముద్రపుబొడ్డుననున్న దేశములపైఁ దనయధికారముఁ జూపఁ దొడఁగెను. మాల్టా, గ్రీస్,

రోడ్స్ మొదలయిన దేశములు మహమ్మదీయులకు లోబడియె. అలీ యను నాల్గవ ఖలీఫా మహమ్మదునకు నల్లుడు. ఈతని కిద్దఱు కొమారులుండిరి. వారి పేళ్ళు హసేన్, హుసేన్. వీరిద్దఱును మహమ్మదునకు దౌహిత్రులు. ఈ అలీ కాలములో ఖిలాఫత్‌ను గుఱించి కలహములు కలిగి యాతడు చంపబడియె. ఆతని పుత్రులు పారసీక (ఈరాన్) దేశమునకు బాఱిపోయిరి. ఖిలాఫత్‌పీఠము డమాస్కస్‌కు గొంపోబడియె. మువావియా యను నాఱవ ఖలీఫాయొక్క కాలములో మహమ్మదు దౌహిత్రులగు హసేన్ హుసేనులు చంపబడిరి. (669) ఈ క్రూరకృత్యసూచకముగా నిప్పటికిని మహమ్మదీయులు పీఁపండుగు చేయుచున్నారు. క్రీ. శ. 624 లో అబ్దుల్ మలేక్ అనువాడు పదవ ఖలీఫాయయ్యెను. ఈతని సైన్యాధీశుడు తరీక్ అనువాడు స్పేన్ దేశమును గెలిచి, యాదేశముయొక్క దక్షిణపు కొనమీద దనపేరిట 'జబల్ తరీక్' అను కోట గట్టించెను. తరీక్‌ను వానిచే గట్టబడిన కోటయని దీనికర్థము. 'జబల్ తరీక్' అనుమాటయే ప్రస్తుతము జిబ్రాల్టర్‌గా మారినది! ఈతని మఱియొక సైన్యాధీశుడగు అబ్దుర్రహ్మాన్ అనువాడు స్పేన్ దేశపు క్రైస్తవరాజయిన ర్యడరిక్ అనువానిని క్రీ. శ. 705 లో నోడించెను; పిరినిస్ పర్వతములవఱకు రాజ్యమును సంపాదించెను; ట్యూనిస్ ప్రాంతమును దీసికొని కేరోల్ పట్టణమును గట్టించెను. ఈతని సైన్యములచే గార్డెజ్ పట్టణము కాల్పబడియె! తరువాత మహమ్మదీయులు ఫ్రాన్స్‌దేశములోనికి జొరబడిరి. క్రీ. శ. 732 లో ఫ్రాన్సుదేశపు రాజయిన చార్లెస్ మార్టెల్ అనువాడు వీరిని బరాభవించి వీరు ముందుకు బోకుండ నడ్డగించెను. ఇది వీరు యూరోప్ ఆఫ్రికా ఖండములలో జేసిన కల్లోలము. ఇదియంతయు మహమ్మదు గతించిన నూఱేండ్లలోపల జరిగిన వృత్తాంతము.

పైని వర్ణింపబడిన కాలములోనే యరబ్ మహమ్మదీయులు ఆసియా ఖండములోని టర్కీ, తుర్కస్థాన్, పారసీకము, అఫ్గానిస్థాన్ అను దేశములు జయించి యచ్చటివారికి మహమ్మదీయదీక్ష యొసగిరి. పారసీకు లనేకముగా బోరిరి. కాని తుదకు వారికి క్రీ. శ. 641లో

నహవంద్ యుద్ధమందు బూర్ణపరాజయము కలిగెను. అప్పుడు తమ మతమును విడువఁజాలని యనేక పారసీక కుటుంబములవా రా దేశమునువిడిచి సముద్రమార్గమున హిందూస్థానములోని గుజరాత్ దేశమునకు వచ్చిచేరిరి. అప్పటి రాజు శరణాగతత్రాణుఁడగుటచే వారిచే 'గుజరాత్ భాషను గ్రహించెదము; మీరాజ్యమందు గోహత్య చేయము' అని యొప్పించుకొని వారి కాశ్రయ మిచ్చెను. ఇప్పుడు మనదేశమందుఁ గాన వచ్చెడి పారసీకులు వారి సంతతివారే.

ఇట్లు అరేబియా దేశములోని యనాగరిక జనులు యూరోప్ ఖండములోని ఘనతఁజెందిన రోమక సామ్రాజ్యమును, సిరియా, స్పేన్, కార్తేజ్, గ్రీస్ మొదలయిన రాజ్యములను, ఆసియా ఖండములోఁ బేరొందిన పారసీకమును గెలిచి, లోకమునంతను దలక్రిందులుగాఁ ద్రిప్పిరి ; కావున నెంతటి బలశాలియుఁ దా నజేయుఁడనుకొనఁ గూడదు. ఎంత బలహీనుఁడయినను నేనేమి చేయఁగలనని తలఁప గూడదు.

పైని వర్ణించినట్లు మహమ్మదీయులు లోకమునంతయుఁ గాల్చు చుండఁగా దానినిగుఱించి మనదేశస్థులకు సమాచారమే తెలియదు. సమాచార మెట్లు తెలియును ? పరదేశములకుఁ బోయినఁగదా ? జాతిపోవు నన్న భయముచే మనవారు కూపస్థమండూకము లయిరి. అట్లుగాక యీ దేశపు వీరు లితరదేశములకుఁ బోవుచుండినయెడల వారి కీవర్తమానము చక్కఁగఁ దెలిసియుండును. యూరోప్ ఆసియా ఖండములలోని యుద్ధములు వారు స్వయముగాఁ జూచియుందురు. ఈ మిడతలదండు తమ దేశముమీఁదికి వచ్చునని వారికిఁ బూర్వమే తెలిసి తమ రక్షణకుఁ దగిన యేర్పాటులు చేసికొనుటకు వీలుండును. కాని నేఁడందులకుఁ జింతపడి నందున లాభమేమి ? ముసల్మానులు దీన్‌దీన్ అను రణధ్వనులతో మన గుమ్మములోనికి వచ్చువఱకు వారి సంగతియే మన మెఱుఁగము. అందుచే మనము వారిని వెడలగొట్టలేక మనస్వాతంత్ర్యముఁ బోఁగొట్టుకొంటిమి. ఇఁక నా కథాభాగమునకు వత్తము.

## మహమ్మదీయుల మొదటి దాడులు

క్రీ. శ. 664 వ సంవత్సరములో మహలబ్ అనుపేరుగల మహమ్మదీయ సేనానాయకుడు ముల్తాన్ వఱకు వచ్చి తిరిగిపోయెను. క్రీ. శ. 711 లో మహమ్మద్ కాసిమ్ అనువాడు సింధుప్రాంతము మీదికి దండెత్తివచ్చి యచ్చటి దాహిరను హిందూరాజును జంపి రాజ్యము నాక్రమించుకొనియె. కాసీం మరణానంతరమున మహమ్మదీయులను హిందువులు వెడలగొట్టి మరల స్వరాజ్యమును స్థాపించిరి. అటుతరువాత మూడువందల సంవత్సరములవఱకును హిందూదేశమునకు ముసల్మానులవలన విశేషబాధ కలుగలేదు.

## గజ్నీ వంశము.

(967 - 1186)

క్రమక్రమముగా ఖలీఫాల యధికారము తగ్గెను. వారి చేతిక్రింద నున్న రాజ్యములో నచ్చటచ్చట స్వతంత్రరాజ్యము లేర్పడెను. తొమ్మిదవ శతాబ్దాంతమున బుఖారా పట్టణములో సామానీవంశపురాజులు స్వతంత్రులైరి. వీరు మహమ్మదీయమతమును స్వీకరించిన పారసీకులు. ఈరాజులు తురకలను (Turks) జయించి వారికి మహమ్మదీయదీక్ష యొసగి వారిలో ననేకశూరులను దమసైన్యములో జేర్చికొనిరి. ఈ తురకలు మిక్కిలిశూరులు; ప్రాణములకాశింపక పోరాడువారు. అబ్దుల్ మలిక్కును సామానిరాజునొద్ద అలప్తగీన్అను తురక బానిసగానుండెను. వాడు క్రీ. శ. 967 లో దనపరాక్రమప్రభావమున స్వతంత్రుడై గజ్నీ పటణము రాజధానిగా జేసికొని ప్రభుత్వము చేయదొడగెను. అలప్తగీన్ క్రీ. శ. 976 లో మరణమందగా నాతని యల్లుడగు సబక్తగీన్ గజ్నీ రాజ్యమునకు రాజయ్యెను.

## సబక్తగీన్

(976 - 997)

గజ్నీ పట్టణము హిందూదేశమునకు మిక్కిలి సమీపముగా నున్నందునను, ఆరాజ్యపు సరిహద్దు పంజాబురాజ్యపు సీమను దగిలి యున్నందునను, ఈ క్రొత్త తురకరాజ్యమువలన దమకు బెక్కు బాధలు కలుగునని హిందువులకు భయముకలిగెను. అప్పుడు జయపాలుడను రాజు పంజాబుదేశమును పాలించుచుండెను. ఆతడీ తురకరాజ్యపు పొలిమేరను వెనుకకు నెట్టవలయునని తలచి, సింధునదిదాటి వారి మీదికి యుద్ధమునకు బోయెను. ఉభయసైన్యములును యుద్ధమునకు సిద్ధమైయున్న సమయమున బ్రహ్మాండమైన ముసరుపట్టి గాలివాన వచ్చెను. అప్పుడు శిలారూపమైన మంచుగడ్డలు పడెను. హిమాలయ ప్రాంతమందలిమంచునకు జలికి దాళలేక హిందూసైన్యము లోడి పోయెను. అందుచే సబక్తగీనునకు సంవత్సరమున కింతకప్పము కట్టెద నని యొప్పుకొని జయపాలుడు తిరిగివచ్చెను. కాని యా కప్పమీయ నందున సబక్తగీన్ అతనిమీదికి దండెత్తివచ్చి యాతని నోడించి పేషావరులో దనసైన్యమునుంచి వెడలిపోయెను. ఈతరుష్కుడు క్రీ. శ. 997 లో మృతుడయ్యెను.

## గజ్నీ మహమూదు

(999 - 1030)

ఈతడు సబక్తగీనునకు నుంపుడుకత్తెయందు బుట్టిన పుత్రుడు. ఇస్మాయ లనువాడు సబక్తగీనునకు నౌరసపుత్రుడు. కాని యా యౌరసపుత్రునిఁ జెఱసాలలోఁబెట్టి దాసీపుత్రుడగు మహమూదు 'సుల్తా'నను బిరుదు వహించెను. హిందూదేశమునీది కనేకపర్యాయములు దండెత్తివచ్చి, యిచ్చటి యనేక దేవాలయములను, మందిరములను, పట్టణములను ధ్వంసముచేసి, యసంఖ్యధనమును ఈదేశమునుండి

దోచుకొనిపోయిన తురుష్కులలో నీతడగ్రగణ్యుడని చెప్పవచ్చును. ఈతడు పండ్రెండుపర్యాయములు హిందూదేశముమీదికి దండెత్తి వచ్చెను.

మొదటిదాడి (క్రీ. శ. 1001)—నవంబరునెలలో బదివేలసైన్య ములతో వెడలి మహమూదు పెషావరుమైదానములో విడిసెను. జయ పాలుడు సింధునదిదాటి వానిమీదికి యుద్ధమునకు బోయెను. 27 వ నవంబరు దినమున యుద్ధముజరిగి జయపాలునకు బరాభవముకలిగి యాతడును, పదియైదుగురు సేనాధీశులును శత్రువులచేతిలో జిక్కిరి. మహమూదు వారియొద్దనుండి యసంఖ్యధనము దీసికొని వారిని వద లెను. అప్పుడు జయపాలుడిచ్చిన యొక కంఠమాలయొక్క వెల 180,000 దీనారు*లనగా నెనిమిదిలక్షల పదివేలరూపాయ లుండెనట! మహమూదు గజ్నీ వెడలిపోయెను. పరాజయ దుఃఖముచే జయపాలు డగ్నికాష్ఠముల భక్షించి దేహమువిసర్జించెను. ఆతని కుమారుడగు అనంగపాలుడు రాజయ్యెను.

రెండవదాడి (1004)—అనంగపాలుడు మహమూదుతో స్నేహ భావముజూపుచున్నను, ఆతని దాయాదియగు భాట్టియాదేశపురాజు తురుష్కులను ద్వేషించుచుండెను. ఈతనిపేరు విజయరాయ్. ఈతని మీదికి మహమూద్ దండెత్తిపోయెను. మొదట హిందువులకే విజ యము సంప్రాప్తమయ్యెను. తుదకు మహమూదు మక్కాపట్టణము వైపునకు దిరిగి, మోకాళ్ళమీద గూర్చుండి యీశ్వరప్రార్థనచేసి నేడు మీకు దప్పక జయమగునని యీశ్వరుడు సెలవిచ్చినాడని సైనికులతో జెప్పగా దురుష్కసైనికు లుత్సాహముగలవారై ఘోర ముగా బోరాడి విజయులైరి. విజయరాయుడు సింధునది యొడ్డునందలి యరణ్యములోనికి బాఱిపోయి యచ్చటనే మృతుడయ్యెను. భాట్టియా రాజ్యము తురుష్కులపాలయ్యెను. వా రెంతయోధనము దోచుకొని స్వదేశమునకు వెడలిపోయిరి.

---

*దీనారటంకము వెల రమారమి నాలుగున్నర రూపాయలు.

మూడవదాడి (1005)—అబ్దుల్‌ఫతేలోది యనువానిని మహమూదు, ముల్తాన్ దేశమునకు నధికారిగా నేర్పఱచెను.వాఁడనంగపాలునితోఁగలసి మహమూదును లక్ష్యపెట్టక తిరుగఁబడియె. అందుచే మహమూదు పేషావర్ ప్రాంతముమీఁదుగాఁ బంజాబుదేశమునకువచ్చి శత్రువు నోడించెను. అనంగపాలుఁడు కాశ్మీరమునకుఁ బాఱిపోయెను. అబ్దుల్‌ఫత్తే శరణుచొచ్చెను. అటు అఫ్‌గానిస్థానులో ఖురాసాన్ ప్రాంతముమీఁదికి ఇలీఖ్ ఖానుఁడనువాఁడెత్తివచ్చెనని విని మహమూదు త్వరగా వెడలిపోయెను.

నాల్గవదాడి (1005-6)—మహమూదు వెళ్ళినతోడనే యనంగపాలుఁడు తిరిగివచ్చి యనేక రాజపుత్రులను గలుపుకొని తురుష్కులను నోడించుటకు యత్నముచేయఁదొడఁగెను. తురుష్కులచేఁ జేయఁబడిన ధర్మవిప్లవమువలనను, దేవాలయధ్వంసమువలనను హిందువులందఱికి మిగులఁ గోపమువచ్చి యనేకులువచ్చి యనంగపాలుని సైన్యములోఁ జేరిరి. దూరదూరములనుండి హిందూస్త్రీలుగూడఁ దమ నగల నమ్మి యీధర్మయుద్ధమునకై ధనమును బంపిరి! మహమూదున కీవర్తమానము తెలిసి వాఁడును గొప్పసైన్యములతోఁ దండెత్తివచ్చెను. ఉభయులకుఁ బోరాటమై హిందువులదియే కొంచెము పై చేయియై యుద్ధము జరుగుచుండఁగా ననంగపాలుని యేనుఁగు బెదరి రణరంగమునుండి పాఱిపోవుచున్నదని భ్రమించి హిందూసైనికులందఱును చెల్లాచెదరైరి. మహమ్మదీయులకు విజయము ప్రాప్తమయ్యెను. వారంతటితో నూరకుండక నగరకోట దేవాలయముమీఁదికిఁ బోయిరి. అది హిమాలయపర్వతముయొక్క దక్షిణపుటొంపుమీఁదనుండెను. అచ్చట నగ్నిపర్వత మున్నందున దానిని గొప్పక్షేత్రముగానెంచి హిందువు లాదేవాలయమునకుఁ గోట్లకొలఁది ధనము కానుకగా నిచ్చుచుండిరి. అందుచే నచ్చట నపారమగు సంపత్తియుండెను. ఈ సమాచారము తెలిసి మహమూదకస్మాత్తుగా నాదేవాలయముపైఁబడియె.

ఈస్థల సంరక్షణార్థమై యెప్పుడచ్చటనుండు సైన్యముకూడ నప్పు డనంగపాలునకు సహాయము చేయుటకుఁ బోయినందున నచ్చటి ధన మంతయు నాల్గేచ్ఛనకు సులభముగా దొరకెను. అప్పుడచ్చట నేడు లక్షలబంగారు దీనార్ నాణెములును, ఏడువందల మణువుల బంగారు వెండి నగలును, రెండువందల బంగారపుకడీలును, రెండువేల మణు వుల వెండియు, కెంపులు రవలు పచ్చలు మొదలయిన యిరువదిమణు వుల రత్నములును నాదేవాలయములో మహమూదుకు దొరకెనఁట !

మహమూదు తనదేశమునకుఁ బోయి తనవిజయమునకై గొప్ప యుత్సవముఁ జేసెను.అందు బంగారపుగద్దియలును, మేజులునుజేయించి వానిపై హిందూదేశమునుండి తేఁబడిన రత్నాదులనుంచి, చూచువారి కనులకు విందుగావించెను. బీదల కన్నదానమును, సాధువులకు,విద్వాం సులకు, శూరులకు బహుమతులును నొసంగెను. 1010 లో మహమూదు సూరవంశజుడఁగు మహమ్మదనువానిని నోడించెను. ఈసూరవంశజులే ముందు మహమూదువంశమును నంత మందించిరి.

**నాలుగుదాడులు**—క్రీ. శ. 1010 లో మహమూదు ముల్తాను స్వాధీ నముచేసికొని ఫతేలోది యనువానినిఁ జెఱపట్టెను. ఇది యెదవదాడి. క్రీ. శ. 1011 లో నీతఁడు స్థానేశ్వరదేవాలయముఁ గొల్లగొట్టెను. ఇది యాఱవదాడి. 1013 లోను, 1014 లోను కాశ్మీరముమీఁదికిఁ దండువెడలి పోయినట్లు గానవచ్చెడిని. కాని యచ్చటనుండి యూరకయే రావలసిన వాఁడాయెను. ఇది యేడవ యెనిమిదవదాడులు.

**తొమ్మిదవదాడి (1017)**—ఇదియొక గొప్పదాడి. ఇదివఱ కెన్ని పర్యాయములు వచ్చినను మహమూదు పంజాబుదాఁటి వెళ్ళలేదు. కాని యీ తడవ గంగానదియొడ్డుననున్న ధనసంపన్నములయిన నగరము లను దోఁచుకొనుటకు నిశ్చయించెను. ఒకలక్ష గుఱ్ఱపుస్వారులును, ఇరు వదివేలు కాల్బలమును వెంటఁదీసికొని యీసాహసికాగ్రగణ్యుఁడకస్మా త్తుగాఁ గనోజ్ పట్టణము నొద్దకివచ్చి విడిసెను. వీరు గ్రామము సమీ

పించువఅకును వీరు వచ్చుచున్నారనిన వార్త కనోజురాజగు కువరరాయ నికిఁ దెలియనేతెలియదు.అందుచే నచ్చట యుద్ధసన్నాహమేమియులేదు. తా నాఁమ్మేచ్చునితోఁ బోరి గెలుచుట యసంభవమని యెఱిఁగి యూరా జాతనితో సంధిచేసికొనెను. అంతట మహమూదు మధురానగరమునకుఁ బోయి యచ్చటి దేవాలయములఁ గొల్లగొట్టి స్వదేశమునకుఁ బోయెను. హిందూదేశములోని భవ్యమందిరములఁజూచి యాతఁడు గజ్నీలో నూత నముగా గొప్పమందిరములను గట్టించెను.

పదవ పదునొకొండవదాడులు (1021 - 1023)—కనోజ్‌రాజు మహమూదుతో సంధిచేసికొన్నందున నితరరాజపుత్రరాజు లందఱు వానిని బహిష్కరించిరి. బుందేల్ ఖండాంతర్గతమైన కాలింజర్ పట్ట ణపు రాజు కనోజ్‌మీఁదికి దండెత్తిపోయెను. కనోజ్ రాజు మొట్టవిని మహమూదు వానిసహాయమునకుఁ బరుగెత్తికొనివచ్చెను. కాని వాఁడు వచ్చుటకుఁ బూర్వమే కనోజ్‌రాజు కలింజర్ రాజయిన నందునిచేఁ జంపఁబడియె. అందుచే మహమూదు కలింజరునకుఁ బోయెను. కాని యందు విశేషలాభములేక యాతఁడు తిరిగివెళ్ళవలసినవాఁడాయెను అని తురుష్కచరిత్రకారులు వ్రాసియున్నారు. అనఁగా మహమూదుకు గొప్ప పరాభవము గలిగి యాతఁడు తిరిగిపోయెనని మన మర్థముచేసికొన వచ్చును. ఈతురుష్కుఁడు పదునొకండవ దాడిలో లాహోరుప్రాంత మును దీసికొని గజ్నీ రాజ్యములోఁ గలుపుకొనెను.

పండ్రెండవదాడి (1024)—ఇది మహమూదుదాడులలో నగ్ర గణ్యమైనది; కడసారిది. కాఠేవాడ్ ద్వీపకల్పమునకుఁ బూర్వము సౌరాష్ట్రమనిపేరు. అచ్చట దక్షిణపువైపు సముద్రపుటొడ్డున సోమ నాథుని దేవాలయము కలదు. ద్వాదశజ్యోతిర్లింగములలో నొక్కటి యని యీ మహాక్షేత్రము మిక్కిలి ఘనతచెందియుండెను. లింగము సముద్రపుటొడ్డున నున్నందున సముద్రలహరు లా లింగమునకు నభిషే కముఁ జేయుచుండెను. ప్రతిసంవత్సరము కోట్లకొలఁది జనులు దేవుని

సేవింపవచ్చుచు నసంఖ్యధనము నొసఁగుచున్నందునను, వెలకొలఁది గ్రామము లీదేవునికి నగ్రిహారములుగా నీయఁబడినందునను నీ దేవస్థాన మొకసంస్థానపు రాజమందిరమువలె నుండెను. వేయిమంది యర్చకు లీదేవునికి నారాధకులుగా నుండిరి. ఇట్టి విఖ్యాతిఁజెందిన దేవుని విగ్రి హముఁ బగులఁగొట్టిన కీర్తి సంపాదింపవలెనని మహమూదుకుఁ ప్రబల మైనకోర్కె పుట్టెను. అచ్చటి యసంఖ్యధనమును గొల్లగొట్టవచ్చుఁ గదాయనిన యాశ యాతని మఱింత పురికొల్పఁగా నాతఁడు క్రీ.శ. 1024 లో దండువెడలెను.

గజ్నీ పట్టణమునుండి సోమనాథదేవాలయము వేయిమైళ్ళ దూర మున నుండెను. గజ్నీనుండి సోమనాథుకు వచ్చుటకు రెండుమార్గములు. ఒకటి బోలన్ ఘొజాక్కలను కనుమలగుండా సింధుదేశములోనుండి; రెండవది ఖైబర్కనుమనుండి పేషావర్, ముల్తాన్, అజ్మీర్మీఁదినుండి. మహమూదీ రెండవమార్గమున వచ్చినట్లు కానవచ్చెడిని. ముప్పదివేల గుఱ్ఱపుసేనయు, ముప్పదివేల లొట్టిపిట్టలును వెంటఁదీసికొని మహ మూదు బయలుదేరెను. ఈలొట్టిపిట్టలమీఁద రస్తుసామగ్రియు మంచి నీళ్ళను గట్టుకొనిరి. అక్టోబరులో ముల్తానుజేరి యచ్చటినుండి యజ్మీరు నకుఁబోయెను. ఆతఁడు వచ్చుచున్నాఁడనినవార్త యదివఱకుఁ దెలియ నందున నచ్చటిరా జాతనిరాక తెలియఁగనే పాఱిపోయెను. అచ్చటినుండి యాతఁడు గుజ్రాత్లోని అనిహిలపట్టణమునకుఁబోఁగా నచ్చటిరాజు గూడఁ బాఱిపోయెనఁట. అంత మహమూదు తిన్నగా సోమనాథుని యొద్దకు వచ్చి చేరెను. ఒకపూజారివచ్చి 'సోమనాథుఁడు మిమ్మునంద ఱిని సంహరించును' అని చెప్పెను. కాని తురుష్కులు వానిపై బాణ ములువేసి వానిని బాఱఁదోలిరి.

రెండవదినము శుక్రవారమైనందున మహమూదు 'అల్లాహో అక్బ' రని యఱచి తన సేవకులకు నధికోత్సాహముఁ గలిగించి దేవాలయము చుట్టునున్న కోటను ముట్టడించి యుద్ధమునకుఁ బ్రారంభించెను. కోటలోని వారికిని దురుష్కులకును పోరు ఘోరమయ్యెను. మూడుదినములవఱకు

యుద్ధము జరిగెను. ఇంతలో అనిహిలనగరపురాజును, 'ఇతరరాజపుత్రి లును సోమనాథుని రక్షణార్థమై పరుగెత్తుకొనివచ్చిరి. హిందువులకె జయ మగునట్లు గానుపించెను. తురకసైనికులు కాలు వెనుదీయఁజొచ్చిరి. ఈ సమాచారముచూచి మహమూదు భూమిమీఁద సాష్టాంగముగాఁబడి దేవు నిఁబ్రార్థించి 'మీకు జయము నిక్క' మని దేవుఁడు సెలవిచ్చెనని చాటిం చెను. అందుపైఁ దురుష్కులందఱును పదిరెట్లు బలముగలవారై రాజ పుత్రులతో ఘోరముగాఁబోరిరి. అందుచే రాజపుత్రులందఱును విఱిగి చెల్లాచెదరైరి. అంత నాతురుష్కునికే విజయము ప్రాప్తమై యాతఁడు దేవాలయములోనికిఁ బ్రవేశించెను. దేవాలయములో నొక్కదీపమే యున్నందున నది భయంకరముగానుండెను. ఆదేవాలయ మేఁబదియాఱు స్తంభములమీఁద గట్టబడియె. అందు బంగారుగొలుసులకుఁ గట్టఁబడిన పెక్కుగంటలు వ్రేలాడుచుండెను.అచ్చటి లింగమూర్తి తొమ్మిదియడుగు లెత్తుండెను. మహమూదు గర్భగృహము దాఁటి లింగమూర్తిని సమీపిం చెను. అప్పుడచ్చటఁ బూజచేయు బ్రాహ్మణులందఱనువచ్చి 'మీరు మాదేవుని ముట్టకున్న యెడల మీకు బంగారపురాసు లొసెంగద'మని రఁట. అందులకు మహమూదు 'విగ్రహము లమ్మువాఁడనిపించుకొనుట కంటె విగ్రహములఁ బగులఁగొట్టువాఁడనిపించుకొనుట నాకధికప్రియ' మని యాలింగమును బగులఁగొట్టెనఁట. అందు నాతనికి రత్నముల రాసులు దొరకెనఁట. ఆధనమును, లింగముయొక్క శకలములను,చందన ముతోఁ జేయఁబడి మిక్కిలి చక్కని చెక్కడపుఁ బనితనముఁగల దేవా లయపు పెద్దతలుపులును దీసికొని యాతఁడు గజ్నీకిఁ బోవుటకు బయలు దేరెను. ఈరత్నరాసుల విషయమైనకథ నమ్మఁదగిన చరిత్రాంశము కాదని డాక్టర్ హంటర్ యొక్క యభిప్రాయము.

ఈతఁడు తిరిగిపోవునపు డెదిరింపవలయునని యనేకరజపూత రాజు లజమీరునొద్దఁ గాచియుండిరి. ఈసమాచారము తెలిసి యామార్ గమునఁ బోనొల్లక సింధుదేశములోని యెడారిమార్గమునఁబోయెను.త్రోవఁ జూపువారు హిందువులయినందుననీమహ్మదీయులపైఁ గోపముగలవారై తప్పుత్రోవలు చూపిరి. అందుచే నాయెడారిలో నెండకు మలమలమాఁడి

యన్నముదొరకక,నీరుదొరకక,కసువుదొరకక మ్లేచ్ఛసైన్యము లనేకములు మడిసెను.అట్టులనేక కష్టములుపడుచు వారు గజ్నీ పట్టణముఁజేరిరి.సోమ నాథునిశకల మావిగ్రహాంతకుఁడగు తురుష్కుఁడు గజ్నీ పట్టణములోని మసీదునకుఁబెట్టించెను. రెండుతునకలు మక్కామదీనాలకుఁ బంపెను. సోమనాథుని దేవాలయపు కవాటములను మహామూదుకుమారుఁడాతని గోరీకిఁ (సమాధికి) బెట్టించెను. క్రీ.శ. 1842 లో వానిని నప్పటి గవర్నర్ జనరల్ అగు ఎలింబరో హిందూదేశమునకుఁదెచ్చెను.ప్రస్తుత మవి యాగ్రాకోటలోని యొక చీఁకటికొట్టులోనున్నవి. ఇవి నిజమైన సోమనాథకవాటము లగునని కొందఱును కావని కొందఱును వాదించి యున్నారు.

ఈదాడికి తరువాత మహామూదు తిరిగి హిందూదేశమునకు రాలేదు. అఱువదియాఱేండ్లు బ్రతికి యాతఁడు క్రీ.శ. 1030 లో మధు మేహముచే మరణముఁ జెందెను.

పైని మహామూదునుగుఱించి వ్రాసిన యంశములన్నియు నింగ్లీషు గ్రంథముల ననుసరించి వ్రాయఁబడినవి. ఈగ్రంథకారులంద ఱును తురుష్క చరిత్రకారుల ననుసరించియున్నారు. కావున నీవర్ణన మంతయుఁ బక్షపాతభూయిష్టమని చెప్పుటకు సందేహములేదు. అప్పటి హిందువులు వ్రాసియుంచిన చరిత్ర లేమియులేనందున నందలి కథాంశ మెంతవఱకు నిజమో యెంతవఱకు నసత్యమో తెలుసుకొనుటకు వీలు లేదు. హిందూదేశముపై నాతఁడు పదునొకండు పర్యాయములు దండెత్తె నని యొకఁడును, పండ్రెండుసారులని మఱియొకఁడును, పదియారు సారులని యింకొకఁడును వ్రాసియున్నాఁడు. వారివ్రాఁతలలో నింకను పరస్పర విరోధంబులు కలవు. ఈలియట్అను చరిత్రకారుఁడు వీని నన్నిఁటినిఁజూపి, వీనిని సమన్వయించుటకుఁ గొంత యత్నించెను. కాని యది యంతగా యుక్తియుక్తముగాలేదు. దీనినిగుఱించి యెక్కువగాఁ బరిశోధన జరిగినఁగాని నిజము తేలనేరదు.

ఇన్నిసారులు హిందూదేశముపై దండెత్తివచ్చినపు డొక్కసారి యైనను నాతనికి బరాజయము కలిగినట్లు తురుష్కులు వ్రాసియుండ లేదు. ఇది గొప్ప వింత. తమనాయకులకు బరాజయము కలిగినపు డూరక జాలువిడచుట వారి స్వభావమైనందున, నేడవ యెనిమిదవ పదవ దాడులలో నాతనికి జక్కని పరాభవము కలిగెనని మూహింపవచ్చును. ఈతడి డిన్ని పర్యాయము లీదేశమునకు వచ్చినను ఇచ్చట రాజ్య స్థాపనము చేసినవాడుకాడు. అందుచే నాతని కీదేశపురాజులచే ననేక పరాభవములు సంప్రాప్త మయ్యెననియు, నందుచే నాతనికి నిచ్చట రాజ్యము స్థాపించుటకు వీలులేకపోయె ననియు మన మూహింపవలసి యున్నది. కాని యాతనికి దొరకిన రాజ్యమును వదలి వెళ్ళినాడని తురుష్కులు వ్రాసిన వ్రాతలు కొందఱింగ్లీషువారు నమ్మినట్లు మనము నమ్ముట బాలిశము.

ఇదియుగాక మహమూదును పంజాబు రాజయిన యనంగ పాలుడు పూర్తిగా బరాభవించినందులకు నొక గొప్ప యాధారము నాకు గ్రొత్తగగానుపించినది. అది తురుష్కగ్రంథములోనిదియే గనుక విశ్వాసపాత్రమైనది. అబురిహాన్ అల్‌బిరూని అను తురుష్కవిద్వాం సుడు తారీఖ్ ఉల్‌హింద్ అను చరిత్రగ్రంథమును వ్రాసెను. అందు 'గాబూల్ దేశములోని బ్రాహ్మణరాజులు' అను వంశమునుగుఱించి బాగుగ వర్ణించియున్నాడు1. అనంగపాలుడావంశములోనివాడు ఆవం శపు రాజులనుగుఱించియు అనంగపాలునిగుఱించియు అల్‌బిరూనీ యిట్లు వ్రాయుచున్నాడు : "ఈరాజులు మిక్కిలి రాజ్యవిస్తారము గలవార యును, ఉత్తమసద్గుణమండితులుగను, ఆడినమాట తప్పనివారుగను, తమ కంటె దక్కువవారిని దయతో జూచువారుగను నుండిరి. అమీర్ మహమూదుకును అనంగపాలునికిని వైరమున్నపు డనంగపాలుడు

---

1. హిందూదేశ కథాసంగ్రహము : ప్రథమభాగము హిందూ మహాయుగము మూడవకూర్పు, 188 వ పుట చూడుడి.

మహమూదునకు వ్రాసిన యీ యుత్తరమునకై యాతనిని గొనియాడ వలసి యున్నది." "నీరాజ్యముమీఁదికి దురకలు (Turks) దండెత్తి వచ్చిరనియు, ఖురాసాన్ ప్రదేశమంతయు నాక్రమించిరనియు విన్నాను. వలయునెడ నైదువేలగుఱ్ఱములతోను, పదివేల సైనికులతోను, నూఱు ఏనుఁగులతోను నీకు సాహాయ్యము చేయుటకు వచ్చెదను; లేదా నీకిష్ట మున్న యెడలఁ బైనిఁ బేరొక్కన్నదానికంటె రెండింతల సైన్యముల నిచ్చి నాకుమారునిఁ బంపెదను. నీయనుగ్రహమునకై నే నిట్లు వ్రాయలేదు. నేను నిన్నుఁ బూర్తిగఁ బరాభవించినను అట్టిగౌరవము నాకుఁదప్ప నితరుల కుండఁగూడదని నాయుద్దేశము" ఈయుత్తర మౌదార్యశాలియైన యనంగపాలుఁడు మహమూదునకు వ్రాసెనని మహమూద్ యొక్క-యాస్థానపండితుఁడైన అల్‌బిరూనీ యుదాహరించియున్నాడు1. కావున నిది యసలుకు సరియైన నకలని మనము చెప్పవచ్చును.అనంగపాలుఁడు మహమూదును పూర్తిగఁ బరాభవించెననుటకు నింతకంటెఁ బ్రిబల ప్రమాణమేమికావలయును ? తాను పూర్తిగనోడించి వెడలఁగొట్టిన శత్రునిమీఁదికి నితరశత్రువులు దండెత్తిరాఁగాఁ దనవైరము మాని ధర్మ స్వరూపుఁడగు అనంగపాలుఁ డీయుత్తరము మహమూదుకు వ్రాసెను. కావున గజ్నీమహమూదు హిందూరాజులచే ననేక పర్యాయములు పరా భూతుఁ డయ్యెననియు, ఆయంశములను మహమ్మదీయ చరిత్రకారులు కప్పిపెట్టిరనియు, ఇంగ్లీషు గ్రంథకారులును ఆచరిత్రభాగమును బాగుగఁ బరిశోధింపలే దనియు మనము నిశ్చయముగఁ జెప్పవచ్చును. దీనిం గుఱించి మహమ్మదీయ చరిత్రగ్రంథములను చక్కఁగఁ బరిశోధించి చూడవలయును.

మొత్తముమీఁద జూడఁగా లోకములోని విఖ్యాతసేనానాయకు లలో మహమ్మ దొక్కఁడని చెప్పవలసియున్నది. ధైర్యసాహసము లీతని యమ్మతగుణములు. శత్రిసైన్యములు తనసైన్యములకంటె నెక్కుడుగా

---

1. Elliot's History of India, Vol. 2, PP. 12&40.

నున్నపుడు వారిని మోసపుచ్చి జయముసాధించును పాయంబును,వీలులేని చోట్ల దెలివిగల శత్రువునుగూడ దప్పించుకొని దాటిపోవుతెలివియు, దన్నైసెన్యము పాటిపోవునపుడు తన కీశ్వరసాక్షాత్కారమైనదనియు దప్పక జయముకలుగునని యీశ్వరుడు వరమొసంగె ననియు నటించి వారిని మకల యుద్ధమునకు బురికొల్పి జయము సాధించు నేర్పును గల మహామూమవంటి మహాయోధులరిది. ఈతడు విద్యాభివృద్ధియు శిల్పకళాభివృద్ధియు జేసెను. పరమతమునందు నపరిమితద్వేషమును, ధనమునందు నెడతెగని తృష్ణయును దుర్గుణములు తప్ప నన్యదుర్గుణంబు లీతని కందు లేవు.

మహామూమవంశజులు క్రీ. శ. 1152 వఐకు గజ్నీలో రాజ్యము చేసిరి. వా రెవరును ఈదేశమునకు రానందున వారిచరిత్రతో మనకు బనిలేదు. కడపటిరాజయిన బహరా మనువానిని గోరీరాజులు జయించి నందున నాతనికుమారుడగు ఖుస్రూ యువాడు హిందూదేశమునకు బాటివచ్చి లాహోరులో నేడుసంవత్సరములు రాజ్యముచేసెను. వీని కుమారుడగు ఖుస్రూమలీకనువాడు గోరీ రాజులచే 1186లో జయింపబడియె. అంతటితో నీవంశ మంతరించెను.

## గోరీవంశము

## (1152 - 1206)

హిందూదేశముయొక్క స్వాతంత్ర్యము హరించి తురుష్క రాజ్యము నిష్ఠ స్థాపించినవా రీవంశమువారు. హిందూకుశపర్వతము యొక్క యుత్తరశాఖాపార్శ్వమున గోర్ లేక ఘోర్ అనుమండలము కలదు. అది తమమూల పరిదేశమని యఫ్ఘాను లెంచెదరు. అచ్చటి వారి కింతకు బూర్వమే యరబ్‌వారిచే మహమ్మదీయదీక్ష యొసగబడియెను. అరబ్‌వారు వీరి స్వాతంత్ర్యము హరించియుండిరి. కాని వీరు పోయిన స్వాతంత్ర్యము మరల సంపాదించిరి. గజ్నీమహామూదీమండలము జయించియుండెను. కాని యాతనిమరణానంతరమున

గోర్‌లోనుండెడి సూర్‌వంశజుఁడయిన అల్లాఉద్దీననువాఁడు ప్వతంత్రుఁడగుటయేగాక, క్రీ. శ. 1152లో గజ్నీరాజగు బహరా మనువాని నోడించి, గజ్నీపట్టణముఁ గాల్చి యారాజ్యమంతయు స్వాధీనము చేసి కొనెను. ఈతనితరువాత నీతని కుమారుఁడు చంపఁబడెను. ఈతని యన్న కుమారులగు గ్యాస్‌ఉద్దీన్, శహాబుద్దీ ననువాండ్రికలిసి రాజ్యము చేయఁ దొడఁగిరి. ఇద్దఱు రాజులుకలసి యైక్యమత్యముతో రాజ్యముచేసిన యుదాహరణమిది యొక్కటియె.

## శహాబుద్దీన్ మహమ్మద్ గోరీ

(1157 - 1206)

వీరి యిద్దఱిలో శహాబుద్దీననువాఁడు హిందూదేశముమీఁదికి ననేకపర్యాయములు దండెత్తివచ్చి, యెన్నియోపర్యాయము లిచటిరాజు లచే నోడింపఁబడి పాఱిపాఱి, మరలమరల వచ్చి తుదకు విజయుఁడై యీదేశమునఁ దురుష్కరాజ్యమును స్థిరపఱచెను. ఈతనికాలమందు నుత్తరహిందూదేశమున శూరులగు రాజపుత్రులనేకులుండిరి. వారిలోని పరస్పరకలహములే యీదేశపారతంత్ర్యమునకుఁ గారణమయ్యెను. ఆయంశము లిచ్చటఁ గొంచెము వివరముగా వ్రాయుట యావశ్యకము.

## అప్పటి రాజపుత్ర రాజ్యములు

ఆకాలమందు దిల్లీ యజ్‌మీరు పట్టణములలో చహువాన్ వంశజుఁడగు పృథ్వీరాయఁడును, కనోజ్ పట్టణములో రాథోడ్ వంశజుఁడగు జయచందుఁడును, మేవాడాంతర్గతమైన చితోడ్ దుర్గముమీఁద గుహలోట్ వంశజుఁడగు సమరసింహుఁడును, అబూగడ్డపై పరమార వంశజుఁడగు జైతుఁడును, పట్టణమను నామాంతరముగల అనిహిలపురములోఁ జాళుక్యవంశజుఁడును గుర్జరాధిపుఁడును అగుభోలాభీముఁడును రాజ్యముచేయుచుండిరి. వీరుముఖ్యమైనవారు. వీరుగాక చిన్నచిన్న రాజులనేకులుండిరి. కాని యెవ్వరికి వారు స్వతంత్రులయి యుండుచే

నెప్పుడును బరస్పరకలహములు కలిగియుండిరి. వీరిలోనిముఖ్యుల పూర్వచరిత్రయు నప్పటిసంగతియు నిచ్చట సంగ్రహముగఁ బొందు పటిచెదము.

## కనోజ్

ఇది బహుపురాతనకాలమునుండియు విఖ్యాతిఁజెందినరాజ్యము. ఒకప్పుడు దీనికి సార్వభౌమత్వము కలిగియుండెను. వైశాల్యమును బట్టియుఁ జక్కనిమందిరములను బట్టియుఁ గనోజ్ పట్టణము మిక్కిలి ఘనతను వహించియుండెను. క్రీ. శ. 1017 లో గజ్నీమహమ్మా దీపట్టణమునకు వచ్చినపుడు దానిశోభకు నచ్చెరువంది దానినిగుఱించి తనవారి కిట్లు వ్రాసెను : "ఇచ్చట వేలకొలఁది మందిరములు గలవు. అవి నిశ్చలభక్తుని నమ్మికవలె దృఢమైనవి. అవి చాలవఱకుఁ జంద్ర కాంత శిలలతో నిర్మింపఁబడినవి. ఇవిగాక యసంఖ్యదేవాలయములు కలవు. ఈకనోజ్‌పట్టణమునకు నింత చక్కఁదనము వచ్చుటకుఁ గోట్ల కొలఁది దీనారులు సెలవై యుండవలెను. రెండువందల సంవత్సరము లకోఁగూడ నిట్టిపట్టణముఁగట్టుట దుర్లభము." రాజస్థాన చరిత్రికారుఁడగు కర్నల్ టాడ్ అనువాఁడీపట్టణముఁగూర్చి "ప్రస్తుతపు లండను పట్టణమువలె జయచంద్రుని రాజధానియగు కనోజ్‌పట్టణ మెటుచూచినను వదునైదుకోసులు వైశాల్యము కలదియై యుండె" నని వ్రాసి యున్నాఁడు. ఆగరమున నాకు లమ్మువారి గడపలు ముప్పదివే లుండె నఁట. ఈరాజునొద్ద గొప్పసైన్య ముండెను.

ప్రస్తుతచరిత్ర విషయిక కథాసమయమున నీపట్టణములో జయ చంద్రుఁడను రాజు రాజ్యముచేయుచుండెను. ఈతఁడు దక్షిణదేశము నకుఁ బోయి కొన్ని దిగ్విజయములుఁ జేసినట్టు 'పృథ్వీరాజరాసా' యను గ్రంథమువలనఁ దెలియుచున్నది. ఈతఁడును అప్పుడు దిల్లీశ్వరుఁడుగా నుండిన పృథ్వీరాజును అక్క చెల్లియుండ్రికుమారుఁడు. సార్వభౌమాధి కారమునకై యీయిద్దరికిని స్పర్ధకలిగియుండెను. తాను సార్వభౌమునఁ

నని స్థిరపఱచుటకై జయచంద్రుఁడు రాజసూయయాగము చేయుటకు సుద్యమించెను. కాని యాతనిసైన్యముల నోడించియు, నాతని బంధువు నొకనిఁ జంపి యజ్ఞసమయమున సశౌచము (సూతకము) వచ్చులాగునఁ జేసియుఁ, బృథ్వీరాయఁడాయజ్ఞమునకు విఘ్నము కల్పించెను. ఇదియుఁ గాక జయచంద్రుని కన్యయగు సంయుక్తయను నామె నెత్తుకొనిపోయి యాతఁడు వివాహమాడెను. ఈ కథాభాగము పృథ్వీరాయచరిత్రలో వివరముగ వర్ణింపఁబడును. ఈకారణములచే జయచంద్ర పృథ్వీరాయలకు నెడతెగనివైరము కలిగెను.

## అన్హిల్‌పుర భీమదేవుఁడు

గుజరాత్‌దేశములో అన్హిలపురమను పట్టణముగలదు. దానికే పట్టణమని మాఱుపేరు. అచ్చట 'సోలంఖీ'వంశజులగురాజులు రాజ్యము చేయుచుండిరి. 'సోలంఖీ' శబ్దము 'చాలుక్య' శబ్దభవము. శహబుద్దీన్ గోరీకాలమందిచ్చట భీమదేవుఁడను రాజు రాజ్యముచేయుచుండెను. ఇతఁడు మిక్కిలిపరాక్రమవంతుఁడు పెక్కుసేనలు కలవాఁడు. ఈతఁడును జయచంద్రుఁడును గలిసి యుండినయెడలఁ దురుష్కులకు నేమియు నీదేశమున నాధారము లేకయుండును. కాని యాతనికిని పృథ్వీరాజునకును వైరము తటస్థించెను. ఆకాలమునందు అబూరాజగు తేజపరమారనువానికి ఇచ్ఛనీకుమారియను లావణ్యవతియగు కూఁతురు గలదు. ఆమెను దనకిమ్మని భీమఁ డామెతండ్రికి వర్తమానమంపెను. కాని యాతఁడు తనకన్యను పృథ్వీరాయన కీయదలఁచి యాతనిఁ దన సహాయమునకుఁ బిలిచెను. ఆతఁడు భీమునిమీఁదికిఁబోయి యాతనిఁ బూర్తిగఁ బరాభవించెను. ఇట్లు శక్తిగలరాజులు తమసామర్థ్యము లొకరి నొకరు నోడించుటలో వ్యర్థపుచ్చిరి.

## మేవాడ్ రాజ్యము

ఈరాజ్యముయొక్క పూర్వపు రాజధాని చితోడ్. ఇప్పటిరాజధాని ఉదయపురము. ఈరాజ్యముయొక్క సంపూర్ణచరిత్ర 'రాజపుత్రుల

శౌర్యాగ్ని'యను 6 వ ప్రకరణమునందు వర్ణింపఁబడినది. కావున నిచ్చట వ్రాయనక్కఱలేదు. పృథ్వీరాజునకు సమకాలీనుఁడగు నీదేశపురాజు సమరసింహుఁడు. ఈతఁడు పృథ్వీరాజుయొక్క చెల్లెలపెనిమిటి. ఈ బావమఱఁదుల కిద్దఱికిని మిగుల స్నేహము. ఈసమరసింహుఁడు సుశీలుఁడు. ప్రశంసనీయమైనట్టియు ననుకరణీయమైనట్టియు, బ్రవర్తనకలవాఁడు. ఈతఁడు సైన్యవ్యవస్థలో మిక్కిలికుశలుఁడు. యుద్ధమం దర్జునుఁడని పేరుగాంచెను. ఈతఁడు శాంతుఁడు, గంభీరుఁడు, వక, దూరదృష్టియు, సదసద్వివేచనమును, మిత్రాభిమానమును ఈతని విశేషసద్గుణములు. ఈతఁడు నీతిమంతుఁడును. రాజ్యకార్యవిచారదుఁడును, దయాసంపన్నుఁడు నగుటచే దనసరదారులకును, బ్రజలకును దండ్రియని కీర్తి వహించెను. ఈవర్ణన యీతనికి సమకాలీనుఁడగు చాండ్‌భాట్ అను నతని గ్రంథములోనుండి గైకొనఁబడినది.

## అజ్‌మేర్ దిల్లీరాజ్యములు

ఈరెండురాజ్యములకును మేమువర్ణించెడి కాలమునఁ బృథ్వీరాయఁడు రాజుగానుండెను. ఈతనిపైతృకరాజ్య మజ్‌మేర్; దౌహిత్రకము దిల్లీ.అజ్‌మేర్ పట్టణములో చహుహాన్ వంశపురాజులు రాజ్యముచేయుచుండిరి. అందు వీసలదేవుఁడనువాఁడు మిక్కిలిపరాక్రమవంతుఁడై క్రీ. శ. 1096 లోఁ దురుష్కులనోడించెను. అప్పుడాతనికి సనేకక్షత్రియరాజులు సహాయపడిరి. కాని గుజరాత్‌నేశపురాజయిన భీమదేవుఁడు వచ్చినవాఁడుకాఁడు. అందుచే వీసలదేవుఁ డాతనిమీఁదికి దండెత్తిపోయి, యాతని నోడించి, యాతనియొద్దనుండి కప్పము దీసికొనెను. విజయసూచకముగా నొకవీసలనగర మనుపట్టణముఁ గట్టించెను. ఈవంశమునందు సోమేశ్వరుఁడనురాజునకుఁ గ్రీ. శ. 1159 లోఁ బృథ్వీరాజు జన్మించెను. ఇఁక నీతనికి దిల్లీరాజ్యము వచ్చినవిధము తెల్పెదము.

దిల్లీపట్టణమునకుఁ బూర్వపునామము ఇంద్రప్రస్థము. ఇది పాండవాగ్రజుఁడగు ధర్మరాజుచేఁ గట్టింపఁబడియె. మయాసురునిచే

నపూర్వమైన మయసభ యిచ్చటనే నిర్మింపఁబడియెను. ధర్మరాజు రాజసూయ యజ్ఞ మిచ్చటనే చేసెను. యుధిష్ఠిరుని తరువాత ముప్పదవవాఁడగు క్షేమరాజును జంపి యాతనిమంత్రి యగువిసర్వ్యఁడు రాజయ్యెను. ఈవంశములో ముప్పదియెనిమిదవవాఁడగు రాజపాలునిఁ జంపి సుఖవంతుఁడనువాఁడు రాజ్యము నాక్రమించుకొనియె. వానిఁజంపి తువరవంశజుఁడగు విక్రమాదిత్యుఁడు ఇంద్రప్రస్థ పురాధీశుఁడయ్యెను. అప్పటినుండి పందొమ్మిది పురుషాంతరములవఱకు నీరాజధాని తువరవంశజులచే నేలఁబడియె. చివరరా జనంగపాలుఁడు. ఈతని కాలములోనే యీపురమునకు దిల్లీయని పేరుగలిగెను. అనంగపాలునికిఁ బుత్రసంతానములేదు. ఇద్దరు పుత్రికలుండిరి. అందుఁ గమలాదేవి యనునామెను అజమీరురాజయిన సోమేశ్వరునకు నిచ్చెను. ఈమెకుమారుఁడే పృథ్వీరాజు. అనంగపాలుని రెండవకూఁతయగు విమలాదేవిని కనోజ్‌రాజయిన విజయపాలుని కిచ్చియుండిరి. ఈమెయే జయచంద్రునితల్లి. అనంగపాలుఁడు ముసలివాఁడై బదరికాశ్రమమునకుఁ బోవునపుడు తన దిల్లీరాజ్యము దౌహిత్రుఁడగు పృథ్వీరాజునకిచ్చెను. అందుచే నాతఁడజమీరురాజ్యమునకును దిల్లీ రాజ్యమునకును అధిపతియయ్యెను. అనంగపాలుఁ డొకదౌహిత్రునకే రాజ్యమిచ్చినందున రెండవదౌహిత్రుఁడును కనోజ్‌రాజును అగు జయచంద్రునకుఁ గోపమువచ్చెను. ఇదియే జయచంద్రపృథ్వీరాయల వైరమునకు మొదటికారణము.

నాగోర్‌పట్టణమునొద్ద ఖటుపురములోఁ బృథ్వీరాయలకు భూమిలో నెక్కుడుగా ధనముదొరకెను. చందెల్‌రాజునకుఁ బృథ్వీరాజునకును వైరము గలిగినందున వారికి యుద్ధముజరిగి యందు చందెల్‌రాజు పరాజితుఁడై రాజ్యముఁ గోలుపోయెను. ఈప్రకారము పృథ్వీరాయని రాజ్య వైభవములు దినదినము హెచ్చుటఁజూచి యోర్వఁజాలక కనోజ్ పట్టన్ (అనిహిల్‌పురము) రాజులు శహాబుద్దీన్‌గోరీ యనువానిని దమ సహాయమునకుఁ బిలిచిరి. వాఁడును వీరిసహాయమునకువచ్చెను. పృథ్వీ రాజునకు సహాయముచేయుటకై చితోడ్ గడమునుండి సమరసింహుఁడు

వచ్చెను. వీరందఱికిఁ బోరుజరిగి యందు జయచంద్రుని పక్ష మోడి పోయెను. శహాబుద్దీన్‌గోరీ పృథ్వీరాజుచేఁ జెఱపట్టఁబడియె. వానియొద్ద నుండి యెనిమిదివేలగుఱ్ఱములఁ దీసికొని పృథ్వీరాజు వానిని విడిచివే సెను. తనసైనికులకు ననేకబహుమతు లొసంగెను.

మఱియొకసారి పృథ్వీరాజు కొద్దిసైన్యముతో సముద్రశిఖరమను పట్టణమునకుఁ బోయి వచ్చుచుండఁగా శహాబుద్దీన్‌గోరి యాతని నెది రించెను. ఆయుద్ధములో నైదువేల తురుష్కులు గోరీతోఁగూడ రాయని చేతిలోఁ బడిరి. వారియొద్దనుండి యసంఖ్యధనముఁదీసికొని యారాజు వారిని బంధవిముక్తులఁజేసెను.

ఈప్రకారము శహాబుద్దీన్‌గోరి పృథ్వీరాయనిమీఁదికి నేడుసారులు దండెత్తివచ్చినట్లును, ఏడుపర్యాయము లాతనిఁ బృథ్వీరాయఁడు పట్టు కొని విడిచి పెట్టినట్లును హిందూగ్రంథకారులు వ్రాసియున్నారు. కాని తురుష్కచరిత్రకారులును, వారినేయనుసరించెడి యింగ్లీషుచరిత్రకారు లును క్రీ. శ. 1176 లో మాత్ర మొక్కసారి పృథ్వీరాయఁడు గోరీని స్థానేశ్వరక్షేత్రమందుఁ బూర్తిగా నోడించెననియు, నందు గోరీకి గొప్ప గాయము తగిలి యాతఁడు తప్పించుకొని పాఱిపోయెననియు వ్రాసి యున్నారు. ఆయుద్ధములోఁ బరాజితుఁడయిపోయి నప్పటినుండియు నాతఁడు మరల హిందూదేశముమీఁదికి దాడి వెడలవలయుననియే రాత్రిం దినములును దగినయేర్పాటులు చేయుచుండెను.

ఇట హిందూరాజుల సమాచారముఁ గనుఁగొందము. కనోజ్ రాజయిన జయచంద్రునికి సంయుక్తయనుకూఁతు రుండెను. ఆమెయుఁ బృథ్వీరాయఁడును బరస్పరానురాగబద్ధులైరి. కాని తండ్రికి వైరియైన వానిని వరించుటయెట్లు ? ఇంతలో జయచంద్రుఁడు రాజసూయముఁ జేయఁదలఁచి, యందులోనే తనకొమార్తె యొక్క స్వయంవరముఁ జేయ నిశ్చయించి దేశదేశరాజుల రావించెను. అందుకు దిల్లీశ్వరుఁడు పోఁడయ్యె. కావున జయచంద్రుఁడు మిగులఁ గోపించి యాతనితోఁ గల

వైరమువలన బృథ్వీరాజు ప్రతిమ నొకదానిని జేయించి దానిని ద్వార పాలకుని స్థలమునందున నిలువబెట్టి యాతని నగౌరవించెను. అంత స్వయంవరవిధి ప్రారంభమయ్యెను. "సంయుక్త చేత బుష్పమాలను ధరించి సఖీసహితయై, యామండపమునకు వచ్చెను. రాజకన్య సభకు రాగానే రాజపుత్రు లందఱిచూపులు నామెవైపునకే మరలెను. ప్రతిభూపతియు నామెతన్ను వరియింపవలయునని కోరుచుండెను. సంయుక్త మిగుల గంభీరదృష్టితో రాజలోకమునంత నొక్కసారి కలయజూచెను. తనకిష్టుడగు పృథ్వీరా జచటికి రాలేదనియు, ఆయనను బరిహసించుట కాయనప్రతిమ నొకదానినిజేసి ద్వారమునం దుంచిరనియు నామె కంతకుబూర్వమే తెలిసియుండెను. అందువలన నాబాల యొక గడియవరకు కేమియో యోచించి. తుదకు దృఢనిశ్చయముగలదియై తిన్నగా నడచి దిల్లీశ్వరునిప్రతిమను సమీపించి యామూర్తి కంఠమునందు బుష్పహారమును వేసెను. దాని గనినతోడనే సభయందంతట నొకచో కల్లోలమయ్యెను. జయచంద్రుడు దట్టియవమానమును సహింపజాలక కోపావేశపరవశుడై 'దుష్టురాలగు దీనిని గారాగృహమునందుంచుడ'ని యాజ్ఞాపించెను. అంత రాజులందఱును నిరాశను బొంది తమతమ నగరములకు జనిరి.

"ఈసంగతియంతయువిని పృథ్వీరాజు పరమానందభరితుడయ్యెను. జయచంద్రుడు తన్నుబఱిచిన యవమానమును, సంయుక్త తనయందు గనబఱిచిన ప్రేమయు నేకీభవించి తన్ను ద్వరపెట్ట బృథ్వీరాజు జయచంద్రునిపై యుద్ధయాత్రవెడలెను. ఇట్లాయన శూరులగు యోధులతో గనోజ్‌పట్టణము సమీపమున విడిసెను. అచట నున్న కాలమునసే యొకరాత్రి మిగుల రహస్యముగా బృథ్వీరాజు సంయుక్తను గలసి గాంధర్వవిధిచే నామెను వరియించెను.

"వీరి వివాహవార్త యొకరిద్దఱు దాసీలకు దప్ప నితరుల కెంత మాత్రము దెలియదు. పృథ్వీరాజువచ్చి తనగ్రామము బయల విడియుట విని యాతనిబట్టి తెండని జయచంద్రుడు మూడువేల సైన్యమునం

పెను. కహారకంఠీరు డనువాని ముందిడుకొని శత్రుసైన్యములు తమ పైపునకు వచ్చుటగని పృథ్వీరాజు వారితో బోరుటకు సిద్ధముగా నుండెను. తదనంతర మారెండుసైన్యంబు లొండొంటిందాకి మిగుల ఘోరముగా బోరసాగెను. అంచు బృథ్వీరాజు సేనానియగు నాతతా యికిని జయపంద్రుని సైన్యాధిపతియగు కహారకంఠీరునకును ద్వంద్వ యుద్ధము ప్రాప్తించెను. ఆయూరు లికువురును సింహనాదములు చేయుచు నొండొరులతో నెక్కుడు పంతంబులు పలుకుచు నొకరినొకరు నొప్పిం చుచుండిరి. అంత గొంతసేపటికి భటులయొక్కయు, గుఱ్ఱముల యొక్కయు, నేనుగులయొక్కయు, దేహములనుండి కాఱు రక్తము ప్రవాహమై పాఱదొడగెను. అట్టిసమయమున కహారకంఠీరుని రోషా వేశ మధికమైనందున నాతడు తనరథంబుడిగి యాతతాయిని తనఖడ్గము నకు బలియిచ్చి, పృథ్వీరాజు కంఠము దెగనేయ నుంకించెను. కహార కంఠీరుని శౌర్యమునకోడి పృథ్వీరాజు బలంబులు చెదరి పాఱిపోవ సాగెను. అట్టిసమయమునం దాకస్మికముగా నొక శౌర్యనిధి యచటికి వచ్చి, పృథ్వీరాజు కంఠముపై బడనున్న ఖడ్గమును దునియలుచేసి యాతని గాపాడెను. ఈపరాక్రమవంతు డెవడో యొకరాజపుత్రుడని చదువరులు భ్రమపడవలదు. అట్లు తనసాహసమువలన బృథ్వీరాజును గాపాడినది యాతనిపత్నియు, జయపంద్రుని కూతురును నగు సంయు క్తయే ! ఆమె తన భర్తనుగలిసి యాతనితో వెళ్ళవలయునని బహు ప్రయాసముతో గారాగృహమువెడలి యతియోగ్యమైన సమయమున నా స్థలము ప్రవేశించెను. తానెన్నడును సంగ్రామము జూడనిదైనను ఆమె జంకక సమయస్ఫురణ కలదియై తానును యుద్ధముచేసి తన భర్తప్రాణ ములగాపాడెను. సంయుక్త వచ్చినతరువాత బృథ్వీరాజుబలములు మరల జేరుకొని జయపంద్రుని సేనల నోడించెను. తరువాత బృథ్వీ రాజు భార్యాసహితుడయి ఢిల్లీనగరమున కరిగెను." *అప్పటినుండి యు బృథ్వీరాజునకును జయపంద్రునకును వైర మధికమయ్యెను. అది

---

*సౌ. భండారు అప్పమాంబగారిచే రచింపబడిన 'అబలాసచ్చ రిత్ర రత్నమాల' ప్రథమభాగము. 2 వ కూర్పు. 178వ పుట చూడుడి.

వటకు గుజరాత్‌దేశపు భీమదేవునకును పృథ్వీరాయనికిని గలిగిన వైరము చదువరు లెఱింగియేయున్నారు. కడమక్షత్రియులలో గొంద ఱీకు, కొందఱకు నుండిరి. దేశవినాశమునకు మూలమయిన యిట్టి ద్వీధా భావ మప్పటిరాజలోకములలో బుట్టెను.

శహాబుద్దీన్‌గోరీ హిందూదేశము నెప్పుడు క్రొంగుదునా యని యెదురుచూచుచుండెను. బైరాగి, గోసాయి, ఫకీర్ మొదలయిన వేష ములధరించి యాతనిచారు లీదేశమునం దిరుగఁజొచ్చిరి. వారివలన గోరీకి నిచ్చట యంతఃకలహముల జాడలుతెలిసి వాఁడు యుద్ధమునకుఁ గాల్దీవ్వుచుండెను.

ఇట పృథ్వీరాయని శూరనాయకు లనేకులు కనోజ్ యుద్ధముకో మడిసిరి. మిగిలినవారిలో కయమాష్ అనునాతని మంత్రియొకఁడు. "ఈతఁడు ఖటుపురములోని నిధానముఁదీసెను; మురసలములోని పిడి హారరాజును జంపెను: గోరీమ్లేచ్ఛునిఁ జెఱపట్టెను; బలవంతులైన హిందూరాజులను తురకరాజులను నోడించెను; అందఱను చవాన్ రాజు నకు భయపడునట్లు చేసెను. ఆతఁడు పెద్దపులివలె భయంకరుఁడయి తన కీర్తిచే నన్ని దేశములఁ నింపెను." అని 'పృథ్వీరాజరాసా' గ్రంథములో వ్రాయఁబడియున్నది. ఈతఁడు పృథ్వీరాజునకు బహిఃప్రాణమైయుండెను. కాని యొకసారి యాతఁడు రాజు భోగకాంతను గామించినందున గోపమువచ్చి రా జీతనినిఁ జంపెను.

యుద్ధములోఁబోఁగా మిగిలిననాయకులలో చాముండరాయఁ డను వాఁడొకఁడుండెను. ఈతఁడు భీమునివలె మిక్కిలిబలశాలి. ఈతనిచెఱలె లిని పృథ్వీరాజునకిచ్చినందున నీతఁడు పృథ్వీరాజుకుఁ గుడిభుజముగా నుండెను. కాని యొకసారి యాతఁడు రాజునకుఁ బ్రీతిపాత్రమైన యేనుఁ గును జంపినందున రాజునకుఁ గోపమువచ్చి యాతఁడు చాముండరాయనిఁ గారాగృహమునఁబంచుంచెను. అప్పటినుండి శస్త్రమునుబట్టనని యాతఁడు ప్రతిజ్ఞవట్టెను.

హాహూలీరాయఁడను మఱియొకవీరుఁడు పృథ్వీరాజు నొద్దనుండెను. సంయుక్తను వివాహమాడినతరువాత రాజు విషయలంపటుఁడై యీతని నగౌరవించెను. అందులకు నీతఁడు మిక్కిలిరోషించి గోరీనిఁ బృథ్వీ రాయనిమీఁదికిఁ దెచ్చుటకు గజ్నీపట్టణమునకుఁబోయెను. హిందూదేశ స్వాతంత్ర్యనాశనమున కివి హేతువులయ్యెను.

ఇచ్చటఁ బృథ్వీరాయని బాల్యస్నేహితుఁడును, చరిత్రకారుఁడును అగు చాండ్‌భాట్ అనువానిగుఱించి కొంచెముప్రాయవలయును. భాట్టను వారు మన దేశమున భట్రాజు లనఁబడియెదరు. రాజులయొద్దనుండి వారియశోవర్ణనముఁ జేయుట వీరిపని. వీరిలోవనేకులు కవులని విఖ్యాతిఁ జెందిరి. చాండ్‌భాట్టనువాఁడు 'పృథ్వీరాజరాసా'యనుకావ్యమును రచించి యందుఁ దన మిత్రుఁడగు దిల్లీశ్వరుని చరిత్ర వర్ణించెను. ప్రస్తుత చరిత్రలోని యనేకాంశములందుండియే గ్రహింపఁబడినవి. ఈచరిత్ర చారణీభాషలో ప్రాయఁబడిన లక్షగ్రంథము. చారణీభాష హిందీభాష యొక్క యొకభేదము. ఈచరిత్రయందు ననేకాద్భుతాంశములున్నను నమ్మఁదగినచరిత్రాంశము లనేకములు కలవు. స్థానేశ్వరయుద్ధమప్పు డీ కవి దేవీమందిరములోఁ గూర్చుండి యీగ్రంథము ప్రాసెనఁట. ఈ గ్రంథము మిక్కిలి పెద్దదియగుటచే నిందులోని కొన్నిభాగములు మాత్రము కలకత్తాలోని యేశియాటిక్‌సొసైటివారు ప్రచురించియున్నారు.

## స్థానేశ్వర మహాయుద్ధము

(క్రీ. శ. 1193)

పైని వర్ణింపఁబడినట్లు రాజ్యపుగుట్టంతయుఁ దెలిసిన హాహూలీ రాయఁడు స్వామిద్రోహియై శహాబుద్దీనుతోఁ గలిసినతరువాత, వానికి ధైర్యమువచ్చి వాఁడు పృథ్వీరాయనిమీఁదికి దండెత్తివచ్చెను. ఈతడవ గుజరాత్ కనోజ్‌రాజులును వారిసామంతులును గోరీకే సహాయముచేసిరి. పృథ్వీరాజునకు సహాయముచేయుటకుఁగూడ ననేకరాజులువచ్చియుండిరి.

నూఁటయేఁబది రజపూతవీరులు గంగోదకముఁజేతపట్టి 'శత్రునిగెలువ నైన గెలిచెదము; లేదా స్వదేశస్వధర్మములకై రణమందు దేహము నర్పింపనైన నర్పించెదము' అని శపథములుచేసిరి. పృథ్వీరాజునకు సహాయులైనవారిలోఁ జిత్తూరురాజగు సమరసింహుఁడు ముఖ్యుఁడు. ఈ యుభయసైన్యములును స్థానేశ్వరముకో ఘోరముగాఁ బోరాడెను. దేశ ద్రోహులగు హిందూరాజులు గోరీపక్షమునందు నుండుటవలనను, స్వామిద్రోహియగు హాహులీరాయనివలన తురుష్కులు హిందువుల బలాబలములును యుక్తులును బాగుగ నెఱుఁగుటవలనను, తురుష్కులు విజయులైరి; హిందువులకుఁ బరాభవముకలిగెను. వేలకొలఁది క్షత్రి యులు హిందూదేశస్వాతంత్ర్య సంరక్షణమునకై కడసారి ప్రయత్నముఁ చేసి పారతంత్ర్యతనుజెందిన ఈదేశమం దుండఁగూడదని కాఁబోలు రణముకో వీరస్వర్గమునకుఁ బోయిరి. మిత్రద్రియుఁడగు సమరసిం హుఁడు మడిసెను. పృథ్వీరాయఁడు తాతార్ఖానుఁ డనువానిచేఁ జెఱ పట్టఁబడియె. 'నేను శహాబుద్దీన్ గోరీని నేడుసారులు పట్టుకొని యేడు సారులు దయతలఁచి విడిచిపెట్టితిని. కావున నాయుపకారమును స్మరించి యైనను నన్ను విడువు'మని పృథ్వీరాజు చెప్పెను. అందుపై తాతార్ ఖానుఁడు "కనుకనే నిన్ను విడుచుటకు వీలులేదు. చేతఁజిక్కిన శత్రు వును విడిచిపెట్టితినని నీవు చెప్పెడుగర్వోక్తులు నీమూర్ఖతను గనఁబఱచు చున్నవి. వైరి మొదటఁజేతఁ జిక్కినప్పుడే వానిని నీవు చంపివేసి యుండినయెడల నేఁ డీగతి నీకు ప్రాప్తించియుండదు కదా ? నీ మౌర్ఖ్యముయొక్కఫలము నేఁడు నీకు ననుభవింపక తప్పదు" అని ప్రత్యుత్తర మిచ్చెను.

"పృథ్వీరాజుగూడ నాయుద్ధమునందే మడిసెనని కొందఱు చెప్పె దరు. గోరీ విజయుఁడై పృథ్వీరాజును చెఱఁబెట్టి గుర్రిడ్లుతీసివేసి,యాతని పాదములకు మిక్కిలి బరువులయిన లోహపుబేడీలనువేసి, కారాగృహమున ందుంచెననియు, నీసంగతియంతయు విని పృథ్వీరాజు మంత్రియు, నతని చరిత్రలేఖకుఁడును మహాకవియునగు చాందుభట్టు, గోరీ యాస్థానమునకరిగి కొన్నిదినము లపటనుండి యాతని కృపకుఁబాత్రుఁడై,

పృథ్వీరాజును జూచుట కనుజ్ఞవడసెననియు, అట్లు సెలవంది కారా గృహమున కరిగి పృథ్వీరాజును బలుకరింపఁగా, నాతఁడు కన్నులు లేకున్నను మాటను గుర్తించి యాభట్టును కౌఁగిలించుకొనెననియు,అచట వారిరువురు నొకయుక్తివలన నాతురుష్కునిఁ జంపనిశ్చయించు కొనిరనియు, అందుపై చాందుభట్టు గోరీయొద్దికివెళ్ళి ప్రసంగవశమున పృథ్వీరాజుయొక్క బాణ నైపుణ్యమును వర్ణించుచు, నాతఁ డిపుడు కన్నులు లేకున్నను శబ్దము జాడఁబట్టి సూటిగా బాణమువేయునని చెప్పగా, గోరి యావిచిత్రమును గనుటకై యొక సభచేసి యాసభకు పృథ్వీరాజును బిలిపించి, యతనికి నతని విల్లును బాణములునిచ్చి చమత్కారము మేమ యినఁ జూపుమని యాజ్ఞాపించెననియు, ఆమాట సూటినిఁబట్టి పృథ్వీరాజుతనిపై బాణమువేయ నాతఁడు (గోరి) మృతినొందెననియు, తదనంతరము చాందుభట్టు పృథ్వీరాజు లిరువురును దురకలచేఁ బడక యాసభయందే యొకరినొకరు పొడుచుకొని జీవముల విడిచిరనియు, మరికొందఱు చెప్పెదరు. పైని చెప్పఁబడిన శరసంధాన మహోత్సవమంతయు మనదేశముననే జరిగినదని యొకరును, తురకదేశముననే జరిగెనని యింకొకరును వక్కాణించెదరు. వీనిలో నేది నిజమో మనము చెప్పఁజాలము.'1

## పారతంత్ర్య ప్రారంభము

స్థానేశ్వర యుద్ధముతో హిందూదేశముయొక్క స్వాతంత్ర్యము పోయి యప్పటినుండి యీదేశము పరరాజుల స్వాధీనమై పారతంత్ర్యమును సంకెలలచే బంధింపఁబడెను.

స్థానేశ్వరయుద్ధమైన వెంటనే గోరీ డిల్లీపట్టణము మీఁదికిఁ బోయెను. తురుష్కుల చేతిలోఁ బడనొల్లక యచ్చటి రాణీసంయుక్తమొదలయిన రాజపుత్రస్త్రీ లగ్నిఁప్రవేశించిరి. డిల్లీ తురుష్కుల స్వాధీనమయ్యెను.

---

1. అబలా సచ్చరిత్ర రత్నమాల 182 వ పుట.

క్రీ. శ. 1194లో గోరీ మరల నీదేశమునకువచ్చి యంతకు పూర్వము దేశద్రోహియై తనకు సహాయముచేసిన కనోజ్ రాజగు జయచంద్రుని గెలిచి యాతని పట్టణము దీసికొనెను. జయచంద్రుడు గంగలోబడి ప్రాణముల విడిచెను. దేశద్రోహి కిది తగినశిక్ష కాదని యెవరు చెప్పగలరు? అంతట రాథోడ్‌వంశజు లచ్చటినుండి రాజపుత్రస్థానమునకుబోయి జోధ్‌పురమను రాజ్యమును స్థాపించిరి. అది యిప్పటికిని గలదు.

శహాబుద్దీన్ మహమ్మదుగోరీ తన సరదారుడగు కుతుబుద్దీన్ అను వానిని హిందూదేశములో దన ప్రతినిధిగానుంచి తాను గజ్నీకి వెడలిపోయెను. ఈ కుతుబుద్దీ ననువాడు గుజరాత్, గ్వాలేర్ మొదలయిన స్థలములను సాధించెను. చితోడ్‌గడ్డమీదికి బోగా నచ్చటి రాణి యాతని నోడించెను. 1196 లో నీతడు బుందెల్‌ఖండములోని కాల్పీ కలింజరు దుర్గములును, మహమ్మదు బఖ్త్యార్‌ఖిల్‌జీ యనువాని సహాయమువడసి ఉత్తరబహార్, అయోధ్య, బంగాళాదేశములను జయించెను.

క్రీ. శ. 1202 లో గ్యాసుద్దీన్ చనిపోయినందున శహాబుద్దీ నొక్కడె రాజ్యమునకు నధికారియయ్యె.

ఈతడు క్రీ. శ. 1206 లో బంజాబునకువచ్చి సరిహద్దుమీది గక్కరనుజనులును గెలిచి వారికి మహమ్మదీయదీక్ష యొసగెను. ఆతడు తిరిగి వెళ్ళునపుడు సింధునదియొడ్డున లోహటకమనుగ్రామము నొద్ద విడిసి, గాలివచ్చుటకు దన గుడారములగెలిచి యుంచెను. అంతగా దాగియున్న గక్కరు లందుజొరబడి గోరీని జంపిరి.

శహాబుద్దీన్ మహమ్మదుగోరి శూరుడును, యుద్ధకుశలుడును అని చెప్పుటకు సందేహములేదు. కాని గజ్నీమహమూదువలె నీతడు బుద్ధిశాలియు రసికుడును గాడు. మహమూదు విద్యాప్రియుడై యనేక విద్వాంసులకు నాశ్రయదాతయైనందున నాతని ఖ్యాతి విశేషముగానున్నది. శహాబుద్దీన్ యుద్ధమునకంటె నన్యమెఱుగడు. కావున నాతని కీర్తియంతగా బ్రసరించినది కాదు.

హిందూదేశములో దురుష్కరాజ్యమును నాటిన గౌరవ మీతనిదే యని చెప్పవలయును. గజ్నీమహమూదు విగ్రహములం బగులంగొట్టి ధనము దోచుకొని పోయెనేగాని యీదేశమున రాజ్యమును స్థాపించిన వాడు కాడు. ఈతడాకార్యములను జేయుచు నిచ్చట రాజ్యముంగూడ సంపాదించెను. ఈతని మరణసమయమున మాళవదేశమును, దానిచుట్టు నున్న ప్రదేశమును దప్ప మిగిలిన యుత్తర హిందూదేశమంతయు నాతని వశమైయుండెను. సింధు బంగాళదేశములు పూర్తిగా నాతని స్వాధీనమయ్యెను. ఈప్రాంతముల నేలుటకు నాతడు సుబేదారుల నేర్ప అచెను. ఇంక గొన్నిదినములు బ్రతికియున్నయెడల నాతడు హిందూ దేశముయొక్క ప్రథమతురుష్క చక్రవర్తియై యుండు ననుటకు సందేహములేదు.

# రెండవ ప్రకరణము

## అఫ్గాన్ రాజులు

### బానిసవంశము

### (1206 - 1288)

శహాబుద్దీన్‌గోరీ చనిపోయిన తరువాత నాతని ప్రతినిధియగు కుతుబుద్దీన్ స్వతంత్రుఁడై రాజ్యమంతటను తనపేరిట మసీదులలో ఖుత్బా చదివించి నాణెములుచేయఁ దొడఁగెను. ఈతఁడు మొదట గోరీ యొద్ద బానిసగా నుండెను. కావున నీవంశమునకు 'బానిసవంశ' మని నామము వచ్చెను. ఈవంశములోని పదిమందిరాజు లెనుబదియేండ్లవఱకు రాజ్యముచేసిరి.

### 1. కుతుబుద్దీన్

### (1206 - 1210)

ఈతఁడు మొదట శహాబుద్దీనువద్ద బానిసగానుండినను తన బుద్ధి వైభవముచేతను, యుద్ధకౌశలముచేతను, యజమానుని విశ్వాసమునకును స్నేహమునకును పాత్రుఁడయ్యెను. క్రమముగా శహాబుద్దీనుయొక్క యందఱు సరదారులలో శ్రేష్ఠుఁడై హిందూదేశములో నాతని ప్రతినిధి యయ్యెను. శహాబుద్దీనుని మరణము తరువాత నీతఁడు స్వతంత్రుఁడై డిల్లీపట్టణము రాజధానిగా నాలుగేండ్లు రాజ్యముచేసెను. ఈతఁడు న్యాయ దృష్టియు సౌమ్యస్వభావమును గలవాఁడు. ఈతఁడు డిల్లీపట్టణములోఁ గట్టించిన కుతుబ్‌మినా రనుజయస్తంభ మిప్పటికిని డిల్లీపట్టణములో లోకులచూపునకు విందై యొప్పుచున్నది. ఈతఁడు క్రీ. శ. 1210 లో మరణమునొందెను.

కుతుబుద్దీన్ ఢిల్లీచుట్టుపట్టురాజ్యమును స్థిమితపఱచుచుండఁగా భక్త్యార్ఖిల్జీ యనుమఱియొక సరదారుఁడు బంగాల్ బేహార్ ప్రాంతముల స్వాధీనము చేసికొని గౌడపట్టణములో స్వతంత్రముగా రాజ్యము చేయఁ దొడఁగె.

## షమ్సుద్దీన్ అల్తమష్

(1210 - 1235)

కుతుబుద్దీనునకు ఆరమను నొకకొమారుఁ డుండెను. ఆతఁడు రాజ్యము చేయుఁకు నసమర్థుఁ డగుటచే నేప్రాంతాధీశు లాప్రాంతమున స్వతంత్రులుగాఁ జొచ్చిరి. అందుచే ఢిల్లీలోని సరదారులు కుతుబుద్దీన్ యొక్క యల్లుఁడగు నల్తమష్‌ను రాజ్యమునకు రమ్మని పిల్చిరి. వాఁడు వచ్చి యారమును నోడించి తాను మూఁడవ రాజయ్యెను.

ఈతఁడు బంగాల్ సింహప్రాంతములలో స్వతంత్రులయిన సుబేదారుల గెలిచెను. ఉజ్జయినీపట్టణమును స్వాధీనముచేసికొని యచ్చటి దేవాలయములఁ బాడుచేసెను. ఈతఁడు క్రీ. శ. 1235 లో మరణముఁ జెందెను. మరణసమయమున సింధు గంగానదుల నడుమనున్న ప్రదేశమంతయు నీతని ప్రభుత్వమునకు లోఁబడి యుండెను.

## మోగలులు

అల్తమష్ రాజ్యముచేయునప్పు డుత్తరమునుండి మోగలు లనుజను లీదేశమునకు రాఁ జొచ్చిరి. వీరు మొదటఁ జైనాతార్తరీ యనఁగా మంగోలియా దేశములోనివారు. అచ్చటినుండి వీరిదండు పశ్చిమదిక్కునకును, దక్షిణదిక్కునకును బ్రసరించెను. లంబాడీలవలె వీరెప్పుడును మూఁకలు మూఁకలుగాఁ దిరుగుచుండిరి. తుపానువలె నదాటుగా నొక్కస్థలముమీఁదఁ బడి దానిని ధ్వంసముచేసి క్షణములో మాయమై పోవుచుండిరి. దేశధ్వంసమే వీరు వచ్చి వెళ్ళినమార్గమునకు గుఱుతు. పండ్రెండవశతాబ్దమువఱకు వీరు పూర్తిగా మహమ్మదీయులు కాలేదు.

మిక్కిలి యభ్రద్ధ కలిగియుండిరి. వీరిలో నొకడు బండ్రెండవ శతాబ్దమున చెంగీస్‌ఖానుడనువాడొకడుదయించెను.

## చెంగీస్‌ఖాన్

ఈయసామాన్యపురుషుడు క్రీ. శ. 1154 లో జన్మించి క్రీ. శ. 1227 లో మరణమునొందెను. ఈతడొక రాక్షసుడని చెప్పవలెను. ఇతనియొద్ద నున్నంతసైన్యము, ఈతడు సంపాదించినంతదేశము, గెలిచిన దేశములలోని జనులను నీతడు పెట్టినంతబాధయు మన మితర చరిత్రలలో నెచ్చటను జూడజాలము. పశ్చిమసముద్రమునుండి పూర్వ సముద్రమువఱకును హిందూదేశమునకు నుత్తరమున ఏశియాఖండములో నున్న రాజ్యమంతయు నీతడు స్వాధీనముచేసికొనెను. ఈతనిరాజ్య మైదువేలయైదువందలమైళ్ళు పొడవును, మూడువేలమైళ్ళు వెడల్పును గొలతగా గల విరివికలది. ఈరాజ్యమంతయు హిందూదేశమునకు నాలుగు రెట్లుండును. ఈచంగీస్‌ఖానుడు హిందూదేశమునకు రాలేదు. కావున బ్రస్తుత మీతనిచరిత్రతో మనకు బనిలేకపోయినను ముం దీతనివంశజులు హిందూదేశములో రాజ్యస్థాపన చేసినందున నా కథా సందర్భమునొదలియుటకై యీచరిత్ర యిచ్చట వ్రాయబడియెను.

## సుల్తానా రజియా

## (1236 - 1239)

ఇక మనము ప్రకృత మనుసరింతము. అల్తమష్ తరువాత నాతని కుమారుడగు రుక్నుద్దీన్ అనువాడు నాల్గవ నవాబయ్యెను. కాని వాడు దుర్మార్గుడగుటచే సరదారులందఱు దిరుగబడి అల్తమష్‌కూతురగు రజియాయను నామెకు బట్టముకట్టిరి. దిల్లీ సింహాసనమునెక్కిన స్త్రీ యీమె యొకతియే.

సుల్తానారజియా మిక్కిలి పరాక్రమశీల. తండ్రి దూరదేశమునకు బోయినప్పుడు దిల్లీలో రాజవ్యవహారమంతయు నామెయే చేయు చుండెను. రాజున కావశ్యకములగు సద్గుణములన్నియు నామెయందు

వసించియుండెను. ఆమె బుద్ధియు, అంతఃకరణమును శౌర్యమును జూచినయెడల స్త్రీరూపమును ధరించిన పౌరుషమేయని చెప్పవలయునని గ్రంథకారులు వ్రాసియున్నారు. ఆమె చక్కదనము, కర్తృత్వశక్తి, న్యాయచాతుర్యము, పాటుపడుసామర్థ్యము లద్భుతములు. ఆమె పురుష వేషము వేసికొని ప్రతిదినము రాజసభ నలంకరించుచుండెను. ప్రతి కార్యమును స్వయముగా బరిశోధించి చేయుచుండెను. పూర్వమునుండి వచ్చుచున్న కొన్ని దురాచారములమాన్పెను; చట్టముల సవరించెను. ఇట్లన్నివిధముల వ్యవహారదక్షతగలది యయ్యును, ఒకవ్యవహారమునందు నామె పొరపడెను.ఆ పొరపాటే యామె నాశమునకు గారణమయ్యెను. తనకు ప్రీతిపాత్రుడైన యొక యబిసీనియన్ బానిసవానికి నామె యధికార మిచ్చినందున నామె సరదారులు తిరుగబడి యా బానిసవానిని, ఆమెను, ఆమె తరువాత వివాహమాడిన యామె భర్తను జంపిరి.

రజియాతరువాత నామెతమ్ముడగు బహరాం రాజ్యముచేసెను. ఆతడు 1241 లో జంపబడియె. తరువాత అల్తమష్‌యొక్క మనుమడగు అలాఉద్దీన్ మస్ ఉద్ అనువాడు 1243 వఱకు రాజ్యము చేసెను. ఈతని రాజ్యకాలమందు మోగలులు రెండుసారులు హిందూదేశమునకు వచ్చిరి. తిబేటు లోనుండి బంగాళాదేశమున కొకబంది పోటును, పశ్చిమదిక్కునుండి పంజాబున కొక బందిపోటును వచ్చి యుండెను. ఈరాజును పదచ్యుతునిజేసి యీతని పినతండ్రియగు నాసిరుద్దీన్ మహమ్మదనువాడు సుల్తానయ్యెను.

## నాసిరుద్దీన్ మహమ్మద్

(1246 - 1266)

ఈతని ప్రభుత్వకాలము ప్రజలకు సుఖావహమయ్యెను. ఈతడల్తమష్ కుమారుడు. ఈతని నితనితండ్రి బంగాళాదేశమున కధికారిగా నియమించెను. కాని యీతడు చిన్నవాడగుటచే దన సవతితల్లిచే జెఱబెట్టబడియె. మస్ ఊద్ రాజ్యమునకు వచ్చినప్పు డీతనిని బంధ

విముక్తునిఁజేసి బైరాక్ ప్రాంతములకు సుబేదారుగా నియమించెను. ఈతఁడు బహు సాధువృత్తి గలవాఁడు. చెఱసాలలోనున్నపుడు తురుష్కుల వేదమగు కురాన్‌యొక్క ప్రతులు వ్రాసి వానినమ్మి జీవనము గడుపుచుండెను. తుదవఱకు నీ నవాబీవృత్తిని వదలినవాఁడుకాఁడు. తురుష్కులలో బహుపత్నీత్వమున్నను ఈతఁ డేక పత్నీవ్రతముఁ బాలించెను. ఇంటిపనులన్నియు నితని భార్యయే చేయుచుండెను. ఒకనాఁడా సాధ్వి వంటచేయుచుండఁగా వ్రేళ్ళు కాలినందున నామె యొకవంటలక్కను పెట్టుఁడని భర్తను గోరఁగా నాతఁ డొప్పుకొనక యామెతో "నేను రాజ్యమును గాపాడువాఁడను; రాజ్యమునకు యజమానుఁడను గాను. కావున నాసొంతవెచ్చమునకుఁ గావలసిన ధనము నిచ్చుభారము రాజ్యముపై వేయుట పాడికాదు. నీవు శాంతచిత్తముతో నీకార్యములఁ జేయుచుండుము. నీకిందునకు నీశ్వరుఁడు తగిన ప్రతిఫలము తప్పకయిచ్చును" అని చెప్పెను ॥ ఈతఁడు తాను సంపాదించిన ధనమునకు వచ్చెడి సాధారణపు భోజనమే చేయుచుండెను. తమసౌఖ్యమునకు, తమ వారి యాటపాటలకును ప్రజల ధనమంతయు వ్యర్థంచేసి, సహింపలేని పన్నులువేసి ప్రజలను బీడించు రాజులును రాజసేవకులు నీసుల్తాను చరిత్రఁ జదివి సిగ్గుచేఁ దలవంతురుగాత.

ఈతనిచరిత్ర మన్నివిధములను ప్రశంసనీయమైనందున నీతని రాజ్యములోఁ బ్రజలకు విశేషముగా సౌఖ్యము గలిగెను. ఈతఁడు తిరుగఁబడిన సరదారుల నందఱినిఁదీసి క్రొత్తవారి నేర్పఱిచెను; వాయవ్యదిక్కునుండి మోగలులు రాకుండ నచ్చటఁదగిన సైన్యముంచెను. యమునానది యొడ్డున నున్న కొన్ని రాజ్యములను, మాళవప్రాంతమును, బుందేలఖండములోని నరవరరాజ్యమును జయించెను. ఈతనియొద్ద గ్యాసుద్దీన్ బల్బన్ అను బుద్ధిశాలియగు మంత్రిపుంగవుఁ డుండెను. ఈసుల్తాన్ 1266 లోఁ గీర్తిశేషుఁ డయ్యెను.

## గ్యాసుద్దీన్ బల్బన్

## (1266 - 1286)

నాసిరుద్దీన్ మహమ్మూదునకు సంతానము లేనందున నాతని మంత్రియగు బల్బనునకు రాజ్య మనాయాసముగా లభించెను. ఈతఁడు చిన్నతనమున బానిసవాఁడుగానుండి తన యోగ్యతచే నింతవాఁడయ్యెను. ఈతనికాలములో రాజసభయొక్క మర్యాదలెక్కఁడయ్యెను. ఈతఁడు మిక్కిలి వైభవమును సౌఖ్యమును అనుభవించెను. ఈతఁడు విద్వత్పక్షపాతియుఁ బ్రజాహితకరణదక్షుఁడునై యుండెను. తనరాజ్యమునందు మద్యపాన మెవ్వరును చేయఁగూడదని యీతఁడు శాసించెను. ఆశాసనమును ఉల్లంఘించినవారినిఁ గఠినముగా శిక్షించుచుండెను. ఆసమాచార మాసేవకునిభార్య పోయి బల్బనుతోఁ జెప్పుకొనఁగా వాఁడాయపరాధినిఁ బిలిపించి నిండుకొలువులో వానికి దేహాంతశిక్ష విధించెను. ఇట్లె అయోధ్యనవా బొకసారిచేయఁగా వానిని సభలోఁ గొరడాలతోఁ గొట్టించి చంపఁబడిన సేవకునిభార్యకు నాతనిని బానిసవానిఁ జేసెను. తన రాజ్యమునందు నెచ్చటను సారాబట్టీలు పెట్టవలదని యాజ్ఞాపించెను.

తోగర్‌ఖానుఁ డనుబంగాళాదేశపు సుబేదారుఁడు తిరుగఁబడెను. అందుచే బల్బను వానిమీఁదికిఁ దన సైన్యముల రెండుసారులు పంపెను. కాని రెండుసారులును సుల్తాన్‌సైన్యములకే పరాభవము కలిగెను. అందుచే మూఁడవసారి బల్బను స్వయముగా యుద్ధమునకుఁబోయి యాతనిఁ బరాభవించెను. (1283).

బల్బనుకు, సద్గుణములచేతను పరాక్రమముచేతను శోభితుఁడగు మహమ్మూదను కుమారుఁడుండెను. మోగలులు ముల్తానుమీఁదికి దండెత్తిరాఁగా నీమహమ్మూదు వారిమీఁదికిఁబోయి వారిని నోడించెను. కాని యా యుద్ధములోఁదాను హతుఁడయ్యెను. (1285). పుత్రమరణదుఃఖము వలన బల్బను 1286 లో మృతుఁడయ్యెను.

ఈ సుల్తాన్ తురుష్కపక్షపాతియైనను మొత్తముమీఁద నీతని రాజ్య కాలము వర్ణనీయమనుటకు సందేహములేదు. ఈతనికిఁ బూర్వము, దిల్లీపట్టణముచుట్టు దొంగతనములు, బందిపోటులు, తిరుగుబాటులు మొద లయినవారి భయము విశేషముగానుండెను. ఆ భయములన్నియు నివారణ చేసి యితఁ డరణ్యముల నరకించి, వ్యవసాయాభివృద్ధిచేసెను. అనేక దేశములలోని విద్వాంసు లీతనియాస్థానమునం దుండిరి. మోగలు లీతనిఁ జూచి భయముఁజెందుచుండిరి. ఈతఁడు తనకుమారునినిమిత్తము రాజ్యము చేయుపద్ధతులు వ్రాసియుంచెను. వానిలోనియంశము లంచును జ్ఞాపక ముంచుకొనఁ దగినవి. కావున వానిలోని కొన్ని యంశములుమాత్ర మిచ్చట నుదాహరించుచున్నాము.

"నాయాయుర్దాయమంతయు రాజ్యమేలుటయందుఁ బోయెను. నేను కొద్దిదినములలోనే మరణము నొందుదును. కావున నాయనుభవ మంతయు నీయుపయోగార్థము చెప్పుచున్నాను"

"సింహాసనారూఢుఁడ వయినప్పటినుండియు నేను దేవుని ప్రతి నిధిని అని తలఁచి ప్రవర్తింపుము. నీమీఁదఁ బడినకర్తవ్యభారమును జక్కఁగ గుర్తింపుము. దుష్ప్రవర్తనవలన నీగొప్పయధికారమునకుఁ గలంకము తగులనీయకుము. నీచులమీఁదను లోభులమీఁదను నీ యను గ్రహముఁ జూపకుము. వారిని నీయొద్దకుఁ జేరనీయవలదు"

"వివేక మనుకళ్ళెముపెట్టి మనోవికారము లనుగుఱ్ఱములను నీ స్వాధీనములో నుంచుకొనుము. క్రోధముచేతిలోఁ జిక్కకుండ జాగ్రత్త పడుము. క్రోధము మనుష్యమాత్ర లందఱికిని శత్రువు. అందులోను రాజులఘాత కది ముఖ్యకారణము.

"సారాసారవిచారశక్తియు, సత్కార్యాచరణమునందు దక్షితగల బుద్ధియు గలవారిసలహా తీసికొని, మితవ్యయయుక్తమయిన యౌదార్య కార్యములకు నీఖొక్కసములోని ధనమును వెచ్చించుచుండుము.

* * * * *

"స్వధర్మశీలత, సద్గుణములు, యోగ్యత యనుగుణములు గల వారిని న్యాయాధ్యక్షులుగా నియమింపుము. అందువలన నీన్యాయబుద్ధి రాజ్యమందంతటను ప్రకాశించును.

* * * *

చేయవలయునని యొకసారి నిశ్చయించి ప్రారంభించినపనిని బూర్తి చేయువఱకును విడువఁగూడదు. పట్టినపని విడిచినవారి మనో దౌర్బల్యము లోకులకు బాగుగఁ దెలియును"

## ఖిల్జీలకు బాద్

## (1286 - 1288)

ఈతఁడు బల్బను మనుమఁడు. ఈతఁడు ద్వుషర్వర్తనము గల వాఁడు. యమునానదియొడ్డున నొకవిలాసమందిరముఁ గట్టించుకొని యితఁడు విషయసౌఖ్యముల ననుభవింపఁ దొడఁగెను. సరదారులును, ప్రజలును తిరుగఁబడఁ జొచ్చిరి. ఎట చూచినను అరాజకమయ్యెను. డిల్లీలో ఖిల్జీపక్షము, మోగల్పక్షము అని రెండుపక్షము లుద్భవించి, యందలి ఖిల్జీపక్షపు నాయకుఁడగు జలాలుద్దీ ననువాఁడు ఖైకుబాదును జంపి డిల్లీరాజ్యమును స్వాధీనముచేసికొనెను.

ఇట్లు క్రీ. శ. 1288 లో బానిసవంశ మంతరించెను. గజ్నీమహమ్మూదు కాలమునననుండి యీబానిసవంశ మంతమందువఱకు మూఁడు వందలయేండ్లయ్యెను. ఈకాలములోఁ దురుష్కులు ఉత్తరహిందూదేశములోని యనేకహిందూరాజుల గెలిచిరి. ఉత్తరదేశములోని తమరాజ్యమును బలపఱచుకొనిరి. నర్మదానదిదాఁటి దక్షిణమునకుఁ బోరైరి. దక్షిణదేశములో నాకాలమున ననేక శూరాగ్రేసరులయినరాజు లుండిరి. ఓరుగంటిలోని కాకతీయరాజులును, దేవగిరిలోని యాదవరాజులును వైభవోన్నతియందుండిరి. మఱియు ననేకహిందూరాజులు దక్షిణమునందుండిరి. కాని యుత్తరదేశమందలి హిందూరాజుల కొక్కఁడును సహాయము చేయఁడాయెను. ఉత్తరదేశమునం దేమి జరుగుచున్నదియుఁ

దెలిసికొనరైరి. తమలోఁ దామైక్యభావమును గుదుర్చుకొని సైన్యముల వృద్ధిపఱిచి చారులనుబంపి తురుష్కుల వర్తమానములఁ దెప్పించు కొనుచుఁ దమపైకిఁదురుష్కులు రాకుండుమార్గమునైనను జేయరైరి. ఇట్లు మిక్కిలి యజాగ్రత్తతో నున్నందువలన దక్షిణములోనిరాజులు తమస్వాతంత్ర్యములను త్వరలోనే పోఁగొట్టుకొని వినాశముఁజెందిరని చదువరులు చూడఁగలరు.

## ఖిల్‌జీవంశము

## (1289 - 1320)

పేషావరునకు నావలనున్న అఫ్‌గానిస్థాన్ పర్వతప్రాంతములందు ఖిల్‌జీలను నొకజాతిజను లుండిరి. గ్రామములు దోఁచుకొనుచుఁ దిరుగుట వీరివృత్తి. రాజుల సైన్యములో వీరు జీతమున కుండుటయుఁ గలదు. బల్బనుసైన్యములో నిట్టివా రనేకు లుండిరి. మలీక్ అను సరదారుఁడు తనపరాక్రమచే బల్బనును మెప్పించి సామారాప్రాంతమునకు సుబేదారుఁ డయ్యెను. ఆతని కుమారుఁడు ఫిరోజ్. ఈతఁడు బానిసవంశపులోని చివరవాఁడగు కైకుబాద్‌సుల్తానును జంపి జలాలుద్దీన్ అనుపేరిట దిల్లీ శ్వరుఁ డయ్యె. ఈతని వంశమునకు ఖిల్‌జీవంశ మనిపేరు.

## జలాలుద్దీన్ ఖిల్‌జీ

## (1289 - 1295)

ఈతఁడు రక్తపాతముఁజేసి రాజ్యమును సంపాదించినను, రాజ్యా రూఢుఁడైన తరువాత సాత్వికవృత్తి నవలంబించెను. అంత పెద్దయధి కారమునకుఁ దాను దగినవాఁడనుగానని నటించుచుండె. సింహాసనము మీఁదఁ గూర్చుండక తానంతకుఁ బూర్వము కూర్చుండెడి స్థలమునన్నే కూర్చుండును. లోకులయెడ దయయు నుపకారబుద్ధియుఁ గలిగి యుండెను. పూర్వపుస్నేహితులను నెప్పటివలెనే గౌరవించుచుండెను. ఎవరికిని గఠినమైనశిక్షలు విధించినవాఁడుకాఁడు. ఈతని శాంతస్వభావ

మును తురుష్కచరిత్రికారు లెక్కడుగాఁ బొగడియున్నారు. ఇతని స్వజాతీయులగు ఖిల్జీవారికీ సుల్తానింత శాంతముగా నుండుట యిష్టము లేదు. క్రీ. శ. 1291 లో గొప్ప కలవు సంభవించి వేలకొలఁదిజనులు మడిసిరి.

ఈతని శాంతస్వభావముఁ జూచి జను లచ్చటచ్చట నల్లరులుచేసి తిరుగఁబడసాగిరి. అప్పు డీతఁడు కొంత రాజసవృత్తిని ధరించి యట్టి వారి పొగ రడంచెను. మాళవాప్రాంతములోఁ దిరుగఁబడినవారిమీఁదికి స్వయముగా రెండు పర్యాయములు పోయి వారి నోడించి యాప్రాంత మును తన రాజ్యములోఁ గలుపుకొనియె. క్రీ. శ. 1292 లో లక్షమోగల్ స్వారులు పంజాబుమీఁదికి దండెత్తివచ్చిరి. వారి నెదిరించుటకై జలా లుద్దీను స్వయముగావెళ్ళి మోగలుల నోడించెను. కాని త్వరలోనే యుభయసైన్యములకు స్నేహము కుదిరెను. చంగీజ్ ఖాను ని మనుమఁ డగు ఉకాయతఖాననువాఁడు జలాలుదీనుని కూఁతురును వివాహమాడెను. ఆఁతడు మూఁడువేల మోగలులను డిల్లీలోనుంచెను. డిల్లీలో వారున్న పేటకు 'మోగల్‌పురా' యని యిప్పటివఱకును బేరుగలదు. ఈ మూఁడు వేల మోగలులును త్వరలోనే మహమ్మదీయులైరి. ఇంతవఱకు మోగలు లందఱును మహమ్మదీయులు కాలేదు. మహమ్మదీయుల సహవాసము వలన వారందఱును క్రమక్రమముగా మహ్మమదీయు లయిరి.

## అల్లాఉద్దీన్ దక్షిణమును జయించుట

(క్రీ. శ. 1293)

జలాలుద్దీనునియొద్ద నాతని తమ్ముని కొమారుఁడగు అల్లాఉద్దీన్ అనువాఁడుండెను. వాఁడనేకయుద్ధములయందుఁ దనశౌర్యముఁ జూపి నందున నాతనిపై మిక్కిలి యనుగ్రహముకలవాఁడై జలాలుద్దీను, ఆత నిని గంగా యమునా నదుల నడుమనున్న కరా యనుప్రాంతమునకును, అయోధ్యాప్రాంతమునకును సుబేదారుగా నియమించెను. అదివఱకుఁ దురుష్కులు దక్షిణమునకుఁబోలేదు. అదివఱకు నెవ్వరును జేయనిపని

తానుజేసి దక్షిణరాజ్యములను గెలువవలయుననిన కాంక్ష యాఅల్లా ఉద్దీనునకు బుట్టెను. దక్షిణములో దేవగిరియను ధనాఢ్యమైనపట్టణము గలదని యాతడు విని యచ్చటి ధనమంతయు దోచుకొనవలయునని నిశ్చయించెను.

దేవగిరికి బ్రస్తుతము దౌలతాబాదనిపేరు. ఇది ప్రస్తుతము నైజాము రాజ్యములోని యౌరంగాబాదుజిల్లాలో నున్నది. దిల్లీపట్టణమునుండి యది రమారమి యేడువందల మైళ్ళమీదనున్నది. ఆకాలమునందు డిల్లీనుండి దేవగిరికి బోవుటకు నెన్నియో యరణ్యములును, అపరిచితస్థలములును దాటవలసియుండెను. త్రోవలో ననేకవిధములయిన జనులుండిరి. వారు మార్గము నడ్డగించినను, గుఱ్ఱములకు గావలసినగడ్డియు సైనికులకు గావలసిన ధాన్యమును నీయనియెడల నెవ్వరి సైన్యములయినను మడియవలసినదే. ఇట్టికారణములచే నల్లాఉద్దీను దేవగిరికి బోవుటకు జలాలుద్దీ నిష్టపడినవాడుకాడు. కాని అల్లాఉద్దీన్ హిందువులస్వభావము వారితో నుత్తరహిందూదేశమున బోరాడినపుడు బాగుగ దెలిసికొనెను. హిందువులు సాత్వికవృత్తి ప్రధానులనియు, ధర్మయుద్ధముయొక్క నేమములను దప్పనివారనియు, వర్తమాన మంపికాని యుద్ధమునకు రారనియు, వారిజోలికి బోనిది వారన్యులజోలికి బోరనియు జక్కగ నెఱిగిన వాడగుటచే నేదియో సాకు చెప్పి త్రోవలోని హిందూరాజుల మోసపుచ్చవచ్చునని నిశ్చయించి యెనిమిదివేల సైన్యము దీసికొని క్రీ. శ. 1293 లో గంగా యమునలలోని యంతర్వేదిలోనున్న కరాపాంతమునుండి బయలుదేఱెను. బుందేల్ ఖండములోని యరణ్యములోనుండి కొన్ని దినములవఱకు ప్రయాణముచేసి వింధ్యపర్వతమును, నర్మదానదియు దాటి యకస్మాత్తుగా దేవగిరియొద్ద విడిసెను. త్రోవలో నంతటను నీతడు "నేను డిల్లీసుల్తానునకు దమ్మునికుమారుడను. పెత్తండ్రితో బోరాడి రాజమహేంద్రివరపు రాజునొద్ద నుద్యోగము సంపాదించుకొనుటకు వెళ్ళుచున్నాను" అని చెప్పెను. ఈయేడువందలమైళ్ళ ప్రదేశములో నాతనిమాట సత్యమా యసత్యమాయని విచారించినవాడుగాని, యీ

తురుష్కనిముందుకు బోనిచ్చుట దేశోపద్రవకరమని తలచి యాతనిని నెదిరించినవాడుగాని యొక్కడును లేడయ్యెను ।

ఆకాలమున దేవగిరిమీద యాదవకులజుడగు రామదేవరా వను మహారాష్ట్రిరాజు రాజ్యము చేయుచుండెను. కాకతీయరాజులలో ప్రతాప రుద్రునివలె నితడును ఈవంశములో మిగుల విఖ్యాతిజెందెను. ఈతడు క్రీ. శ. 1271 మొదలు క్రీ. శ. 1309 వఱకు రాజ్యము చేసెను. ఈతనియొద్ద హేమాద్రి యనువాడు మంత్రిగా నుండెను.ముగ్ధ బోధ మనువ్యాకరణమును రచించిన బోపదేవుడీతని యాస్థానపండితుడని చెప్పెదరు. ఇదిక బ్రకృతమనుసరింతము.*

అల్లాఉద్దీన్ వచ్చుచున్నాడనినవార యే రామదేవరావునకు దెలియదు. గ్రామమునకు వెలుపల నున్న దేవుని దర్శింపబోగా నాత నికి నీళ్లమేచ్చుడు వచ్చెనన్నవార్త తెలిసెను. అప్పు డాతనిసైన్యము లచ్చటలేవు. మరియొకచోటికి యుద్ధమునకు బోయియుండెను. కావున రామదేవరా వాగ్రామములోని కొందఱుజనులను జేర్చుకొని అల్లాఉద్దీ నుతో బోరాడి, యోడికోటమీదికిబోయి డాగెను.ఇప్పటివలె నప్పుడు కోటకు గందకములేదు. తురుష్కులు కోటకు ముట్టడివేసిరి. క్రింద నున్న పట్టణమును దోచుకొనిరి. దాచినధనము జూపుడని ప్రజలను మిక్కిలి బాధలుపెట్టిరి. "నేను చిన్న సైన్యముతో ముందువచ్చినాను. వెనుకనుండి సుల్తానుయొక్క సముద్రమువంటి సైన్యము వచ్చుచున్నది" యని యల్లాఉద్దీన్ రాజు ను దెలిపించెను. ఇంతలో దురదృష్టవశమున గోటలోనిధాన్య మయిపోయెను. ధాన్యపుగోనెలు కోటలోనికి బంపుటకు బదులుగా నుప్పుబస్తాలదివఱకు బంపబడియె. కోటలోని వారికి దినుటకు నన్నము లేనందున రాజు వెంటనే యల్లాఉద్దీనునకు గొంత ధనమిచ్చి సంధిచేసికొనెను. రామదేవుని సైన్యము వచ్చినయెడల దనకు బరాజయము కలుగునేమోయని భయపడుచున్న తురుష్కుడం

---

*దేవగిరి యాదవులచరిత్ర సవిస్తరముగ దెలిసికొనగోరువారు హిందూదేశ కథాసంగ్రహము-ప్రథమభాగము 4వ కూర్పు చూడుడి.

తట బయలుదేఱుటకు సిద్ధపడయ్యెను. ఇంతలో రామదేవునిసైన్యము దీసికొని యాతని కుమారుడగు శంకరదేవుడు వచ్చిచేరెను. తండ్రి వలదన్నను శంకరదేవుడు "మారాజ్యములోని ధనము మాకీయవలసినది." అని యల్లాఉద్దీనుతో యుద్ధముచేయ దొడగెను. ఈయుద్ధములో శంకరదేవు డసమానపరాక్రమము గనబఱిచెను. తురుష్కులందఱును హతులగు సమయము వచ్చెను. ఇంతలో గోటలోనుండి కొందఱు సైనికులు మరాటావారి సహాయమునకు రావలయునని బాసలుదేఱిరి. కాని వారిగుఱ్ఱములవలన లేచినదుమ్మును జూచి యది దిల్లీనుండి వచ్చుచున్న మహమ్మదీయుల మహాసైన్యమని యెంచి శంకరదేవునిసైనికులు ధైర్యము విడిచి పాఱిపోయిరి. తురుష్కులు విజయులైరి. కోటలో ధాన్యములేనందున రామదేవు డాహ్మేచ్ఛునకు ఎలిచ్‌పూరు చుట్టునుండు కొంతప్రాంతమును, అపారధనమును నిచ్చి సంధిచేసికొనెను. అల్లాఉద్దీన్ కరాప్రాంతమునకు దిరిగిపోయెను. యుద్ధములోని జయాపజయములు కేవలపౌరుషాధీనములు కావనుటకు నీదేవగిరియుద్ధమొక దృష్టాంతము.

ఈఅల్లాఉద్దీన్ తన్నుగుమారునివలె బెంచిన జలాలుద్దీనును క్రీ. శ. 1295లో జంపి డిల్లీ సింహాసనమును దా నాక్రమించుకొనియె.

## అల్లాఉద్దీన్ ఖిల్‌జీ

## (1296 - 1316)

ఈతడు రాజ్యమునకు వచ్చినతోడనే జలాలుద్దీనుని యిద్దఱు కొమారులను జెఱబెట్టి చంపించెను.

ఈతని రాజ్యకాలమందు మోగలుల గొప్పసైన్యములు హిందూదేశముమీదికి నాలుగైదు పర్యాయములు దండెత్తివచ్చెను. కాని యన్ని పర్యాయములును అల్లాఉద్దీన్ యొక్క సైన్యము లామోగలులబూర్తిగ నోడించి యీదేశమునుండి వెడలగొట్టెను.

ఈతఁడు రాజ్యమునకువచ్చిన రెండవయేట (1297) తన సరదారులను గుజరాథ్ దేశమునకుఁబంపి యచ్చటి కర్ణుఁడనురాజును వెడలఁగొట్టి యాతని భార్యను రాజ్యమును స్వాధీనముచేసికొనెను.

## రతనభోర్ జయించుట

(1299)

జయపూర్ రాజ్యములో రతనభోర్ అనుబలిష్ఠమైన దుర్గమొకటి యుండెను. దానిని సాధించుటకు నల్లాఉద్దీన్ తన సరదారులగు ఆలఫ్ ఖాన్, నుసర్రత్ ఖాన్ అనువారి నిద్దటినిఁ బంపెను. అచ్చటి రాజగు అంబీరదేవుఁడు ఘోరముగఁ బోరి తురుష్కులను మరలించెను. అప్పుడు స్వయముగా నల్లాఉద్దీన్ యుద్ధమునకుఁబోయెను. ఆసమయమున నాతని యన్నకుమారుఁడగు రుక్న ఖానుఁడనువాఁడు అల్లాఉద్దీన్ ఒక్కఁడు గాన వచ్చినపు డాతనిపై బాణములువేసి, యాతఁడు చచ్చెనని తలఁచి, తాను సుల్తాను నని డంకావేయించెను. ఇంతలో నల్లాఉద్దీన్ లేచివచ్చి వాని శిరస్సును ఖండించెను. తరువాత రతనభోర్‌చుట్టు ముట్టడివేసెను. దుర్గాధీశుఁడగు హంబీరదేవుఁడు మహాశౌర్యముతో స్వరక్షణముఁజేసికొనియె. తురుష్కులకుఁ బరాజయముకలుగు సమయమువచ్చెను. ఇంతలో నా రాజుయొక్క మంత్రి స్వామిద్రోహియు విశ్వాసఘాతకుఁడును నైకోట తురుష్కులకు నిచ్చివేసెను. తురుష్కులు లోనఁజొరఁబడి రాజును, నితరజనులను జంపిరి. కోట తురుష్కులచేతిలోఁ బడిన తరువాత, బహుమతికై యెదురుచూచుచున్న యాస్వామిద్రోహినిఁజూచి అల్లాఉద్దీన్ "మొదటియజమానుని మోసపుచ్చినవాఁడు రెండవయజమానునికి ద్రోహముచేయక యుండునా"యనిపలికి వానికి శిరశ్ఛేదము చేయించెను.

## చితోడ్ గడమును దీసికొనుట

(1304)

క్రీ. శ. 1303 లో అల్లాఉద్దీన్ రాజపుత్రస్థానములోని చితోడ్ గడముమీఁదికి దండెత్తిపోయి దానిని గెలువలేక తిరిగివచ్చెను. మరుసటి

సంవత్సరమున దిరిగి యాగడమును ముట్టడించి దానిని స్వాధీనము చేసికొనెను. అప్పుడు క్షత్రియ వీరులును. క్షత్రియ స్త్రీలును చూపిన యద్భుతపూర్వమైన క్షాత్రతేజమునొక్క వర్ణన మిం దారవప్రకరణ ములో జేయబడినది. కావున మరల నిచ్చట వర్ణింప నక్కఱలేదు.

## దక్షిణదేశపు దండయాత్ర

విజయము సంప్రాప్తమైనకొలదిని అల్లాఉద్దీనుకు రాజ్యతృష్ణ యెక్కువయ్యెను. దక్షిణ దేశమందున్న రాజ్యముల నన్నిటినిగెలిచి యాసేతుహిమాలయ మేకచ్ఛత్రాధిపత్యముగా రాజ్యమేలవలయునని వానికి గోరిక్కవొడమె. 1303 లో మల్లిక్ ఫక్రుద్దీన్ ఖూనా, మల్లిఛాజు అను సేనాధిపతులను గొప్పసైన్యముతో ఓరుగంటిరాజ్యముమీదికి దండెత్తిపోయెను. కాని వారు సంపూర్ణముగా బరాభూతులై డిల్లీకి పాఱిపోవలసినవారైరి.

దేవగిరిరాజు రామదేవు డొప్పుకొనిన కప్పము జెల్లింప నందున గాఫుర్ క్రీ. శ. 1307 లో నాతనిరాజ్యముమీదికి పంపెను. ఈ కాఫురనువాడు మొదట ఖంబాయత్ పట్టణములో నొక వర్తకుని యొద్ద బానిసగానుండెను. గుజరాథ్ ప్రాంతము గెలిచినప్పు డల్లాఉద్దీన్ ఈకాఫుర్‌ను బలవంతముగా బట్టుకొనివచ్చెను. కాని దిల్లీశ్వరునికి వీని యందు ననుగ్రహము గలిగినందున వీడు దినదినాభివృద్ధిజెంది సేనానాయకుడయ్యెను.

సుల్తానుయొక్క ఆజ్ఞననుసరించి మలిక్‌కాఫురు దేవగిరిపై దండెత్తిపోయి రామదేవునిబట్టుకొని దిల్లీకిబోయెను. అచ్చట రామదేవుడాయనెల లుండి యల్లాఉద్దీన్ వలన మర్యాదనువడసి తన రాజ్యమునకుదిరిగివచ్చెను. అప్పటినుండి యాతడు దిల్లీరాజులకు దప్పక కప్పముగట్టుచుండెను.

ఈ సేనాధీశుడు క్రీ. శ. 1309 లో నోరుగంటికిబోయి యచ్చటి రాజును నోడించి యాతడు డిల్లీశ్వరునకు గప్పముకట్టునట్లు చేసెను.

క్రీ. శ. 1310లో నా కాఫుర్ కర్ణాటకముమీఁదికి దండువెడలెను. దేవగిరి పైఠన్ మొదలగు పట్టణములమీఁదుగా ద్వారసముద్ర మను కర్ణాట రాజధానిని జేరెను. ఈపట్టణము శ్రీరంగపట్టణమునకు వాయవ్య మున నూఱుకోసులదూరమున నున్నది. అచ్చట బల్లాలవంశజుఁడు రాజ్యముచేయుచుండిరి. ఆపట్టణముఁ దీసికొని మ్లేచ్ఛుఁడు బల్లాళరాయ లను డిల్లీశ్వరుని కరిగాపుజేసి పాండ్యరాజ్యముపై దండువెడలెను.అపుడు పాండ్యరాజ్యమునం దంతఃకలహములు చెలరేగి దేశపరిస్థితులు తారు మాఱైయుండినందున నతనికి పెక్కుతావుల జయముగలిగెను. పాండ్యు లతనితో బహిరంగయుద్ధము విజయవంతముగ పోరాడజాలకపోయినను. నతని వెన్నంటిపోవుచు సమయ మనుకూలమైనప్పు డతనిపైబడి యతని స్కంధావారమును దోచుకొనుచు పలుతెరగుల నాతని పీడింపగలిరి. కాని యాతఁడు దేవాలయములను దోచుకొని నేలమట్టముగ జదియ గొట్టుచు పట్టణములను, గ్రామములను దగులబెట్టుచు మధుర పర్యం తము దండుచేసి యా పట్టణమును దోచుకొని చొక్కనాథుని దేవాలయ మును పాడుగావించెను. ఇట్లు రాజ్యము సమస్త మ్లేచ్ఛాక్రాంతమగుట కోర్వక పాండ్యవంశజులలో నొక్కడైన విక్రమపాండ్యుడు సైన్యము లను గూర్చుకొనివచ్చి యా శ్రీరంగమున నతని బరాభూతునిగావించెను. అంతట కాఫర్ చేతచిక్కిన దోపిడిధనమునుగొని డిల్లీమార్గమునుబట్టెను.

దేవగిరిరాజగు రామదేవుఁడు క్రీ. శ. 1312లో మృతిచెందెను. ఆతని కుమారుఁడగు శంకరదేవుఁడు రాజయ్యెను. ఆతఁడు డిల్లీకిఁ గప్పము పంపనందునఁ క్రీ. శ. 1312లోఁ గాఫుర్ ఆతనిమీఁదికిఁబోయి యాతనిఁ జంపి మహారాష్ట్రదేశమంతయు డిల్లీరాజ్యములోఁ గలిపెను.

## అల్లాఉద్దీనుని గర్వము

ఎడతెగని విజయములవలన నల్లాఉద్దీనునకు నహంభావ మెక్కువయయ్యెను. మహమ్మదువలె నూతన మతస్థాపనము చేయవలయునని యు, శికందరుని (అలెగ్సాండర్) వలెఁ బృథ్వియంతయు జయింప

వలయుననియు వాఁడు నిశ్చయించెను. రెండవసికందర్ (Alexander the Second) అనిపేరు పెట్టుకొని యాపేరిట నాణెములు వేయింపఁ దొడఁగెను. హిందూదేశములో నొక్క ప్రతినిధినుంచి తాను పృథ్వీ దిగ్విజయమునకుఁ బయలుదేఱవలయునని నిశ్చయించెను.

## రాజ్యములోని తిరుగుపాటులు

అల్లాఉద్దీన్ మిక్కిలి కోపముకలవాఁడు. రాజ్యములో ననేకజను లాతనిని జంపుటకు నెన్నియోసారులు యత్నముచేయుచుండిరి. ఆ సమా చారములు తెలిసినపు డాతఁడు మఱింతకోపమును వహించును. మలిక్ కాఫుర్ దక్షిణములోని చివరిదాడి వెడలివచ్చినపుడు అల్లాఉద్దీన్‌యొక్క వైభవసూర్యుఁ డాకాశమధ్యమం దుండి ప్రచండుఁడై వెలుఁగుచుండెను. సృష్టిక్రమము ననుసరించి యాతఁడస్తాచలము వైపునకుఁ దిగఁజొచ్చెను. తృతీయ పక్షతిగల మలిక్ కాఫుర్ మీఁద నల్లాఉద్దీన్ మిక్కిలి యనుగ్రహము గలిగి యుండుటచేఁ గడమ వారికందఱికిఁ గోపమువచ్చెను. సుల్తానునకును ఆతని భార్యాపుత్రాదులకును వైరము కలిగెను. కాఫుర్, వారినిఁబట్టుకొని కైదులోనుంచెను. గుజరాత్ దేశమువారు తిరుగఁబడిరి: చితోడ్‌గడము స్వతంత్రమయ్యెను.దక్షిణములో రామదేవరాయని యల్లుఁడగు హర్‌పాలదేవుఁడు కొంతసైన్యమును జేర్చుకొని మహారాష్ట్ర దేశములోనుండి తురకల వెడలఁగొట్టెను. ఈ సమాచారములు విని యందువలనఁ గలిగిన దుఃఖక్రోధముల యధిక్యమువలన రోగముపుట్టి అల్లాఉద్దీన్ క్రీ. శ. 1316 లోఁ జనిపోయెను. కాఫురనువాఁ డీతనికి విషప్రయోగము చేసెననియు జనాపవాదము గలదు.

## అల్లాఉద్దీన్ స్వభావము

ఈ బాదుశాహ చాండిష్ఠుఁడు, నిరంకుశుఁడు, నిర్దయుడు. ఈతని రాజనీతి యత్యంతకుటిలమైనది. తన్నుఁ జంపుటకైలోకు లప్పుడప్పుడు యత్నించినందున లోకులెవ్వరును రాజు నాజ్ఞ లేనిది తమయిండ్లను

విందులు వినోదములు వివాహములు చేయఁగూడదనియు, నొక్కచోఁ గూడఁగూడదనియు శాసించెను. భూమిపన్ను విశేషముగా నెక్కించెను. రైతు యిట్టి భూమినే, యిట్టి పశువులనే, యిట్టి జీతగాండ్రనే తప్ప నితరుల నుంచుకొనఁగూడదని నిబంధన లేర్పఱిచెను. ఈయాసరుకు లీయాధకలకే యమ్మవలసినది యని వర్తకులకుఁ గట్టడచేసెను. నలుదిక్కుల ననేక గుప్తచారులను బంపి ప్రజాజనుల రహస్యవర్తనముఁ గనుఁగొను చుండెను. ఇట్టి నిబంధనలవలన లోకులకు నిబ్బంది గలిగి వారికి బాదుషా యెడల నసూయ గలిగెను. ఈతఁడు ధర్మవిషయమై ప్రజలను బాధ పెట్టినవాఁడు కాఁడు. ఇప్పటి ప్రభుత్వపువారివలెనే యితఁడు మతవిషయమునం దౌదాసీన్యము నవలంబించెను. తేపతేప మాఱుచుండెడు లోకాభిప్రాయము ననుసరించి రాజ్యముచేయుటకంటె నొక్కరాజు నిరంకుశ ప్రభుత్వము చేయుటయే మంచిదని యీతఁడు చెప్పుచుండెను.

ఇట్లంతర్వ్యవస్థవలనఁ బ్రజలకు మిక్కిలిబాధ కలుగుచున్నను ఈ రాజు చండశాసనుఁడగుటచేఁ బ్రజలకుఁ జోరాదులవలని బాధలుగాని, యితరరాజ్య విషయకబాధలుగాని లేకయుండెను. బాటసారులు నిర్భయముగఁ ద్రోవలలో నిదురించుచుండిరి. ఈ విషయములో నాతని రాజ్యమును ప్రస్తుతపు ప్రభుత్వముతోఁ బోల్పవచ్చును. బంగాళమునుండి కాబూలువఱకును, తెలుఁగుదేశమునుండి కాశ్మీరమువఱకును ఇప్పటివలెనే యప్పుడును బంగార మెగురవేయుచుఁబోయినను అడ్డగించువాఁడు లేకయుండెను.

ఈతఁ డాసేతుహిమాలయరాజ్యముఁ బాలించిన మొదటి తురక రాజు. హిందూస్త్రీని వివాహమాడిన ప్రథమయవనుఁడు. ఐశ్వర్యమదాంధులై ప్రాప్తమైన యధికారమును దురుపయోగముసేసి ప్రజాపీడనమును సాధుతాడనమును చేసినవారికి నంతమందు నెట్టికష్టములు వచ్చునో రాజ్యమెట్లు లయించునో కనుఁగొనుటకు నీతనిచరిత్ర యొక ప్రబలమైన యుదాహరణము.

## ముబారిక్ ఖల్‌జీ

## (1316 - 1320)

అల్లాఉద్దీన్ చచ్చినతోడనే యాతని పెద్దకుమారుని కన్నులు పెఱికి వానిఁ గైదులోవేసి యాతని కై దేండ్లతమ్ముఁ డొకడుండఁగా వానికిఁ బట్టముకట్టి మలీక్ కాఫుర్ తానె రాజ్యము చేయసాగెను. కాని వానిరాజ్య మొల్లక వానిసేవకులె వానిని జంపిరి. అల్లాఉద్దీనుని నాల్గవ కుమారుఁడగు ముబారిక్ అనువాఁడు తనతోడ బుట్టిన వారినందఱిఁ జంపి తాను రాజయ్యెను.

ముబారిక్ మూర్ఖుఁడు, నీచుఁడు. వేశ్యా నట విట గాయకాది నీచులతోఁగలసి యాటపాటలు నడపును. నీచులకు బానిసలకు గొప్ప యధికారము లొసఁగెను. మర్యాద కల వారందఱును రాజసభకు వచ్చుటమానిరి. ఈ రాజు నొద్ద జాతి భ్రష్టుడఁగు ఒక గుజరాతీ వాఁడుండెను. వాని పేరు హసన్. వీనియెడ ముబారిక్కునకు ననుగ్రహము కుదిరి నందున వాఁడు క్రమక్రమముగా నెక్కుచుఁ దుదకు ముఖ్యమంత్రి యయ్యెను. అప్పు డీతనికి ఖుస్రూ అని పేరువచ్చెను.

ఈ రాజు మూర్ఖుఁడయినను గొన్ని సత్కృత్యము లీతనిచే జరిగినవి. జరాసంధునివలె అల్లాఉద్దీన్ పదునేడువేల జనులఁ గైదీలజేసెను. వారి నందఱి నీతఁడు విముక్తులఁ జేసెను. అల్లాఉద్దీనుచే లాగు కొనఁబడిన భూము లెవరివి వారికిచ్చెను. బాధకరములైన పన్నులఁ దీసివేసెను. ప్రజలకుఁ గలయితర బాధలఁ దొలఁగించెను.

క్రీ. శ. 1318 లో నీతఁ డొకసరదారుని గుజరాత్‌మీఁదికిఁ బంపి తాను దక్షిణమునందలి దేవగిరికిఁ బోయెను. అచ్చట రామదేవుని యల్లుఁడగు హర్‌పాళ్‌దేవుఁడు తురకలను వెడలఁగొట్టి రాజ్యము చేయుచుండెను. ముబారిక్ వానిఁ బట్టుకొని బాధించి చంపి తురకరాజ్యమును మహారాష్ట్రదేశములో. శివాజి యుదయించువఱకు స్థిరపఱిచిపోయెను. మహారాష్ట్రదేశమునకు మరల స్వరాజ్యము వచ్చెను. కాని యప్పుడు

తురకలచేతులలోఁబడిన దేవగిరికోటమాత్ర మప్పటినుండి యిప్పటివఱ కును మహమ్మదీయుల స్వాధీనతలోనే యుండుట వింతగదా ! ప్రస్తుత మది దౌలతాబాద్ అనుపేరిట నైజాంరాజ్యములో నున్నది.

ముబారక్ ఖల్జీ దేవగిరిరాజ్యమును స్వాధీనపఱచుకొనినపిమ్మట తెలంగాణముపై నొక దండయాత్ర నంపెను. అల్లాఉద్దీన్ ఖల్జీ మరణా నంతరము ఓరుగంటి ప్రతాపరుద్రుఁడు డిల్లీసుల్తానుకు చెందవలసిన కప్పము నంపక బిగబట్టెను; ఆ కప్పమును వసూలు చేయుటకును, ప్రతాపరుద్రుడు దానినిచ్చుట కంగీకరింపక తిరుగుబాటుచేసిన పక్షమున నతని జయించి యతని రాజ్యమును స్వాధీనపఱచుకొనుటకును దనసేనాధిపతియగు ఖుస్రూఖానుని సైన్యముతోగూడనంపెను. ఈ దండ యాత్ర వృత్తాంతమును సమకాలిక చరిత్రకారులు భిన్నముగ వర్ణించి యున్నారు; పూర్వ మల్లికాపుర్‌వలెనే ఖుస్రూఖానుడును ఓరుగంటికి ముట్టడివేయగా ప్రతాపరుద్రుడు నిభాయించలేక యపారధనమును ననర్ఘ్య మణిభూషణ వస్తువాహనములను, దనరాజ్యమందలి రాష్ట్రములో కొంత భాగమును సమర్పించి సంధి చేసికొనెనని యొక్కరును; నట్లుగాక ఖుస్రూఖానుని యాగమనవార్త విన్నంతటనె ప్రతాపరుద్రుడు ఆతని సగౌరవముగ నెదుర్కొని సుల్తానుకు చెందవలసిన కప్పమును జెల్లించి ప్రత్యేకమతనికి బహుమానములనిచ్చి వీడ్కొలిపెనని మఱియొక్కరును వ్రాసియున్నారు. వీనిలో నెయ్యది విశ్వాసపాత్రమో నిర్ధారించి చెప్పుటకు వీలులేదు. కాని ఖుస్రూఖానుని యాగమనమునకు ఫలితముగ దండము చేతనైననేమి, సామముచేతనైననేమి ప్రతాపరుద్రుడు డిల్లీసుల్తాను నకరిగా పై యథాపూర్వము కప్పము గట్టనొడబడెను.

ఖుస్రూ ద్రావిడ దేశమునకుఁబోయి యపరిమితమైనధనముఁ గొల్లగొట్టి తెచ్చినందున బాదుషా సంతుష్టుఁడై తన రాజ్యసూత్రములను బూర్తిగా ఖుస్రూ చేతిలో వదలిపెట్టెను.

రాజ్యములో నెక్కడఁ జూచినను తిరుగుబాటు లెక్కడయ్యె. ఒకరాత్రి బాదుషాను జంపి ఖుస్రూ రాజ్యారూఢుఁడయ్యెను.

## ఖుస్రూ లేక నసూర్ ఉద్దీన్

రాజ్యారూఢుడై ఖుస్రూ నాసిర్ ఉద్దీన్ అను పేరుపెట్టుకొనియెను. ఈతని చర్య లద్భుతములు. మొదట హిందువుగానుండి తురుష్కుడైన యాతడు పరస్పరవిరుద్ధములైనపనులు చేసెను. ఈతడు రాజ్యమం దంతటను ఖుత్బా చదివించి నాణెములను వేయించెను. ఖుస్రూవంశము లోని పురుషుల నందఱిని జంపించెను. ఇంతలో బంజాబుదేశములోని సుబేదారగు గాజీబెగ్ తుఘ్లుక్ అనువాడువచ్చి ఖుస్రూను జంపి డిల్లీ స్వాధీనముచేసికొని ఘయాస్‌ఉద్దీన్ అను పేరుపెట్టుకొని రాజ్యము చేయసాగెను.

ఫెరిస్తా మొదలయిన చిత్రకారులు వీనినిగుఱించి పెక్కుకల్లలు వ్రాసిరి. ఖుస్రూ మొదట నంత్యజుడని ఫెరిస్తా యనెను. కాని యది యబద్ధము. అలీమహమ్మ దనువాడు గుజరాత్‌చరిత్ర వ్రాసియున్నాడు. అందు ఖుస్రూ మొదట రాజపుత్రుడని స్పష్టముగా వ్రాయఁబడి యున్నది.

## తుఘ్లుక్ వంశము

(1320 - 1414)

ఇది యీదేశమున రాజ్యముఁజేసిన తురకల మూఁడవ కుటుం బము. వీరిరాజ్యమునకు నడుమ క్రీ. శ. 1398 లో తైమూరులంగు దాడి వలనఁ గొద్దికాలము విఘ్నమువచ్చినను దొంబదినాలుగు సంవత్సరముల వఱకు నీవంశపువారు డిల్లీలో రాజ్యముచేసిరి. పైని ఖుస్రూను జంపెనని చెప్పిన ఘయాస్‌ఉద్దీన్ ఈవంశములోని మొదటివాఁడు.

## ఘయాస్ ఉద్దీన్ తుఘ్లుక్

## (1320 - 1326)

ఈతఁడు లాహోర్ ప్రాంతమందలి రైతు అయియుండునని చరిత్ర కారు లూహించియున్నారు. తన సదాచరణమువలనను పౌరుషమువల నను గొప్పవాఁడయ్యెను. ఈతఁడు ఖుస్రూనుజంపి డిల్లీని స్వాధీనము చేసికొన్నప్పుడు ఖిల్జీ వంశజుఁడెవఁడైన నున్నయెడల రాజ్యమిచ్చెద నని వెతికించెను. కాని యదివఱకే వారందఱును ఖుస్రూచేతఁ జంపఁ బడిరి. గనుక ఖిల్జీవంశజుఁడెవ్వఁడు దొరకఁడయ్యె. అంత ఘయాస్ ఉద్దీన్ పట్టాభిషిక్తుఁడయ్యెను. ఈతఁ డాడినమాట తప్పనివాఁడు, నీతి మంతుఁడు, లోభములేనివాఁడు. ఈతఁ డైదు సంవత్సరములే రాజ్యము చేసినను ప్రజలచే మెప్పువడసెను. రాజ్యపాలనవిషయమై యందఱును దలయూఁచఁదగిన నిబంధనలు చేసెను. అనేకదుర్గములను, భవనము లను బాగుచేయించి క్రొత్తవానిఁ గట్టించెను. గొప్పగొప్ప విద్వాంసులఁ బిలిపించి కురాన్‌లోని వచనములను డిల్లీలోని యాచారములను అను సరించి క్రొత్తచట్టములను జేయించెను. మోగలులవలన రాజ్యమునకు బాధకలుగకుండ హిందూదేశపు ఉత్తరపు సరిహద్దునొద్దఁ దగినయేర్పా టులు చేసెను.

## ఓరుగల్లుమీఁదికి దండెత్తుట

ఓరుగంటి ప్రతాపరుద్రుఁడు మహమ్మదీయులకుఁ గప్ప మీయుట మానెను. అందుచే బాదుషాయొక్క పెద్దకుమారుఁడైన ఉలుఘ్‌ఖానుఁడు క్రీ. శ. 1321 లో నోరుగంటికిఁబోయి యాకోటను ముట్టడించెను. ఈ ఉలుఘ్‌ఖానునినే కాఁబోలు కొందఱు చరిత్రకారు లుల్లూఖాన్ అని యనిరి. ఉభయసైన్యములకును ఘోరముగాఁ బోరుజరిగెను. ముట్టడి వేసిన తురకలు హతాశులైరి. అనేకులుమడిసిరి. ఆంధ్రుల యద్భుత ప్రతాపమునకుఁ దాళలేక మిగిలిన మ్లేచ్ఛులొకరాత్రి ఎవ్వరితోఁజెప్పక పలాయితులైరి. ఆంధ్రవీరులు వారివెంటఁబడి పాఱిపోవువారిలో ననే

కులఁజంపిరి. వారి యుద్ధసామగ్రి నంతయు స్వాధీనము చేసికొనిరి. ఒక తురుష్కసేనానిఁ బట్టుకొనిరి. వాఁడు కారాగృహమునందె యంత మందెను. మఱియొక సేనానిని మరాటీవారు చంపిరి. ఇట్లు తురుష్కులకుఁ బ్రబలపరాభవముకలిగెను. కాని వాండ్రు పట్టినపట్టు వదలనివాండ్రి గుటచే మరుసటి సంవత్సరమున మరలవచ్చి ఓరుగంటిని గెలిచి ప్రతాపరుద్రుని జెఱపట్టి దిల్లీకిఁ గొంపోయిరి. ఆతఁడు మార్గమధ్యమున నర్మదా తీరమున మృతినందెను. ఆంధ్రదేశము సమస్తమును మహమ్మదీయులకు హస్తగతమాయెను.

## తుఘ్లఖాబాద్

ఈబాదుషాహ దిల్లీయొద్దనే యొక కోటకట్టి దానికి తుఘ్లఖాబాద్ అని తన వంశపుపేరుపెట్టి తనవంశపు కీర్తి యాచంద్రార్కముందునట్లు చేసెను. ప్రస్తుతమీకోట మిక్కిలి దురవస్థలోనున్నను దాని పూర్వవైభవమును సూచించుచున్నది. కోటగోడలు మిక్కిలి పెద్దవిగను, గట్టివిగను నున్నవి. కోటలోనికిఁబోవు రాజద్వారము మొదలయినవన్నియు భూమిలోపల నున్నవి. కోటలోఁ గూర్చుండి శత్రుసైనికులతోఁ బోరాడవచ్చును. అచ్చటనుండి యిష్టమున్నవైపునకు సైన్యముఁ బంపుటకు వీలుండెను. కోటలోని త్రోవలు, బాజారులు, మందిరములు, తోటలు మొదలయినవాని గుఱుతు లిప్పటికిఁ గానవచ్చుచున్నవి. ఆకోటలోనుండి డిల్లీపట్టణమునకుఁ బోవుటకు భూమిలోనుండి త్రోవయుండెను.

## ఘయాస్ఉద్దీన్ మరణము

ఈబాదుషాహ తిరుగఁబడిన కొందఱుజనుల నోడించి తిర్‌హూత్ అనఁగాఁ బురాతనమిథిలాదేశమును స్వాధీనముచేసికొనియె. ఈతఁ డొకసారి బంగాళాదేశమునకుఁ బోయి తిరిగివచ్చినప్పుడు అలఫ్‌ఖాన్ అను నాతని పెద్దకొమారుఁడు తండ్రిని మహాగౌరవముతో నూరివెలుపల నెదుర్కొని యాతనికొఱకు నిర్మింపఁబడిన కట్టగుడారములో దింపెను. ఆ గుడార మొక్కసారి యాతనిమీఁదఁ బడినందున నాతఁడు దుస్సుఱుల విడి

చెను. (1326) ఈమోసమంతయు నలఘ్ఖానునిచే బుద్ధిపూర్వకముగాఁ జేయఁబడియెనని చరిత్రకారుల యభిప్రాయము.

## మహమ్మదు ఘుఘ్లుక్

(1326 - 1351)

గ్యాస్ఉద్దీనుని పెద్దకుమారుఁడైన ఉలఘ్ఖానుఁడు 'మహమ్మ' దనిపేరుపెట్టుకొని రాజ్యారూఢుఁడయ్యెను. ఎక్కువగా విద్యనేర్చినవాఁడైనను సారాసారవిచారమును దూరదృష్టియు లేనియెడల యీమనుజుని పుస్తకసంబంధియైన వానిపాండిత్యమంతయు నెట్లు నిష్ఫలమగునో చూడదలఁచినవారికి నీ బాదుషా చరిత్రయొక్క గొప్పలక్ష్యముగా నుండు ననుటకు సందేహములేదు. ఈతఁడు మిక్కిలి విద్వాంసుఁడు. ఈతనికి నరబ్బీఫారసీభాషలలో సాహిత్య పటిమ గలదు. న్యాయశాస్త్రమునందును, గ్రీక్ తత్త్వశాస్త్రమునందును నిపుణుఁడు. వైద్యశాస్త్రములోను ప్రవేశముకలదు. రాజ్యమునకు రాఁగానే యనేక విద్వాంసుల కాశ్రయమిచ్చి యితరరాజులు చూపని యౌదార్యమును జూపెను. ఈతని యద్భుత స్మరణ శక్తి నిఁజూచి లోకులీతనిని 'ఏక సంథగ్రాహి' యనుచుండిరి. ఔదార్యమునందునుగూడ నీతఁడు మంచివాఁ డనిపించుకొనెను. ధర్మనిష్ఠగలవాఁడై సారా మొదలయిన మాదకద్రవ్యములఁ జూడనైనఁ జూచెడువాఁడుకాఁడు. ఇవి యీతని సద్గుణములు. ఇఁక దుర్గుణములఁ జూచినయెడల లక్షోపలక్షలు కలవు. ఈతఁ డత్యంతస్వేచ్ఛాచరణమును, తొందరపాటును, అదూరదృష్టియుఁ గలవాఁడు; అసూయామత్సరగ్రస్తుఁడు; పరమక్రూరుఁడు. ఇతనికిఁ గోపమువచ్చినపుడు చూచినయెడల నీతఁడు లోకమంతయు భ్రమింగివేయునా యేమి యని చూచువారికిఁ దోఁచెడిని. ఈతఁడు వ్యర్థమనోరథముల వెంటఁదగిలి తెలివిమాలిన కార్యములఁజేసి తనరాజ్యమునకుఁ, బ్రజలకును అపరిమితములయిన దుఃఖములఁ దెచ్చిపెట్టెను. ఈతనిచరిత్ర వార్నియుట యనఁగా నితఁడుచేసిన పొరపాటులను లెక్కించుటయే.

## రాజ్యములోని యవ్యవస్థ

ఈరాజులు దక్షిణదేశమును జయించినప్పటినుండియు రాజ్యము యొక్క వైశాల్య మెక్కువయై, యేకప్రభుత్వముగా నేలెడుభార మధిక మయ్యెను. ఇంత కష్టపడినను దక్షిణదేశమువలన ద్రవ్యప్రాప్తి విశేషము కాదయ్యెను. పెక్కుసారు లుత్తరములోనిడబ్బు తీసికొనిపోయి దక్షిణమున వెచ్చింపవలసివచ్చెను. అందుచే బాదుషాహ కెచ్చటిధనమును జాలదయ్యె. దేశమంతయు దోపిడివలన గడుగబడినందున బ్రజలలో బలమేమియు లేకపోయెను. ప్రాణసంరక్షణార్థమై ప్రజలు రాజుమీద దిరుగబడిరి. దక్షిణదేశములో దిరుగబడినవారిని జయించుటకు దనసైన్యము బాదుషా యంపగా నుత్తరదేశమునుండి మోగలులీతని రాజ్యముమీదికి దండెత్తివచ్చిరి. యుద్ధముచేయుటకు దనయొద్ద సైన్యములేనందున మహమ్మదు వారికి ధనమిచ్చి సమాధానపఱచి వారిని బంపివేసెను. బాదుషాహ మిక్కిలి బీదవాడయ్యె. అప్పు డాతడు దక్షిణములోని రాజులతో స్నేహముచేసి యుండినయెడల నాతనికష్టములు తొలగి యుండును. కాని యట్లుచేయక తనకు డబ్బు కావలయునని ప్రజలపై గతినమైనపన్నులువేసెను. అందుచే బీదవా రడుగంటిరి; ధనవంతులు తిరుగబడిరి. రైతులు వ్యవసాయము మానుకొనిరి.ధాన్యపు ధరలు హెచ్చెను. ఇంతలో వర్షముకూడ వెనుకకుబోయెను. ఇంకేమున్నది ? ప్రజలు మలమలమాడిరి. వేలకొలది పట్టణములును, లక్షలకొలది పల్లెలును, కోట్లకొలది జనులును కుటుంబములును రూపము లేకుండ నాశముజెందెను. దేశమంతయు శ్మశానమయ్యెడు వేళ వచ్చెను. ఆహా ! స్వసౌఖ్యమునందే దృష్టిగలరాజుల పరిపాలనమువలన నిట్టియాపదలు సంభవించునుగదా !

## రాజధానిని మార్చుట

ఈసంకటమునుండి తప్పించుకొనుటకై మహమ్మదు డిల్లీనుండి లేచి దక్షిణమందలి దేవగిరి (దేవగడ్) తన రాజధానిగాజేసెను. దేవ

గిరి యను పేరు మార్చి దానికి దౌలతాబాద్ అని పేరుపెట్టెను. అప్పుడే యాకోట ప్రస్తుతమున్నట్లు కట్టఁబడినది. తాను దౌలతాబాదునకుఁ బోవుటయేగాక డిల్లీలోని ప్రజలనందఱిని నేడువందల మైళ్ళమీఁదనున్న యా నూతన రాజధానికి రమ్మని బలవంతపెట్టెను అట్లుచేయుటవలనఁ దన ప్రజలందఱును ఉత్తరదేశములోని కటువును దప్పించుకొందురనియుఁ దాను దక్షిణములోని రాజ్యములఁ జక్కఁగఁ దనస్వాధీనమందుంచుకొన వచ్చుననియు నాబాదుషా యభిప్రాయము. కాని యందువలన ననేక జనులకు మిగుల బాధకలెను. నూతనరాజధానిలో సందఱికి స్థలము దొరకదయ్యెను. అందుచే నసంఖ్యజనులు హతులైరి. దిల్లీపట్టణము పాడుపడెను. ఇట్లనేకములయిన చిక్కులను జూచి బాదుషాహ మరల రాజధానిని దిల్లీకిమార్చెను. దౌలతాబాదునుండి మరల దిల్లీకి వచ్చునెడ ననేకులు మడిసిరి.

## రాగినాణెములను బంగారునాణెములుగ వాడుట

ఖొక్కసములో ధనము లేకపోయెను. అందులకే విచిత్రమైనరాజొకయుక్తి కల్పించెను. రాగినాణెములఁ జేయించి వానిని బంగారునాణెములుగా వాడుఁడని ప్రజల నాజ్ఞాపించెను. రాజుచేఁ జేయఁబడిన నాణెములవంటివే ప్రజలుచేయసాగిరి. అందుచే మోసమెక్కువయ్యెను. ఇట్టివనికిమాలిన నాణెములిచ్చి బీదవారు గొప్ప వెలగల ద్రవ్యములు వర్తకులయొద్దనుండి కొనసాగిరి. ఈదేశములో రాగినాణెములపు సరకుగొని పరదేశవర్తకు లితరదేశములలో బంగారు నాణెముల కమ్మసాగిరి. అందుచే వరకులు వరకముచేయుట మానిరి. ఇతరదేశములనుండి ఈదేశమునకు సరకులు వచ్చుట యాఁగిపోయెను. బంగారము వెలనాలుగు రెట్లు హెచ్చెను. రాగినాణెములకు బదులు బాదుషా బంగార మీయలేకపోయెను. వేలకొలఁది వర్తకులు దరిద్రులైరి.

## చీనాదేశముమీఁదికి దాడి

చీనాదేశమును జయించుటకై యీబాదుషాహ తన తమ్ముని కుమారుఁడగు ఖుస్రూమలీక్ అనువానిని లక్షసైన్యముతోఁ బంపెను. వాఁడు 1337 లో బయలుదేరి నేపాల్‌దేశపు టరణ్యములలో మిక్కిలి ప్రయాసపడి చీనాదేశపు పొలిమేర నెట్టకేలకుఁ జేరెను. అచ్చటఁ జీనా సైన్యములతోఁ బోరాడి యోడి ఖుస్రూమలీక్ తిరిగి పాఱవలసినవాఁడాయెను. అప్పుడె వాన పడినందున నెచ్చటఁ జూచినను జలప్రళయమయ్యె. అందువలనను చలిగాలివలనను సైనికులందఱును సమసిరి. ఆదుఃఖవార్త బాదుషాహకుఁ జెప్పుటకుఁ బదిమంది మాత్రము బ్రతికి వచ్చిరి.

తుర్కస్థానమును పారసీకమును జయించుటకై బాదుషాహ యొక గొప్పసేనను గూర్చెను. ఆ సైనికులకు నొక్క సంవత్సరము వఱకుఁ గూర్చుండఁబెట్టి జీత మీయవలసివచ్చెను. ఇంతలో బొక్కసము లోని డబ్బయిపోయినందున వారినందఱిని నిండ్లకుఁ బంపివేసెను. ఇట్లు పనిలేని సైనికులు దేశమును దోఁచసాగిరి. దేశమునం దెచ్చుచూచినను బందిపోటువార్తలే వినరాఁదొడఁగెను.

## రాజ్యములోని తిరుగుబాటులు

ఈతఁ డొకపనియైనను సక్రమముగను సాంగోపాంగముగను జేయఁడయ్యె. సంకటముతోఁబాటు ఈతనిక్రోధమును అభివృద్ధికాఁ దొడఁగెను. గర్షాస్పుఁడను నితని యత్తకుమారుఁ డొకఁడు తిరుగుబాటుచేయఁగా వానినిబట్టి యితఁ డెన్నెన్నియో బాధలుపెట్టి చంపించెను. (1328). ఇతఁడు విధించు శిక్షలన్నియు నిట్లే కఠినముగా నుండెను. ఈతఁడు రాక్షసవృత్తి నవలంబించి మనుష్యులవేఁట యను నొక క్రొత్తవేఁటమార్గమును కల్పించి నిజవినోదార్థమై పెక్కు నిరపరాధులైన బీదవాండ్రను వేఁటాడెను. జమాబంది యను పద్ధతిని నీతఁడే ప్రారంభించెను. గంగా

యమునలోని ప్రదేశమున భూమి శిస్తులు పూర్వముకంటె గొన్నిచోట్ల బదిరెట్లును, కొన్నిచోట్ల నిరువదిరెట్లును హెచ్చించెను. అందుచే నీతని యధికారులు సిస్తునడుగబోయినపుడు జనులు గ్రామములను విడిచి పాఱిపోయిరి. అందుచే గ్రామములు పాడుపడి యరణ్యములు పెరిగెను. ఈతడు వేలకొలది జనులనుజంపి వారి శిరంబుల డిల్లీకోటమీదగ గట్టెను. ఇట్టి ఘోరకృత్యములవలన దేశమంతటను రాజుండగానే యరాజక మయ్యెను. సుల్తానుయొక్క దారుణపరిపాలనను సహింపజాలక ప్రజ లనేకప్రాంతములందు తిరుగుబాటు చేసిరి. అయోధ్య బంగాళ ప్రాంతములవారు విప్లవపతాకమునువిప్పి స్వతంత్రులగుటకు యత్నించిరి; అట్లే మాళవ గుజరాత సింధుదేశములందును అల్లరులు చెలరేగెను. దక్షిణహిందూదేశమందు సర్వత్ర హిందూమహమ్మదీయ నాయకులు సుల్తానును ధిక్కరించి నూతన స్వతంత్రరాజ్యములను స్థాపించిరి. వీని యందు ప్రథమమున బరిగణింపదగినది యాంధ్రుల తిరుగుబాటు. ఓరంగలుపతనమునకును గాకతీయాంధ్రసామ్రాజ్యవిచ్ఛిత్తికిని గారణము మహమ్మదీయపరాక్రమమొక్కటియెకాదు. అంతకుమించినది ప్రతాపరుద్రుని హ్రస్వదృష్టి - ఉలుఘ్ఖానుడు ఓరుగంటి తొలిముట్టడిలో పరాజయమునంది పారిపోయినపిమ్మట నతడు శీఘ్రముగ మరలిరాజాల దనియెంచి సర్కారు కణజములనుదెరిపించి సేకరించి యందు ధాన్యమును సర్వమును విక్రయించుటయేకాక కోటసంరక్షణార్థము రప్పించి యుండిన నాయకుల వారి మూకలును వారివారి నెలవులకంపివేసెను; కావున నులుఘ్ఖానుడు డిల్లీనుండి వచ్చిన నూతనబలముతోగూడ వచ్చి యోరుగంటిని ముట్టడించినపుడు ప్రతాపరుద్రునికి దీర్ఘకాలము ముట్టడి నిలుచుటకువలసిన వస్తుసామగ్రికాని కోటను సంరక్షించుటకుదగిన బలముగాని లేకపోయెను; తత్కారణమున నతడు కోటను తురుష్కులకు వశపరచి వారికి పట్టుబడవలసివచ్చెను. ప్రతాపరుద్రుని బంధనమును తదనంతరమరణమును తన్మూలముగ సంప్రాప్తమైన పారతంత్ర్యమును ఆంధ్రనాయకులకు హృదయశల్యములై బాధింపగడగినవి. తురుష్కుల

పాలన మిక్కిలియు దుర్భరమాయెను. ఎట్లయినను నష్టమైపోయిన దేశ స్వాతంత్ర్యమును పునరుద్ధరింపవలయుననెడి కోరిక ప్రజల హృదయ మందు గాఢముగబాదుకొని వారిని తత్కార్యనిర్వహణమునకు ప్రేరేపించి నది. ఆంధ్రనాయకులెల్ల నేకమై ముసునూరిప్రోలయ నాయకుని యాధి పత్యముక్రింద నొకసమితిగ నేర్పడి దేశదాస్యవిముక్తి కి గృషిసేయగలి గిరి. ప్రోలయనాయకుడు శూరుడు; నేర్పరియైన సేనాధిపతి. తురక సైన్యములను పెక్కురణరంగములందు పరాభూతులనుగావించి పాఱ దోలి తీరాంధ్రమున హిందూస్వాతంత్ర్యమును పునఃప్రతిష్ఠించెను. ఆతని యనంతరమతని సోదరపుత్రుడైన కాపయనాయకుడు క్రీ. శ. 1336 లో ఓరుగంటినుండి మహమ్మదీయులను దఱిమివేసి యాంధ్ర దేశమునంతటిని వశపఱచుకొని ప్రోలయనాయకుడు ప్రారంభించిన కార్యమును సమాప్తమొనర్చెను. ఈయంశములన్నియు నాల్గవప్రకరణము నందు విపులముగ వివరింపబడియున్నవి. దౌలతాబాద్ తప్ప మఱేమియు దక్షిణమందుఁ దురకల స్వాధీనతలో లేకుండఁజేసిరి. తుదకు మహ మ్మదు స్వయముగా సైన్యములఁ దీసికొని దౌలతాబాదువఱకుఁ బోయెను. ఇంతలో గుజరాత్‌దేశములోని జనులు తిరుగఁబడిరని విని యాతఁ డచ్చ టికిఁ బోయెను. అచ్చట సింధురాజుతోఁ బోరాడవలయునని యత్నించు చుండఁగా జ్వరమువచ్చి యావిక్షిప్తుఁ డగుబాదుషాహ మరణముఁ బొందెను (1351).

## స్వతంత్ర రాజ్యములు

మహమ్మదు తుఘ్లుక్ యొక్క రాజ్యములో నరాజక మగుట వలన నేదేశపు అధికారు లాదేశమునకు స్వతంత్రప్రభువులై దిల్లీశ్వరుని లక్ష్యపెట్టకపోయిరి. బంగాళము, కర్ణాటకము తురకవారిచేతులలోనుండి పూర్తిగాపోయెను. ఆఫ్‌గాన్, గక్కర్ అనఁబడువారు ఉత్తర హిందూ దేశములోని వాయవ్యపుసరిహద్దును స్వాధీనముసేసికొనిరి. మహారాష్ట్ర ములోనున్న బాదుషాహయొక్క యల్లుఁడగు ఇమాద్ ఉల్ముల్క్ అను

వానిని జంపి హసన్‌గంగూ యనువాడు బహమనీరాజ్యమునకు మూల పురుషుడయ్యెను. ఈరాజ్యచరిత్ర యీ గ్రంథముయొక్క మూడవ పరికరణములో వర్ణింపబడును.

## ఇబ్నబతూతా

ఆఫ్రికా ఖండములోని లాంజర్స్ నివాసుడగు ఇబ్నబతూతా యను విద్వాంసుడు డాశియాఖండమును జూచుటకై వెడలి మహమ్మదు రాజ్యముచేయునపుడు క్రీ. శ. 1341 లో డిల్లీకి వచ్చెను. ఈ పట్టణమును గుఱించియు నీరాజుయొక్క రాజనీతిని గుఱించియు నీతడిట్లు వ్రాసి యున్నాడు:—"దిల్లీ పట్టణము వైభవయుతముగ నున్నది. అచ్చటి మసీదులను, కోటగోడలను బోలినవి పృథ్వీలో నెచ్చటను లేవు. అయినను లోకులు దక్షిణమునకు వెడలిపోయి నందున బట్టణము నిర్జనమై యుండెను. మహమ్మదురాజ్యములో వెలుతురు చీకటి, న్యాయము అన్యాయము అనునవి మిక్కిలి పంతగాడు గలిసియున్నవి." ఈవిద్వాంసుడు కొన్నిదినము లారాజ్యములో న్యాయాధ్యక్షుని పనిచూచి చీనాకు రాయబారిగా బోయెను.

## ఫిరోజ్ తుఘ్లుఖ్

(1351 - 1388)

మహమ్మదు తుఘ్లుఖ్ చనిపోయిన తరువాత హిందూదేశమునకు గొంత విశ్రాంతి కలిగెను. ఈతని పినతండ్రికొమారుడైన ఫిరోజ్ అనువాడు సింహాసన మెక్కెను. రాజ్యమునకు వచ్చిన రెండవయేట నీతడు బంగాళమును జయించుటకు బోయెను. కాని వర్ష ప్రతిబంధకమువలన నితడు తిరిగివచ్చెను. అటుతరువాత నీతడు నూతనరాజ్యమును సంపాదించుటకు యత్నించినవాడు కాడు. ఇతరరాజ్యముల స్వాతంత్ర్యమపహరించుటకు యత్నించుటకంటె నున్నరాజ్యమును చక్కగా బరిపాలించుకొనుట మంచిదని యీరాజు యుద్ధములను మానివేసెను. బం

గాక బహమనీరాజ్యముల స్వాతంత్ర్య మొప్పుకొనెను. ఎల్లప్పుడును ప్రజాహితైకతత్పరుడై వారికి మేలగు కార్యములే చేయుచుండెను. అందుచే నితనికీర్తి యజరామరమైనది. యుద్ధవర్ణలతో నిండియుండుటయే ఘనతయగునేని యితని చరిత్రలో నట్టి వర్ణనలులేవు. ప్రజాసౌఖ్యాభివృద్ధికరమగు పనులే శాశ్వతకీర్తికి గారణ మగునేని యితని చరిత్రయంతయు నట్టి పనులతోనే నిండియుండెను.

## జనులకు హితప్రదములగు పనులు

ఈతడు ప్రజలహితమునకై యీక్రింది మందిరాదికములగట్టించెనని తురుష్క చరిత్రకారులు వ్రాసియున్నారు. 40 మసీదులు, 30 పాఠశాలలు, 100 ధర్మశాలలు (సత్రములు), 200 పట్టణములు, 100 సార్వజనికస్నాన గృహములు, 20 రాజమందిరములు, 100 రోగ చికిత్సాలయములు (ఆస్పత్రులు), 10 నక్షత్రశాలలు, 10 పెద్దబావులు, 30 తటాకములు, 50 ఆనకట్టలు, 150 వంతెనలు. ఇవిగాక గొప్పకాలువలు త్రవ్వించెను. అందు మూడు ముఖ్యములైనవి. యమునానదిలోనుండి యొకకాలువ తీయించి దానిని పానిపత్ వద్దనుండి బికానీర్ మరుస్థలములోని హంసీ, హుసార్లనుగ్రామములవఱకు గొనిపోయెను. అది యిప్పటివఱకును బాఱుచున్నది. రెండవకాలువ యొకటి త్రవ్వింపగా దానివలన ఘోగ్రా సత్లజ్ అనునదులు యమునతో గలుపఁబడినవి. మూడవకాలువ సరస్వతీనదిమొదలు కగర్ నదివఱకును ద్రవ్వింపఁబడియె. ఇది జీవనదివలె ననేక సంవత్సరములవఱకును బాఱుచు సర్హింద్, మన్సూర్పుర్ ప్రాంతమందలి జనులకు మహోపకారిగనుండెను. ఈకాలువ త్రవ్వునపు డేఁబదివేలజనులు పనిచేయుచుండిరి. ఈకాలువ త్రవ్వునపుడు పెద్దపెద్ద యెముకలుదొరికెనఁట. అందు మనుష్యుని యస్థిపంజరము (Skeleton) మూడుగజముల యైదడుగుల రెండంగుళముల పొడవుండెనఁట !

ఉత్తర హిందూదేశములో నాకాలమున కాలువలేవియు లేకయుండెను. తెలుఁగుదేశములో నున్న కాలువలును, వానివలన

వ్యవసాయమునకు గలుగు లాభమును గ్రహించి యీబాదుషాహ యుత్తరదేశములో బైనివర్ణింపబడినట్లు కాలువలు త్రవ్వించెను. ఈ సమాచారము తెలుగువారికి భూషణాస్పదము.

ఫిరోజ్ ఒక్కచోటనేయుండక ప్రజాక్షేమము గనుగొనుటకై ప్రతిసంవత్సరమును రాజ్యములో దిరుగుచుండెను. అనేకస్థలములలో గ్రొత్తక్రొత్త గ్రామములనుగట్టించి వ్యవసాయమధికముగా జరుగునట్లు చేసెను. ప్రజలకు బాధకరములయినపన్నులు తీసివేసెను. అందుచే బ్రజలకు సౌఖ్యముకలిగి వారు తిని కుడుచుటకు గలవారలయిరి. ప్రతి పురుషునియింటను కొంతధాన్యమును, దొడ్డియందు బఱువులును, స్త్రీ యెడలిపై నగలును కానుపింపను దొడగెను. వస్త్రావరణమును పూసపోగునులేని యిల్లులేదయ్యె. ఆహా ! ఏమివింత ! విపరీతపు పన్నులు లేకుండినయెడల బ్రజలు కొద్దిదినములలోనె ధనవంతులగుదురుగదా ? సురాజుగలదేశమునకు బీదతన మేలవచ్చును ?

## ఈతడు వ్రాసిన యాత్మచరిత్ర

ప్రజల మేలుకొఱకు నీబాదుషాహచే జేయబడిన కార్యము లీతనియాత్మచరిత్రయందు వివరముగా వర్ణింపబడినవి. అవి బహుబోధ ప్రదములగుటచే వాని నిచ్చట దెనిగించుచున్నాము:—

"నేటివఱకు జిన్నచిన్న యపరాధములకు నా యపరాధములు చేసిన వారిని జంపుటయు, లేక వారి కాలుసేతుల నఱుకుటయు, లేక వారికనుల దీయించి బాధపెట్టుటయు, లేక వారిని శూలముపై నెక్కించుటయు, లేక వారిచర్మము దీయించుటయు మొదలయిన క్రూరశిక్షలు విధింపబడుచుండెను. కాని నాకు రాజ్యాధికారము నొసంగిన సర్వశక్తిమంతుడగు పరమేశ్వరుడు మిక్కిలి కృపగలవాడై యిట్టి క్రూర శిక్షలను నిలిపివేయుటకు నాకు బుద్ధి యొసంగెను. కావున నే నాజ్ఞాపించు

నది యేమనఁగా, నేఁటివఱకు నే యే దిల్లీశ్వరుఁ డిట్టి నిష్ఠురకృత్యము లను జేసెనో, యాయా దిల్లీశ్వరునిపైఁ నీశ్వరునికిఁ గలకోపమును బోఁగొట్టుటకై యందఱును ప్రతిదినము దేవదేవునిఁ బ్రార్థింపవలయును.

"చిన్నచిన్న వర్తకులయొద్దినుండి మాయుద్యోగస్థు లిదివఱకుఁ దీసికొనుచున్న బహుమతులను, కట్నములను, బాధకరములగు చిన్న చిన్న పన్నులను ఇఁక ముందునుండి తీసికొనఁగూడదు. బంజరుభూము లలోఁ బఱువులమేపుటకును, పుష్పములు చేఁపలు మొదలైనవాని నమ్మ్మటకును, ప్రత్తి యేకుటకును, వంటచేయుటకును, అంగడి పెట్టుటకును, సారాయి నమ్మ్మటకును, ప్రజలు రాజునకు నిదివఱకుఁ బన్ను నిచ్చుచుండిరి. కాని యీ పన్నులన్నియు నిఁకముందుఁ ప్రజ లీయ నక్కఱ లేదు. ఎందుకనఁగా, నిట్టిపన్నులు రాఁబట్టుకొను నధికారులు తమయధికారమును దురుపయోగముచేసి ప్రజలను బాధపెట్టెదరు. అట్లు ప్రజల బాధపెట్టుటకంటె రాజు పన్ను వదలుకొనుటమేలు. ఇప్పుడు ప్రకటన పఱిచిన నియమముల నతిక్రమించి క్రొత్తపన్నులు ప్రజలపై వేయఁ బడవు.

"యుద్ధమందు దొరకినధనమును నైదుభాగములుగా విభజించి, యందు నాలుగుభాగములు రాజు తీసికొని యొకభాగము సైనికులకుఁ బంచిపెట్టు నాచార మిదివఱకు గలదు. ఇఁక ముందు నాలుగుభాగములు సైనికులకిచ్చి యొకభాగముమాత్రము రాజు తీసికొనఁగలడు. నాస్తిక మతము నవలంబించుట, దుర్వ్యసనమును అభివృద్ధిచేయుట, లంచములు తీసికొనుట, ఉద్యోగస్థు లధికారమును దురుపయోగముసేయుట, ఈయపరాధములను చేసినవారిని రాజ్యమునుండి వెడలఁగొట్టబడును.

"నన్నుఁ జూచి జనులు వినయము నేర్చికొనవలయునని నేను వెలగల వస్త్రములనుగాని, ఆభరణములనుగాని ధరించుట మానివేసితిని. పూర్వరాజులచేఁ గట్టఁబడిన సత్రములు మొదలైన లోకోపయోగకరము లగు వాని నన్నిటిని బాగుచేయించి క్రొత్తవానిని గట్టించుటలో ధనమును వ్యయపఱుచుట నాకు విధియని తలఁచెద.

"మహమ్మద్ తుఘ్లఖ్ బాదుషాయొక్క కోపముచే నాశము జెందిన వారి వంశజు లెచ్చటనైన నుండినయెడల వెదకించి వారికి వర్షాశనము లొసంగి యాబాదుషాను క్షమించితి మని వారిచే వ్రాయించుకొని, అందుపై సన్మాన్యులగువారిచే సంతకముచేయించి ముద్రవేయించి, యా కాగితములను ఆబాదుషాయొక్క సమాధిలో బెట్టించితిని. విద్వాంసులును సన్మాన్యులును అగువారివలన నేను సద్బోధలవినుచు నాచరణము నందునట్లు ప్రవర్తించుటకు యత్నించెద. యుద్ధమందు గాయములుతగిలిగాని, ముసలితనముచేగాని, యుద్ధముచేయుటకు నసమర్థుడగు సైనికుని వాడు బ్రతికియుండువటకు నింట గూర్చుండబెట్టి వానిజీత ముపకార వేతనముగా నీయబడును. నాకు విషముపెట్టి చంపుటకు రెండుతడవలు యత్నించిరి. కాని యా యత్నములు కొనసాగినవి కావు."

## హిందూ మతద్వేషము

ఈ బాదుషాహ యనేకవిషయములలో మంచివాడనిపించుకొనినను హిందూమతమును గుఱించి మాత్సర్యము మిక్కిలి ద్వేషము కలిగియుండెను. ఇతడనేక హిందూదేవాలయములను, ప్రతిమలను, పుస్తకములను, ధ్వంసముచేసెను. బ్రాహ్మణులయెడ మిక్కిలి నిష్ఠురభావము కలవాడై వారియొద్దినుండి జిజియా యను పన్ను రాబట్టుకొనుచుండెను. పన్నిచ్చుట లేదని యనేక బ్రాహ్మణులు తిరుగబడి ప్రాణములబోగొట్టుకొనుచుండిరి. కాని యాప్లేచ్ఛ డాపన్నును దీనివేసినవాడు కాడు.

## వృద్ధావస్థ

ఈతడు ముసలివాడైనతరువాత తనమంత్రియగు ఖాన్‌జహాన్ అనువానికి రాజ్యవ్యవస్థ యొప్పగించెను. బాదుషా కొమారుడగు మహమ్మద్ అనువానికిని ఆమంత్రికిని వైరముపచ్చినందున దనతండ్రియను మతిని రాజపుత్రుడగు మహమ్మద్ రాజ్యము నేలసాగెను. కాని

యీతఁడురాజ్యపరిపాలనము చేయునప్పుడు రాజ్యములో ననేక యుద్ధము లును, కల్లోలములును సంభవించినందున వయోవృద్ధుఁడగు ఫిరోజ్ బాదుషాహ్ మరల రాజ్యమును స్వయముగాఁ బాలింపఁదొడఁగె. ఇతఁడు తొంబది వర్షములవఱకు బ్రతికి 1388 లోఁ బరలోకగతుఁ డయ్యెను.

## తరువాతి బాదుషాలు

ఫిరోజ్‌యొక్క మనుమఁడగు గయాసుద్దిన్ అనువాఁ డైదు నెలలు రాజ్యముచేసెను. వానిని వానితమ్ములు చంపిరి. అబూబకరు అను వాఁడు కొన్నిరోజులు రాజ్యముచేయఁగా నయోగ్యుఁడని తలఁచి యాత నిని సరదారులు రాజ్యమునుండి తొలఁగించిరి; ఫిరోజుని కొమారుఁడగు మహమ్మద్ అనువానికి రాజ్య మొసంగిరి. ఈతఁడు 1390 మొదలు 1394 వఱకు రాజ్యముచేసెను. తరువాత నీతని పుత్రుఁడగు హుమా యూన్ రాజ్యారూఢుఁ డయ్యెను. కాని యాతఁ డకస్మాత్తుగా మరణ ముఁ జెందినందున నాతని తమ్ముఁడగు మహమూద్ బాదుషా యయ్యె.

ఇట్లు దిల్లీకి రాజులైనవా రందఱును అల్పాయువులును, అల్ప సామర్థ్యము గలవారు నైనందున దిల్లీరాజ్యములో నెచ్చటఁజూచినమ అరాజకమై యెచ్చటి యధికారు లచ్చటనే స్వతంత్రులుకాఁజొచ్చిరి. ఖాజాజహాన్ అను వజీరుఁడు బంగాళాదేశమును స్వాధీనముచేసికొని జ్యోన్‌పూర్ పట్టణమును తన రాజధానిగాఁ జేసికొనియె. సారంగఖాన్ అను మఱియొక సరదారుఁడు పంజాబ్‌దేశమును లోఁబఱుచుకొనియె. గుజరాత్ మాళవ ఖానదేశములు మొదలయిన ప్రాంతములలోని యధి కారులు స్వతంత్రులైరి. డిల్లిపట్టణములో నెల్లప్పుడును పోరాటములు జరుగుచుండెను. ఇట్లు దిల్లీశ్వరుఁ డెడతెగని సంకటములచే బాధపడుచు బలహీనుఁడగుట విని, యిదియే మంచి సమయముగాఁ దలఁచి తయ మూర్‌లంగ్ అను మోగలుఁడు దిల్లీమీఁదికి దండెత్తివచ్చెను.

## చంగీజ్ ఖానుని వంశజులు

చంగీజ్ ఖానుని గుఱించి యిదివఱకు గొంత వ్రాసియున్నాము. ఆసియాఖండములోని ప్రదేశమంతయు జయించిన యీమహాపురుషుడు 1227 లో బరలోకగతుడయ్యెను. తరువాత నాతనిపుత్రులగు ఉక్తాయ్, మనుమలగు గయూక్, మంగూన్, కుబ్లాఖాన్ అనువారు రాజ్యమునకు నధికారులైరి. 1227 మొదలు 1295 వఱకు నీరాజులు చీనాదేశమును, హిందూదేశమునకు దూర్పుననున్న మఱికొన్ని దేశములను జయించిరి. జపాన్ దేశమును మాత్రము గెలిచినవారు కారు. కుబాఖ్ తమ్ముడగు హులాక్ అనువాడు 1258 లో బగ్దార్‌లోని ఖలీఫాను వెడలగొట్టి ఆలెప్పో, డమాస్కస్ పట్టణములను స్వాధీనము చేసికొనెను. ఉక్తాయనువాని యన్నకుమారుడు బాతూయనువాడు యూరోప్ ఖండములోని రష్యాలో బ్రవేశించి మాస్కో, కీఫ్ అను పట్టణములను గాల్చెను; జర్మనీకి బోయి సాయ్‌లేషియా, హంగేరి, పోలండ్ మొదలయిన ప్రదేశములను గెలిచెను. డ్యానూబ్ నదియొక్క యుత్తరపు ప్రదేశమంతయు మోగలులు స్వాధీనముచేసికొనిరి. సర్వియా, బ్యాస్నియా, బల్గేరియా మొదలైన ప్రాంతములను ధ్వంసముచేయుచు మోగలులు మరల రష్యా దేశమునకుబోయిరి. అచ్చట సైబేరియా ప్రాంతముపై బాతూ యనువాని వంశజులు మూడువందల సంవత్సరములవఱకు రాజ్యముజేసిరి. తరువాత రష్యాదేశపువారా రాజ్యమును మరల స్వాధీనము చేసికొనిరి.

కుబ్లా అనువాడు పేకిన్‌రాజధానిలో రాజ్యము చేయుచుండెను. అతని వంశజులు నూటయేబది సంవత్సరములవఱకు నచ్చటనే యుండి చీనాదేశముపై నిరంకుశప్రభుత్వము చేసిరి. కాని చీనాదేశమువారు తిరుగబడి మోగలులను వెడలగొట్టి నూటయేబదిసంవత్సరముల తరువాత తమ స్వాతంత్ర్యమును మరల సంపాదించుకొనిరి. తయమూర్ లంగ్ అనువాడు తాను చంగీజ్‌ఖానుని వంశజుడనని చెప్పుచుండెను.

గ్రంథకారులు నాప్రకారమే వ్రాసియున్నారు. కాని మీఁదవర్ణింపఁబడిన రెండు వంశములలో నీతఁ డేవంశమునందుఁ బుట్టినది తెలియదు.

## తయమూర్ లంగ్

(1336 - 1405)

ఈతని పేరు తయమూర్. లంగ్ అనఁగా కుంటివాఁడు. ఈతఁడు యుద్ధములో గాయములు తగిలినందున కుంటివాఁ డయ్యెను. కావున చరిత్రకారు లీతనిని తయమూర్ లంగ్ అని వ్యవహరింతురు.

ఈతఁడు 1336 వ సంవత్సరమున జన్మించెను. ఈతనితండ్రి పదివేల గుఱ్ఱములకు నధికారిగానుండెను. తయమూర్ చిన్ననాఁటనుండియు యుద్ధప్రియుఁడై క్రమక్రమముగాఁ బరరాజుల నోడించుచు 1370 లో జగతాయియను మోగలవంశము నంతమొందించి స్వతంత్రరాజ్యమును స్థాపించి సమర్కండ్ పట్టణమును తన రాజధానిగాఁ జేసికొనియె. అటు తరువాత నీతఁడు పరరాజ్యముల జయింప దండయాత్రకు వెడలెను. పారసీకము పశ్చిమతురకస్థానమును గెలిచి మాస్కో పట్టణమువఱకుఁ బోయెను.

## హిందూదేశముమీఁదికివచ్చుట

(1398)

తయమూర్ హిందూదేశముమీఁదికి దండెత్తివచ్చుటకుఁ గారణ మెద్దియో తెలియదు. మతాభివృద్ధిచేయుటకు నాతఁడు రాలేదనుట నిశ్చయము. ఏలయన నాతఁడు మహమ్మదీయుఁ డైనను ఆ మతాభివృద్ధికిని. తన రాజ్యాభివృద్ధికిని సంబంధము కలుగఁజేసినవాఁడు కాఁడు. ఈతఁడు రాజ్యాభిలాషచేతనే యీదేశమునకు వచ్చెనని తోఁచెడిని.

1396 వ సంవత్సరమునందు తయమూర్ మనుమఁడగు పీర్ మహమ్మద్ జహాంగీర్ అనువాఁ డోడలతో వంతెనగట్టి సింధునదిని

దాటి ఉంచ్ అను పట్టణమును ముట్టడించెను. ముల్తాన్ ప్రాంతమునకు సుబేదారుడగు సారంగ్‌ఖాన్ ఆపట్టణమునకు సహాయముచేయుటకై వచ్చెను. కాని పీర్‌మహమ్మదునకు నోడి ముల్తాన్‌దుర్గములో డాగి యుండవలసినవాడాయెను. పీర్‌మహమ్మదు వెంటనేవచ్చి యాదుర్గమును ముట్టడించి యాఱునెలలవఱకు నచ్చటనే యుండెను. దుర్గములోని యన్నసామగ్రి యై పోయినందున చేయునదిలేక సారంగఖాను డాదుర్గమును పీర్‌మహమ్మదునకు స్వాధీనముచేసెను. అచ్చట పీర్‌మహమ్మద్ గుణములు రోగముచే జచ్చినందున నాతనికి నేమియు జేయుటకు దోచకయుండెను. ఇంతలో నాతని తాతయగు తయమూర్ 1398 లో నతనికి సాహాయ్యము చేయుటకు వచ్చెను.

సింధునది దాటి తయమూర్ మొదట తులుంబ్ పట్టణములో ప్రవేశించి యందలి జనులనందఱిని నఱికివేసెను. ఈపట్టణము చినాబ్ రావి యనునదుల సంగమమునొద్ద నున్నది. అచ్చటనుండి తయమూర్ షహానవాజ్ అను పట్టణమునకు బోయి యచ్చటనున్న ధాన్యములో నుండి తనకు వలయుధాన్యముదీసికొని మిగిలినదానిని గాల్చివేసెను. అచ్చటినుండి తన మనుమనియొద్దికిబోయెను. తాత మనుమలు గలిసి భాటనీర్ అను పట్టణముమీదికి బోయి నిరపరాధులగు నసంఖ్యజను లను సంహరించిరి. అచ్చటినుండి సరస్వతి, ఫత్తేబాద్ రాజపూర్ మొద లైన స్థలముల ధ్వంసముచేయుచు నీమోగలసైన్యములు దిల్లీపట్టణమును సమీపించి పానిపత్తను కురుక్షేత్రములో విడిసెను. అప్పుడు దిల్లీలో బేరునకుమాత్రము బాదుషా యగుమహమూదునకును, తయమూర్ లంగు నకును యుద్ధముజరిగి యందు మహమూద్ పరాజితుడై గుజరాత్ దేశమునకు బాఱిపోయెను. దిల్లీపట్టణము తయమూర్ స్వాధీనమయ్యె. అచ్చటి జనులందఱు నతనిశరణు చొచ్చిరి. తయమూర్ దిల్లీ సింహాస నమునైనెక్కి తనపేరిట ఖుద్బా చదివించెను. ఇతడు పట్టణమునకు వెలుపలనుండి విజయోత్సవములో నిమగ్నుడై యుండగా నితనిసైని కులు దిల్లిపట్టణములో జొరబడి యసంఖ్య జనులను నఱికి ప్రోవ

లన్నియు రక్తముతోడను, శవములతోడను నింపివేసిరి. దోచుకొనిన ధన మింతయని చెప్పుటకు నలవికాదు.

తయమూర్ పదునైదు దినములవఱకు దిల్లిపట్టణములోనుండి దోచుకొనిన ధనమంతయు వెంటదీసికొని తనదేశమునకు దిరిగి వెళ్ళెను. వెళ్ళునప్పుడు త్రోవలో గాన్పించిన పట్టణములను గాల్చియు వేలకొలది జనులను సంహరించియు దేశమునం దంతటను నగ్నిప్రళయము గావించి మీరత్ హరిద్వారమార్గమున వెడలిపోయెను.

## తయమూర్ యొక్క స్వభావము

ఆశకు దాసుడైనతరువాత మనుజుడెట్టి క్రూరకర్మమునకైనను వెనుదీయడనుటకు తయమూర్ లంగ్ యొక్క చరిత్రయే దృష్టాంతము. ఈతడతిపరాక్రమవంతుడు; అతిక్రూరకర్ముడు. జనులను సంహరించుటయు, గ్రామములను గాల్చుటయు నితనికి సహజలీలలై యొప్పె. అయిన నితనియందు గొప్పరాజులకు శోభించు నితర సద్గుణములును వాసము చేయుచుండెను. ఇతడు దుష్టుడైనను అప్రబుద్ధుడు కాడు. ఇతని చట్టములును రాజ్య వ్యవస్థయు జూచి యూరోపుదేశమువారును మెచ్చుకొనిరి. ఇతని నిష్ఠురమైన రాజనీతి యాకాలమునకు దగినటులే యుండెను. అప్పుడు యూరోపుఖండములో మిక్కిలి నాగరికత జెందిన దని ప్రఖ్యాతిగాంచిన స్పేన్‌దేశమునకంటె నీతనిరాజ్య మన్నివిధముల శ్రేష్ఠముగా నుండెననుటకు సందేహములేదు. ఈతనియొద్దకు బంపబడిన స్పేన్‌దేశపు రాయబారిచే వ్రాయబడిన యంశములను బట్టియే మన మీసంగతుల నూహింపవచ్చును.

తయమూర్ నలువదిసారులు దండువెడలి యనేకరాజ్యముల సంపాదించెను. ఇతడింత గొప్పరాజ్యమును మిక్కిలి దక్షతతో బరిపాలించెను. రాజ్యమం దంతట సుగ్రీవాజ్ఞవలె జెల్లుచుండెను. ఇతని వైభవము జూచి స్పేన్‌రాయబారి యాశ్చర్యచకితుడయ్యె. ఇతనిపట్టపురాణివెంట మూడువందల దాసీలుండిరి. క్రిందబడి పొర్లాడు పావడ

నెత్తిపట్టుటకు బదునైదుగురు దాసీలును, తలమీది ముకుటమును బట్టి కొనుటకు ముగ్గురు దాసీలును వెంట దిరుగుచుందురు.

తయమూర్ 1405 లో బరలోకగతు డయ్యెను.

## తయమూర్ తరువాతి హిందూదేశము

తయమూర్ వెడలిపోయిన తరువాత దిల్లీపట్టణమున గొన్ని నెలలవఱకు నరాజకమై యనేకజనులు గ్రామము విడిచి పాఱిపోయిరి. రెండునెలలైన తరువాత మల్లూఇక్బాల్ఖాన్ అనువాడు కొంతపరిశ్రమ చేసి పట్టణములోని యల్లరుల నడచెను. అప్పుడు మరల జనులు పట్టణములోనికి రాజొచ్చిరి. పాఱిపోయిన మహమూద్ తుఘలఖ్ బాదుషాహ తిరిగి డిల్లికివచ్చెను. కాని ఇక్బాల్ఖానుకిని ఈతనికిని నైకమత్యము గలుగనందున వీరికి యుద్ధము జరిగెను. తరువాత 1405 లో ఇక్బాల్ఖానుడు మరణమునొందగా మహమూద్ మరల దిల్లీసింహాసనము నెక్కెను. కాని దిల్లీపట్టణములోదప్ప మఱియెచ్చటను ఆతని యాజ్ఞ చెల్లదయ్యె. మిగిలిన ప్రాంతములన్నియు స్వతంత్రరాజ్యము లయ్యెను. గుజరాథ్ దేశములో ముజఫర్ఖాన్, అయోధ్యాప్రాంతములో ఖ్వాజాజహాన్, కాల్పి మహోవా మొదలైన స్థలములో మహమ్మద్ఖాన్, పంజాబులో ఖిజర్ఖాన్ మొదలైనవాండ్రు సరదారులు స్వతంత్రులై దిల్లీశ్వరుని లక్ష్యపెట్టక యుండిరి. అందుచే మహమూద్ పేరునకు మాత్రము బాదుషాహగా నుండెను. ఈతడు 1412 లో నీలోకములోని కష్టములను సహింపలేక పరలోకగతుడయ్యెను. ఇంతటితో హిందూదేశములో రాజ్యముచేసిన తురకవంశ (Turks) మంతరించెనని చెప్పవచ్చును. మహమూదుపోయిన తరువాత దౌలత్ ఖానులోది అనువాడు రాజ్యము నాక్రమించుకొనియె. కాని వానిని తోడిచి ఖిజర్ఖాన్ అనువాడు దిల్లీశ్వరుడయ్యెను. ఈతడే యయ్యది వంశమునకు మూలపురుషుడు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

## సయ్యద్ వంశము

## (1414 - 1450)

ఖిజర్ ఖాను(డు తయమూర్ లంగ్ యొక్క అనుగ్రహము సంపాదించిన వా( డగుటచే నాతని పేరిటనే రాజ్యము చేయుచుండెను. మంచిరాజనిపించుకొని యీత(డు 1427 లో మరణము( జెందెను. తరువాత నితని కొమారు(డగు ముబారిక్ సయ్యద్ అనువా(డు ప్రజానురంజకముగనే రాజ్యము చేసెను. ఆత(డు 1435 లో( దనమంత్రిచే( జంప( బడియె. తరువాత నితని కొమారు(డగు మహమ్మద్ 1445 వఱకును, మనుమ( డగు అల్లాఉద్దీన్ సయ్యద్ అనువా(డు 1450 వఱకును రాజ్యము చేసిరి. తరువాత బహిలోల్ లోదీ యనువా(డు రాజ్యము నాక్రమించుకొని లోదీవంశపురాజులలో మొదటివా( డయ్యెను.

## లోదీవంశము

## (1450 - 1526)

లోదీవంశమువారు అఫ్గానులు. మొదట వీరు వర్తకులు.ఫిరోజ్ తుఘలఖ్ రాజ్యములో మిక్కిలి ఘనతను జెంది రాజకీయోద్యోగములలో( ప్రవేశించిరి. బహిలోల్ బాదుషా మిక్కిలి శూరు(డు. ఇతర సరదారులచే నాక్రమింప(బడిన దిల్లీరాజ్యములోని ప్రాంతములను గొంత వఱకు సాధించెను. ముప్పదియెనిమిది సంవత్సరములవఱకు రాజ్యము చేసి యీత(డు 1488 లో మృతు( డయ్యెను.

బహిలోలుని కొమారు(డైన సికందర్ లోదీ యనువా(డు తండ్రి వలెనే పరాక్రమశీలు(డై ప్రజలకు మేలు కలుగునట్లు రాజ్యముచేసెను. ఈతని రాజ్యములో( బ్రజలు యుద్ధభయములేక శాంతత ననుభవించిరి. ఇత(డు దయయు( బరోపకారబుద్ధియు( గలవా(డు. ప్రజారక్షణార్థమై సంరక్షకభటుల (పోలీసువారిని) నేర్పఱిచెను. గుఱ్ఱపుటంచెల( బెట్టించెను. బాటలను (రోడ్లను) వేయించి ప్రయాణమునకు ననేకములైన

యుపపత్తులు కలిగించెను. ఇతఁడు విద్వాంసుఁడును, కవిత్వగుణసంప న్నుఁడును, ధర్మశాస్త్రవేత్తయు నైనందునఁ బ్రజలకు నెల్లప్పుడును న్యాయము కలుగఁజేయుచుండెను. అన్నిసద్గుణము లొక్కనియందు నుండఁగూడదని కాఁబోలు నితనియందు హిందూమతద్వేష మను గొప్పదుర్గుణ మొకటి వాసము చేయుచుండెను. మతవిషయమై యీతఁడు హిందువుల ననేకబాధలు పెట్టెను. ఇతఁడు 1517 లో నైహికరాజ్యమును విడిచి వెళ్ళెను. తరువాత నితనికొమారుఁడగు ఇబ్రాహీంలోదీ యనువాఁడు పట్టాభిషిక్తుఁడయ్యెను.

ఇబ్రాహీంలోదీ పరాక్రమహీనుఁడు. ఈతనిరాజ్యమందు నెచ్చటఁ జూచినను బ్రజలు తిరుగఁబడఁజొచ్చిరి. లాహోరులోని సుబేదారుఁడగు దౌలతఖాన్ అనువాఁడు దిల్లీశ్వరునితోఁ బోరాడి తయమూర్ వంశజుఁడైన బాబర్ అనువానిని హిందూదేశము మీఁదికి రప్పించెను. క్రీ. శ. 1526 వ సంవత్సరమందు నేప్రిల్ 21 వ దినమున పానిపత్ కురుక్షేత్రమునందు బాబరునకును ఇబ్రాహీమునకును యుద్ధము జరిగి యందు నిబ్రాహీంలోదీ చంపఁబడియె. హిందూరాజ్యము మోగలుల స్వాధీనమయ్యెను. ఈసంగ్రామమునకు మొదటి పానిపత్తే యుద్ధమనిపేరు.

ఇఁక మోగలప్రభుత్వమును వర్ణింపవలసినది మాకువిధి. కాని యట్లుచేయుటకు, బూర్వ మప్పటిదేశకాల విద్యావర్తకాదులను గుఱించి కొంచెము బ్రాసెదము.

## సింహావలోకనము

గజ్నీమహమూదు 1001 లో నీదేశముమీఁదికి మొదట దండెత్తి వచ్చెను. అప్పటినుండి 1526 లో బాబర్ దిల్లీపట్టణమును స్వాధీనము చేసికొనువఱకు గతించినకాలము 525 సంవత్సరములు. అందు మొదటి 200 సంవత్సరములవఱకును పంజాబులోని కొంతభాగము తప్ప హిందూదేశములోని మఱి యేప్రాంతమును మహమ్మదీయులకు లోఁబడినది కాదు. 1193 లో జరిగిన స్థానేశ్వర యుద్ధము తరువాత నుత్తరహిందూ

దేశము తురుష్కుల స్వాధీనమయ్యెనని చెప్పవచ్చును. 1316 లో మరణముచెందిన అల్లాఉద్దీన్‌ఖిల్జీ రాజ్యము చేయునపుడు దక్షిణహిందూస్థానములోని యనేకప్రాంతములు తురకలచే నాక్రమింపఁబడియె. కాని కృష్ణానదికి దక్షిణము నందున్న దేశ మనేక సంవత్సరములవఱకు మహమ్మదీయులకు స్వాధీనమైనదికాదు.

ఈ అఫ్‌గానుల ప్రభుత్వము క్రమముగా బానిసవంశముతో 1206 లోఁ బ్రారంభమై లోదీశంశముతో 1526 లో సమాప్తము నొందెను. ఈ 320 సంవత్సరములును హిందూదేశమంతయుఁ దురుష్కులచే నొక్కరణరంగముగా మార్పఁబడియె. ఎచ్చటఁ జూచినను, ఎన్నఁడుచూచినను పోరాటములు, యుద్ధములు, రాజవంశములు మాఱుట, ఒక్కరాజ్యము పెక్కురాజ్యములగుట, ప్రాంతాధికారులు తిరుగఁబడి స్వతంత్రులగుట మొదలైన రణప్రసంగములే కానవచ్చును. అందువలనఁ బ్రజలకు నిమ్మళపాటును సౌఖ్యమును లేక యుండెనని వేఱుగఁ జెప్పవలయునా?

## మతద్వేషము

ఒకరిద్దఱు బాదుషాలుతప్ప కడమవా రందఱును హిందువులను హిందూమతమును ద్వేషించుచుండిరి. దానిచేఁ బ్రజలకు మిక్కిలి బాధలు కలుగుచుండెను. బాదుషాలవలన దమకు నెన్నిబాధలు కలిగినను హిందువులు తమమతమును వదిలినవారు కారు. రాజభీతిచే మహమ్మదీయులైనవారు లక్షకొక్కరైనను ఉందురో యుండరో. ఇట్లెన్ని సంకటములకైనను ఓర్చి తమమతమును విడువకయున్నందులకు హిందువుల నెంతయుఁ గొనియాడవలసి యున్నది. పారసీకము తురకస్థానము మొదలైన దేశములలోని జనులందఱును రాజభీతిచే స్వమతమును వదలి మహమ్మదీయమతమును స్వీకరించిరి. కాని యెన్ని సంకటములు వచ్చినను హిందువులుమాత్రము మతభ్రష్టులు కారైరి. ఇంతియకాదు. కాలము పోయినకొలఁదిని హిందువులకుఁ గల పరమతసహిష్ణుతవలన హిందువులకును, మహమ్మదీయులకును సఖ్యతహెచ్చి వా రొక్కగ్రామములో నన్నదమ్ములవలె నుండుట సంభవించెను.

హిందువులకు మతవిషయమై కొంతబాధకలిగినను రాజకీయోద్యోగము లనేకములు వారి కీయబడుచుండెను. భూమిశిస్తుతో సంబంధించిన యుద్యోగములు విశేషముగా హిందువులకే దొరకుచుండెను. వర్తకము కూడ వారే చేయుచుండిరి.

## గ్రామ సంఘములు

యుద్ధములవలన బ్రిజాపీడనము జరుగుచుండె ననియిదివఱకు వ్రాసియున్నాము. కాని పెద్దపెద్ద పట్టణములలో నుండువారికిని, ఆ పట్టణములయొద్ద నుండువారికిని దప్ప పల్లెలలో నుండువారికి యుద్ధాదుల వలన విశేషబాధ లేకయుండెను. పల్లెలలోజనులు రాజకీయాధికారులు వచ్చినపుడు వారి కీయవలసినపన్ను నిచ్చి వారిని బంపి గ్రామములోని వ్యవహారము లన్నియు రాజుతో సంబంధములేకుండ తామే చక్కబెట్టుకొనుచుండిరి. గ్రామములోనికి దొంగలు మొదలగువారు రాకుండ గ్రామస్థులే తగునేర్పాటు చేయుచుండిరి. గ్రామములోని పోరాటములను, వ్యవహారములను, దాయభాగవివాదములను గ్రామములోని పెద్దమనుష్యులే విచారించి తీర్చుచుండిరి. గ్రామములోని జనులు కలహించి తీర్పునకు మఱియొక గ్రామమునకుబోయి యెఱుగరు. ఇట్టి గ్రామసంఘములకే పంచాయితీ లనిపేరు. ఇట్టివి హిందూదేశమందు ననాదికాలమున నుండి మహమ్మదీయ ప్రభుత్వ సమాప్తివఱకు జరిగి ప్రస్తుతప్రభుత్వము వచ్చినతరువాత నడుగంటినవి. ఇప్పటివారు గ్రామస్థులను లక్ష్యపెట్టక మూడురూపాయిల వ్యాజ్యమునకై ముప్పదిసారులు న్యాయస్థానమునకు దిరుగుచు మూడువందలరూపాయిలు వెచ్చించుట మనము చూచుచున్నాము. ఇదియెంతయు శోచనీయము. మనవాండ్రు గ్రామసంఘములను మరల స్థాపించి యిక ముందైనను ఇంటిగుట్టు వెలిపుచ్చకుందురుగాక!

## వర్తకము

రాజ్యములోని యెడతెగని యుద్ధములవలన మధ్య హిందూదేశ ములో వర్తక మంతగాఁ బ్రబలినట్లు కానరాదు. కాని సముద్రపుటొడ్డున నున్న దేశములలో వర్తకము విశేషముగా జరుగుచుండెను. మార్కోపోలో యను వేనిస్ పట్టణపు వర్తకుఁడు హిందూదేశమునకు వచ్చి యుండెను.ఆతఁడు వ్రాసియుంచిన వర్ణనవలన మన మప్పటివర్తకమును గుఱించియు, నితరాంశములను నితఁడు సంస్కృతములో వ్రాయించెను. ఇతఁడు 1699 లో రాజ్యమునకు వచ్చి 1743 లోఁ గాలధర్మము నొందెను.

## దేశభాషల యభివృద్ధి

మహమ్మదీయ ప్రభుత్వ కాలములో హిందీ, బంగాలీ, మరాటీ తెలుఁగు మొదలైన దేశభాషలలో ననేక రసవంతము లయిన కావ్యము లుద్భవించెను. హిందీభాషలోఁ బదునాఱవ శతాబ్దమునందు తులసీదాస్ అనుభక్తుఁడు రామాయణము రచించెను. ఈ గ్రంథము తుల్సీరామాయణ మనుపేర మిక్కిలి విఖ్యాతిఁ జెందియున్నది. వేలకొలఁది హిందుస్థానీ జనులు దీని నెప్పుడును, భక్తితోఁ బాడుచుండెదరు. ఇతఁడీ గ్రంథమును 1575 లోఁ బ్రారంభించెను. ఈకవి 1624 లోఁ గాలధర్మము నొందెను. పదునాఱవ శతాబ్దములో సూర్దాస్, నాభాజీ. కేశవదాస్ మొదలైన కవులు జన్మించిరి. పదునేడవ శతాబ్దములో బిహారీలాల్ అనుకవి సత్ సహాయ్ అను గ్రంథమును రచించెను. ఈకవులందఱును భక్తులు. ఈశ్వరభక్తిచే గ్రంథరచన చేసిరిగాని రాజాశ్రయమువలనఁ గాదు. ఇందుచేతనే హిందీ, బంగాలీ, మరాటీ మొదలైన గ్రంథములలో భక్తిరసమే ప్రధానము. శృంగారరస మంతగా నుండదు. ఇదియే యీ కావ్యములకును, ఆంధ్ర కావ్యములకును గలభేదము.

# మూడవ ప్రకరణము

## దక్షిణములోని మహమ్మదీయ రాజ్యములు

ఇదివఱకు వ్రాయబడిన రెండు ప్రకరణములలో మహమ్మదీయుల యుత్పత్తి మొదలు ఢిల్లీశ్వరు లయిన మోగల చక్రవర్తుల వంశావసానమువఱకు జరిగిన హిందూదేశ చరిత్ర భాగము వర్ణింపఁబడినది. అందు ముఖ్యముగా డిల్లీపట్టణము రాజధానిగాఁగల సార్వభౌమ రాజులను గుఱించియే విశేషము వ్రాయఁబడినది. కాని యీకాలమందే హిందూదేశము యొక్క యనేక ప్రదేశములలో ననేక రాజులు దిల్లీశ్వరులను లక్ష్య పెట్టక స్వతంత్రులుగా రాజ్యము చేసిరి. వారిలోఁ గొందఱు మహమ్మదీయులును, గొందఱు హిందువులును గలరు. అట్టి వారిలో ముఖ్యులయిన రాజులను గుఱించి యీ గ్రంథములో సంక్షేపము గానైన వ్రాసినం గాని మహమ్మదీయ మహాయుగమును మేము పూర్తిగా వర్ణించిన వారము కాఁజాలము.

డిల్లీబాదుషాహలకుఁ బ్రతిస్పర్ధులుగా నున్న మహమ్మదీయ రాజులలో దక్షిణ దేశములోని బహమనీ వంశపు రాజులను, ఆవంశములోనుండి చీలిన గోలకొండ విజాపురము మున్నగు నైదు రాజ్యములును ముఖ్యములైనవి. ఈరాజ్యముల చరిత్రకును ఆంధ్రదేశ చరిత్రకును ఎడతెగని సంబంధము కలదు. కావున నీచరిత్ర భాగమును ఆంధ్రులు చక్కఁగఁ దెలిసికొన వలయును.ఈ మూడవ ప్రకరణములో నీ దక్షిణములోని మహమ్మదీయరాజ్యముల చరిత్ర వర్ణింపఁబడును;

ఉత్తరదేశమందలి మహమ్మదీయ నిరంకుశ ప్రభుత్వమునకు నంకుశములయిన వారు రాజపుత్రులు. కావున వారిచరిత్ర ఆఱవ ప్రక

రణమునందు వర్ణింపఁబడును. దక్షిణములోని తురుష్కరాజులను ఘోర ముగానె దిరించినవారు విజయనగర ప్రభువులు. వీరి యశోవర్ణన నాల్గవ ప్రకరణమందుఁ జేయఁబడును. ఉత్తర దక్షిణదేశములలోని నవాబుల నందఱిని జెదరఁగొట్టి నూతనరాజ్యమును సాధించినవారు మరాఠీవారు. వీరి చరిత్రను సవిస్తరముగాఁ దెల్పుచు నీహిందూదేశ కథా సంగ్రహము యొక్క మూఁడవభాగ మను స్వతంత్ర గ్రంథమొకటి వ్రాయఁబడును. కావునఁ బ్రకృత మనుసరింతము.

## బహమనీ రాజ్యము

(1347 - 1525)

డిల్లీపట్టణములో మహమ్మద్ తుఘ్లఖ్ రాజ్యము చేయుచుండఁగా దక్షిణదేశములో నతని సైన్యాధీశుఁడగు హసన్‌గంగూ అనువాఁడు తిరుగఁబడి స్వతంత్రుఁడయ్యెను. ఈ హసన్‌గంగు అనువాఁడు మొదట డిల్లీపట్టణములో గంగూయను బ్రాహ్మణునియొద్ద బానిసగా నుండెను. ఈ బ్రాహ్మణుఁడు నవాబువద్ద జ్యోతిష్కుఁడుగా నుండెను. ఒకదినము పొలము దున్నుచుండఁగా హసనుకు భూమిలో ధనముదొరకెను. అది వాఁడు తీసికొని పోయి యజమానున కిచ్చెను. వాని సత్యసంధత్వము నకు మెచ్చి యతఁడు వానిని నవాబునొద్దికిఁ దీసికొనిపోయి పదివేల గుఱ్ఱములకు నాధిపత్య మిప్పించెను. "నీకుముందు రాజ్యప్రాప్తియున్నది, అప్పుడు నన్ను మఱువవలదని చెప్పి యాతనిని గంగూబ్రాహ్మణుఁడు పంపివేసెను. మొదట వాఁడు దిల్లీశ్వరునికై యనేక యుద్ధములుచేసి శత్రువులగెలిచి, దిల్లీశ్వరునివలన జాఫర్ ఖాన్ అను బిరుదును వడసెను. అతఁడు 1347 లో అల్లాఉద్దీన్ షాహ అని పేరు పెట్టుకొని స్వతంత్రుఁడయ్యెను.

## హసన్ గంగూ అల్లాఉద్దీన్ షాహ

## (1347 - 1358)

ఇతఁడు తాను రాజయినతరువాతఁ దనపూర్వపు యజమానుఁడగు గంగూ బ్రాహ్మణునిఁ దనకోశాధ్యక్షునిగా నేర్పఱిచెను. అతని జ్ఞాపకార్థమై తనకు హసన్ గంగూ అనియు, తనవంశమునకు బహమన వంశ మనియుఁ బేళ్ళుపెట్టెను. బహమన్, బహ్మన్ శబ్దములు బ్రాహ్మణ శబ్దభవములు. ఇతఁడు మొదటఁ గపటముచేసి దక్షిణదేశములోని హిందూరాజులందఱను తనకు సహాయులగునట్లు చేసి, తనపని యైన తోడనే వారితో స్నేహము చాలించెను. ఇతఁడు హిందూమతద్వేష్టకాఁడు. కలబరగి (గుల్బర్గా) పట్టణమును హసనాబాదని పేరుపెట్టి తన రాజధానిగఁజేసికొనెను. పదునొకండు సంవత్సరములవఱకు రాజ్యముచేసి యీబహమనీరాజ్యసంస్థాపకుఁడు కాలధర్మము నొందెను.

ఈ క్రొత్తరాజ్యము ముఖ్యముగా మహారాష్ట్రదేశములో వ్యాపించెను. దీని కుత్తరమున నర్మదానదియుఁ, బశ్చిమమున సహ్యాద్రి పర్వతమును, దక్షిణమునఁ గృష్ణానదియుఁ, దూర్పున తెలుఁగుదేశమును, గోండువనమును* హద్దులుగానుండెను. ఈరాజ్యముయొక్క పొలిమేరనంటుకొనియే మాళవదేశములోను, ఖాన్‌దేశములోను నూతన మహమ్మదీయరాజ్యము లేర్పడెను. కృష్ణానదికి దక్షిణమునఁ దుంగభద్రాతీరమునందు 1336 లో, అనఁగాఁ గలబురగీలో బహమనీరాజ్యము స్థాపింపఁబడెను. ఇదియె మిక్కిలి ప్రబలి బహమనీరాజ్యమునకుఁ బ్రబల ప్రతిస్పర్థియయ్యెను. కలబురగ పట్టణము విజయనగరమున కుత్తరమునను, ఓరుగంటికిఁ బశ్చిమమునను నూటయేఁబదిమైళ్ళమీఁదనుండెను. బహమనీరాజ్యచరిత్ర యనఁగా వారికిని విజయనగర రాజులకును జరిగిన యుద్ధములవర్ణన.

---

*మధ్యపరగణాలలోని కొంతభాగమునకు గోండువనమనిపేరు.

## మహమ్మద్ షాహ

## (1358 - 1375)

అల్లాఉద్దీనుకు దావూద్ మహమ్మదులను ఇద్దఱుకుమారు లుండిరి. వారిలో మహమ్మదనువాఁడే రాజ్యముచేయవలయునని అల్లాఉద్దీన్ ఏర్పాటుచేసినందున మహమ్మద్ రాజయ్యెను. ఇతఁడు తనపేరిటఁ జేయఁబడిన నాణెములను కరఁగించినందుకు ననేకహిందువులఁ గఠిన ముగా శిక్షించెను. ఓరుగంటి రాజును, విజయనగరరాజును ఒక్కటియై యీతనితో యుద్ధముచేయ సాగిరి. మహమ్మద్ షాహ స్వయముగా యుద్ధమునకుఁబోయి బెల్లముకొండయొద్ద నోరుగంటి యువరాజును సైన్యాధీశుఁడును అగు వినాయకదేవునిఁ జంపెను. అపార సంపత్తి దోఁచుకొని తిరిగివచ్చునప్పు డాతని సైన్యములో ననేకసైనికులు హతులైరి.

దిల్లీబాదుషాహ మీఁదఁ దిరుగఁబడునపుడు హసన్ గంగూకుఁ దా మొసంగిన సాయము తమకే కీడై, యింటిప్రక్క బహమనీరాజ్యమను ప్రబల శత్రుని తెచ్చిపెట్టెనని హిందూరాజుల కప్పుడు తెలియవచ్చెను. అందుచే వారప్పుడు దిల్లీలో రాజ్యముచేయుచున్న ఫిరోజ్ తుఘ్లఖ్ అనువానికి బహమనీ రాజుమీఁదికి దండెత్తి రావలసినదనియు, తాము సాహాయ్య మొనర్చెదమనియుఁ దెలియఁజేసిరి. కాని గృహకలహము లచే వ్యాప్తుఁడైయున్న ఫిరోజ్ యుద్ధమునకు వచ్చినవాఁడుకాఁడు. ఈ వర్తమానము మహమ్మద్ షాహకుఁదెలిసి యతఁ డోరుగంటి మీఁదికి యుద్ధమునకుఁ బోయెను. ఓరుగంటి రాజీదాడి సహింపలేక యతనికి ముప్పదిమూఁడుకోట్ల రూపాయలను గోలకొండ దుర్గమును నిచ్చి సంధి చేసికొనెనని తురుష్కచరిత్రకారులు వ్రాసియున్నారు. కాని మిక్కిలి చిన్నసంస్థానములకు నధిపతియైన వినాయకదేవుఁడు మూఁడుకోట్ల రూపాయి లిచ్చె నన్నమాట నమ్మఁదగినదికాదు. అతని రాజ్యమంతయు నమ్మినను మూడుకోట్లువచ్చునా యని సంశయింప వలసియున్నది. ఇఁక ముందెన్నడును ఓరుగంటి రాజులను బాధపెట్టనని యాతనివలనఁ గాగి

తము వ్రాయించుకొని ఓరుగంటిరాజు మహమ్మద్ షాహకు రత్నములు చెక్కఁబడిన గొప్పసింహాసనమొకటి యిచ్చెనఁట. బహమనీ వంశము లోని ప్రతిరాజు ఆసింహాసనమునే యెక్కి దానిని నూతనరత్నములతో నలంకరించుచుండెను. అది తొమ్మిది యడుగులు పొడవును మూఁడడు గులు వెడల్పును గలిగియుండెను. ఒకప్పుడు దానివెల నాలుగుకోట్ల రూపాయలని లెక్కవేయఁబడెను ।

ఈ రాజు విజయనగరరాజగు కృష్ణరాయనితో యుద్ధముచేయ సాగెను. కృష్ణరాయఁడు బహమనిరాజులది యైన ముద్గలదుర్గమును నాక్ర మించుకొని యచ్చటి తురుష్కులనందఱిని జంపివేసెను. ఈ వర మానము తెలిసి యొకలక్ష హిందువుల సంహరించెదనని మహమ్మద్ షాహ ప్రతిజ్ఞచేసెనట. తరువాత జరిగిన యుద్ధములో విజయనగరరా జోడిపోయెను. డెబ్బదివేల హిందువులు సంహరింపఁబడిరి. ఈయుద్ధము లో విజయనగరమువారు ఫిరంగుల నుపయోగించిరఁట. ఆదవనియొద్ద మరల నొక యుద్ధము జరిగెను. అందు భోజమల్లుఁడనువాఁడు విజయ నగరరాజునకు సైన్యాధీశుఁడుగనుండెను. యుద్ధములో గాయపడి యతఁడు పాఱిపోయినందున నతని సైన్యములు విరిగెను (1366). మహమ్మద్ షాహ అయిదు లక్షల హిందువుల సంహరించి రాయలతో సంధి చేసి కొని వెడలి పోయెనఁట.

పై కథాభాగము పెరిస్తా యనుతురుష్క చరిత్రకారుని గ్రంథము నుండి గ్రహింపఁబడినది. ఈ గ్రంథకారుఁడు నిజము వ్రాయక పక్ష పాతము వహించి హిందువుల యపకర్షమే విశేషముగా వ్రాయుచుం డును. అందువలన నితఁడు వర్ణించినయంశములు నిజమని నమ్ముటకు వీలులేదు. పెనీయఁబడిన కథాంశములోని యొక యసత్యమును జూడుఁ డు. మహమ్మద్ షాహతోఁ బోరాడిన విజయనగరపురాజు కృష్ణరాయఁ డని పెరిస్తా వ్రాసియున్నాఁడు. 1509 వ సంవత్సరము మొదలు1530 వ సంవత్సరమువఱకు రాజ్యము చేసిన కృష్ణదేవరాయఁడు 1358 మొదలు 1375 వఱకు రాజ్యముచేసిన మహమ్మద్ షాహతో నెట్లు పోరాడును ? ఇందువలననే పెరిస్తావ్రాఁతలు నమ్మఁదగినవి కావనియు, మహమ్మదీ

యుల యుత్కర్షము చూపుటకు నతఁడు లేనిపోనికథల నల్లి చరిత్రమని వ్రాసెననియు మన మూహింప వచ్చును.

మహమ్మద్ షాహకు సమకాలీనుఁడు బుక్కరాజు. ఆతనికిని మహమ్మద్ షాహకును యుద్ధములు జరిగెననియు,ఒకప్పుడు వీరును ఒకప్పుడు వారును గెలిచిరనియు, హిందువులు గెలిచినప్పుడు తురుష్కులను, తురుష్కులు జయించినప్పుడు హిందువులను విశేషముగా సంహరించిరనియు మనము పై వర్ణనవలనఁ దెలిసికొన వలెను.

మొత్తముమీఁద మహమ్మద్ షాహ తెలివితో రాజ్యమునేలెను. ప్రజల సుఖదుఃఖముల నెఱుంగుటకై యతఁడు తన రాజ్యములో నప్పుడప్పుడు తిరుగుచుండును. పదునేడు సంవత్సరములు రాజ్యముచేసి యతఁడు 1375 లోఁ గాలధర్మము నొందెను.

1375 మొదలు 1378 వఱకు ముజాహిన్ అనువాఁడును, తరువాత నొక్కసంవత్సరమువఱకు దావూద్ షాహ అనువాఁడును రాజ్యము చేసిరి. ముజాహిద్ షాహ విజయనగరరాజుతోఁ బోరాడి యతని నోడించి యనేక దుర్గముల నాక్రమించి యసంఖ్యధనమును దీసికొని వచ్చెనని ఫెరిస్తా వ్రాసియున్నాఁడు.

## మహమూద్ షాహ

## (1378 - 1397)

ఇతఁడు అల్లాఉద్దీన్ యొక్క కనిష్ఠపుత్రుఁడు. ఇతఁడు దయాశీలుఁడు, సద్గుణవంతుఁడు, న్యాయైకవర్తనిరతుఁడు. ఇతఁడు మహమ్మదీయుఁడైనను ఏకపత్నీవ్రతమును పరిపాలించెను. తాను విద్వాంసుఁడగుటచే నరబ్బీ పారసీక దేశములలోని విద్వాంసుల రావించి గౌరవించుచుండెను. ఇతఁడు పరోపకారకృత్యము లనేకములుచేసెను. పెద్దపెద్ద పట్టణము లన్నింటిలోఁ బాఠశాలలును, అనాథాలయములును గట్టించెను. గ్రుడ్డివారికి మనోవర్తు లేర్పఱిచెను. రాజ్యమునం దంటను బోధ

చేయుటకై మహమ్మదీయమతగురువులను నేర్పఱిచెను. కటువు వచ్చినప్పుడు పదివేలయెడ్లను పెట్టి యితరదేశములనుండి ధాన్యము తెప్పించుచు ప్రజల కందజేకి చౌకగా ధాన్య మిప్పించెను. ఈతని ప్రభుత్వకాలములో యుద్ధాదులు లేక ప్రజలు నెమ్మదియు సౌఖ్యము ననుభవించిరి. ఇతనికి దక్షిణదేశములోని అరిసాటల్ అనిపేరు కలిగెను. ఇతడు 1397 లో గాలధర్మము నొందెను.

ఇతనితరువాత నితనికుమారు లిద్దఱు రాజ్యారూఢు లైరి. కాని కొంతకాలములోనే పదచ్యుతులైరి. ఇతనియన్న యగు దావూద్‌ఖానుని కుమారుడైన ఫిరోజ్‌షాహ సింహాసనాసీనుడయ్యెను.

## ఫిరోజ్‌షాహ

## (1397 - 1422)

ఈతని కాలములో బహమనీ రాజ్యము మిక్కిలి వైభవదశ ననుభవించెను. ఇతడనేకభాషలనేర్చి యుండెను. తన యంతఃపురములో నానాదేశపు స్త్రీలను దెచ్చి యుంచెను. భీమానదియొడ్డున ఫిరోజ్‌బాద్ అను నగరమును గట్టించి యందుదనయంతఃపురస్త్రీలకై యొకమందిరము కట్టించెను. అది యిప్పటికిని మంచిస్థితిలో నున్నది.

ఇతడు రాజ్యము చేయునప్పుడు డిల్లీపట్టణము మీదికి తయమూర్‌లంగ్ దండెత్తి వచ్చెను. అతడు దక్షిణమునకు వచ్చునేమోయని భయపడి యీతడాతనిసార్వభౌమత్వము నొప్పుకొనుచు నాతని యొద్దకు దనరాయబారుల నంపెను. తయమూర్‌లంగ్ అందులకు సంతసించి యీతనికి బహుమతు లంపెను.

కేరళరాజైన నరసింహరాయడీతనితో యుద్ధముచేసి మొదట గొన్ని యుద్ధములలో విజయుడయ్యెను. కాని తుదకు నోడి ఫిరోజ్‌షాహతో సంధి చేసికొనెను.

ఎప్పటివలె విజయనగరరాజులతో యుద్ధము ప్రారంభమయ్యెను. కృష్ణానదియొక్క యుభయతీరములమీఁద నుభయ సైన్యములు విడిసెను. విజయనగరసైన్యము లభేద్యమైనందున తురుష్కులొక మాయోపాయమును బన్నిరి. ఫిరోజ్ సైన్యములోని యొకకాజీ (న్యాయాధికారి) మాఱువేషము వేసికొని యొకబోగము మేళముతోఁ గలిసి విజయనగర రాజపుత్రుని శిబిరమునకుఁ బోయెను.అచ్చట నాటచూచుటలో నిమగ్నుఁడైన రాజపుత్రునిఁ జంపెను. అంత సైన్యములన్నియుఁ గలవరపడి పాఱిపోయెను. తురుష్కులు విజయులైరి. హిందువులు సంధిచేసి కొనవలసిన వారైరి. 1406 లోఁ దురుష్కులు విజయనగరరాజును మఱి యొకసారి యోడించిరి.ఈ నబాబు 1417 లోఁ దెలుఁగుదేశము మీఁదికి దండెత్తిరాఁగాఁ దెలుఁగువా రీతని సైన్యముల నోడించి యితని వజీరుఁడగు మీర్ ఫెజ్ ఉల్లా అనువానిని జంపి, మఱి యన్యవిధముల ననేక బాధలు పెట్టి యదివఱకుఁ దురుష్కులు తమ్ముఁ బెట్టిన బాధలకుఁ బూరిగఁ గసి తీర్చుకొనిరి. ఈ గొప్ప పరాభవముచే ఫిరోజ్‌షాహ మతి పోయి భ్రాంతుఁడయ్యెను. ఇతఁడు 1422 లోఁ గాలధర్మము నొందెను. కేరళ రాజైన నరసింహరాయఁడును, విజయనగరపు దేవరాయఁడును తమ యాఁడుబిడ్డల ఫిరోజ్‌షాహకిచ్చి వివాహము చేసిరని ఫెరిస్తా వ్రాసినాఁడు. కాని యీహిందూద్వేష్టయొక్క మాట సాక్ష్యంతరము లేనిది మనము నమ్మఁటకు వీలులేదు.

## ఆహమ్మద్ షాహవల్లి

(1422 - 1435)

వీఁడు ఫిరోజ్‌షాహ తమ్ముఁడు. వల్లీ యనఁగా సాధువని యర్థము. ఇతఁడు మహమ్మదీయ సాధువుల మిక్కిలి మన్నించి వారికనేక వర్షాశనము లిచ్చినందున నితని కీపేరువచ్చెను. ఫెరిస్తా కల్పిత కథప్రకార మీతఁడు కేరళ విజయనగర రాజుల నోడించెను. 1424 లో నోరుగంటిమీఁదికి దండెత్తిపోయి యప్పటిరాజును జంపి యారాజ్యము

నంతను నాక్రమించు కొనెను. అనేక హిందువుల బలవంతముగా దురు
ష్కులఁ జేసెను. అతని కారాజ్యములో రత్నములగని దొరికెనఁట. అది
పరిపేలగని యని యనేకుల యభిప్రాయము. 1426 లో మాళవదేశపు
సుల్తానుతోఁ బోరాడి యాతఁడు విజయుఁ డయ్యెను. బేదర్ పట్టణ మొకటి
కట్టించి యప్పటికిఁ దనరాజధానిని మార్చెను.

## అల్లాఉద్దీన్ షాహ
## (1435 - 1457)

ఇతఁడు బేదర్ పట్టణములోనే రాజ్యారూఢుఁ డయ్యెను. 1443
లో నితనికి విజయనగరము వారికిని మూఁడు ఘోరమైనయుద్ధములు
జరిగి తుద కీతఁడే విజయుఁ డయ్యెనని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు.
ఇతఁడు శంకరరాయ్ అను మరాటాసరదారుని మీఁదికిఁ దనసైన్యము
లంపఁగా నాతఁడును సిర్కేయను మఱియొక మరాటా వీరుఁడును కలసి
తురుష్కసైన్యములో నొక్క సైనికుఁడైన లేకుండ నందఱిని నటికి
వేసిరి.

ఈతనియొద్ద నున్న తురుష్కసరదారులలో దఖ్కనీ తురుష్క
లనియు, పరదేశీ తురుష్కలనియు రెండుతెగ లేర్పడెను. వీరిపోరాటము
లోనే బహమనరాజ్య మంత మొందెను. దఖ్కనీతురుష్క లనఁగా
బహుకాలమునుండియు దక్షిణ దేశమునందే కాఁపురముండిన తురు
ష్కులు. అట్లుగాక క్రొత్తగా అరబ్బీ పారసీకాది దేశములనుండి వచ్చిన
వారు పరదేశీ తురుష్కులు.

అల్లాఉద్దీన్‌షాహ మంచి మాటకారి యనియు ధూర్తుఁడగు రాజ్య
కర్త యనియు, విద్యాభోక్త యనియుఁ బేరొందె 1457 లోఁ గాలధర్మము
నొందెను.

ఇతని తరువాత 1457 మొదలు 1463 వఱకు హుమాయూన్
షాహ నిజాంషాహ లను నిద్దఱురాజులు రాజ్యముచేసిరి. వారిరాజ్యకాల
ములో విశేషములంతగా లేవు.

## రెండవమహమ్మద్ షాహ

## (1463 - 1482)

ఇతఁడు రాజ్యమునకు వచ్చినప్పుడు తొమ్మిదిసంవత్సరముల వాఁడు. ఇతని రాజ్యకాలములో మహ్మూద్ గావాన్ అనువాఁడు ముఖ్య మంత్రిగానుండి యన్ని వ్యవహారములను జక్కఁబెట్టుచుండెను. ముహమ్మద్ షాహ చరిత్రయంతయు నీమహ్మూద్ గావాన్ చరిత్రతో నిండియున్నది. ఈ మహ్మూద్ గావాన్ స్వామిభక్తపరాయణుఁడగు రాజకార్య ధురంధరుఁడని విఖ్యాతి వడసెను. కావున నితనిచరిత్ర యిచ్చటఁ గొంచెము వివరముగా వ్రాయఁదలఁచినారము.

## వజీర్ మహ్మూమ్మద్ గావాన్

ఇతఁడు పారసీకదేశములో జన్మించెను. ఇతనివంశజు లచ్చటి మంత్రులుగా నుండిరి. సుల్తాన్ తహమస్ప్ అనువాఁడు తన్నుఁ జంపునేమో యని మహ్మూద్ గావాన్ స్వదేశమును విడిచి వర్తకము నిమిత్తమై వెడలెను. అనేకదేశములు తిరిగి యచ్చటచ్చటి విద్వాంసులతో స్నేహము చేసెను. నలువదిమూఁడు సంవత్సరముల వయసుగలవాఁడై యుండఁగా దక్షిణ హిందూదేశములోని విద్వాంసులఁ జూచుటకై దాభోళ అను మరాటీదేశమందలి రేవులో దిగి బీదర్ పట్టణమునకుఁ బోయెను. అచ్చటినుండి డిల్లీపట్టణమునకుఁ బోఁదలఁచెను. కాని యతని యలౌకికగుణములను జూచి అల్లాఉద్దీన్ షాహ యతనికి నౌకసరదారు పని యిచ్చెను. అతఁడు స్వపరాక్రమముచేఁ గ్రమక్రమముగా నభివృద్ధి చెంది ముఖ్యమంత్రి యయ్యెను. అతని యౌదార్యమును గుణంచిన విఖ్యాతి ఆసియాఖండములో యన్ని దేశములలోను ప్రసరించి యందువలన యనేకవిద్వాంసులకు ఫలప్రాప్తి యయ్యెను. అతఁడు స్నేహప్రియుఁడు, న్యాయ విచారణయందు మిక్కిలి పేరొందిన వాఁడు, గొప్ప కవి, గణిత శాస్త్రములో మిక్కిలి ప్రవీణుఁడు. బీదర్ పట్టణములో నతఁడు తన ధనముతో భవ్యమైన పాఠశాల యొకటి కట్టించెను.

1467 లో మాళవ దేశపు సుల్తాను దక్షిణ దేశము మీదికి దండెత్తి వచ్చెను. అతనితో బోరాడి గావాన్ ఆతని నోడించెను.

కొంకణ దేశములో దాభోళ్, చౌల్, జున్నర్, కోలాపూర్, వాంఝా మొదలైన ప్రదేశము లన్నియు నదివఱకే బహమనీ రాజులకు లోబడెను. కాని మరికొందఱురాజులు లోబడక యుండిరి. అట్టి రాజులలో విశాలగడమను నామాంతరముగల ఖేళణాయను గడమునకు నధిపతియైన శంకరరాయడొకడు.అతనిని మఱి యితరులను జయించుటకై 1469 లో మహ్మూద్ గావాన్ గొప్ప సైన్యమును వెంటదీసికొని వెడలెను. శంకరరాయడు సముద్రము వఱకు రాజ్యమును మూడువందల యోడల సముద్ర సైన్యమును గలిగినవాడగుటచే మహమ్మదీయ వరకులను మిగుల బాధించుచుండెను. అందుచే నతనితో రెండుసంవత్సరములవఱకు ఘోరముగా బోరి మహ్మూద్ గావాన్ ఖేళణా దుర్గమును నాక్రమించు కొనియె. విజయనగరము వారి రాజ్యములోనిదియగు గోవా పట్టణమును ఆతడు 1473 లో నాక్రమించుకొనెను. ఇట్లు సముద్రము నంటుకొనియున్న కొంకణ దేశమంతయు దురుష్కులపాలయ్యెను.

పైని వర్ణింపబడిన విజయముల వలన మహ్మూద్ గావానుని కీర్తి విస్తరించెను. షాహ యతనిని మిగుల గౌరవించి యధిక సంపత్తి యొసంగెను. కాని యతడు విరకుడగుటచే నాధనమంతయు బీదలకుబంచి పెట్టి యతడు బీదవానివలెనే యుండజొచ్చెను.

ఓడ్ర దేశపురాజైన అంబరరాయడనువానిని అతని తమ్ముడగు మంగళరాయడు మిగుల బాధపెట్టుచుండెను. 1471 లో మహమ్మద్ గావాన్ అంబరరాయనికి సాహాయ్యముచేసి వాని తమ్ముని నోడించి వాని వలన కొండపల్లి, రాజమహేంద్రివరములను మహమ్మద్ షాహ కిప్పించెను. ఈ యుద్ధములో ననేక మహమ్మదీయసరదారులు తమ తమ శౌర్యములజూపి విఖ్యాతులై గొప్ప గొప్ప యధికారముల వడ

సిరి. నిజాం ఉల్‌ముల్క్ అను బిరుదుగల మలిక్ హసన్ బహీరీ యను వాఁడు తెలుఁగు దేశమునకు సుబేదారుఁ డయ్యెను. ఇమాద్ ఉల్‌ముల్క్ అను బిరుదుగల దర్యాఖానుఁడు వరాడ్ (Berar) దేశమునకు సుబేదారుఁ డయ్యెను. యూసూఫ్ ఆదిల్‌ఖానుఁ డనువాఁడు దౌలతాబాదునకు సుబేదారుఁ డయ్యెను. ఇతఁడు ఖాన్‌దేశములోని యనేక ప్రదేశములను గెలిచి బహమనీ రాజ్యమలోఁ గలిపెను. ఈ సరదారు లందఱును పరదేశీయులైన తురుష్కులు. అందుచే వీరియుత్కర్షమును జూచి దఖ్కనీ తురక లోర్వలేక పోయిరి. 1472 లో బేల్‌గాం రాజైన వీరకర్ణరాయఁడు గోవాపట్టణమును దీసికొన యత్నించెను. కాని మహమ్మద్ షాహ యతని మీఁదికిఁ బోయి బేల్‌గాము నాక్రమించుకొనియెను. అచ్చటి నుండి తిరిగి వచ్చునప్పుడు మహమ్మద్‌షాహ తల్లియైన మాయీరాణి కాలధర్మము నొందెను. ఆకాలపుస్త్రీలలో నీమె కొనియాడం దగినది. 1473-74 వ సంవత్సరములలో దక్షిణదేశమందు గొప్ప కటివు తటస్థించెను.

మహమ్మదీయ సైన్యములు 1477 లో ఓఢ్రదేశము మీఁదికిని, కర్ణాటాంధ్ర దేశముల మీఁదికిని దండెత్తిపోయి క్రొత్తదేశముల నాక్రమించుకొనియెను. కొంచీ దేవాలయమును దోఁచుకొని యపారసంపత్తిని దీసికొని వచ్చెను. ఈకార్యము లన్నియు మహమ్మద్ గావాన్‌యొక్క శౌర్యముచేతనే జరిగినందున మహమద్ షాహకు నతనియందుఁ బ్రేమ హెచ్చెను. "విస్తీర్ణమైన రాజ్యమును మహమ్మద్ గావాన్‌వంటి మంత్రియు ననురెండపూర్వవస్తువు లీశ్వరుఁడు నాకు దయతలఁచి యిచ్చె" నని షాహ చెప్పుచుండెను. ఇట్లు గావాన్ మాహాత్మ్యము హెచ్చుచున్నందున నతనికి ననేక శత్రువులు కలిగిరి.

ఇతరసరదారుల ద్వేషము హెచ్చుటకు మఱియొకకారణముఁ గలిగెను. గావాన్ కాలమున రాజ్యవిస్తార మెక్కుడయ్యెను. అందుచే రాజ్యము చిన్నదిగా నున్నప్పుడు అల్లాఉద్దీన్ హసన్‌గంగూకాలములోఁ జేయఁబడిన రాజ్యవ్యవస్థయంతయు మార్పవలసి వచ్చెను. పూర్వము

రాజ్యమంతయు నాలుగు సుబాలుగా విభజింపఁబడెను. ప్రస్తుతము మహమ్మద్ గావాన్ రాజ్యమును ఎనిమిది సుబాలుగా విభజించెను. ఆయా యధికారులు నడచుకొనవలసిన నియమమును దృఢముగా నేర్పఱిచెను. అంతకుఁ బూర్వము సైనికులకు సరియైన జీతమియ్యక యధికారులే ధనమంతయు నపహరించు చుండిరి. ముందటు జరుగకుండఁ దగిన నిబంధన లేర్పఱుపఁబడెను. అందుచే నంతకుఁ బూర్వము నిరంకుశులుగా నుండిన యధికారుల కందఱికి మహమ్మద్‌గావానునిపై కోపము హెచ్చెను.

రాజ్యములోని న్యాయసైన్య విద్యాదానాది విషయములనుగూడ మహమ్మద్‌గావాన్ సంస్కరించెను. భూములు కొలిపించి రైతు లీయవలసిన పన్నును స్థిరపఱిచెను. 1440 వ సంవత్సరములో బహమనీరాజుల సైన్యమునకు ముట్టుచుండిన జీతము 1830 లో నింగ్లీషువారి సైన్యములకు నీడేశములో ముట్టుచుండిన జీతముకంటె నెక్కుడుగానుండెను. ఇదియునుగాక యాకాలమందు నిప్పటికంటె రూపాయి వెల యెక్కుడుగా నుండెను. 1470 లో 500ల గుఱ్ఱపు సైన్యము నుంచుటకు సంవత్సరమునకు 3,15,000 రూపాయలు వ్యయమగుచుండెను. 1830 లో నంత సైన్యమునకే 2,19,000 రూపాయలు మాత్రము వెచ్చింపఁబడుచుండెను. సొంత గుఱ్ఱమును ఆయుధములునుగల గుఱ్ఱపు రౌతునకు 1470 లో నెలకు 40 రూపాయలు వేతనము ముట్టుచుండెను. అట్టివానికి 1830 లో 20 రూపాయలుమాత్రి మిచ్చుచుండిరి. ఇట్లు గావాన్, రాజ్యములోని యన్ని వ్యవహారములను చక్కఁబెట్టెను. రాజ్య తంత్రములోని యొక్కొక శాఖవారి కృత్యములను ఇతర శాఖలవారు పరీక్షించునట్లు కట్టు దిట్టములు చేయఁబడినందున రాజ్యములోని యధికారులకు నన్యాయము చేయుటకు వీలులేదయ్యెను.

గావానుని యధికారము హెచ్చిన కొలఁదిని శత్రువులుగూడ హెచ్చిరి. వారందఱును ఒక కుట్రపన్నిరి. మహమ్మద్‌షాహ మీఁదికి దండెత్తి రావలసినదని ఓఢ్రరాజునకు మహమ్మద్‌గావాన్ ఒక యుత్త

రము ప్రాసినట్లును, దానిని వారలు తోర్వలో బట్టుకొనినట్లును కథ కల్పించి, యొకయసత్యపు టుత్తరమును షాహకు జూపించిరి. అప్పుడు వాడు తప్పుద్రాగియుండి గావానును తనయొద్దకు బిలిపించి మూర్ఖుడై చంపించెను (1481). అప్పుడాతనివయస్సు 78 సంవత్సరములు. తాను నిరపరాధినని యెంతచెప్పినను షాహ వినినవాడు కాడు. తుదకు నిటి దుష్కృత్యమువలన నీ కీర్తికి గళంకమువచ్చి నీరాజ్యము పోగలదని చెప్పి యతడు ప్రాణములువిడిచెను. షాహ తన్ను బిలిపించినప్పుడు అతనియొద్దకు బోవలదని యెందఱుమిత్రులు చెప్పినను వినక తన సత్యసంధత్వమునే నమ్మి యతడు షాహయొద్దకు బోయెనట.

## మహమ్మద్ గావాను యోగ్యత

ఇతడు హిందూదేశమందలి సత్పురుషులలోను, సన్మంత్రుల లోను ఒక్కడని చెప్పవలసియున్నది. ఆకాలమందు హిందూదేశమం దలి తురుష్కులలో నంత విద్వాంసుడును రాజకార్యనిపుణుడును లేడని చెప్పవచ్చును. స్వార్థసాధనమునం దెంతమాత్రమును దృష్టిలేక రాజ కార్యమే పరమార్థముగానెంచి యకృత్రిమస్వామిభక్తితో నితడు రాజ్య కార్యములను నడపెను. ఇద్దఱు బాలరాజుల కాలములో నితడు మంత్రిగా నుండి వారినిబెంచి పెద్దవారినిజేసి బాగుపఱిచెనేగాని సొంతమునకేమి యు లాభమును సంపాదించిన వాడు కాడు. ఇతని వలననే యభివృద్ధిం జెందిన సరదారు లనేకులు రాజద్రోహులై స్వతంత్రులైరి. అట్టిస్థితిలో నీతనికి స్వలాభమునందుగోర్కె యుండినయెడల బహమనీ రాజ్య మంతయు నాక్రమించుకొనుట యసాధ్యముకాదు. కాని రాజభక్తియే ప్రధానముగాగల యీమహాత్ముడు గ్రుడ్డి గవ్వయైన నన్యాయముగా సంపాదించిన వాడుకాడు. ఔదార్యము, నిష్పక్షపాతము, యుద్ధనై పుణ్యము, న్యాయబుద్ధి, పరోపకారచింత, స్వామిభక్తి మొదలైన యనేక సద్గుణములతో విభూషితుడైనందున జరిత్ర గ్రంథములలో నీతని కీర్తి యజరామరమై యున్నది. ఇతని సత్వగుణప్రాధాన్యము జూపుటకై చరిత్రకారులెన్నియో యితిహాసములు ప్రాసియున్నారు. ఇతడు ప్రతి

దినమును బీదర్ పాఠశాలకుఁబోవును. కొంకణదేశ దిగ్విజయమునుండి తిరిగి వచ్చినప్పుడు మహమ్మద్ షాహయు నతని తల్లియు నెదురేగి యత నికి స్వాగతమిచ్చిరి. షాహ తన యొంటిమీఁదియంగీ దీసి గావానునికిఁ దొడిగెను. రాజమాతయు నతనిని గౌరవించి యపరిమితసంపత్తునిచ్చెను. వారు వెడలిపోయిన తరువాత మహమ్మద్ గావాన్ తన యిల్లులోనికిఁ బోయి యేడ్వసాగెను. గ్రామములోని బీదల నందఱినిఁ బిలిపించి వారి కాధనము పంచిపెట్టెను. అట్లేలచేసితివని లోకులడుగఁగా "రాజు స్వయ ముగా నన్నుఁ జూచుటకు వచ్చినందునను, రాణి నన్ను అన్యాయని పిలిచినందునను నేను వివేక భ్రష్టుఁడనైతిని. అందువలన నాకు మిక్కిలి చింతకలిగి దుఃఖమునకుఁ గారణమైన యీసొత్తును నేనందఱికిఁ బంచి పెట్టితిని" అని జవాబు చెప్పెనఁట! ప్రతి శుక్రవారమును మాఱువేషము వేసికొని యాతఁడు పట్టణములోఁ దిరుగుచు లోకులకు దాన ధర్మములు చేయుచుండెను. దూరదేశమునందున్న విద్వాంసులకుఁగూడ నాతఁడు బహుమతులు పంపుచుండెను. రాజుచే నక్రమముగఁ జంపఁబడిన మహ మ్మద్ గావానుని యోగ్యత యిట్టిది.

గావానునియొద్ద ధనమపరిమితముగా నున్నదని షాహతలఁచి యతని ధనాగారమును స్వాధీనముచేసికొనెను. కాని యతనికి ధనము లభించినదికాదు.గావానునియొద్ద రెండుబొక్కసము లుండెను.ఒకటిరాజుకు సంబంధించినది.రెండవది బీదలది.మొదటి బొక్కసములో సైన్యవ్యయ మునకై నిలిచియున్న 15000 రూపాయ లుండెను. రెండవదానిలో 300 లుండెను.ఇవిగాకయతనియొద్ద దొరకిన వస్తువులు శయనించుటకు నుంచు కొనిన రెండుచాపలు,వంటసాలలోనున్న మృత్పాత్రిలు పుస్తకాలయములో మూఁడువేల పుస్తకములుండెను.ఆపుస్తకములన్నియు నతఁడు పాఠశాలకు నిచ్చి వేసెను.ప్రతి దినమును తనభోజనమునకై రెండు రూపాయలు తీసి కొని మిగిలిన ధనమంతయు దానముచేయుచుండెను.పాతసీకదేశమునుండి వచ్చునప్పుడు నలుబదివేల రూపాయ లాతఁడు వెంటఁదీసికొని వచ్చెను. దానితో వర్తకముచేయుచు వచ్చిన లాభమంతయుఁ బరోపకారములో

వెచ్చించెను. ఈ యంశములన్నియు షాహకు చక్కఁగఁదెలిసి, యత నికిఁ దాఁజేసినకృత్యమునకై మిక్కిలి పశ్చాత్తాపము కలిగి యతఁడా చింతతోఁ ద్వరలోనే మృత్యుముఖమునఁ బడెను.

## మహమ్మూద్ షాహ

(1482 - 1518)

ఈతని కాలములో బహమనీరాజ్యము వినాశముచెందెనని చెప్ప వచ్చును. ఇతని యాస్థానమందలి దఖ్కనీ పరదేశీతురుష్కుల కలహములు ముదిరి రాజధానిలో నిరువది దినములవఱకు రక్తపాతము జరుగుచుండెను. సుబేదారులందఱును స్వతంత్రులై వేఱువేఱు రాజ్యముల నిరంకుశలుగాఁ బరిపాలింపసాగిరి. ఈరాజు మిక్కిలి వ్యసనాసక్తుఁడై నందున నితనియాజ్ఞ నెవఁరును వినరైరి. ఇతఁడు 1518 లోఁ గాల ధర్మమునొందెను. ఇతని ప్రభుత్వకాలములోనే బహమనీ రాజ్యములో నుండి యైదురాజ్యము లేర్పడెను. వానిపేర్లు:—1. బేదర్‌లోని బేరీద్ షాహీ, 2. వరాడ్ దేశములోని ఇమాంషాహీ, 3. అహమ్మద్ నగరము లోని నిజాంషాహీ, 4. విజాపురములోని ఆదిల్‌షాహీ, 5. గోలకొండ లోని కుత్బ్‌షాహీ.

మహమ్మూద్‌షాహకు తరువాత 1526 వఱకు ముగ్గురు నలుగురు బహమనీ రాజులైరి. కాని వారందఱును రాజ్యములేని రాజులు; సేవకులు లేని ప్రభువులు. స్వతంత్రులైన సుబేదారుల నాశ్రయించుకొని జీవనము గడుపుకొనిరి. కావున వారిని గుఱించి విశేషము వ్రాయనక్కఱలేదు.

ఇఁక బహమనీరాజ్యములోనుండి చీలిన యైదురాజ్యముల చరిత్ర సంగ్రహముగా వ్రాయఁబడును.

## 1. బేదర్‌లోని బేరీద్ శాహి

(1492 - 1656)

బహమనీరాజ్యమునకు రాజధానియైన బేదర్‌లో 1492 లో కాసీం జేరీద్ అనువాఁడు స్వతంత్రముగా రాజ్యముచేయఁ దొడఁగెను. ఈ కాసీం మొదట మహమ్మద్ షాహయొద్ద బానిసగానుండెను. ఆ సుల్తాను కాల ములో మరాటావారు తిరుగఁబడినప్పుడు కాసిం మిక్కిలి శౌర్యముతో వారి నణఁచినందున రాజానుగ్రహమునకుఁ బాత్రుఁడై సరదారుఁ డయ్యెను. ఇతఁడు 1504 వ సంవత్సరమువఱకు రాజ్యముచేసెను. ఈ వంశములోని రెండవరాజు అమీర్ బేరీద్ అనువాఁడు. ఇతఁడు 1549 వఱకు రాజ్యముచేసెను. ఇతని రాజ్యములోఁ గొంతభాగము విజాపూర్ రాజు తీసికొనినందున నాలుగైదు లక్షలుచెల్లు రాజ్యముమాత్ర మీతనికి నిలిచియుండెను. మూఁడవరాజు అలీబేరీద్‌షాహ. ఇతఁడు 1569 వఱకు రాజ్యముచేసెను. ఈవంశములో షాహ బిరుదును ధరించిన మొదటిరా జీతఁడు. ఇతని రాజ్యములోఁ గొంతభాగము అహమ్మద్‌నగర రాజైన నిజాంషాహ తీసికొనెను. 1569 వఱకు నితని ప్రథమపుత్రుఁడైన ఇబ్రా హీం బేరీద్‌షాహయును, 1572 వఱకు నితని చిన్నకొమారుఁడైన రెం డవకాసీం అను వాఁడును రాజ్యముచేసిరి. క్రమక్రమముగా నీరాజ్యము చిన్నది యగుచువచ్చెను. 1656 లో ఔరంగ్‌జేబ్ దక్షిణదేశమునకు సుబే దారుగా వచ్చినప్పు డీ రాజ్యమును బూర్తిగా నాశమొందించెను. మహ మ్మద్ గవానునిచే 1478 లో గట్టింపఁబడిన పాఠశాలామందిరమును ధ్వంసముచేసెను.

## 2. వరాడ్ దేశములోని ఇమాంశాహి

(1484 - 1582)

ఈవంశస్థాపకుని పేరు ఫత్తే ఉల్లాఇమాద్ షాహ. ఇతఁడు మొదటఁ దెలుఁగు బ్రాహ్మణుఁడు. విజయనగర రాజ్యములోనివాఁడు. తురుష్క రాజ్యముమీఁదికి దండెత్తిపోయినప్పుడు వీనిని జెఱపట్టి

తెచ్చి వీనికి మహమ్మదీయదీక్ష యొసఁగిరి. అప్పటినుండి వీఁడు మహమ్మద్‌గావాన్‌యొక్క యనుగ్రహమువలనఁ గ్రమక్రమముగ నభివృద్ధి చెంది ఇమాద్ ఉల్‌ముల్క్ అను బిరుదును వరాడ్ దేశమునకు సుబేదారు నధికారమును బడసెను. ఇతఁడు 1484 లో స్వతంత్రుఁడై ఇమాద్ షాహ యనుబిరుదు వహించి యా సంవత్సరమునందే కాలధర్మము నొందెను. ఇతని కుమారుఁడగు అల్లాఉద్దీన్ ఇమాద్‌షాహ 1484 మొదలు 1527 వఱకు రాజ్యముచేసెను. ఇతఁడు గావిల్‌గడమను గ్రామమును తన రాజధానిఁ జేసికొనెను. ఈకోట మిక్కిలి కఠినమైనచోటఁ జక్కఁగఁ గట్టఁబడియున్నది. అచ్చటఁ గట్టఁబడిన మసీదిప్పటివఱకును చెక్కుచెదరకయున్నది. ఈ రాజునకును నిజాంషాహి రాజునకును వైరము వచ్చి యితఁడు ఖానదేశ గుజరాత్ దేశముల రాజులసాయము వడసెను. అందుకు వారి కీతఁడు తనరాజ్యములోని కొన్నిగ్రామముల నిచ్చెను.

అల్లాఉద్దీన్ ఇమాద్‌షాహయొక్క కుమారుఁడైన దర్యా ఇమాద్ షాహ అనువాఁడు నిజాంశాహీరాజులతో సంబంధబాంధవ్యములు చేసెను. ఇతని రాజ్యకాలములో యుద్ధాదికము లేమియులేక ప్రజలు నెమ్మదిగానుండిరి. అల్పవయస్కుఁడగు నీతనికొమారుఁడు రాజ్యమునకు రాఁగా తోఫల్ ఖానుఁడను ధూర్తుఁడగు సరదారుఁడొకఁడు రాజ్యము నాక్రమించుకొనియెను. 1572 లో మూర్తిజా నిజాంషాహ అనువాఁడు దండెత్తివచ్చి తోఫల్‌ఖానుని ఇమాద్‌షాహ వంశజులను జయించి వరాడ్ దేశమంతయు నిజాంషాహీ రాజ్యములోఁ గలుపుకొనియె.

## 3. అహమ్మదనగరపు నిజాంశాహి

(1489 - 1637)

అహమ్మద్‌నిజాంషాహ (1489 - 1508) విజయనగరములో తిమ్మప్ప బహిరూ (భైరవుఁడు) అను నొకబ్రాహ్మణుఁడు కలఁడు. అతని కొక కుమారుఁ డుండెను. తురుష్కులు దండెత్తివచ్చినప్పుడు వానిని బట్టుకొనిపోయి తురుష్కునిఁజేసిరి. వాఁడు మహమ్మద్

గావాన్‌యొక్క యనుగ్రహమును బడసి గొప్పయధికారముల సంపా
దించి మలీక్ నాయాబ్ నిజాండుల్‌ముల్క్ బహిరీ యను బిరుదావళులతో
గలిసిన పేరు గలవాడయ్యెను. వానికుమారుడగు అహమ్మద్ షాహ
స్వతంత్రుడై అహమ్మద్ నగరము రాజధానిగా నూతన రాజ్యమును
స్థాపించెను. స్వతంత్రుడగుటకు బూర్వ మతడనేక దుర్గములను
జయించెను. అందు శివనేరిదుర్గ మొకటి. ఆదుర్గములో నతనికి ధనము
దొరకెను. తరువాత నతడు చందన్‌వందన్, లోహగడము, తోరణా
మొదలైన దుర్గము లనేకములు సాధించి రాజాపురమువఱకు గొంకణ
దేశమును స్వాధీనపరచుకొనెను. తరువాతికాలములో నీ దుర్గము
లన్నియు శివాజీచే గెలువబడి నందున మిక్కిలి విఖ్యాతి జెందినవి.
అహమ్మద్ నిజాంషాహ జున్నర్ అను పట్టణములోనుండి రాజ్యమును
చక్కగా నేలుచుండెను. ఇతడు తన ప్రజలకు నెట్టిభయమును లేకుండ
బాలించెను. అందుచే నతని రాజ్యములోని నొకచోటినుండి మఱియొక
చోటికి బంగారము నెగరవేసికొనుచు పోయినను భయములేకుండెను.
ఇతనిని గెలిచి యితనిగర్వ మణగవలయునని బహమనీ రాజు
యత్నించెనుగాని యాతడే యోడిపోయెను. ఇతడు 1494 లో
అహమ్మద్ నగరమునుగట్టించి దానినే తనరాజధానిని జేసికొనెను;
దౌలతాబాదను దుర్గమును ముట్టడించి సాధించెను. ఇతడు 1508 లో
గాలధర్మము నొందెను. ఇతని సద్గుణములను వర్ణించుటకు నే నస
మర్థుడనని ఫెరిస్తా వ్రాసియున్నాడు. ఇత డేకపత్నీవ్రతమును
బాలించెను. ఇతని ప్రభుత్వకాలములో లోకులు కుస్తిపట్లుపట్టుట సాముగ
రడీలుచేయుట మొదలైన పౌరుష సూచకములగునాటల విశేషముగా
నేర్చుకొనసాగిరి. ఈరాజు మహమ్మదీయుడైనను హిందూవంశజు
డెనందున నితని సద్గుణములకు హిందువులుగూడ సంతసింపవలసి
యున్నది.

బుర్‌హాన్ నిజాంషాహ (1508-1553). ఈతడహమ్మద్
షాహ కుమారుడు. రాజ్యారూఢుడయినప్పు డీతడేడుసంవత్స

13)

రములవాఁడు. మఖమలఖానుఁ డనుమంత్రి యీతనికి విద్యనేర్పెను. ఇస్మాయిల్ ఆదిల్‌షాహాయొక్క కూఁతు నీతనికిచ్చి వివాహముచేసిరి. అయినను మామయల్లుండ్రకుఁ బోరాటకలిగి యల్లుఁడే యోడిపోయెను. ఇమాద్‌షాహిరాజుతో యుద్ధము జరిగి యందుఁగూడ నీతనికె పరాభవము కలిగెను. తుదకీ మహమ్మదీయరాజుల కందఱికిని సఖ్యము కలిగెను. ఈతనియొద్ద గంబరశేనుఁడను బ్రాహ్మణుఁడు చాలా కాలము వఱకు ముఖ్యమంత్రిగ నుండెను. గుజరాథ్ దేశపు రాజునకును ఈతనికిని స్నేహముకలిగెను. మరాటావా రీతనిప్రభుత్వకాలములోనే ప్రసిద్ధికెక్కసాగిరి. సంభాజీచిట్‌నీ ననువాని కీరాజు 'ప్రతాప్‌రావ' ను బిరుదునిచ్చి, యీతనిని పరరాజులయొద్ద రాయబారిగా నేర్పఱిచెను. విజయనగరము నేలుచున్న రామరాజు 1530 లో నీరాజు మీఁదికి దండెత్తి యీతనిని నోడించెను. తరువాత నితఁడు రామరాజుతో స్నేహముచేసి యీతని సాహాయ్యముఁ దీసికొని విజాపుర రాజులపైన ననేకపర్యాయములు దండెత్తిపోయెను. ఈషాహకు నైదుగురు పుత్రులుండిరి. ఈతఁడు 1553 లోఁ గాలధర్మము నొందెను.

హుసేన్ నిజాంషాహ (1553 - 1565). ఈతని ప్రభుత్వకాలములో నన్నదమ్ములకు వివాదములు కలిగెను. విజాపుర గోలకొండ విజయనగరరాజు లీతనిమీఁదికి దండెత్తివచ్చిరి. వారిదాడి కోర్వలేక యీతఁడు వారితో సంధిచేసికొనెను. రామరాజు తురుష్కులందఱిని మిక్కిలిబాధ పెట్టినందున విజాపుర గోలకొండ అహమదనగరములోని తురుష్కరాజు లందఱును ఒక్కటైరి. హుసేన్ నిజాంషాహకు చాంద బేబీ యనుకూఁతు రుండెను. ఆమెను ఆదిల్ షాహాకిచ్చి వివాహము చేసెను. తరువాత నీ తురుష్కరాజు లందఱును గలిసి 1565 లో తాలికోట యుద్ధమందు రామరాజు నోడించిరి. ఈ వర్తమానమంతయు విజయనగరరాజ్యచరిత్రలో సవిస్తరముగా వర్ణింపఁబడును. ఈరాజు నొద్ద నాఱువందలఫిరంగు లుండెనఁట.

మూర్తజానిజాంషాహ (1565 - 1586). ఈతఁడు చిన్నవాఁడుగా నున్నప్పు డీతనితల్లియగు ఖుజాసుల్తానా యనునామె రాజ్యము

చేసెను. ఈతఁడు 1569 లో స్వయముగా రాజ్యముచేయఁ దొడఁగెను. విజాపురంమీఁదికి యుద్ధమునకుఁబోయి వారిసైన్యాధీశుని నీతఁడు చంపెను. వరాడ్ (బీరార్) దేశపురాజును, సైన్యాధీశునిఁజంపి యా రాజ్యము నాక్రమించుకొనియెను. ఖాన్‌దేశపు సుల్తానుని నోడించి యాతఁడు కప్పము కట్టునట్లు చేసెను. ఈతఁడు విశ్వాసపాత్రుఁడును స్వామిభక్తుఁడును అగు తన మంత్రి ననావశ్యకముగాఁ జంపించెను. ఈమంత్రి పేరు చంగీజ్ ఖానుఁడు.

ఈ నవాబు తరువాత మిరన్ హుసేన్ - ఇస్మాయిల్ నిజాం షాహలను నిద్దఱు సుల్తానులు 1586 మొదలు 1591 వఱకు రాజ్యము చేసిరి. తరువాత రెండవబురాణ్ నిజాంషాహ అనువాఁడు నాలుగు సంవత్సరములు (1591 - 1594) రాజ్యముచేసెను. ఈ ప్రభుత్వముల కాలములో ఆస్థానమందలి సరదారులకోఁ గలహాములు మెండయ్యెను. దక్షిణదేశీయులు పరదేశీయులు అని రెండుకక్షలుపుటి యెవరికి నధికారము వచ్చినప్పుడు వా రితరులను బాధపెట్టఁ జొచ్చిరి. 1594 లో మియాన్ అంజూ అనువాఁడు అహమ్మద్ అనువానిని సుల్తానును జేసెను.

## చాందబీబీ

అహమ్మదనినవాఁడు నిజాంవంశజుఁడు కాఁడని వాదముద్భవిల్లెను. అందుచే మిఆన్ మంజూ అనువాఁడు అక్బర్‌పాదుషాహ కుమారుఁడగు మురాద్ అనువానిని తన సహాయమునకుఁ బిలిచెను. ఇట్లు మోగలులు అహమద్ నగర రాజ్యమును ఆక్రమింగుటకు సిద్ధులయి వచ్చిరి. కాని యిప్పుడు చాందబీబీ యనుశూరవనిత యా రాజ్యమును తన శౌర్యోత్సాహములచేఁ గాపాడి యజరామర కీర్తిని సంపాదించెను. ఈ ప్రసంగపు వర్ణనయు, నీమెచరిత్రమును కీర్తిశేషురాలయిన సౌ. భండారు అచ్చమాంబయక్కగారి గ్రంథములోనుండి గ్రహించుచున్నాఁడను.

"ఈ శూరవనితకు నిజామ్‌షాహిలో మూఁడవపురుషుఁడగు హుసేన్ నిజామ్‌షాహ తండ్రి. ఆదిల్ షాహిలో నాల్గవపురుషుఁడగు అల్లీ ఆదిల్ షాహ భర్త. వీరిరువురికిని పరస్పర కలహములు కలిగియుండెను. కాని అహమ్మద్ నగర విజపూరు. గోలకొండలకుఁ బ్రభువులయినతురకషహాలు కూడి విజయనగరము దండు వెడలుటకు నిశ్చయించుకొనిన కాలములో, అహమ్మద్ నగరమునకు నధిపతియయిన హుసేన్‌షాహ, విజాపురమున కధిపుఁడయిన అల్లీ షాహతో సఖ్యము చేయఁ దలఁచి తనకూఁతురగు చాందబీబీని నతనికిచ్చి వివాహము చేసెను. తదనంతరము తాలికోటలో క్రీ. శ. 1565 వ సంవత్సరమునం దీమహమ్మదీయులకును విజయనగరాధీశ్వరుఁడగు రామరాజునకును యుద్ధముజరిగి విజయనగర సంస్థాన మడుగంటె ననుసంగతి హిందూ దేశ చరిత్రము చదివినవారి కందఱకును విదితమేగాని స్త్రీలగు చదువరులకు నీషాహీలసంగతి దిన్నఁగాఁ దెలిసినంగాని ప్రస్తుత చరితము బోధపడదుగాన వాని వివరము, నిందుఁ గొంత సంగ్రహముగాఁ దెల్పెద :—

క్రీ. శ. 1526 వ సంవత్సరమున బ్రాహ్మణీ రాజ్యమను తురక రాజ్య మంత్యదశకు వచ్చెను. అప్పుడు దక్షిణమున నైదుగురు తురుష్కులు స్వతంత్రులయిరి. వారికో విజాపురమునందు రాజ్యము చేయువారిని 'ఆదిల్ షహాల' నియు, గోలకొండయందలి రాజుల వంశమును 'కుదుబ్ షహాల' నియు, వర్హాడ (బీరారు) రాజులను 'ఇమాద్ షహాల' నియు అహమ్మదనగర ప్రభుత్వమువారిని 'నిజామ్‌షహాల' నియు, అహమదాబాదు నందలి వారిని 'బరీద్ షహాల' నియు వాడుచుండిరి. కాని కొన్నిదినములయిన పిదప 'ఇమాద్ శాహి' 'బరీద్ శాహీలు' రెండును నాశమునొంది 'ఆదిల్ శాహి' 'నిజామ్‌శాహి' 'కుతుబ్ శాహీలు' మూఁడుమాత్రము నిలిచెను. శాహి యనగాఁ రాజ్యమనియు శాహయనఁగా రాజనియు నర్థము.

భర్త జీవితకాలమునందు చాందబీబీయొక్క చాతుర్యమంతగాఁ దెలియకుండెను. ఈమె భర్తయగు అల్లీ మిగులభోగముల ననుభవించుచు

రాజ్యమునం దెంతమాత్రము దృష్టిలేక యుండెను; ఇట్లుండఁగా క్రీ. శ. 1580 వ సంవత్సరమునం దొకదినమునం దాతఁడు అజాగ్రత్తగానున్న సమయంనం దొకఁ డకస్మాత్తుగా నతనిఁ జంపెను. తదనంతర మాతని తమ్మునికొడుకగు రెండవ యిబ్రాహిమ్ ఆదిల్‌ఖాహ సింహాసనారూఢుఁ డయ్యెను. అతఁడు 9 సంవత్సరముల బాలుఁ డగుటవలన నాతని పెత్తండ్రి భార్యయగు చాందబీబీయే కమీల్‌ఖానను మంత్రిసాహాయ్యము వలన రాజ్యము నేలుచుండెను. కొన్ని దినము లయినవెనుక కమీల్ ఖానునకు రాజ్యకాంక్ష మిక్కుటమయ్యెను. దానింగని చాందబీబీ కీశ్వరఖానను సరదారుని సాహయ్యముచే వానిఁ జంపి కీశ్వరఖానునకు దివాన్‌గిరి నిచ్చెను. కాని కొంతకాలమునకు వాఁడును గృతఘ్నుఁడయి రాణిమీఁదఁ గొన్నిదోషముల నారోపించి యామెను సాతార కిల్లాలో కైదుచేసియుంచెను. చాందబీబీని కైదుచేసినపిదప కీశ్వర్‌ఖాను రాజ్యమునం దంతటను విశేషసంక్షోభము చేయసాగెను. దాని నెవరును మాన్పలేక యుండఁగా యెకసాల్‌ఖానను సిద్దీసరదారుఁ డొకఁడు వాని నచటినుండి వెడలఁగొట్టి చాందబీబీని విడిపించి తెచ్చెను. తదనంతర మామె యెకసాల్‌ఖానును వజీరుగా నేర్పఱిచి రాజ్యము నేలుచుండెను. అప్పుడాతఁడు ప్రాతఁ నౌకరుల నందఱిని దీసి క్రొత్తవారిని నియమించెను. అక్కాలమునందు విజాపురమునందలి జనులు మంత్రిత్వము ఉన్‌ఉల్‌ముల్క్ సిద్దీకియ్యవలెనని కొందఱును, అబ్దుల్ హసనను దఖ్‌నీతురకకియ్యవలెనని మఱి కొందఱును ఇట్లు రెండుపక్షములుగా నుండిరి.

ఇట్లు రాజ్యములో నంతఃకలహంబులు జరుగు చుండఁగా మూర్తి ఖా, నిజామ్‌ఖాహ, కులీకుతుబ్‌ఖాహ వీరిద్దఱును అహమ్మద నగరముపైకి దండువెడలి దానిని సమీపించిరి. అప్పుడచటఁ ప్రజలలో బొత్తిగా నైకమత్యము లేకయుండి నందున వైరులకు మిగుల యుక్తిగా లోకులను సమాధానపఱిచి అబ్దుల్ హసనునకుఁ బ్రధానిత్వమిచ్చి రెండు పక్షముల వారిని నొకటిగాఁజేసి శత్రువులు మరలిపోవునట్లు చేసెను.

శాహలు తమతమనగరముల కరిగినపిదప దిలార్‌ఖానను సిద్ది మిక్కిలి గర్వించి అబ్దుల్‌హసనును జంపించి తానే ప్రధానియయ్యెను.

ఇట్లీరాజ్యమున నొకసంవత్సరముపై నాఱుమాసములలో ముగ్గురు మంత్రులైనను నొకఁడైన నెగ్గకుండెను. దిలార్‌ఖాన్ సిద్ది మిగుల చాతుర్య వంతుఁడైనందున నతఁడు తనకు రాజ్యకాంక్ష కలిగియు దానిని వెలిపుచ్చక మిగుల జాగరూకుఁడయియుండెను. ఇతఁడు రాజ్యవ్యవస్థను మిక్కిలిచక్కఁగాఁ జూచెనుగాని చాందబీబీ యపట నుండిన తనయాట లేమియు సాగవని తెలిసికొని ఇబ్రాహిమ్ ఆదిల్‌షహా చెల్లెలగు ఖదీజా సుల్తానాయను రాజపుత్రిని మూరి జానిజామ్ శాహ కొడుకగు మిరాన్ హుసేనుని కిప్పించి క్రీ. శ. 1574 వ సంవత్సరమున ఖదీజా సుల్తానాకుఁ దోడు చాందబీబీని నిజామ్‌షాహికిఁ బంపి బాలరాజును నాశ్రయహీనునిఁ జేసెను.

చాందబీబీ నిజామ్‌షాహికి వచ్చినపిదప నచట నైదాఱు సంవత్సరములలో మూర్తి జానుజంపి యాతని కొడుకగు మిరాన్ హుసేనును, అతనినిఁజంపి యాతని పినతండ్రియగు బురాణశాహయును, అతని వెనుక నాతని పుత్రుడగు ఇష్మాయెల్ శాహయును, తదనంతర మాతని తమ్ముఁడగు ఇబ్రాహిమ్ నిజామ్‌షహాయును రాజ్యముచేసిరి. ఇబ్రాహిం మరణానంతరమునం దతని పుత్రుఁడగు బహదూర్‌ను కారాగృహము నందుంచి మి ఆన్ అను దక్షిణీ తురకమంత్రి నిజామ్ షాహిలోని వాఁడని చెప్పఁబడు అహమ్మ దనువానిని సింహాసనముపై నుంచి తానే రాజ్యముచేయ మొదలుపెట్టెను. ఈ అహమ్మదునకు రాజ్యము నిచ్చుట సిద్ది సరదారుల కిష్టములేక బహదురునకు సమవయస్కుఁడగు నొక బాలునిఁదెచ్చి వానినే రాజ్యార్హుఁడని చెప్పఁదొడఁగిరి. ఇట్లు వారు రెండు పక్షములవారై సైన్యసహితులగుటఁ గని మిఆన్ మంజూ మిగుల చింతించి అక్బర్‌బాదుషా కొడుకగు మురా దనునాతనికి మీరు నాకు సాయము చేసినచో అహమ్మదనగరము మీ స్వాధీనము చేయుదునని వర్తమానమునంపెను. కాని మురాద్ సైన్యసహితుఁడయి వచ్చులోపల

అహమ్మదనగరమునం గల రెండుపక్షముల వారికి యుద్ధముజరిగి సిద్ధీలను మిఆన్ మంజూ ఓడించెను. కాని దానిన ప్రకారము అహమ్మదనగరము మురాదునకీచ్చుటకు సమ్మతింపఁడయ్యె. అంత నా రాజపుత్రుఁడు యుద్ధసన్నద్ధుఁడయ్యెను.ఆసమయమున నీ ప్రధాని సైన్యము నంతను ఆదిల్‌షహా, కుతుబ్‌షహాలను సహాయమునకుఁ బిలువఁబోయెను. ఆతఁడరిగినపిదప బహాదుర్ రాజ్యమని చాటించి చాందబీబీ రాజ్యమును తానే నడపుచుండెను.

ఆసమయమునం దిద్దరు ముగ్గురు రాజ్యము తమకే కావలయునని యనుటవలన నచటి జనులు రెండు మూడు పక్షములుగా నుండిరి. ఇట్టి సమయమున చాందబీ తన దృఢనిశ్చయమును విడువక, నేహంగ ఖానునకు నుషహా అల్లీ సిద్ధీకిని వర్తమానముల నంపి వారిని రాజధానికిఁబిలువనంపెను. చాందబీబీ యాజ్ఞాప్రకారమున వారిరువురును వచ్చుచుండఁగా త్రోవలో శత్రువులు వారిని రానీయక నిలిపిరి. నేహంగ ఖాన్ మాత్రము శత్రుసైన్యము నుపాయముగాఁ జీల్చి రాజధానిం బ్రవేశించెను.

ఆదిల్‌షాహా, కుతుబ్‌షహాలు మురాదుని రాక విని, అతఁడు ప్రథమమునందు నిజామ్‌షాహిని గెలిచి పిదప తమపైకి వచ్చునని భయపడి విపులసైన్యములతో నిజామ్‌షాహీకిఁ దోడుగా వచ్చుచుండిరి. ఈ సంగతి విని మురాద్ వారు వచ్చినచో గెలుపొందుట కష్టమని తలఁచి గ్రామమును చుట్టుముట్టి బురుజులను బడఁగొట్ట యత్నించుచుండెను. మురాద్ సైనికులు బురుజులను బైటినుండి త్రవ్వి గూడుచేసి యా గూఁటిలో తుపాకిమందునుంచి దానికి నగ్నిని ఁరవులుకొల్ప యత్నించుచుండిరి. కాని చాతుర్యవతియగు చాందబీబీ లోపలనుండి బైటివరకు రంధ్రములు పొడిపించి వారా గూటిలోనుంచు మందు నీవలికిఁ దీయించుచుండెను. ఇంతలో వా రొకబురుజునకు నిప్పంటించినందున నా బురుజుతోఁగూడ ననేక సైనికులు నాశమునొందిరి. అంత నాత్రోవను మొగలులు పట్టణములోనికిఁ జొరనుంకింపఁగా నదివఱ కధిక శౌర్యముతో యుద్ధము చేయుచున్న నిజాము సైన్యములు ధైర్యమును విడిచి పాఱఁ

దొడ్డగెను. అప్పుడు చాందబీబీ ధైర్య మవలంబించి, కవచమును ధరియించి మోముపై ముసుకువేసికొని చేత ఖడ్గమును ధరియించి "నాబొందిలో ప్రాణము లుండగా పట్టణము పగవారిచేఁ జిక్కనీయ" నని కూలిన బురుజు వైపునకుఁ బరుగెత్తెను, దానింగని సైనికు లధికశౌర్య సాహసములు గలవారలై మరలి శత్రువులతోఁ బోరసాగిరి. ఆ దినమంతయు యుద్ధము జరిగెను. గాని చాందబీబీ శత్రువులను పట్టణములోనికిఁ జొరనీయకుండెను. అప్పు డామె యెక్కడఁజూచినను దానెయై బహుశౌర్యముతోఁ బోరాడెను. ఆ సమయమునందలి యామె శౌర్యమునుగని శత్రుసైనికులు సహిత మాశ్చర్యపడిరని ప్రత్యక్షముగాఁ జూచిన యొక సైనికుఁడు వర్ణించెను. అప్పుడు మురాద్ తనకు గెలుపు దొరకుట దుస్తరమని తెలిసికొని "మాకు వర్హాడప్రాంతము నిచ్చిన యెడల మేము మా దేశమునకుఁ బోయెద" మనిచాందబీబీకి వర్తమానమంపెను. త్వరగా రాజ్యమునందలి యితరసైనికులువచ్చి తనకుఁ దోడుపడు లక్షణము లేమియు నగపడనందున వర్హాడప్రాంతము చాందబీబీ వారికినిచ్చి సంధి చేసికొనెను.

తదనంతర మామె బహాదుర్‌ను కారాగృహమునుండి విడిపించి తెచ్చి యత్నికిఁ బట్టాభిషేకముఁ గావించెను. అంత నామె అహమ్మదఖానను నాతని ప్రధానిగా నేర్పరిచి యా పిల్లవానిపేర తాను రాజ్యము నేలుచుండెను. కాని అహమ్మదుఖానునకు రాజ్యకాంక్ష మిక్కుటమైనందున అతఁడు చాందబీబీ మాటను సాగనీయకుండెను. ఈ సంగతి సైనికులకుఁ దెలియఁగా వా రాతనిఁబట్టి బంధించి చాందబీబీ స్వాధీనము చేసిరి. తదనంతర మాతనిపని నేహంగఖానను నాతని కిచ్చినందున చాందబీబీ రాజ్యము సురక్షితముగా నేలఁదొడగెను. కాని త్వరలోనే నేహంగఖాను రాణికి వైరియయ్యెను. ఈ సమయముననే మురాద్ కాలము చేసెను. అంత నగ్బరుపాదుషా తన చిన్న కొమారుఁడగు డానియల్ అను నాతనిని మురాద్ పనిమీఁదికిఁబంపి యతనికి వజీరునిగా ఖాన్ ఖానను వానిని బంపెను. అప్పు డక్బరు బర్హాణపురమునకు వచ్చి

డానియల్‌ను క్రీ. శ. 1599-వ సంవత్సరమున అహమ్మదు నగరముపైకి యుద్ధమున కంపెను.

ఈసమయమునందు నిజామ్‌షాహీలో మిగుల నవ్యవస్థగా నుండెను. చాందబీవంటి చాతుర్యవతి రాజ్యము చేయుచున్నను ఆసమయమునందామెకు నచట నిశ్వాసార్హులగు వారెవ్వరును లేకయుండిరి. కాన నామె యేమియుఁ జేయలేక యుండెను. నేహంగఖాను చాందబీబీతో నేమో యాలోచించి వైరులను ప్రోవలో నాటంకపఱుపఁబోయెను. కాని శత్రివులాతఁడుండుప్రోవను రాక మరియొకప్రోవతోవచ్చి పట్టణమును ముట్టడించిరి. అప్పుడు చాందబీబీ తనయాజ్ఞను వినువారెవ్వరునులేక యప్పటికి రాజధానిని విడిచి బాలరాజును గొనిపోవ నిశ్చయించెను. కాని యామె సమీపముననుండు హమీద్‌ఖాను వాని కాయాలోచన సరిపడక చాందబీబీ పగవారికి రాజ్యమిచ్చుచున్నదని యూరంతటను జాట మొదలుపెట్టెను. అది విని దక్షిణీతురకలు నిజమని తలఁచి హమిద్‌ఖానును ముందిడుకొని కొందఱు భటులు చాంద బీబీ యంతఃపురముఁజొచ్చి యామెను జంపిరి. ఇట్లు హిందూస్థానపు ఇతిహాసములోఁ బ్రసిద్ధురాలయిన స్త్రీరత్నముయొక్క చరిత్రము ముగిసెను. ఈమె ప్రథమమునందు విజాపురమున మరఁది కొమారుఁడగు ఇబ్రాహిమ్ ఆదిల్‌షహా చిన్నతనమున నతని కొరకు ఆదిల్ షాహిని రక్షించెను. పిమ్మట అహమ్మద్ నగరమునఁ దనతమ్ముని మనుమఁడగు బహదురుకొఱకు నిజామ్‌షాహీ సంరక్షణమును మిగుల కుశలతతోఁ జేసి సార్వభౌముఁడగు అక్బరుయొక్క కుమారుని సైన్యములను దిరుగ గొట్టెను. కాని తుదకు రాజ్యమునం దింతటను మూర్ఖు లుండుటవలన నామె యోగ్యత నెఱుగక మిగుల నన్యాయముగా నామెను జంపిరి. నేఁటివరకును దక్షిణమున స్త్రీలశౌర్యమునుగూర్చి ప్రసంగించు నప్పుడు అచటివారు చాందబీబీయొక్క శౌర్యమునే ప్రథమమున శ్లాంఘింతురు.

చాందబీబీ విషయమై యొకచరిత్రకారుఁ డిట్లు వ్రాసియుంచినాఁడు: "దక్షిణ హిందూదేశములో జన్మించిన పరాక్రమ వంతులలో

నీమె యొకతె. ఆమెవంటి స్త్రీరత్నము లుద్భవించుట యరుదు. ఆమె రూపమునందుఁ జక్రనిది. అల్పవయస్సులోనే భర్తృవియోగదుఃఖము ప్రాప్తించినను, మరణమువఱకును పవిత్రాచరణమునందె దృష్టి కలిగి యుండెను. అహమ్మదనగర విజాపుర రాజ్యములోఁ బ్రసంగము వచ్చినప్పుడు తన కర్తవ్యము నీమెచేసెను. ఆమె యప్రతిమశౌర్య మనేక పర్యాయములు ప్రజ్వలించెను. ఆమెకు దుఃఖప్రదమగు మరణము ప్రాప్తించినందులకు నందఱు జనులును చింతించెదరు, నేఁటివరకును ఆమెను సన్మానపూర్వకముగా స్మరించెదరు."

చాందబీబీచే రాజుచేయఁబడిన బహాదుర్ షాహాను మోగలులు ఆగ్రాకోటలోఁ జెరఁబెట్టిరి (1600). ఇంతటితో నహమ్మద్ నగరరాజ్య మంతరించెనని చెప్పవచ్చును. కాని యా రాజ్యములోని కొందరు సరదారులు మూర్తజా అనువానికిఁ బట్టాభిషేకముచేసి యహమ్మదనగర రాజ్యమును మరికొన్ని దినములవరకు రక్షింప యత్నించిరి. అట్టి సరదారులలో వజీర్ మలిక్ అంబర్ అనువాఁడు ముఖ్యుఁడు.

## మలిక్ అంబర్

ఇతఁడు హబ్షీ (Abyssinian) జాతివాఁడు. మొదటి మూర్తజా నిజాంషాహయొక్క మంత్రియగు చంగీజ్ ఖానునియొద్ద నీతఁడు మొదట సరదారుగానుండి యభివృద్ధిఁ జెందెను. పైని వర్ణించినట్టు మోగలులు 1600 లో నహమ్మదనగర రాజ్యమును గెలిచిన తరువాత నీతఁడు దౌలతాబాదు దుర్గమునకు నాఱుమైళ్ళమీఁద ఖడకీ యను గ్రామములో గొప్పమందిరములు కట్టించి, రాజవంశములోని మూర్తజాయనువానికిఁ బట్టముకట్టి, యాగ్రామమును నిజాంషాహివారి రాజధానినిజేసెను. ఈ పట్టణమునకే తరువాతి కాలములో ఔరంగజేబు అవరంగాబాద్ అని పేరు పెట్టెను. మలిక్ అంబర్ వద్ద గొప్ప గొప్ప మరాటా సరదారులుకూడ నుండిరి. శివాజియొక్క పితామహుఁడగు మాలోజిభోన్సలే, మాతామహుఁడగు లఖూజీ జాధవరావు ఇతనియొద్ద సరదారులుగా

నుండిరి. వీరి నందరిని సహాయులుగాఁ దీసికొని, మాలికాంబర్ మోగ లుల నోడించి వారాక్రమించుకొనిన రాజ్యమును తిరిగి సంపాదించెనుఁ. దిల్లీశ్వరుని సరదారుఁడగు ఖానఖానాన్ అనువాని నోడించి అహమ్మద నగరము స్వాధీనము చేసికొని, వానిని బరహాణ్ పురమువరకును వెడలఁగొట్టెను. తరువాత నాతఁడు దేశస్థితిని బాగుపఱుపఁ జొచ్చెను. నిజాంషాహిలోని భూములన్నియుఁ గొల్పించి, భూముల యాదాయము లనుబట్టి పన్ను లేర్పరిచెను. ఉత్తరదేశములో రాజా తోడరమల్లుఁడు చేసిన యేర్పాటు లీతఁడు దక్షిణమునఁజేసి ప్రజల యాశీర్వచనమునకుఁ బాత్రుఁడయ్యెను. గ్రామము లిజారా కిచ్చు పద్ధతి మానివేసెను. ఏరయి తెంతపన్ని వ్యవలయునో స్పష్టముగాఁ దెలిసినందున నుద్యోగస్థులు వానియొద్దనుండి యెక్కుడు పన్ను తీసికొనుటకు వీలులేకపోయెను. కొన్ని సంవత్సరములవఱకుఁ బన్ను లేకుండ భూములనిచ్చి యనేక భూముల నమరక పరిచెను. అందుచేఁ బ్రజలు బాగుపడి పన్నులు తప్పక యీయసాగిరి.

గుజరాత్ దేశపు సుబేదారుఁడగు అబ్దుల్లాఖానుఁడు వచ్చి పోరాడ నాతనిని మలికంబర్ ఓడించెను. అందుమీఁద 1617 లో జహాంగిర్ బాదుషా తన కుమారుఁడగు షాహజహాన్ అనువానిని మలిక్ అంబర్ మీఁదికి ముందుపంపి తానును దండెత్తివచ్చెను.

మరాటీ సరదారు లనేకులు చీలి మోగలులలోఁ గలిసిరి. అందుచే మలికంబరుఁడోడి దిల్లీశ్వరునకు నహమ్మదనగరమును, కొంతరాజ్యము నిచ్చెను. షాహజహాన్ కాశ్మీరమునకుఁబోఁగా మలికంబర్ తానోడిన రాజ్యమును మరల సంపాదించెను. తరువాత నీ వర్తమానము తెలిసి షాహజహాన్ మరలవచ్చి పోయిన రాజ్యమును తిరిగి జయించెను అట మీఁద మలికంబర్ ఢిల్లీశ్వరునితోఁ బోరాడలేదు. స్నేహభావముతోడనె యుండెను. తన శక్తి కొలఁదిని పడిపోవుచున్న నిజాంషాహి రాజ్యమును కాపాడెను. ఈ మంత్రిపుంగవుఁ డెనుబదిసంవత్సరములు బ్రతికి 1626 లోఁ గీర్తిశేషుఁడయ్యెను. స్వామిభక్తి, రాజ్యచాతుర్యము, న్యాయ

ప్రవర్తనము, ఈశ్వరభక్తి, ఔదార్యము, శౌర్యము లనుగుణములకై యీతఁడు జగద్వంద్యుఁడనుటకు సందేహములేదు.

మలికంబర్ మరణానంతరమున నిజాంషాహియొక్క యాస్థాన మందు ననేక కలహములు కలిగెను. షహాజీ మొదలయిన మరాటీ సర దారులు తిరుగఁబడిరి. 1629 లో గొప్ప కఱవు వచ్చినందున ననసంఖ్య ప్రజాక్షయమై రాజ్యమంతయుఁ బాడుపడెను. కొలఁదికాలములోనే మోగలసైన్యములు దండెత్తి వచ్చెను. 1633 లో నహమ్మద నగర రాజ్యము మోగలులు స్వాధీనము చేసికొనిరి. బాలరాజును తీసికొనిపోయి ఢిల్లీపట్టణములో జెరఁబెట్టిరి.

ఇంతయైనను మరియొక కుప్రవానిని రాజునుజేసి నిజాంషాహిని నిలువఁబెట్టవలయునని శివాజి తండ్రియగు షహాజీభోన్సలేయను మరాటీ సరదారుఁడు 1633 మొదలు 1637 వరకు యత్నించెను. కాని తుదకు నాతఁడును మోగలులకోడి విజాపురము వారియొద్ద సరదా రయ్యెను.

## 4. విజాపురములోని ఆదిల్ శాహి.

## (1489 - 1686).

ఈ రాజవంశము రమారమి రెండువందల సంవత్సరములవరకు ప్రభుత్వముచేసెను. దీనికి మూలపురుషుఁడు యూసుఫ్ ఆదిల్ శాహ అనువాడు. ఈతఁడు 1489 మొదలు 1510 వరకు రాజ్యముచేసెను. ఈతఁడు తురుకస్థానములోని యొక గొప్పవంశములోని వాఁడని కొం దఱు చరిత్రకారులు వ్రాసియున్నారు. 1459 లో నితఁడు హిందూదేశము నకు వచ్చి మహమదు గవాన్ వద్ద నుద్యోగములో ప్రవేశించి క్రమ క్రమముగా నభివృద్ధిచెందెను. ఇతఁడు విజాపురమునకు సుబేదారుగా నుండి బహమని వంశజుఁడగు మహమ్మదుషా మృతిచెందిన తరువాత

స్వతంత్రుఁడయ్యెను. ఈతఁడు విజాపురములో ననేక సుందరమందిరము లను గట్టించి యీ పట్టణమునకు మిగుల వన్నె తెచ్చెను. ఇతఁడు తన జీవితకాలమంతయు యుద్ధమును జేయుచు నెక్కుడురాజ్యము సంపాదిం చెను. ఇతని రాజ్యమునకు నుత్తరమున నీరానదియు, దక్షిణమున తుంగ భద్రానదియు, తూర్పున భీమా కృష్ణానదులును, పశ్చిమమున గోవా మొదలు బొంబాయివరకునున్న పశ్చిమసముద్రమును పొలిమేరలై యుండెను. 1510 లో పోర్చుగీసువారి స్వాధీనతలోనున్న గోవాపట్టణము సాధించెను. ఇతఁడు 76 సంవత్సరములవరకు బ్రతికి 1510 లోఁ గాల ధర్మము నొందెను.

యూసుఫ్ ఆదిల్‌ఖాహతోఁ బోల్చుటకు మహమద్‌గవాన్ తప్ప సమకాలీనపురుషుఁడు మరియొకఁడులేడు. ఇతని శౌర్య విద్యావ్యవహార చాతుర్యములను సద్గుణములు వర్ణనీయములు. ఇతఁడు ముసద్దీ పని స్వయముగా చేయుచుండెను. మతవిషయమై హిందూ మహమ్మదీయుల యెడల సమభావము కలిగియుండెను. హిందువులమీఁదను విశేషముగా మహారాష్ట్రులమీఁదను ఇతనికి నెక్కుడనుగ్రహముకలదు. వారి కితఁడు గొప్పయుద్యోగముల నొసఁగెను. రాజ్యవిషయిక మైన దప్తరవంతయు మహారాష్ట్రభాషలోనే వ్రాయుడని యాజ్ఞాపించెను. విజాపురదుర్గమును ఈతఁడేకట్టించెను, ఇతని మరణానంతర మితనికుమారుఁడగు ఇస్మాయిల్ రాజయ్యెను.

ఇస్మాయిల్ ఆదిల్ ఖాహ (1510—1534)-తండ్రి పోయినపుడితడు 9 సంవత్సరములవాఁడు. ఇతనిపాలకుఁడగు కమాల్‌ఖానుఁడితనినిఁ జంప యత్నించెను. కాన రాజమాతచే నాతఁడే చంపింపఁబడియె. బేదర్, వరాఢ్, అహమద్‌నగర్ రాజ్యములలోని రాజులును బహమనీరాజును గలిసి, యితనిమీఁదికి దండెత్తివచ్చిరి. కాని యుక్తిననుసరించి యితఁడు వారిలో మిత్రభేదముకల్పించి, వారి నందరి నోడించెను. పోర్చుగీసువారు గోవా పట్టణమును తీసికొనిరి. 1520 లో కృష్ణదేవరాయలవా రీతని స్వాధీనతలోనున్న రాయచూర్ దుర్గమును అనన్య

సామాన్య పరాక్రమముతో స్వాధీనము చేసికొనిరి. అప్పు డాదుర్గమును విడిపించుటకై యిస్తాయిల్ ఆదిల్‌శాహా గొప్ప సైన్యముతో వెళ్ళెను కాని కృష్ణరాయని శౌర్యమునకుఁ దాళలేక పూర్తిగఁ బరాభూతుఁడై తిరిగిచూడక పాటిపోయెను. ఈ కథాభాగము కృష్ణరాయని చరిత్రలో వివరముగా వరింపఁగలము. ఇతఁడు బేదర్‌రాజైన బుర్‌షాన్ బేరీద్ శాహాను బూర్తిగానోడించెను. ఇతఁడు 1534 లో మరణమునొందెను. ఇతఁడు విద్వాంసుఁడు. దయావంతుడు, న్యాయదృష్టి గలవాడు, రసికుడు, కావ్య ప్రియుఁడు. తన యుద్ధభటులతోఁగూడి యితడు కష్టముల కోర్చి పాటుపడుచుండెను.

## మొదటియిబ్రాహీం ఆదిల్ శాహా (1534—1557)

ఇస్తాయిల్ పోయినతరువాత నాతని పెద్దకుమారుఁడగు మల్లు అనువాఁడు రాజయ్యెను. కాని వాఁడు దుర్వ్యానాసక్తుఁడగుటచే సరదారు లాతనిఁ దొలగించి యాతని తమ్ముఁడగు ఇబ్రహీమును సింహాసనాసీనునిఁ జేసిరి. ఇతఁడు మహమ్మదీయులలోని షియాపంథమును వదలి సునీపంథమును స్వీకరించెను. పరదేశీయులగు తురుష్కుల సైన్యములోనుండి తొలఁగించెను. వారందఱును విజయనగరమునకుఁ బోయి యచ్చటి రాజునొద్ద సైనికులుగానుండిరి. ఇతనికిఁ బూర్వమున్న సుల్తానుదప్తరు నంతయుఁ బారసీలోనికి మార్చియుండెను. దాని నితఁడు మరల మరాటిలోనికి మార్చెను.

అనేక మరాటావారికి గొప్ప గొప్ప యుద్యోగముల నొసఁగెను. అప్పటినుండియే మరాటావారు మిగుల నభివృద్ధిఁజెందిరి. ఇతఁడు విజయనగరమును పాలించుచున్న రామరాజుతోఁ బోరాఁడి యాతని నోడించెనని మహమ్మదీయ గ్రంథకారులు వ్రాసియున్నారు. 1543 లో నిజాంశాహ, కుతుబ్ శాహ, రామరాజులు కలిసి, యితని రాజధాని మీఁదికివచ్చిరి. అప్పుడితనిమంత్రియగు సదఖానుడు యుక్తిచే నిజాం శాహ రామరాజులతో సంధి చేసికొని కుతుబ్ షాహతోఁ బోరాడి యాతనినోడించి గోలకొండకు బారఁదోలెను. కొన్నిదినములలోనే యిబ్రాహింశాహకు నిజాంషాహవలనఁ బరాభవము కలిగెను. ఈ యుద్ధ

ములోను, తరువాత జరగినయుద్ధములలోను నిజాంశాహకు రామరాజు సహాయముచేసెను. ఇతడు 1557 లో మరణము చెందెను.

అలీ ఆదిల్ శాహ (1557—1580)—ఆదిల్‌శాహ రాజు లవియైన కల్యాణీ, సోలాపురము లను రెండు దుర్గములను హుసేన్ నిజాంశాహ స్వాధీన పఱుచుకొనియుండెను. అందుకు రామరాజు యొక్క సాహాయ్యమును వేడుటకై యితడు విజయనగరమునకు బోయెను. అచ్చటనుంచి రామరాజు సైన్యముల వెంటదీసికొని యాతడు 1558 లో నిజాంశాహిరాజ్యముమీదికి దండు వెడలి దేశమంతయు గాల్చివేసెను. అందుపై నిజాంశాహ కల్యాణీ దుర్గమును అలీ ఆదిల్‌శాహకు నిచ్చి సంధిచేసికొనెను. ఈ యుద్ధములో రామరాజుయొక్క హిందూసైనికులు తురుష్కులను మిక్కిలి బాధలు పెట్టిరి. గొప్ప మసీదులను మందిరములను పడగొటిరి. 1559 లో మరల రామరాజు సాయముదీసికొని కుతుబ్‌శాహ ఆదిల్‌శాహ లిద్దరును నిజాంశాహి రాజ్యమును దోచుకొని రాజధానియైన అహమ్మదనగరమునకు బోయి తమకు ననుకూలమైన సంధి చేసికొనిరి. ఈ యుద్ధములో విజయనగర సైన్యములు తురుష్కులకు గోపమువచ్చునట్టి క్రూరకృత్యము లనేకములు చేసిరట.

తనకు సాయమొనర్చిన హిందూరాజైన రామరాజుప్రబలుటచూచి యోర్వలేక మిత్రద్రోహియగు ఈ అలీ ఆదిల్ శాహ తురకరాజులగు నిజాంశాహ,కుతుబ్‌శాహ, బేరీద్ షాహలను రాజులను కలుపుకొనెను. ఇదివరకు బోరాడుచున్న ఈ తురుష్క రాజులకు నిష్కళంకమైనయైక మత్యము కలుగవలయునని ఈ యాదిల్‌శాహతన చెల్లెలినిహుసేన్‌నిజాం శాహకుమారునకిచ్చెను.హుసేన్‌నిజాంశాహకూతురైన చాందబీబిని తాను వివాహమాడెను.ఈ తురుష్క రాజులందరును కలిసి 1565 లో తాలికోట యుద్ధమందురామరాజును జంపియాతనిసైన్యములనోడించిరి.అంతటినుండి విజయనగరరాజ్య భాస్కరుడస్తమించెను. తరువాత ఆదిల్‌శాహ నిజాంశాహలకుమరలయుద్ధముకలిగిఆదిల్‌శాహ రాజ్యములోని కొంతభాగమును నిజాంశాహ తీసికొనెను. 1571 లో ఆదిల్‌శాహ నిజాంశాహ నిద్దరును, పోర్చుగీసు వారిమీదికి దండెత్తివెళ్ళిరి. కాని పరాభూతులయి తిరిగి

వచ్చిరి. 1572 లో అలీ ఆదిల్‌శాహ ఆదవాని దుర్గమును గెలిచెను. ఇతఁడు 1580 లో నొక కొజ్జాచేఁ జంపబడియె. ఈ రాజునొద్ద నొక మహారాష్ట్ర బ్రాహ్మణుఁడు రాజ్యములోని యాదాయ సంబంధమైన మంత్రిగా (Finance Minister) నుండెనని చెప్పిన నితడు హిందూముసల్మానుల సమానభావముతోఁ జూచుచుండెననియు, హిందువులకు గొప్ప గొప్ప యుద్యోగముల నొసంగుచుండె ననియు వేరచెప్పవలయునా ? ఈ రాజు సత్కార్యాచరణమునం దపారసంపత్తిని వెచ్చించెను. గగనమహల్, జుమ్మామసీద్, షహాబురుజ్ మొదలైన చక్కని మందిరములఁ గట్టించెను. కోటచుట్టు పెద్దగోడ పెట్టించెను. గొట్టములో నీళ్ళు తెప్పించి యన్ని వీథులలోఁ గొళాయిలు పెట్టించెను.

## రెండవ యిబ్రాహిం ఆదిల్‌శాహ (1580-1626)—

ఇతఁడు అలీయొక్క తమ్ముని కొమారుడు. రాజ్యమునకు వచ్చినప్పు డితడు తొమ్మిది సంవత్సరములవాఁ డగుటచే కామిల్ ఖానుఁడను మంత్రియు చాందబీబియను నామెయు రాజ్యవ్యవహారములు చూచుచుండిరి. తరువాత ననేక మంత్రులు మారిరి. రాజ్యవ్యవస్థలో నిట్టి కల్లోలములు పుట్టుటచూచి అహమదనగర గోలకొండ నవాబు లదియే మంచి సమయ మని తలఁచి విజాపురముమీదికి దండెత్తిపోయిరి. ఆ పట్టణమును ముట్ట డించి యొక సంవత్సరమువరకు యుద్ధముచేసిరి. కాని అబుల్‌హుసేన్ దిలావర్‌ఖాన్ అను వార లప్రతిమ శౌర్యము జూపినందున నిజాం కుతుబ్ శాహులు వచ్చినత్రోవను మరలి పోవలసినవారైరి. దిలావర్ ఖాన్ ముఖ్యమంత్రి యయ్యెను. కాని రాజు పెద్దవాఁ డైనకొలదిని నాతని కధికార మియ్యక యతనిని కట్టులోనుంచెను. అతఁడొకసారి పారిపోయి స్వతంత్రుడయ్యెను. అందుచే భయపడి దిలావర్‌ఖాన్ అహమద్ నగరమునకుఁ బారిపోయెను. అతనివెంట విఖ్యాత చరిత్రకారుడగు ఫెరిస్తా యుండెను. తుదకు దిలావర్‌ఖానుని మోసముచే విజాపురమునకు రప్పించి, యతనికన్నులు దీయించి యిబ్రాహింశాహ యాతనిని చెరఁ బెట్టించెను. వాఁడచ్చటనే పదిసంవత్సరములుండి మృతినొందెను.

ఈ రాజుకాలమునందు రాజ్యసంపద మిక్కిలి యభివృద్ధి యయ్యెను. ఇతఁడు ప్రజలకు హితమగునట్లు రాజ్యముచేసెను. ఇతని కాలమునందు అక్బర్ బాదుశాహ సైన్యములదీసికొని అహమద్ నగ రముమీదికి దండెత్తివచ్చెను. అప్పుడు ఈ రాజు అహమద్ నగర సాహాయ్యమునకుఁ బంపిన సైన్యములను మోగలులు సుపాయను గ్రామమునొద్ద నోడించిరి. 1603 లో నీరాజు అక్బరునకు ననేక బహు మతు లంపియుఁ, దనకూఁతును అగ్బర్ కుమారుఁడగు ద్యానియల్ అనువానికి నిచ్చియు నాతనితో సంధిచేసికొనెను. ఇతఁడు 1626 లో గాలధర్మము నొందెను.

విజాపురరాజులలో నితఁడు శ్రేష్ఠుఁడు. ఇతఁడు కలహప్రియుడు కానందున లోకప్రియుడయ్యెను. ఈ రాజు తన దేశమును ప్రజలను బాగుచేయుటకై మిక్కిలి పాటుపడెను. తోడరమల్లుఁ డుత్తరదేశము నందు నేర్పరిచిన భూవిషయిక నియమములనే యితఁడు దక్షిణమున నేర్పరిచెను. ఇతఁడు భూములఁ గొల్పించి యేర్పరిచిన పన్నులవిన రమిప్పటివఱకును అచ్చటచ్చటఁ గానవచ్చెడిని. ఇతఁడు మహమ్మదీయు డైనను ఇతరమతములయెడ సమబుద్ధి కలిగియుండెను. గొప్ప గొప్ప యుద్యోగము లీతడు మరాటా వారికిచ్చెను. క్రైస్తవుల యుపయోగా ర్థమై యీతడు కట్టించిన క్రైస్తవ మందిరము లిప్పటికిని గానవచ్చు చున్నవి. పరమత సహిష్ణుతలో నిత డీతని సమకాలీనుడైన అక్బరు కంటె నొకవన్నె యెక్కుడని చెప్పవలయును.

ఇతఁడు విజాపురములో గొప్ప మందిరములను గట్టించెను. ఇత నిచే గట్టింపబడిన మసీదొకటి యిప్పటికిని ఆ కాలపు శిల్పశాస్త్రము యొక్క నైపుణ్యమును జూపుచున్నది. ఈ మసీదు కట్టుటకు ముప్పది యారు సంవత్సరములును, ఏఁబదిరెండు లక్షల రూపాయలును పట్టెను. ఈ రాజు బొక్కసములో ధనమెక్కుడుగా నుండెను. ఇతనియొద్ద నెను బదివేలస్వారు లెప్పుడును యుద్ధము చేయుటకు సిద్ధముగా నుండిరి. ఇతనిరాజ్యపు పొలిమేర మైసూరు దేశమువరకు వ్యాపించియుండెను.

మహమ్మద్ ఆదిల్‌శాహ (1626-1656)—దక్షిణదేశపు చరిత్రలో నీతని ప్రభుత్వము ముఖ్యమైనది. ఈకాలమున మోగలసైన్యములు దక్షిణమునకు వచ్చి అహమ్మదనగర విజాపుర రాజ్యములను జయింపవలయునని ఘోరముగా బోరసాగెను. ఇటు దక్షిణమునందు మహారాష్ట్రులు ప్రబలి శివాజివంటి రణశూరుడు వారిలో బుట్టినందున వారు స్వాతంత్ర్యమునకై యత్నము చేయసాగిరి.

ఈకాలమున షాహజహాన్ దిల్లీశ్వరుడుగా నుండెను. అతని సైన్యములువచ్చి విజాపురమును ముట్టడించెను. కాని మురార్ రావను మరాటాసరదారు డాదిల్ షాహకై ఘోరముగా బోరాడి మోగలుల బారదోలెను. తరువాత దిల్లీశ్వరుడు మహబత్‌ఖాను డనువానిని సైన్యముతో మరల దక్షిణదేశమునకు బంపెను. వాడు దౌలతాబాద్ దుర్గమును స్వాధీనము చేసికొని నిజాంశాహిని అంతమందించెను. అప్పుడు ఆదిల్‌శాహ నిజాంశాహకు సాహాయ్యముచేసెనని కోపముతో మోగల సైన్యములు విజాపుర రాజ్యముమీదికి బోయెను. అప్పుడు మరల నిజాంశాహిని నిలువబెట్ట యత్నించుచున్న షాహాజీభోన్‌సలేయొక్క సాహాయ్యము దీసికొని విజాపురాధీశుడు మోగలుల వెడలగొట్టెను. 1635 లో షాహజహాన్ బాదుషా స్వయముగా విజాపురము మీదికి దండెత్తి వచ్చెను. అప్పుడు షహాజీ రణదుల్లాఖాను లిద్దరును మోగల సైన్యములను మిక్కిలి బాధలు పెట్టిరి. కాని తుదకు ఆదిల్‌శాహ దిల్లీశ్వరునితో సంధిచేసికొన వలసినవా డాయెను. అందువలన నాతనికి మోగలులచే గెలువబడిన నిజాంశాహిలోని కొంతభాగము మోగలు లిచ్చిరి. ఆతడు డిల్లీశ్వరునకు గప్పము గట్టునట్లు ఒప్పుకొనెను. శషాజీ నిజాంషాహి పునరుద్ధారణవిషయమైన యాశనువిడిచి విజాపురము వారియొద్ద సరదారుడుగా నుండెను. తరువాత నీతనికుమారుడైన శ్రీ శివాజి విజాపురమువారి దుర్గము లనేకములు తీసికొనెను. అందుపై నీరాజు శహాజిని జెరబెట్టి మూడుసంవత్సరములవరకు నుంచెను. కాని తుదకు దిల్లీశ్వరునియాజ్ఞ ననుసరించి విడిచిపెట్టెను. ఈ కథాభాగమంతయు, 'మహారాష్ట్రుల

యభ్యుదయము: విజృంభణము' అను మూడవభాగములో వివరముగా వర్ణింపబడును. ఈ శాహ 1656 లో గాలధర్మము నొందెను.

మోగలులతో సంధిచేసికొనిన తరువాత నీరాజు ప్రజాపాలనము నందు మిక్కిలి దక్షుడైయుండెను. కొంచెము విలాసపురుషు డైనను ప్రజారంజనమందె శ్రద్ధకలిగియుండెను. ఇతరదేశపురాజు లీతనిని మిక్కిలి గౌరవించుచుండిరి. ఈతనిసైన్యములో నెనుబదివేల స్వారు లును రెండులక్షల యేబదివేల కాల్బలమును, అయిదువందల యేనుగు లును ఉండెను. ఇతనియాదాయ మిరువదికోట్ల రూపాయలు. ఈతని యెదుట నవరత్న ఖచితములగు శరస్త్రాణంబులుగల వేలకొలది సర దారులు లీనభావముతో నిలుచుందురు. ఈతడు ప్రయాణము చేయు నపుడు వెండి బంగారపు నగలతో నిండియున్న యేనుగు లనేకములు వెంటనడుచును. గ్రామములో నితడు తిరుగునపుడు పౌరు లీతనిమీద సువర్ణ రజితపుష్పంబులు చల్లుచుండిరి. తేపతేప వెండిబంగారపు నాణె ములతో దులదూగుచు నానాణెములన్నియు బీదలకు బంచిపెట్టును.

ఇతడొక మసీదు కట్టించెను. దాని శిఖరమంత పెద్దశిఖరము మరియొకటి లేదట. ఈ శిఖర మేశాస్త్రీయపద్ధతి ననుసరించి నిలుపబడి నదో! ఇది పాశ్చాత్య శిల్పపద్ధతి మించినదని యా శాస్త్రములో పండితు డగు ఫర్‌గ్యూసన్ వ్రాసియున్నాడు.

ఈ రాజునొద్ద ననేక శతఘ్ని (ఫిరంగీ : తోఫ్) లుండెను. అందు ముల్క్-ఇ-మైదాన్ (రణరంగపురాజు) అనునది ముఖ్యమైనది. అది ప్రస్తుతము విజాపురములో నున్నది. ఇప్పుడు దానిని మహాంకాళి యనియెదరు. ఇది మొదట పరిండాయను దుర్గముమీద నుండెను.పూర్వ మాకోట అహమ్మద నగరరాజులకు లోబడియున్నప్పుడు ఈ ఫిరంగీ పోతపోయింపబడెనట. దీనిని నిజాంశాహ తాలికోట యుద్ధమునకు దీసి కొని పోయెనట. ఇది యష్టధాతువులతో జేయబడినది. ఇది 60 పుట్లు బరువున్నదని కొందఱును, 41 పుట్లు అనగా 39000 కత్తల్ బరువున్న దని మఱి కొందఱును వ్రాసియున్నారు. ఇది 14 అడుగుల పొడువుం

డును. దీని పరిఘము 14 అడుగులున్నది, దీనిమూతి యొద్దనున్న తొట్టి యొక్క వ్యాసము రెండడుగుల నాలుగంగుళములు, మంద మొకయంగుళమున్నది.

రెండవ అలీ ఆదిల్ శాహ (1656 - 1672)—ఇతడు రాజ్యారూఢుడైనపుడు దక్షిణములో ఔరంగ్‌జేబ్ సుబేదారుగానుండెను. తన యాజ్ఞ వడయకయే యలీ రాజయ్యె నని ఔరంగ్‌జే బీతనితో బోరాడ జొచ్చెను. అప్పుడే యీ రాజ్య మస్తమింపవలసినది. కాని యింతలో డిల్లీశ్వరుడగు షాహజహాన్ రోగగ్రస్తుడయ్యె ననినవార విని ఔరంగజేబ్ విజాపురమువారితో సంధి చేసికొని వెడలిపోయెను(1657). తరువాత నవరంగజేబు డిల్లీశ్వరుడై తన సైన్యములను విజాపురము మీదికి బంపెను. ఆ సైన్యముల కధికారి జయసింహుడు. వా డనేక పర్యాయములు విజాపురపువారిచే నోడింపబడి తుదకు బలాయిత్తు డయ్యెను.

శివాజి యధికముగా బ్రబలినది యీతని ప్రభుత్వకాలమునందే. శివాజిని జయించుటకు నీత డనేక సైనికులఁ బంపగా వారినందరిని శివాజి యోడించెను. అందు అఫ్‌జుల్‌ఖానుఁ డొకఁడు.

ఈతఁడు ప్రబల శత్రువులతో నెప్పుడును పోరాడవలసినవా డయినను స్వప్రజాహితైక తత్పరుడై యుండెను. కవులను విద్వాంసులను గౌరవించెను. ఈతనియొద్ద ధర్మాజీపండిత్ మొదలయిన మహారాష్ట్ర లనేకులు గొప్ప యుద్యోగములో నుండిరి.

సికందర్ అలీ ఆదిల్‌శాహ (1672 - 1686)—ఇతఁడు రాజ్యమునకు వచ్చినప్పు డయిదేండ్లకుప్రవాఁడు. ఇటు మరాటావారు, అటు ఔరంగజేబ్ అను కత్తెరలో జిక్కి, యాస్థానమునందుఁ దగిన మంత్రులు లేనందున నీతడు తన రాజ్యమును గోలుపోయెను. 1683 లో అవరంగజేబు స్వయముగా దక్షిణ దండయాత్రకు వెడలి విజాపురము వారితో యుద్ధముచేయుచు విజాపురమును ముట్టడించెను. అప్పుడు రాజు

పదునాఱు సంవత్సరములవాడు. తగిన మంత్రులుగాని, సేనాధీశులుగాని లేనందున యుద్ధము చేసినందున లాభము లేదని తలచి సికందర్ అలీ ఆదిల్‌శాహ దిల్లీశ్వరునకు శరణుచొచ్చెను. అంత నౌరంగజే బాతనిని చెఱబెట్టించి సంవత్సరమునకు లక్ష రూపాయ లాతనికి గట్టడిచేసి, విజాపుర రాజ్యమును నాక్రమించుకొనియెను (15 వ అక్టోబరు 1686). తరువాత 1701 లో నౌరంగజేబ్ ఈ సికందర్‌శాహను చంపించెను.

ఇట్లు నూటతొంబది యేడేండ్లవఱకు వైభవముతో ప్రభుత్వము చేసిన విజాపురపు ఆదిల్‌శాహివంశ మంతరించెను.

ఈ ఆదిల్ శాహరాజులు మొత్తముమీద న్యాయదృష్టియు, ప్రజాక్షేమ తత్పరతయు .గలవారు. హిందూముసల్మానులయెడ భేదభావము లేక సమదృష్టి కలవారు. వీరి ప్రభుత్వకాలములోనే పెక్కుమరాటి సరదారుల వంశములు విఖ్యాతిచెంది ఘనతవహించెను. వీరి రాజకీయవ్యవహారము లన్నియు మరాటిభాషలో జరుగుచుండెను. అందుచే దేశభాషయగు మరాటి మిక్కిలి యభివృద్ధిచెందెను. వీరి రాజ్యము ప్రజలకు సౌఖ్యకరముగా నుండె ననుటకు సందేహములేదు.

## 5. గోలకొండలోని కుతుబ్‌శాహి.

(1512—1687)

### పూర్వపీఠిక.

గోలకొండ దుర్గము ప్రస్తుతము హైద్రాబాదు పట్టణమునకు నాఱు మైళ్ళమీఁదనున్నది. అది పూర్వము మట్టికోటగా నుండి యొరుగంటి రాజ్యములోఁ గలిసి యుండెను. ఆ రాజ్యమును బహమనీరాజులు 1422 లో స్వాధీనము చేసికొనిరి. అప్పటి నుండియు బహమనీ రాజుల రాజ్యములోని తూర్పుభాగమునకు నది రాజధానియై యుండెను. దానికి 'తెలంగాన్' లేక 'గోలకొండ సుబా' యని పేరుండెను. ఈ ప్రదేశమునందు బూర్వరాజులచే విస్తీర్ణతటాకంబులును గాలువలును ప్రవ్వింపబడినం

దున నాదేశమంతయు సస్యసమృద్ధిచే శోభిల్లుచుండెను. ఈ ప్రదేశము నకు బహమనీ రాజుమంత్రియగు మహమద్ గవాన్ అనువానిచే కులీ కుతుబ్ ఉల్‌ముల్క్ అనువాడు సుబేదారుగా నియమింపబడెను.

కులీ కుతుబ్‌శాహ (1512-1543)—ఇతడు పారసీకదేశ మందలి యొక గొప్పకుటుంబములోని వాడు. బహమనీరాజగు మహ మద్ శాహ యితనికి నాశ్రయమిచ్చెను. క్రమ క్రమముగా నభివృద్ధిచెంది యితడు గోలకొండకు సుబేదారుడయ్యెను. 1512 లో నితడు స్వతం త్రుడయ్యెను. ఇత డధిక పరాక్రమవంతుడు. తన శౌర్యముచే కులీ కుతుబ్‌శాహ తూర్పు తెలుగు నాడంతయు నాక్రమించుకొనెను. తన రాజ్యపు సీమను తూర్పు సముద్రమువరకు గొంపోయెను. బరీద్‌శాహ నోడించి మెతుకుదుర్గమును ఆక్రమించెను. సీతాపతిరాజు నోడించి కంబమునెట్టు గ్రామమును తీసికొనెను. ఇది ప్రస్తుతము నైజాము రాజ్య ములో నున్నది. దీనికి నిపుడు కమ్మం మెట్టు అని పేరు. ఈ కుతుబ్ శాహ పానగల్లు, గొయ్యలకొండ మొదలైన దుర్గము లనేకములు సాధిం చెను. ఈయంశమునే అదంకి గంగాధరకవి తన తపతీసంవరణో పాఖ్యాన మను గ్రంథములో నిట్లు వర్ణించి యున్నాడు: —

సీ. పడమటను సవాయి - బసవనిగాఁజేసి,
యచట గొయ్యలకొండ - నావరించె ।
తమదిమల్లాఖాను-దక్షిణంబునఁగొట్టి,
హరియించె బానుగ-ల్లాదిగిరుల।
నుత రంబున బరీ-దోడి పారఁగఁదోలి,
మెతుకుదుర్గం బాక్ర-మించి మించె।
బ్రథమదిక్కున నొడ్డి-ప్రాతసామంతుల,
ధట్టించి కంబము-మెట్టఁ గొనియె॥

గీ. నతని బొగడంగఁ దగదె యా-చతురసీతి।
రూఢిగిరి దుర్గలుంతన-ప్రౌఢతేజు।

వాహశిఖరాధిరోహరే-వంతమూర్తి।
కుతుబశాహిసిమ్మాపాలు-గుణవిశాలు॥

కృష్ణదేవరాయని మరణము తరువాత నీకుతుబ్‌శాహ కొండపల్లిని సాధించినట్లు గాన వచ్చుచున్నది. ఇతఁడు 1534 లో గొయ్యలకొండను నాక్రమించినప్పుడు ముఖముపై గాయము తగిలి కురూపి యయ్యెను. మొత్తముమీద ఇత డఱువది దుర్గములు సాధించెను. మహావైభవముతో నఱువది సంవత్సరములవరకు రాజ్యముచేసెను. అందు 16 సంవత్సరములవరకు బహమనీరాజుల సుబేదారుగను, మిగిలిన 44 సంవత్సరములు స్వతంత్రరాజుగను పరిపాలించెను. ఇతనిని నితని రెండవ కుమారుఁడగు జంషీద్ అనువాఁడు చంపించెను.

**జంషీద్ కుతుబ్‌శాహ(1543-1550)**—ఇతఁడు తన పెద్ద యన్న కనులు తీయించి తాను రాజయ్యెను. ఇతని ప్రభుత్వకాలములో వర్ణనీయ విషయములు విశేషముగాలేవు. ఇతనియొద్ద జగదేవరావను మరాటాసర దారుఁడొకడు సర్వాధికారము వహించి యుండెను. ఈరాజు 1550 లో మరణము నొందగా నితని కుమారుని రాజ్యముమీద గూర్చుంచఁబెట్టిరి కాని జంషీద్ తమ్ముడగు ఇబ్రాహీం అనువాడు విజయనగరము నుండి వచ్చి రాజ్యము నాక్రమించుకొనెను.

**ఇబ్రాహీం కుతుబ్‌శాహ (1550-1580)**—ఇతడు కులీ కుతుబ్‌శాహయొక్క నాల్గవకుమారుడు. తన యన్నయగు జంషీద్ రాజ్యము చేయుచుండగా నితడు తన్నుఁ జంపునేమోయని భయపడి యితడు విజయనగరమునకుఁ బాఱిపోయెను. అచ్చట నీతనిని మన్నించి రామరాజితనికి జాగీరొసంగి జంషీద్ మరణమువరకును నితని నచ్చటనే యుంచుకొనెను. అన్న పోయినతోడనే యన్నకుమారుని నోడించి యితఁడు గోలకొండకు రాజయ్యెను.

ఇతఁడు రాజ్యాసనాసీనుడైనప్పు డీతని నభినందించుచు ననేక రాజులుత్తరములు వ్రాసిరి. అప్పటి రాజులలో బరస్పరమైత్రి కుదిరెను.

నిజాంశాహకును కుతుబ్ శాహకును స్నేహమయ్యెను. ఆదిల్‌శాహ, కుతుబ్‌శాహ, రామరాజులు స్నేహితులైరి. ఇట్లందరును స్నేహితులై నందున ఒకానొకడు మరియొకనిమీదికి బోదలచెనేని యితర రాజులంద ఱును వానికి బుద్ధిచెప్పి మాన్పుచుండిరి. ఇబ్రాహిం కుతుబ్‌శాహ నిజాం శాహతో స్నేహముచేసి బేరీద్‌శాహిని రూపుమాప దలచెను. అందుపై రామరాజీ క్రిందియుత్తర మతనికి వ్రాసెను. 'విజాపుర రాజులును అహ మద్ నగర్‌రాజులును ఎన్నియో దినములనుండి పోరాడుట మీ రెరిగియే యున్నారు. ఈ యుద్ధములో నుభయులును సమానులైనందున నెవరికి నేమియు లాభముకలుగలేదు. ని వర్ణించిన యుద్ధములో మీ తండ్రి యేమియు సంబంధము కలుగజేసికొనినవాడు కాడు. ప్రస్తుతము మీరు నిజాంశాహతోగలిసి విజాపురరాజుతో యుద్ధము చేయదలచినట్లు తెలిసినది. ఇబ్రాహిం ఆదిల్‌శాహ మాకు మిత్రుడు. మీకాతడేమియు నపకారముజేయలేదు. మీకును మాకును బహుదినములనుండి స్నేహం కలదు. అందుచేతనే మీకిట్లు వ్రాయుచున్నాను. పరధనాపహరణము చేయుటకై మీరేర్పఱుచుకొనిన కట్టులోనుండి తొలగుడి. మీరు మీ సైన్యమును తిరిగి పిలుపించుకొనుడి. అందుచే వారిరువురికిని సంధి కలిగి బహుకాలమునుండి జరుగుచున్న యుద్ధ మాఱిపోగలదు'.

పదునాఱవశతాబ్దమునందు రాజులొండొరుల కిట్టియుత్తరములు వ్రాసికొనుచుండిరి, ఈ యుత్తరమునుజూచి కుతుబ్‌శాహ యుద్ధమును మాని రామరాజును కలిసికొని రాజులందరికిని మైత్రి కుదిర్చెను.

ఇతని ప్రభుత్వకాలములో మహారాష్ట్రులు ప్రబలిరి. రాజ్యసంపా దనలో నితనికి జగదేవరావను మరాటాసరదారుడు సహాయుడుగా నుండెను. అందుచే శాహ యతనికి ముఖ్యమంత్రిత్వమొసగెను. రాయ రావను మరియొక సరదారుడు ఇతనియొద్దనే ఘనతకెక్కెను. ఇట్టిద్దరు మరాటాసరదారులు గొప్ప యుద్యోగములో నుండుటవలన ననేక మరాటావారు రాజకీయోద్యోగములలోబ్రవేశించుటకు వీలుకలిగెను. అది చూచి తురుష్క సరదారు లోర్వలేక శాహకు మరాటావారిమీద చాడీలు

చెప్పసాగిరి. అందుపై శాహరాయరావును చంపించెను. జగదేవరావు తన సైన్యమును వెంటఁదీసికొని గోలకొండనుండి పారిపోయి దేశమం తయు దోచుకొనుచు నిజాంశాహయొద్దకు బోయెను. అచ్చటఁగొన్ని దిన ములుండి జగదేవరావు మరల గుతుబ్‌శాహి రాజ్యములోనికి వచ్చెను. ఆతనివెంట మరాటి, అరబ్బీ, ఇరాణీ (పారసీక), హబషీ సైన్యము లుండెను. కుతుబ్‌శాహ యాతనిమీదికి ముస్తఫానునిఁ బంపెను. ఆయుద్ధ ముఁో జగదేవునితమ్ముఁడగు వెంకటరావుపడెను. అంత జగదేవరావు విజాపుర రాజునొద్దకు బోయెను. ఇబ్రాహిం కుతుబ్‌శాహ హుసేన్ నిజాంశాహలు కలిసి విజాపురముమీదికి దండువెడలిరి. అప్పుడు విజా పురనవాబు రామరాజుయొక్క సాహాయ్యమును గోరెను. అందుపై రామరాజు తనతమ్ముడైన వెంకటాద్రిని నాతని తోడునకుఁ బంపెను. వెంకటాద్రి జగదేవరావులు కలిసి కుతుబ్‌శాహ నిజాంశాహల సైన్యము లను జెండాడిరి. తెలుఁగుసీమలోని నాయకుల సాహాయ్యమునుబొంది జగదేవరావు ఆంధ్రదేశములోని రమారమి యన్ని దుర్గములను సాధిం చెను. అందుచేఁ గుతుబ్‌శాహ భయపడి జగదేవునకు, గణపురా పాన గల్లులను దుర్గములనిచ్చి యాతనితో సంధిచేసికొనెను. ఈ జగదేవరావు చరిత్ర మనకింతవరకె తెలియును; తరువాతి చరిత్ర తెలియదు. శివాజి కాలములో స్వాతంత్ర్యలాభమునకై జరిగిన యత్నమునకు నీ జగదేవ రావుచరిత్ర పూర్వరంగమని చెప్పవలసియున్నది.

1564 లో నీ ఇబ్రాహిం కుతుబ్‌శాహ యితర తురుష్కరాజు లతోఁగలిసి మిత్రద్రోహియై, సంకటసమయమందుఁ దన్ను రక్షించిన రామరాజు మీఁదికి యుద్ధమునకుఁ బోయి, తాలికోటయుద్ధములో నాతనిఁ జంపి, తన్ను పోషించిన విజయనగరపట్టణమును ధ్వంసము చేసెను.

1567 లో నితఁడనేక హిందూరాజులను జయించెను. విజాపుర రాజ్యములోని మరాటావా రీతని రాజ్యమునకు బాధకలుగఁజేయఁగా నీతఁడు వారితో బోరాడి వారిని మరలించెను. విజయనగర రాజులకు

సామంతులుగానుండి యప్పుడారాజ్య మస్తమించుటచే స్వతంత్రులయిన రాజులను గెలిచి యీతఁడు తనకు సామంతులను జేసికొనియెను.

ఈ ప్రభుత్వపుఁ జివరను మురార్‌రావను మహారాష్ట్ర బ్రాహ్మణుడు ముఖ్యమంత్రిగా నుండెను. ఈతఁడు సర్వాధికారమునువహించి, దక్షిణదేశములోని హిందువుల దేవాలయముల దోఁచుకొని ధనమంతయు గోలకొండకు జేర్చెను. ఈ వార్తవిని నవాబునకు మిక్కిలి చింతకలిగి దానిచే శరీరమునకు, రుగ్మతకలుగఁగా నాతడు 1580 లో గిరిశేషుఁడయ్యెను. అప్పు డితనికి 51 సంవత్సరముల వయస్సు. ఈతనికి ముప్పదిమంది సంతానముగలిగెను. వారిలో నార్గురు పుత్రులును, పదముగ్గురు పుత్రికలునీతని మరణకాలమందు బ్రతికియుండిరి.

ఈ నవాబు విద్వాంసుఁడు, జయశాలి, ప్రజాహితైక తత్పరుఁడు. ఈతఁడు వెడలిన యేదండయాత్రలోను ఈతనికి నపయశస్సు రాలేదు. యుద్ధమునకుఁ బోవునప్పుడు కూడ విద్వాంసులతో సంభాషించి, ప్రజలకు మేలయిన చట్టముల నేర్పఱుచును. రాజ్యవ్యవస్థ యుత్కృష్టముగా నుండెను. దొంగతనమే వృత్తిగాఁ గల యెఱుకు, ఏనాది జాతుల వారిని శిక్షలోఁ బెట్టి బాటసారులకు భయము లేకుండఁజేసెను. ఈతనిరాజ్యంలో గ్రుడ్డి ముదుసలియైనను బంగారపు ముద్దనెత్తిపై నుంచుకొని నిర్భయముగఁ బ్రయాణము చేయగలఁడను ఖ్యాతి వహించెను. కొండవీడు, రాజమహేంద్రవరము, కాసింకొండ యితని రాజ్యములోని ముఖ్యమైన ఠాణాలనిచెప్పిన నీతని రాజ్యవిస్తార మెక్కుడుగా నుండెనని వేఱుగఁ జెప్పవలెనా? ఇతఁడు సుందరములైన మసీదులను, ప్రాసాదములును అనేకములు గట్టించెను. పెక్కుతోటలు వేయించెను. విస్తీర్ణతటాకముల ద్రవ్వించెను. గోలకొండ దుర్గప్రాకారము, ఇబ్రాహింబాగ్ అనుతోఁట పుల్‌బాగ్ (పుష్పోద్యానము), లంగరులు (భిక్షగృహములు), ఇబ్రాహింపట్టణతటాకము, హైద్రాబాదులోని హుసేన్ సాగర్ బడవల్ వద్దియాన కట్ట మొదలైన వన్నియు నితని ప్రభుత్వకాలములోనే నిర్మింపఁబడెను. అందుచే నీరాజ్యము రెండవ యాజిప్టని ఖ్యాతివహించెను. అరబస్థాన్, తురుకస్థాన్, ఈరాన్ (పారసీకము) మొదలయిన దేశములనుండి

యనేకవర్తకులు వచ్చుచుండిరి. అందుచే దేశములోని వర్తకము విశేషముగా నభివృద్ధియై గోలకొండలో దొరకనివస్తువు లేదనిఖ్యాతివచ్చెను. ప్రజల కష్టసుఖము లీనవాబెంతశ్రద్ధతోఁ గనుఁగొనెనో యంత శ్రద్ధతో యే తురుష్కరాజులు గనుఁగొన లేదని యొకగ్రంథకారుఁడు వ్రాసి యున్నాఁడు.

## దేశభాషాభివృద్ధి.

ఈ నవాబు విజయనగరములో డాఁగియున్నప్పుడు రామరాజు నాస్థానములోని బట్టుమూర్తి మొదలయినకవుల సహవాసముచే నాంధ్ర గీర్వాణభాషల నభ్యసించెను. అందుచే నితడు రాజ్యమునకు వచ్చి నప్పటినుండియు నాంధ్రకవీశ్వరుల నాదరించి యా భాషను అభివృద్ధి చేయుటకై యత్నించెను. తురుష్కుఁడయ్యును తెనుఁగు విషయమై యింతయభిమానము గలిగియుండుట వింతగదా! అదంకీ గంగాధరకవి, పొన్నిగంటి తెలగనార్యులను తెనుఁగు కవులిద్ద ఱీతని యాస్థానమునం దుండిరి. గంగాధరకవి నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు తపతీసంవరణ మను కావ్యమును రచించి నవాబునకు నంకితముచేసెను. ఆ గ్రంథము నందు ఇబ్రాహిం కుతుబ్‌షాహను 'మల్కభరాం' అని వాడియున్నాడు. ఈ కవి కృతిభర్తయైన నవాబును ఇట్లువర్ణించి యున్నాఁడు.

సీ. సకలవేదపురాణ-శాస్త్రపాఠగు లైన
యొంటరి విద్వాంసు-లొక్కచోట
నష్టభాషలయందు-నాంధ్యంబు లేకుండు
హొంతకారి కవీంద్రు-లొక్కవంక
గజపతి నరపతి-క్ష్మాభర్త లంపిన
యొడికంపురాయబా-ర్లొక్కదండ
మేరుమందరముల మించఁగల్గిన మన్ని
య్ము ధండనాథు లొ-కొక్కయెడల

గీ. జేరికొల్వ భద్రాసనా-సీనుఁ డగుచు
రమ్యగుణహారి మల్కి-భ-రామకౌరి
భారతక్షీర మయసింధు-బంధమధ్య
లలితపుణ్యకథాసుధా-లహరిఁ దేరి.

గంగాధరకవి కృతికర్తగను ఇబ్రాహిం కుతుబ్‌షాహ కృతిభర్తగను గల యీకావ్యము మిగుల రమ్యముగను ప్రౌఢముగను ఉన్నదనియు, వసుచరిత్రతోఁ బోల్చుటకుఁ దగినదనియు విద్వాంసుల యభిప్రాయము.

'యథారాజా తథాప్రజా' యను సామెత ననుసరించి యీ నబాబు యొక్క యాస్థానమందలి యితరతురుష్క-సరదారులునుఆంధ్రకవులగౌరవించుచుండిరి. నవాబునొద్ద అమీన్‌ఖానుఁడను సైన్యాధీశుడుకలడు. ఇతని కాంధ్రభాషయెడల మిక్కిలి గౌరవముండినట్లు కానవచ్చుచున్నది.ఇతఁడు పొన్నిగంటి తెలగనార్యునిచే రచింపబడిన యయాతి చరిత్రమను అచ్చ తెలుగు కబ్బమును కృతినందెను. ఈ కవినిగురించి యాంధ్రకవుల చరిత్రలోనిట్లు వ్రాయబడియున్నది: 'ఈ తెలగనార్యుఁ డచ్చతెలుఁగు గ్రంథములు చేసిన వారిలో మొదటివాడు. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు: ఆపస్తంబ సూత్రుఁడు: భావనార్యుని పుత్రుఁడు. అచ్చ తెలుఁగునందు గ్రంథములు రచించుట మిక్కిలి కష్టము. ఈకవికిఁ బూర్వమునం దెవ్వరును శుద్ధాంధ్రభాషలో ప్రబంధములు చేయుటకు ప్రయత్నించినవారైననులేరు. ఇట్టి గ్రంథరచన కితడు మొట్టమొదటివాఁడే యయినను, ఈ కవి రచించిన యయాతిచరిత్రము సర్వవిధముల చేతను కూచిమంచి తిమ్మకవి రచించిన యచ్చ తెలుగుపుస్తకములకంటె శ్లేష్ఠకరముగానున్నదని నా యభిప్రాయము. ఈయనకు పూర్వమునందుండిన కవులు కొందఱు తమకృతులలో నక్కడక్కడ నొక్కొక్క యచ్చతెలుఁగు పద్యమును వేయుచువచ్చిరి. అట్టివానిని జూచియే జనులత్యాశ్చర్య పడుచుండిరి. శుద్ధాంధ్రకావ్యములలో మొదటిదియగు నీ కావ్యమును వ్రాయించి, కవిని గౌరవించి దానికిఁ గృతినాయకుఁడయిన అమీర్ఖా

ఖానుండు తెలుఁగువారి కృతజ్ఞతకు నెల్లప్పుడును పాత్రుఁడు గదా! ఈ యమీఁ ఖానుని గురించియు, నితని కుమారులనుగురించి యయాతి చరిత్రలో వ్రాయబడిన యంశములను జూడగా వారాంధ్రకర్ణాట భాషలను చక్కఁగా నెరింగియుండిరనియు, నప్పటి రాజులును, రాజకీయోద్యోగస్థులును, ప్రజలభాషను శ్రద్ధతో నభ్యసించుటయేగాక యా భాషలయందుఁ బాండిత్యము సంపాదించు చుండిరనియు నందుచే దుబాషలక్కరలేకయే ప్రజల కష్టనిష్ఠురములను జక్కఁగఁ దెలిసికొనుచుండిరనియు స్పష్టముగా గానవచ్చుచున్నది.

మహమ్మద్ కులీ కుతుబ్ ఖాహా (1580-1611)– ఇతడు ఇభరాంయొక్క మూడవ కొమారుఁడు. మొదటనే యితఁడు హిందువులతోఁ బోరాడవలసి వచ్చెను. విజయనగరధ్వంసానంతర మచ్చటి రాజవంశజులు పెనుకొండను రాజధానిజేసికొని రాజ్యము చేయుచుండిరి. వారిని గెలువవలయునని యీతడు యత్నించెను. కాని యా కోర్కె సిద్ధించినదికాదు. ఇతని చెల్లెలిని విజాపురనవాబునకిచ్చి యీతడు మహా వైభవముతో వివాహము చేసెను. అప్పటినుండియు నీ రాజులు వైరమును మాని మిత్రులయిరి.

గోలకొండ పట్టణము దిన దినమును అభివృద్ధిచెందినను జనసంఖ్య మిక్కిలి యెక్కుడగుటచేతను త్రాగుటకుఁ గావలసిన నీటి యేర్పాటు తగినట్లు లేనందునను, జననివాసమునకు నిబ్బంది గలుగ జొచ్చెను. అందువలన నీ నవాబు గోలకొండకు నైదుక్రోశములమీద ముసియను నేటియొడ్డున నొకపట్టణము కట్టించెను. దీనికి మొదట భాగానగర మనిపేరు. నవాబు భార్యలలో నొక్కతకు భాగాయనిపేరు. ఈమె భార్యకాదనియు, భోగకాంత యనియుఁ గొందఱు వ్రాసియున్నారు. నవాబు తానుకట్టించిన నగరమునకు మొదట నీమెపేరు పెట్టెను. తరువాత నీ నవాబు కుమారుడైన హైదర్ అనువాని పేరిట నీ నగరమునకు హైదరాబాద్ అని పేరువచ్చెను. గోలకొండకుఁ బైని యొకచో నేటికి నానకట్టగట్టించి యందలి నీరు గొట్టములగుండ భాగానగరమునకు దెప్పించి యీనవాబు జనులకుగల బాధను తీర్చెను. చక్కని మందిరము లనేక

ములు కట్టించి పట్టణమునకు శోభతెచ్చెను. ఈతనిచే గట్టింపబడి జుమ్మా మసీద్; చార్‌మినార్, రాజసౌధములు, పాఠశాలలు, భిక్షాగృహములు మొదలైన వనేకము లిప్పటివరకు నున్నవి. అనేకులచే బొగడ్తయు గన్నవి.

ఈ నవాబునకు దోటలయందు మిగుల శ్రద్ధకలదు. ఇతని సరదారులును ఈతనిని అనుసరించిరి. అందుచే బట్టణముచుట్టును పెక్కుతోట లేర్పడెను.

ఈ నవాబు తనకాలము సత్కృత్యములలో గడపెను. హిందువులతో ననేక పర్యాయములు యుద్ధముచేసెను. కాని యెందును తాను మొదట యుద్ధమునకు దిగలేదు. రాజధానిలోనుండి లోకసుఖాభివృద్ధికి వలయు కార్యములను జేయుచుండెను. రాజ్యములోని రైతులకు వ్యవసాయమునకు నీరు దొరుకుటకు సదుపాయములచే జేసెను. ఈతనికాలములో 78 లక్షల హోనులు లోకోపకారములకై వెచ్చింపబడెను. నవాబు ఏటేట 60 వేల హోనుల బీదలకు బంచిపెట్టుచుండెను.

ఈతని యాస్థానమునందు పారసీకరాజు యొక్క రాయబారియు పారసీక రాజునొద్ద నీతని రాయబారియు నుండిరి. మీర్‌జుమ్లా అనువాడీతనియొద్ద మంత్రిగా నుండెను.

అబుల్ హుసేన్ కుతుబ్‌షాహ (1611-1658)—ఇతడు పూర్వపురాజునకు బుత్రుడు. జహాంగీరు పుత్రుడయిన షాహజహాన్ అహమ్మద నగరరాజ్యమును నాక్రమించుకొని, విజాపురము వారివలన గప్పముతీసికొన్నపు డీతడును డిల్లీశ్వరునకు గప్పము కట్టుటకు నొప్పుకొనెను. కావున షాహజహానునకును ఈతనికిని స్నేహము దృఢముగా నుండెను.

## మీర్‌జుమ్లా.

ఈతనియొద్ద మీర్‌జుమ్లా అనువాడు దివానుగా నుండెను. హిందూదేశములో రాజ్యకార్యధురంధరు (Statesmen) లని విఖ్యాతి

జెందినవారిలో నిత డొక్కడు. ఇతడు పారసీకదేశములో నొకనూనె వాని కుమారుడు. ఒకవర్తకునివెంట నితడు హిందూదేశమునకు వచ్చి డిల్లీశ్వరుని సైన్యములోఁ జేరెను. అచ్చట ప్రమముగా గొప్పవాడయ్యెను, కాని రాజపుత్రుడగు దారాతో నతనికి వైరమువచ్చినందున నాతడు డిల్లీ విడిచి గోలకొండకు బోయెను. అచ్చట నొకయుద్యోగములో ప్రవేశించియు, వర్తకము చేసియు నెక్కుడు ధనమును సంపాదించెను. నవాబునకు నానావిధములయిన కట్నములు, కానుకలు పంపి, యాతనిని ప్రసన్నుని జేసి యాతని ముఖ్యమంత్రిత్వమును సంపాదించెను. గోలకొండ రాజ్యములోని పరిటేల మొదలయిన వజ్రముల గనులవలన నపారసంపత్తి సంపాదించి తన యొద్ద సైన్యములను అభివృద్ధి చేసి తన యజమానుడే తనకు భయపడునట్లు చేసెను. అందుచే నవాబాతనిని గర్ణాటక దేశమునకు బంపెను. అచ్చట నాతడు వజ్రపు గనులలోని వెలగల రత్నము లన్నియుఁ దానుతీసికొని పనికిమాలినరాళ్ళు నవాబునొద్దకు బంపుచుండెను. పోర్చుగీసువారికి రత్నములిచ్చి వారి సాహాయ్యముఁ దీసికొని తనయొద్దనున్న ఫిరంగులపై పోర్చుగీసువారిని అధికారులుగా నేర్పరిచెను. హిందువుల దేవాలయములు ధ్వంసముచేసి యపారసంపత్తిని సంపాదించెను. 1652 లో ట్యావర్నీర్ అను పాశ్చాత్య బాటసారి యాతనిని పెన్నేరుయొక్క యొడ్డున గండికోటలో జూచెను. 'అప్పటికి నాతడు గండికోటను సాధించి కొన్నిదినములే యయ్యెను. అచ్చటి వెండి బంగారపుప్రతిమ లాతడు కరఁగించెను. పదియడుగుల యెత్తుగల యా రితడిప్రతిమలను గరగించి ఫిరంగి చేయించుటకు నాతడు యత్నించెను. కాని యవి కరఁగినవికావు, బ్రాహ్మణులు ప్రతిమలకు మంత్రములచే ప్రాణప్రతిష్ఠ చేయుదురుగాన నవి కరగవని తలఁచి యట్టి మంత్రప్రభావము లేకుండ జేయుడనియు లేనియెడల మిమ్మ్ము జంపించెదననియు నాత డనేక బ్రాహ్మణులను భయపెట్టెను. అయినను ఆ ప్రతిమలు కరగలేదు.' ఈ మీర్‌జుమ్లా కర్ణాటములో నిరంకుశ ప్రభుత్వముచేసి ప్రజలకు మిగుల బాధ కలుగజేసెను. ఈ సమాచారము తెలిసి కుతుబ్‌శాహకుఁ గోపమువచ్చి యాతడు మీర్‌జుమ్లాను బిలిపించి శిక్షింపనెంచెను. కాని శాహయొక్క తల్లికిని మీర్‌జుమ్లాకును సంబంధము

న్నందువలన నామె యీ సమాచారము మీర్‌జుమ్లాకు దెలిపెను. ఇది యునుగాక మీర్‌జుమ్లాయొక్క కుమారుడు కొన్ని చేయరానిపనులు చేసి నందున వానిని నవాబు చెరబెట్టించి వానిసొత్తంతయు దీసికొనెను. అందుమీద మీర్‌జుమ్లా ఔరంగజేబున కిట్లొకయుత్తరము వ్రాసెను:—, 'హిందూదేశములోనిల్లే యత్యంతధనసంపన్నమైన రాజ్యమును మీరు స్వాధీనపరుచుకొను సమయము వచ్చినది. నేను మొదటినుండియు మోగలుల సేవకుడను. వారికి మేలు చేయవలయుననియే గోలకొండకు వచ్చితిని. గోలకొండ నవాబు తల్లి మనకు ననుకూలముగా నున్నది. కర్ణాటక సైన్యమంతయు నా చేతిలోనే నున్నది. గోలకొండ సైన్యమంత యు నా కుమారుడగు మహమ్మద్ అమీర్‌ఖానుని స్వాధీనము. ఇట్టి స్థితిలో మీరు గోలకొండ మీదికి నెత్తివచ్చినయెడల రాజ్యము మీకు నవలీలగా స్వాధీనమగును.'

ఈ యుత్తరము చూచినతోడనే యౌరంగజేబునకు నమితానందము గలిగెను. షియాపంథము నవలంబించిన కుతుబ్‌శాహను గెలుచు సంధి దొరకినదిగదా యని యాతడు సంతసించెను. అప్పు డౌరంగజేబు తన తండ్రియగు షాహజహాన్ చక్రవర్తికి ప్రతినిధిగా దక్షిణములో దౌలతాబాద్ పట్టణములో నుండెను. ఏదో పనిమీద వచ్చినట్లు భాగానగరమునకుబోయి కుతుబ్‌శాహను మోసముచేసి పట్టుకొనవలయు నని నిశ్చయించుకొని యౌరంగజేబు భాగానగరమునకు (హైద్రాబాదునకు) వెడలెను. త్రోవలో దాను బంగాళాదేశమునకు బోవుచున్నానని చెప్పుచుండెను. కాని యొక విశ్వాసపాత్రుడగు సేవకుని వలన ఈ సమాచారము తెలిసికొని కుతుబ్‌శాహ భాగానగరమునుండి పారిపోయి గోలకొండ కోటలో ప్రవేశించెను. ఔరంగజేబు కోటను ముట్టడించెను. మీర్‌జుమ్లావచ్చి యాతని గలిసెను. ఇట్లుండగా డిల్లీలో షాహజహాన్ వద్ద నాతని పెద్దకొమారుడగు దారా మంత్రిత్వము చేయుచుండెను. వానికి నౌరంగజేబు గోలకొండను ముట్టడించిన సమాచారము తెలిసెను. గోలకొండ రాజ్యమును ఔరంగజేబు జయించినయెడల నతడు బలవంతుడై తన మీదఁ దిరుగఁబడు నని తలచి దారాయను నాతడు తన

తండ్రియగు డిల్లీశ్వరునిచే నౌరంగజేబునకు, దక్షణమే గోలకొండ ముట్టడిలేపి తిరిగి రావలసినదిగా నుత్తరము వ్రాయించెను. అందుపై జేయునదిలేక ఔరంగజేబు ఈక్రింది పద్ధతులు కుతుబ్‌శాహచే నొప్పించుకొని రాజ్యమును నాక్రమింపకయే వెడలిపోయెను: (1) యుద్ధవ్యయము కుతుబ్‌శాహ యీయవలయును. (2) కుతుబ్‌శాహ తన కూఁతును ఔరంగజేబు కొమారుఁ డయిన మహమ్మదను వానికిచ్చి, రామగడమను పరగణా యామెకు నగణ మీయవలయును. కుతుబ్‌శాహ మరణానంతర మారాజ్యము మహమ్మదునకు రావలెను. (3) కుతుబ్‌శాహ రాజ్యములోని నాణెములమీఁద డిల్లీశ్వరునిపేరు వేయవలయును. (4) జుమ్లా అనువాని సొత్తంతయు వానికిచ్చివేసి వాని కిష్టమువచ్చినచోటికిఁ బోనీయవలయును.

అప్పటినుండియు గోలకొండ నవాబు డిల్లీశ్వరునకు సామంతుడై సంవత్సరమునకుఁ గోటిరూపాయలు కప్పము కట్టుచుండెను. మీర్ జుమ్లా ఔరంగజేబువద్దఁ జేరి యాతనికి దిల్లీరాజ్యము సంపాదించిపెట్టెను. ఈ అబ్దుల్లా కుతుబ్‌శాహ 1658 లో నన్నఁగా ఔరంగజేబునకు రాజ్యము వచ్చిన సంవత్సరముననే మరణము నొందెను.

•

తానీషా లేక అబూహసన్ కుతుబ్‌శాహ (1658–1687)—ఇతఁడు పూర్వపు సుల్తానునకు మేనల్లుఁడు. ఆతని కూఁతును గూడ వివాహమాడెను. ఇతఁడు సోమరియు విలాసవంతుఁడును అయినను ప్రజలను బిడ్డలవలెఁ గాపాడినవాఁడు కావున నీతనిని జనులు 'తాన్‌శాహ' అనఁగా మంచిరాజని పిలువసాగిరి. ఆమాటయే 'తానీషా' శబ్దముగాఁ దెనుఁగున మారెను. తానీషా నిప్పటికిని తెలుఁగు దేశమువారు భక్తిపూర్వకముగాఁ దలఁచెదరు. ఈ నవాబు కనఁబఱిచిన ప్రజాక్షేమతత్పరతయు, హిందూ మహమ్మదీయ మతముల యెడజూపిన సమానగౌరవమును, హిందువుఁడును బ్రాహ్మణుఁడును అగు మాదన్న పంతులవారికి ముఖ్యమంత్రిత్వమును, అక్కన్నగారికి సైన్యాధిపత్య

మును ఇచ్చుటయుఁ జూచి జను లీతనియందుఁ బూజ్యభావము కలవారై, యితఁడు పూర్వజన్మమందుఁ దపశ్శాలియగు బ్రాహ్మణుఁడనియు, తపోభంగముచేఁ దురుకయై పుట్టె ననియు నొక కథ కల్పించి యున్నారు. ఇది యొక కల్పితకథయైనను ఇందువలన నాకాలమందు నీ నవాబు తన సద్గుణములచేఁ బ్రజల కెంత ప్రియుఁడయ్యెనో స్పష్టము గాఁగలదు.

## అక్కన్న మాదన్నగార్లు

ఈ యన్నదమ్ముల పేర్లు మన తెలుఁగువారు రెండువందల సంవత్సరములనుండి గౌరవపూర్వకముగా స్మరించుచున్నారు. అశ్వినీకుమారులవలె వీరిద్దఱి నామములు కలిపి యుచ్చరింపఁబడునే కాని విడివిడిగా నుచ్చరింపఁబడవు. ఈ పేర్లు మనకు నిదివఱకుఁ దెలిసినను వీరినిగురించి మనకేమియుఁ దెలియదు. ప్రస్తుతము కొన్ని పురాతన గ్రంథములును, కాగితములును వెతకిచూడఁగా గొన్నిసంగతులు దెలిసినవి. వీరియింటి పేరు పింగళివారు. ఈ పింగళివారిది భారద్వాజ గోత్రము. కావున వీరికిని గౌతమగోత్రుఁడగు పింగళి సూరన్న యొక్క వంశమునకును నేమియు సంబంధములేదు. అక్కన్న మాదన్నగారి వంశజుల మని చెప్పుకొను పింగళివారిప్పుడు నైజాము రాజ్యములోని యొరుగంటిలో నున్నారు. వీరిద్దఱును మహారాష్ట్రులనియు అక్కన్నగారికి 'ఏకనాథ్ పంత్' అనియు, మాదన్న పంతులుగారికి 'మదనపంత్' అనియుఁ బేళ్ళుండె నని కొందఱు మహారాష్ట్ర లిటీవలి వారు వ్రాసియున్నారు. కాని యందుకు వారేమియు నాధారము చూపినవారుకారు. నేను చూచినంతవఱకును పూర్వ మహారాష్ట్ర తురుష్కాంగ్ల గ్రంథాదులలో 'అక్కన్న' 'మాదన్న' నామములే వాడంబడి యున్నవి. ఇదియుఁగాక ప్రస్తుతము మాదన్నగారి వంశజులమని చెప్పెడువారు తెలుఁగువారు కావున వీరు తెనుఁగువారనియే మనము నిశ్చయింపవచ్చును.

అక్కన్నగా రన్నయనియు, మాదన్నగారు తమ్ముఁడనియు సామాన్యముగా జను లనుకొనుచున్నారు. కాని యక్కన్నగారు నిజమైన

యన్న కాఁడని యొక యైతిహ్యముకలదు. అక్కన్నగా రొక బీదవాఁడగు బ్రాహ్మణుఁడట. మాదన్నగారు మంత్రిత్వము చేయుచుండఁగా అక్కన్నగా రాతని యింటికివచ్చి ప్రవేశించెనఁట. తనభార్య బంధువుఁడని తలఁచి మాదన్నగారును, భర్త బంధువుఁడని తలఁచి యాతని భార్యయు అక్కన్నగారిని మిక్కిలి మర్యాద చేయుచుండిరి. అక్కన్న గారు వయస్సులోఁ బెద్దవాఁడగుటచే మాదన్నగారాతనిని అన్నగారని పిలుచుచుండిరి. ఇట్లు కొన్నిదినములు గడచిన తరువాత నొకనాఁడు మాదన్నగారు భార్యతో అక్కన్నగారిని గురించి ముచ్చటింపఁగా నాతఁ డామెకు బంధువుఁడు కాఁడని తెలిసెను. అందుపై నతఁ డక్కన్నగారిని మనకుఁగల బంధుత్వము తెలుపుమనఁగా "నాయనా వినుము. నేను పెద్దమ్మకొమారుఁడను, నీవు చిన్నమ్మకొమారుఁడవు. ఇట్లు మన మక్క చెల్లెండ్ర బిడ్డలముగాన నన్నదమ్ములము సుమా. ఈ రహస్యము నీమన స్సులో నుంచుకొనుము. మనమెప్పటియట్ల యన్నదమ్ములవలెఁ బ్రవ ర్తించెదము" అని యనెనఁట!అక్కన్నగారి బుద్ధిచాతుర్యమునకు మెచ్చి మాదన్నగా రాతనిని అటుతరువాత అన్నగానె చూచుచుండిరఁట. ఈ కథయొక్క సత్యాసత్యత్వములు నిర్ణయించుటకు వీలులేక పోయినను, వినుటకు నిది యింపుగానున్నది.

గ్రంథాదులను బట్టిచూడఁగా మాదన్న పంతులుగారే తానీషాయొద్ద ముఖ్యమంత్రిగా నున్నట్టు స్పష్టపడఁగలదు. మొదట అక్కన్నగారి కేమిపని యుండెనోకాని 1682 లో మహమ్మద్ ఇబ్రాహిం అనువానిని దొలఁగించి 'షాహలష్కర్' అధికారమనఁగా సైన్యాధిపత్యము అక్క న్నగారి కీయఁబడెనని ఫోర్ట్ సెంట్ జార్జికోటలోని యొకదస్తావేజు వలన స్పష్టమగుచున్నది. * అంతకుఁ బూర్వపు ఇంగ్లీషుదస్తావేజు

---

* Vide Press List of Ancient Records in Fort St. George, dated 17th May 1882; Reference Letters to Fort St. George, Vol. II, pp 105- 109.

లలో అక్కన్న మాదన్నలను రెండు పేర్లును జంటగా నుండుటవలన 1682కుఁ బూర్వమునందుఁగూడ అక్కన్నగారు పెద్ద యధికారిగా నుండిరని మనమూహింపవచ్చును. అట్లు లేనియెడల నింగ్లీషువా రీతనికి బహుమతులు పంపుటయెట్లు సంభవించును ? రాజ్యాంగ సంబంధమైన యన్ని విషయములలోను అక్కన్న మాదన్న లిద్దఱును గలిసి పని చేయుచున్నట్టు కానవచ్చుచున్నది.

తానీషాకు నీ మంత్రిపుంగవుల మీఁదఁ బూర్తిగ నమ్మికయుండెను. వారును స్వామిభక్తియుఁ బ్రజానురక్తియుఁ గలవారై ప్రజలకందరికి సౌఖ్యముగలుగునట్లు రాజ్యమును పాలించిరి. హిందువులగుటచే హిందువులయందు నెక్కు డభిమానము గలవారలై యన్నివిషయములందును హిందువులను మహమ్మదీయులతో సమానముగాఁ జూడసాగిరి ఉన్నతో ద్యోగములన్నియుఁ దురకలకె యీయక యనేక హిందువులకుఁగూడ నిచ్చిరి. పూర్వమువలెఁ దురుష్కులు హిందువులను బాధ పెట్టకుండునట్లు గాపాడిరి. అదివఱకు రాజుయొక్క జాతివారమని విఱ్ఱి వీగి, తామే శ్రేష్ఠులమని చెప్పుకొనుచు, స్వదేశవాసులగు హిందువులను దిరస్కరించుచున్న తురుష్కులు మాదన్నగారు స్థాపించుచున్న హిందూ ముసల్మానుల సామ్యముఁజూచి యోర్వలేకపోయిరి. అందుచే వారికి ననేక శత్రువు లుద్భవించిరి.

కుతుబ్‌శాహి రాజ్యమును గుత్తుకలో నెప్పుడు వేసికొందునాయని మోగలరాజులు చూచుచుండిరి. అట్లుగాకుండ యజమానుని రాజ్యమును గాపాడవలయుననియు, హిందువుల గౌరవ మధికముచేయుటకె హిందువుల యైక్య మభివృద్ధి చేయవలయుననియు మాదన్న పంతులు శ్రీ శివాజికిని తానీషాకును స్నేహము కుదిర్చెను. మాదన్నపంతులుగారాహ్వానము చేసినందున 1676 లో శివాజి కర్ణాటక దండయాత్రకు బయలుదేఱినపుడు గోలకొండకుఁ బోయి, తానీషాను జూచి స్నేహము దృఢపఱుచుకొనెను. అప్పుడు మాదన్నగారు శివాజికిని, శివాజి మాదన్నగారికిని విందులుచేసిరి. ఆ మంత్రిపుంగవులు శివాజియొక్క స్వదేశప్రీతియుఁ గొనియాడిరఁట. శివాజి పోయినతరువాత నాతని కుమారుఁ

డగు సంభాజికిని తానీషాకును మైత్రిచేసి, వారిదఱిఁ గలిసి ఔరంగ జేబుతో యుద్ధము చేయునట్లు మాదన్నగా రేర్పాటు చేసిరి.

మాదన్నగారు ధర్మమునందు మిక్కిలి శ్రద్ధగలవారుగను, విద్వాంసుల నాదరించువారుగను నుండిరి. నిత్యము ప్రాతఃకాలమందుస్నానము చేసి జాము ప్రొద్దెక్కువఱకును శివపూజ చేయుచుండిరి. అట్టిసమయమున విద్వాంసులందఱునువచ్చి తమ తమ విద్యానైపుణ్యమును జూపి బహుమతులందుచున్నట్టు శివదిగ్విజయ మను మహారాష్ట్ర గ్రంథము వర్ణింపఁబడినది.

తానీషాకుతుబ్‌షా మరాటావారితో సంధిచేసికొనుట విని ఔరంగ జేబు తనసైన్యములను గోలకొండమీఁదికి బంపెను. కాని యక్కన్న మాదన్నగార్లా సైన్యములను అనేక పర్యాయము లోడించి పాఱఁదోలిరి. అందుచే నీ మంత్రిపుంగవులున్నంత వరకును డిల్లీశ్వరునివలనఁ గుతుబ్‌శాహ కేమియు నష్టము కలుగలేదు.

ఇట్లు గోలకొండలో సర్వాధికారముతో ప్రభుత్వముచేయుచున్న యీ మంత్రిపుంగవుల యనుగ్రహము వడయవలయునని మన దేశము వారు గాక ప్రాఫెంచి యింగ్లీషువారుఁగూడ విశ్వప్రయత్నములు చేయుచుండిరి. అప్పుడు ఈస్టుఇండియా కంపెనివారు చిన్న వర్తకులు. చెన్న పట్టణము ఒక చిన్న గ్రామము. ప్రస్తుతము జార్జిటౌన్ అనఁబడు స్థలముమాత్రము కంపెనివారి స్వాధీనములో నుండెను.మచిలీపట్టణములో వీరికి నొకగిడ్డంగి (Factory) యుండెను. ఈ స్థలము లన్నియు గోలకొండవారి రాజ్యములోనివి. కావున నీ భూములకై కంపెనివారు గోలకొండ నవాబునకు శిస్తుచెల్లించుచుండిరి. ఇంతియకాక గోలకొండ రాజ్యములో నిరాటంకముగా వర్తకము చేసికొనుటకు నవాబు నాజ్ఞ కావలసియుండెను. కంపెనివారికి ఔరంగజేబుతో వైరముండెను. కావున గోలకొండలో సర్వాధికారులయిన అక్కన్న మాదన్నగారి యనుగ్రహము సంపాదించుటకుఁ జెన్నపట్టణములోని యింగ్లీషువాండ్రు విశ్వప్రయత్నములు చేయుచుండిరి. 1678 లో తానీషాయు మాదన్నగారును

మచిలీపట్టణమునకు, బోగా నచ్చటి యింగ్లీషువారు వారిని మిగుల గౌరవించి వారి యనుగ్రహము వడయుటకై వారికి ననేక బహుమతులొసంగిరి. 1679-వ సంవత్సరపు ఫిబ్రవరినెలలో చెన్నపట్టణపు ఇంగ్లీషువారు తమకు స్యాంథోం (మైలాపూరు), ఎగ్మూరు అను స్థలములు కౌలున కిప్పించునట్లు కోరిరి. 1680 లో పోడేల లింగప్పయనువాడు చెన్న పట్టణమునకు సరకులురాకుండ నడ్డగించి నందున వాడటుచేయకుండ మాన్పవలసినదనియు, దమవర్తకమునకు భంగములేకుండ, జేయవలసినదనియు, గంపెనీవారు అక్కన్న మాదన్న పంతులవారిని, గోరిరి. అంత వారు దయామయులై కంపెనీవారిని బాధపెట్టవలదని లింగప్పకు వ్రాసి, యాతనినే తమ ప్రతినిధిగా నేర్పఱిచి అన్ని విషయములను గుఱించియు నింగ్లీషువారితో నుత్తరప్రత్యుత్తరములు జరుపుచుండుమని యాజ్ఞాపించిరి. ఈ లింగప్పనే 1682 లో మాదన్నగారు కృష్ణానదికి దక్షిణమునందున్న గోలకొండ రాజ్యమున కంతకును సుబేదార్ (Governor) గా నియమించిరి. కావున నీ లింగప్ప యప్పటిగొప్ప సరదారులలో నొక్కడని చెప్పవలయును. 1682 సం॥ జూలై నెలలో మెడ్రాస్ గవర్నరుసకు పోడేల లింగప్ప యొక యుత్తరమువ్రాసెను. అందు సంవత్సరపుపన్ను 1200 వరహా లీయవలసినదనియు, అక్కన్న గారి యోడలవిషయమై కొంతసాహాయ్యము చేయవలసినదనియు వ్రాసెను. అందువలన అక్కన్నగారికి నోడలున్నవనియు, నాతడు సముద్ర వర్తకము చేయుచుండెననియు మన మూహింపవచ్చును. అది వరకు కంపెనీవారికి నియమబడిన ఫర్మందు ప్రకారము విశాఖపట్టణము మొదలయిన స్థలములలో కంపెనీవారికి వర్తకవిషయమైన వీళ్ళు కలుగ జేయమని కంపెనివారక్కన్న మాదన్నగారిని 1682 సెప్టెంబరులో, గోరిరి. వారి కనేక బహుమతులను బంపిరి. అక్కన్నగారికిని, దుబాష్ వెంకటాద్రికిని 25-వ సెప్టెంబరు దినమున బహుమతులనంపిరి. యీ సంవత్సరపు అక్టోబరునెలలో అక్కన్నగారు మచిలీబందరు మొదలయిన స్థలములకు, బోగా నచ్చటి కంపెనివా రాతనిని మిగుల గౌరవించిరి. పోడేల లింగప్ప కంపెనీవారిపై చాడీలు చెప్పినందున అక్కన్న

గారికి వారిపై కోపమువచ్చెను. 1682 నవంబరులో మాదన్నగారి కుమారుడు మల్లప్పకు వివాహమయ్యెను. అప్పుడు మాదన్నగారికి వీసెడు బంగారపుగొలుసులు కావలసివచ్చెను. అందుకు వెలయిచ్చెదనని యాతడు తెల్పినను వలదనిచెప్పి చెన్నపట్టణపు ఇంగ్లీషువారా బంగారపుగొలుసు, కానుకగా బంపిరి. * 1683-వ సంవత్సరమునందు 1-వ జనేవరిదినమున సంవత్సరాది కానుక గంపెనీవారు 400-వరహాలు మాదన్నగారికిఁ బంపిరి. వారి యనుగ్రహము వడయుట కివి పంపఁబడెనని వ్రాయఁబడియున్నది. ఇంగ్లీషువారిని ననుగ్రహించుటకును, పరదేశమునుండి వచ్చిన యితరాగంతుకుల (Interlopers) ను గోలకొండ రాజ్యములోనుండి వెడలఁగొట్టుటకును అక్కన్నగారికి నెన్నియో పుట్లరాగియు, ధనమును ఇచ్చెదమని చెన్నపురములోని యింగ్లీషువారు 1683 లో 14-వ ఆగస్టు దినమునఁ దెలియజేసిరి. ఇట్లొక్కటా? రెండా? మాదన్న గారి కుమారుని యుపనయనమునకు, పెండ్లికి, మాదన్నగారి పేష్కారుకు (Secretary) ఆయనబిడ్డకు, పినతండ్రికి బహుమతులు పంపి వారి యనుగ్రహమును సంపాదించుటకై యీస్టిఇండియా కంపెనివారు ప్రయత్నించుచుండిరి.

ఈ మంత్రిపుంగవు లప్పుడప్పుడు బెజవాడలో వాసముచేయుచు బీదలకు దానధర్మములు చేయుచుండిరట. ప్రస్తుతము బెజవాడ కనకదుర్గయున్న గట్టుమీద అక్కన్న మాదన్నగారి సత్రములని యొకానొక సత్రము చూపెదరు. అచ్చట నీయమాత్యశ్రేష్ఠులు బీదవారికి నన్నము పెట్టించు చుండిరఁట. అచ్చటనుండి గోలకొండవఱకుఁ నొకబిలముకలదనియు, అందులో నుండి యక్కన్న మాదన్నగారు గోలకొండకుఁ బోవుచుండిరనియు నొక పిట్టకత చెప్పెదరు. తానీషా కొండపల్లి దుర్గముమీఁదను, అతని మంత్రిలగు వీరు బెజవాడలోను అప్పుడప్పుడువచ్చి కొన్నిదినములవఱకు వాసముచేయుచుండిరి.

---

* Pub. Cons. Vol. VII pp. 126, 127 as shown in the Press List. Pub. Cons. Vol. VIII. pp. 1-3 (Press List).

## రామదాసు.

ఈ సందర్భములో మనము భద్రాచల రామదాసును మఱవఁ గూడదు. ఈ భక్తాగ్రేసరుఁడు అక్కన్న మాదన్నగారికి మేనల్లుడఁట. ఈతఁడు పుట్టిన స్థలము నేలకొండపల్లి. ఇది నైజాం రాజ్యములోఁ గమ్మము మెట్టునకుఁ బదిమైళ్ళమీఁద నున్నది. ఈతని పేరు గోపన్న. రామభక్తి చే రామదాసను బిరుదువచ్చెను. ఇతఁడు భద్రాచలము తాలూకాకు తహసీల్దారుఁడుగా నుండి గోలకొండ బొక్కసమునకుఁ బంపవలసిన పైకమంతయుఁబెట్టి శ్రీరామునకు గుళ్ళు కట్టించెను. ఇట్లు సర్కారుపైక మపహరించినందులకు నాతనిని పండ్రెండు సంవత్సరములవఱకు గోలకొండలోని చెఱసాలలో బెట్టిరి. రామదాసును ఉంచిన చెఱసాల యిదియేయని గోలకొండ దుర్గములో నొకచోటు ప్రస్తుతము చూపెదరు. ఇతఁ డీయవలసిన పైకమంతయు నితఁడు చెఱలో నుండగా శ్రీరామలక్ష్మణులు తెచ్చి తానీషాకిచ్చిరనియు నంత నీతనికి బంధవిముక్తి కలిగెననియు భావికజనులు చెప్పుకొనియెదరు. అటుతరువాత నితఁడు భద్రాచలములోనే వాసముండి బొందితో వైకుంఠమునకేగెనఁట !

## గోలకొండరాజ్య వినాశము.

పైని వర్ణింపఁబడినట్లు గోలకొండ నవాబగు అబూహసన్ కుతుబ్‌షాహ హిందూ ముసల్మానులని భేదముచేయక యందఱిని సమానముఁగా జూచుచు హిందువులును బ్రాహ్మణులును అగు అక్కన్న మాదన్న గారికి మంత్రిత్వమిచ్చి రాజ్యముచేయుచుండఁగా నా రాజ్యములోని తురుష్కులకు నట్టి రామరాజ్యము విషతుల్యమయ్యెను. అది వరకుఁదామే సర్వాధికారముచేయుచు హిందువులను ద్రొక్కివేయుట వారికి నలవాటయినందున అక్కన్న మాదన్నగారి యభ్యుదయముఁ జూచి వారోర్వలేక పోయిరి. అట్టి మహమ్మదీయులలో మహమ్మద్ ఇబ్రాహిం అనువాఁడు ముఖ్యుఁడు. ఇతఁడు మొదట షాహలష్కరు (సేనాధి

పతి) గా నుండెను. 1682 లో ఇతనిని ఈ పనిలోనుండి తొలఁగించి సర్ ఖేల్‌పని యీతనికి నొసంగిరి. షాహలష్కరుపని అక్కన్నగారి కీయఁబడెను.

అప్పటినుండియు అక్కన్న మాదన్నగారిని ఎట్లయిన నాశమం దింపవలయునని యీతఁడు నిశ్చయించెను. మాదన్నగారి మడికొలనులో నొక తురకవాఁడు స్నానము చేయఁగా వానిని మాదన్నగారు శిక్షించి రఁట. తురుష్క రాజ్యములోఁ దురుష్కులఁ కిట్టి శిక్షలు విధించుట యన్యాయమని మొఱలిడుచు నాతురుష్కుఁడు దిల్లీశ్వరునియొద్దకుఁ బోయెనఁట. ఏదోసాకు చూచి గోలకొండ రాజ్యమును మ్రింగుట కెదురుచూచుచున్న ఔరంగజేబు, బ్రాహ్మణులను మంత్రులుగాఁ బెట్టు కొనుటయు, మహమ్మదీయునికిఁ దగనట్లు ప్రవర్తించుటయు ననుఁ రెండపరాధములు తానీషా చేసెనని చాటించి, వానిమీఁదికి 1686 లో దనకుమారుఁడయిన ముఅజ్జం అనువానిని, ఖాన్‌జహాన్ అను సైన్యా ధీశునిఁ బంపెను. వారిద్దరి నెదిరింపం గోలకొండనుండి మహమ్మద్ ఇబ్రాహీం పంపఁబడెను. కాని వాడు అక్కన్న మాదన్నగారి మీదనున్న ద్వేషమువలన స్వామిద్రోహియై శత్రువులలోఁ గలిసెను. ఆ సైన్యము లన్నియు హైద్రాబాద్ పట్టణమును సమీపించెను. ఈవార్తవిని తానీషా భయపడి గోలకొండ దుర్గములోనికిఁ బాఱిపోయి దుర్గద్వారములను వేయించెను. మోగలుసైన్యములు హైదార్‌బాద్ పట్టణమును ఇష్టమువచ్చి నట్లు దోఁచుకొనెను. అప్పు డాపట్టణములోనుండి మోగలులు తీసికొనిన ధనము నాలుగైదుకోట్ల రూపాయలకుఁ దక్కువ యుండదని యొక తురుష్క చరిత్రకారుఁడే వ్రాసియున్నాడు. ఎంతమంది పురుషులును, స్త్రీలును చెరపట్టఁబడిరో లెక్కలేదు. ఇట్లు జరుగుచుండఁగా తానీషాకుఁ దెలియకుండ నాతని యంతఃపురస్త్రీలు అక్కన్న మాదన్నగారిని జంపిం చుటకు యత్నములు చేయుచుండిరి. ఒకదినము వారు దివాణమునుండి యింటికిఁ బోవుచుండగా గొందఱు దూతలు వారిమీఁదబడివారినిఁజంపిరి. వీరిద్దరి శిరస్సులు కోసి ఔరంగజేబు పుత్రుఁడైన ముఅజ్జం వద్దికిఁ బంపిరట. ఆదినముననే బ్రాహ్మణులనేకులు గోలకొండ కోటలోఁ జంప

బడిరి. ఇట్లు అక్కన్న మాదన్నగారు పోయినందున తానీషాకుఁదగిన సాయముచేయువా రెవరును లేకపోయిరి. అందుచే నాతఁడు రెండుకోట్ల రూపాయిలిచ్చి మోగలులతో సంధిచేసికొనెను. కాని యీసంధి మిక్కిలి దినములవరకు నిలిచినదికాదు.

1686-వ సంవత్సరమునందలి అక్టోబరులో విజాపుర దుర్గమును స్వాధీనపఱచుకొని ఔరంగజేబు గోలకొండను తీసికొన నిశ్చయించెను. కలుబరగీ (గుల్బర్గా) లో నున్న యొకానొక సాధువుయొక్క సమాధి చూచుటకు వెళ్ళుచున్నానని బొంకి యాతఁడు తన సైన్యములతో గోలకొండను సమీపించెను. తానీషా యాతనికృపకుఁ బాత్రుఁడు కావలయునని యత్నించెను. కాని 'నీవు బ్రాహ్మణులను మంత్రులుగాఁ బెట్టుకొంటివి; పర మతస్థుఁడగు సంభాజీతో స్నేహముచేసితివి; మహమ్మదీయ మతసిద్ధాంతములకు విరుద్ధముగాఁ బ్రవర్తించితివి. కావున నీతో యుద్ధముచేసి నీ రాజ్యమును తీసి కొందునే కాని సంధిపొసఁగద' నిచెప్పి యౌరంగజేబు గోలకొండ కోటను ముట్టడించెను. ఇంక యుద్ధముచేయనిది విధిలేదని తెలిసికొని తానీషా తనవిలాసచర్యలు వదలి, మిక్కిలి ధైర్యవంతుఁడై సైన్యమును చక్కఁబఱచుకొని యద్భుతశౌర్యముతోఁ బోరఁజొచ్చెను. ఏడు నెలలవఱకు ముట్టడివారితో ఘోరముగాఁ బోరి వారిలోని యనేక వీరాగ్రేసరులను రూపుమాపెను. కాని భేదోపాయములో నాఱితేరిన ఔరంగజేబు తానీషాయొక్క సైనికులలో నొక్కొక్కనిఁ జీలఁదీయ సాగెను. ఇద్దఱు సేనాధీశులు తప్ప మిగిలిన వారందఱును స్వామిద్రోహులై మోగలులలో గలిసిరి. ఇట్లు తానీషా పక్షమందున్నవారు అబ్దుల్లా ఖానుఁడను వాడును అబ్దుల్రజాక్ లారీ యనువాఁడును. వీరిద్దఱికి లంచమిచ్చి వీరిని వశపఱచుకొనవలెనని యౌరంగజేబు మిక్కిలి యత్నించెను. తుదకు అబ్దుల్లాఖానుఁడు ధనాశచే స్వామిని విడిచెను. కాని స్వామి భక్తాగ్రేసరుఁడగు అబ్దుల్రజాక్ మాత్రము సత్యసంధత్వము వదలినవాఁడు కాఁడు. దుర్గముయొక్క యొకానొకద్వారమును కాపాడుచున్న అబ్దుల్లాఖానుఁడు నాశచే ద్వారము తెఱచి శత్రువులను కోటలోనికి రానిచ్చెను. అంత ఔరంగజేబు కోట

స్వాధీన పఱుచుకొని (1687 సెప్టెంబరు) తానీషాను దౌలతాబాదు దుర్గం మీదఁ జెఱఁబెట్టెను. అతఁ డప్పటనే కాలధర్మము నొందెను.

ఇప్పట స్వామిభక్తి పరాయణుఁడగు అబ్దుల్‌రజాకును గుఱించి కొంపము ప్రాయవలయును. ఇట్టివా రందఱికిని బూజ్యులు. మోగలులు కోటలోనికిఁ జొరఁబడుచున్నారని తెలిసినతోడనే యాతఁడు కోగిరిలేని గుఱ్ఱముమీద శీఘ్రముగానెక్కి చేతఁగత్తి పట్టుకొని శత్రుసముద్రములోనికిఁ బోయి ఘోరముగా యుద్ధముచేయఁజొచ్చెను. వేలకొలఁది శత్రువులు క్రమ్ముకొని కత్తులతో నాతనిని నొప్పింపసాగిరి. నఖశిఖాంతము వరకు వ్రణములు తగిలినందున నిశ్చేష్టితుఁడై గుఱ్ఱము తీసికొనిపోయి నచోటికిఁ బోయెను. ఒకానొకతోటలో నాతనిని ఆ గుఱ్ఱము పడవైచెను. రెండవదిన మచ్చటివా రాతనిని గుర్తించి యౌరంగజేబు శిబిరమునకుఁ గొంపోయిరి. రాయిగుండెకల యా యౌరంగజేబుకూడ అబ్దుల్‌రజాక్ శౌర్యమునకు నచ్చెరు వందినవాఁడయి, యాతనిని మన్నించి 'ఇట్టి సేనాధీశుఁడు మఱియొకఁడు తానీషాయొద్ద నున్నయెడల మేము గోలకొండ తీసికొనుట దుర్లభమె యుండునని, సంభావించి యాతనికిఁ జికిత్స చేయుటకు నిద్దఱు రణవైద్యుల నేర్పాటుచేసెను. అందు నొకఁడు యూరోప్ దేశస్థుఁడు, మఱియొకఁడు హిందువు. వీ రాస్వామిభక్తుని గాయములకుఁ జికిత్సచేసి, 'మొత్తముమీఁద నాతని శరీరమందు డెబ్బది గాయముల లెక్కించితిమి. మరి గాయము లనేకములు కలవు; కాని గాయముపై గాయము పడినందున లెక్కవేయుటకు వీలులేకపోయె' నని చెప్పిరి. పదునాఱుదినము లాతనికి నుపచారముచేయఁగా నతఁడు కనులవిప్పిచూచెను. అంత నౌరంగజేబు 'నీ యపరాధము లన్నియు క్షమించితిని. మన్‌సబు మొదలయిన యధికారములను నీ కొసంగెదను. నీ కొమారులను నాయొద్దికిఁ బంపు' మని యాతనికి వర్తమానమంపెను. అందుపై నా శూరాగ్రేసరుఁడు తనకుపచారములు చేయించినందులకుఁ గృతజ్ఞతను గనఁబఱచుచుఁ 'దాను జీవింపననియు, జీవించినను ఉద్యోగము చేయుటకుఁ దనకు సామర్థ్యముండదనియు, నొకవేళ సామర్థ్యముండినను, తానీషా యుప్పతిన్న వాఁడెవఁడును వాని శత్రుఁడగు ఔరంగజేబు సేవ చేయఁజాలఁ' డనియు ప్రత్యుత్తరమంపెను. ఆప్రత్యు

త్తరమును విని ఔరంగజేబు చిన్నఁబోయెనట. ఆహా! మొదట లక్షల కొలఁది ధనమును ఉన్నతాధికారమును, ఇచ్చెదనన్న డిల్లీశ్వరుని లంచ ములనుగూడ ధిక్కరించి, బలహీనుఁడయిన తన యజమానునియందె దృఢభక్తి గలవాఁడై, డెబ్బదిగాయములు తగిలి ప్రాణావసానకాలము వచ్చినను తనస్వామి కపకారము చేసినవాఁడగు డిల్లీశ్వరుని సేవలో నుండుటకు నొప్పుకొనక యాతనిని నిర్భయముగా ధిక్కరించిన యీ మహానుభావుఁడు భువనైకవంద్యుఁడనుటకు సందేహములేదు.

ఇట్లు 1512 మొదలు 1682 వఱకు 175 సంవత్సరములు ప్రభు త్వము చేసిన గోలకొండ కుతుబ్‌శాహి రాజవంశ మంతరించెను. బహ మనవంశపు రాజులకంటెను, అందుండి పుట్టిన యితర మహమ్మదీయ రాజ్యముల ప్రభువులకంటెను గోలకొండ నవాబులు ప్రజాహిత దక్షత యందు మిగులఁ బేరొందిరి. వీరందఱును దీర్ఘకాలము రాజ్యముచేసిరి. ఈ రాజవంశములో నొకరిని నొకరు చంపి రాజ్యమును సంపాదించుట లేదు. రాజ్యములోఁ గల్లోలమును ఏమియు లేకయుండెను. ఇదియును గాక యీరాజులు తురుష్కులయ్యును, హిందువుల యెడను, దేశభాష యందును అభిమానము కలిగియుండిరి. కావుననే తురుష్క రాజ్యమయి నను గోలకొండరాజ్యము పోయినందులకుఁ బ్రజలందరును తల్లడిల్లిరి.

# నాల్గవ ప్రకరణము.

....o....

## విజయనగర సామ్రాజ్యము

ఉత్తర హిందూదేశమునుండి మహాప్రవాహముతో వెడలి దక్షిణ హిందూదేశమందలి హిందూమతమును హిందూరాజ్యములను రూపు మాపుటకు సిద్ధముగానున్న మహమ్మదీయులనఁబడు మహానదిని రెండు వందల యేఁబది సంవత్సరములవరకు నడ్డగించి హిందూమతమును హిందువుల ప్రాభవమును రక్షించిన విజయనగర సామ్రాజ్యమును వేయినోళ్ళఁ గొనియాడినను తనివి తీరదు. దక్షిణ దేశములోని హిందూ రాజ్యములన్నియు నడుగంటినందున హిందూమతమునకును తదుద్ధరణ మునకును నాధారమేమియు లేకపోయెను. దక్షిణ హిందూదేశమున కట్టి విపన్నావస్థ ప్రాప్తించినపుడు దాని నుద్ధరించుటకు నవతరించిన రాజ్యమే విజయనగర సామ్రాజ్యము. ఈ ప్రభుత్వమప్పు డుదయించియుండని యెడలఁ బదునాలవ శతాబ్దమునందే యనఁగా నేటికి నెదువందల సం వత్సరములకుఁ బూర్వమే దక్షిణదేశమంతయుఁ బూర్తిగఁ దురుష్కుల పాలై, హిందూమతమంతయు నడుగంటి, నేఁటివఱకు మనమందఱమును మహమ్మదీయులమై యుందుమనుట యతిశయోక్తి కానేరదు.

క్రీ. శ. 1307 లో తురుష్కులు దేవగిరి రామరాజును చెఱపట్టి డిల్లికి గొంపోయినపిమ్మట నతని భృత్యుల్లో నొక్కడును ముమ్మడి

సింగయ యను బేడరు నాయకుని పుత్రుఁడునునైన కంపిలిరాయడు తన యేలుబడిక్రింద నుండిన కంపిలి ప్రాంతమునకువచ్చి యచ్చట స్వతంత్ర ముగ రాజ్యము సేయఁగడగెను. ఇతఁడు గొప్ప శూరుడు; హిందూ ధర్మమునందు గాఢమైన యభిమానము గలవాడు, మహమ్మదీయుల దుష్కృత్యములను సహింపక వారి నెట్లయిన గీటడచి నష్టమైపోయిన హిందూ స్వాతంత్ర్యమును పునరుద్ధరించి హిందూధర్మమును సంరక్షించ వలయునని పట్టుబట్టెను.

కీ. శ. 1312 లో రామరాజు మృతినందిన పిమ్మట దేవగిరి యాదవరాజ్యము తురుష్కాక్రాంతమైనది. డిల్లీశ్వరుడైన అలావుద్దీను ఖల్జీ తన సర్వసేనాధిపతియైన మల్లిక్‌నాయబు కాఫూరును దేవగిరిరాజ్య మునకు పాలకునిగ నియమించెను. అప్పటికే కంపిలిరాయడు ప్రబలుడై కృష్ణా తుంగభద్రలనడిమి యంతర్వేదిలో చాలా భాగము నాక్రమించు కొని యుండెను. అతని రాజ్య జన్మస్థానము కంపిలియైనను హోసపేట తాలూకాలోని కుమ్మఠ దుర్గమునందతడు నివసించుచు ఇటు కాకతి ప్రతాపరుద్రునితోడను, అటు ముమ్మడి వీరబల్లాళ దేవునితోడన యుద్ధ ములు చేయుచు రాజ్యమును విస్తరింపజేయుచుండెను. తుంగభద్రా తట మున పంపా నిరూపాక్షమున కెదుటి గట్టున కొండలనడుమ మూరానెయ సంధియను చోట హోసమల దుర్గమును నొక ప్రబలమైన కోటను గట్టిం చెను.ఇదియే ఆనెగొంది యను పేర తరువాతికాలమున ప్రసిద్ధికెక్కెను. కంపిలిరాయని గూలద్రోసి యతని రాజ్యము వెట్లయిన యాక్రమించు కొనవలయునని నిశ్చయించి మల్లిక్‌నాయబు కాఫూరతనిపై దండువెట్టి క్రీ. శ. 1314 లో కుమ్మఠమును ముట్టడించెను. ఒక వారము చుట్టు ముట్టినను ఆ దుర్గము పట్టుబడకపోగా నిరాశజెంది యతడు ముట్టడి లేవ దీసికొని దేవగిరికి మరలిపోయెను.

మల్లిక్‌నాయబుకాఫూరుయొక్క తిరోగమనమువలన కంపిలి రాయని కీర్తిప్రతిష్ఠలు హెచ్చినవి. అతని యాత్మగౌరవమభివృద్ధి చెంది

నది. తా నెట్టి శక్తివునైన ఢీకొని యెంతటి దుర్ఘటకార్యమునైన నిర్వహింప గలుగుదునను నమ్మకము గుదిరెను. కావున నతఁడెవ్వరిని సరకుసేయక రాజ్యము సేయదొడగెను - ఇట్లు ఐదారేండ్లు గడచినవి, ఇంతటిలో భారతదేశ రాజకీయవాతావరణము మార్పు జెందినది. డిల్లీలో ఖల్జీల యధికారము సమసి వారిస్థానమున తుఘ్లుకులు సామ్రాజ్య పీఠము నధిష్ఠించిరి. క్రీ. శ. 1323 లో ఘయ్యాస్ ఉద్దీన్ తుఘ్లుకు తన కుమారుడగు ఉలూఘ్ ఖానుని నాయకత్వముక్రింద నొక దండయాత్ర దక్షిణాపథముపై నంపి కాకతీయ పాండ్య సామ్రాజ్యములను గూలద్రోయించి యాంధ్ర ద్రావిడదేశములను రెంటిని డిల్లీసామ్రాజ్యమున గలుపుకొనెను. అంతటితో కొంచెమించుమించుగ నాసేతు శీతాచల పర్యంత వ్యాప్త సమస్త భారతావనియు మహమ్మదీయులకు హస్తగతమయ్యెను. కళింగోత్కళములును కంపిలికర్ణాటములు మాత్రమింకను హిందువుల యాధిపత్యముక్రింద నుండినవి. క్రీ. శ. 1325 లో డిల్లీసుల్తాను ఘయాస్ ఉద్దీన్ తుఘ్లుకు ఆకస్మికముగ మృతినందగా నతని పుత్రుడైన యుల్లూఘ్ ఖానుడు సింహాసనము నెక్కి మహమ్మదుబిన్ తుఘ్లుకు నామమువహించి సామ్రాజ్యపాలనము సేయగడగెను. ఇతనితో కంపిలి రాయలకు వైరము పొసగినది. మహమ్మదుబిన్ తుఘ్లుకుయొక్క మేనత్త కొడుకైన బహావుద్దీన్ గర్షాస్పను నతఁడు కృష్ణాతటమందలి సగరపురమును పాలించుచుండెను. ఆతఁడు సుల్తానుపై దిరుగుబాటుచేసి డిల్లీసామ్రాజ్యమునకు దానె యధిపతినని ప్రకటించి యుద్ధప్రయత్నములు సేయదొడగెను. కాని, సుల్తానుచే పరాజితుడై కుమ్మఠమునకు బర తెంచి మిత్రుడైన కంపిలిరాయని శరణువేడెను. శూరధర్మము ననుసరించి యతఁడు బహావుద్దీనుని చేరదీసి సంరక్షణ నొసఁగెను. తత్కారణమున సుల్తానుకు కోపము వచ్చినది - కంపిలిరాజ్యము మీదికి క్రీ. శ. 1326 లో దండంపుచు, మొట్టమొదట సామోపాయమవలంబించి 'నామేనల్లుని నాకుస్వాధీనపరచినయెడల నేను వెడలిపోయెద' నని యాతడు వర్తమానమంపెను. శరణాగతత్రాణబిరుదుగల యారాజు అందుకు నొప్పుకొనక యుద్ధముచేసెను. రెండుపర్యాయములు డిల్లీసైన్యములోడి పారిపోయినవి. కాని మూడవమారు డిల్లీశ్వరుని సైన్యము లధికముగా నుండుట

వలన కంపిలిరాజుకు విజయము కలిగినదికాదు. పరాభవము నిక్కమని తెలిసినతోడనే యా రాజు తన కార్శితుడైన బహావుద్దీను బల్లాళరాయని యాస్థానమున కంపించి తన భార్యాపుత్రాదులు తురుష్కుల చేతులలో జిక్కకుండ వారిని దనఖడ్గముతో సంహరించి కోటలోనుండి వెడలి ఘోరముగాబోరి రణక్షేత్రమునందు వీరశయనము నొందెను. అతని సైనికులందఱును మడిసిరి. ఆర్గురిని మాత్రము మహమ్మద్ తుఘ్లఖ్ చెరపట్టెను. అందు కంపిలిరాజుయొక్క మంత్రియొకడు; కోశాధ్యక్షుడు మరియొకడు; మిగిలిన నలుగురు గొప్ప సరదారులు. మంత్రి పేరు హరిహరుడు, కోశాధ్యక్షునిపేరు బుక్కరాయలు. మలిక్‌నబీ యావల బహావుద్దీనును బట్టుకొనుటకుద్యమించి బల్లాళరాయల మీద దండువెడలెను—బలవద్విరోధమునొల్లక బల్లాళరాజు బహావుద్దీను సుల్తానుకు పట్టియిచ్చి, కప్పముకట్ట నొప్పుకొని సంధి చేసికొనెను.

దిల్లీశ్వరుడు కంపిలి రాజ్యమును వశపరుచుకొని అచ్చట మలిక్ నాయబ్ అనువానిని నధికారిగా నేర్పరిచి చెరబెట్టిన యార్గురికిని మహమ్మదీయ మతదీక్ష నొసగి వెంటదీసికొని డిల్లీకి వెడలిపోయెను.

ఇట్లు కంపిలిరాజ్యమును గూలద్రోసి హస్తగతము చేసికొనినను, అచట సుల్తానుయొక్క అధికారము చాలదినములు సాగలేదు. మూడు నాలుగేండ్లలోపలనే కంపిలిరాజ్యమునకు స్వస్తిచెప్పి స్వదేశమునకు మరలిపోవలసి వచ్చెను—దీనికి ముఖ్యమైన కారణములు రెండు. ఒకటి, యచటి ప్రజల స్వాతంత్ర్యాభిమానము, పారతంత్ర్యములో నుండనొల్ల డిల్లీశ్వరుని సేవకుడైన మలిక్ నబీ మీద తిరుగబడి పోరాడసాగిరి. రెండవది, ఆంధ్రజాతీయ పరిబోధము మహమ్మదీయుల దౌర్జన్యమునకు తాళజాలక తీరస్థాంధ్రులందరు ముసునూరి ప్రోలయ నాయకుని యాధిపత్యముక్రింద నేకమై వారిని దేశమునుండి తఱుమగొట్టి యాంధ్రుల రాజకీయ స్వాతంత్ర్యమును పునఃప్రతిష్ఠించుటయే కాక హిందూ సంస్కృతిని దర్మమును బునరుద్ధరించి కృతకృత్యులైరి. వారిపక్షమున ఆరవీటి వంశజుడైన సోమదేవరాజు గొప్ప

148A


ఖాండేష్
బీదర్
గోండ్వన
బీజాపూర్
గోల్
కొండ
చోళ
పాండ్య
చేర
పల్లవ
విజయనగర సామ్రాజ్యము
దక్కను ముస్లిం రాజ్యములు
16 వ శతాబ్దము.



హజార రామస్వామి ఆలయం (హంపి)



విఠలస్వామి దేవాలయము



రాజమందిరంలోని ఒక సభా భవనం

దండుతో తరలి కృష్ణా తుంగభద్రానదీ తటములందలి ముఖ్యదుర్గముల
నన్నిటిని సాధించుటయేకాక ఆనెగొందిని సయితము స్వాధీనపఱచుకొని
రాయచూరు అంతర్వేదిని ప్రవేశించి యందలి రాయచూరు ముద్గల్లు
మున్నగు ముఖ్యదుర్గముల పెక్కింటి నాక్రమించెను.

అట్టిపరిస్థితులలో రాష్ట్రిపాలన దుస్సాధ్యమగుటచే మల్లిక్‌నబీ
డిల్లీలోనున్న సుల్తాను కావృత్తాంతమును నివేదించెను. అప్పుడు సుల్తాను
కంపిలిరాజ్యమును పాలించుట కనుభవజ్ఞులైన స్వదేశవాస్తవ్యులనే
నియోగించుట లెస్సయని యెంచి కారాగార నిబద్ధులెయుండిన కంపిలి
రాయమంత్రిల నారుగురిని చెఱవిడిపించి తన సముఖమునకు రావించి.
వారిలో హరిహరునకు రాజ్యాధిపత్యమొసగి, ఆతడు తనకు సామంతు
డుగా నుండునట్లొప్పించుకొని అతని తమ్ముడైన బుక్కరాజునకు
మంత్రిత్వమొసగి వారినంపివేసెను. వీరే భావి విజయనగర సామ్రా
జ్యమునకు స్థాపకులై నశించిపోవుచుండిన హిందూధర్మ సంస్కృతు
లను సంరక్షించి చిరసాయిగావించిరి.

## సామ్రాజ్య స్థాపనము.

శూరాగ్రేసరులగు నీయన్నదమ్ముల పూర్వచరిత్రను గురించి
యనేకు లనేకవిధముల వ్రాసియున్నారు. అందు నీక్రిందికథ సమ్మతగి
నదిగానున్నది. వీరిద్దఱు సంగమునకు రాజవంశజుని పుత్రులు; ఓరు
గంటి ప్రతాపరుద్రునియొద్ద కోశాధ్యక్షులుగానుండిరి. 1323 లో నోరు
గంటి రాజ్యము తురుష్కులు ధ్వంసముచేయగా వీరిద్దఱు నచ్చట
నుండి కంపిలిసంస్థానాధీశ్వరుని యొద్దకుఁబోయి తమశౌర్య సాహస
ప్రభావములచే మంత్రిత్వకోశాధ్యక్షత్వములను సంపాదించిరి. తరువాత
వీరికా రాజ్యము వచ్చినవిధము పైని వర్ణింపఁబడినది.

డిల్లీనుంచి హరిహరుడును బుక్కడును కంపిలికి చేరునప్పు
డచ్చటి స్థితిగతులు విషమముగనుండినవి. మల్లిక్‌నబీ రాజ్యము వారి
కప్పగించి డిల్లీకి పోయినను అది వారికి స్వాధీనముగాలేదు. తీవ్రస్థాం
ధ్రిముపిడుదలయైనపిమ్మట స్వల్పకాలములోపలనే దేశమింకను సంపూర్ణ

ముగ మహమ్మదీయుల దాస్యమునుండి విముక్తి నందకముండె బ్రోలయ నాయకుడు స్వర్గస్థుడాయెను; ఆ కార్యభారమంతయు నతని సోదరుని పుత్రుడైన కాపయనాయకునిపై బడినది. కాపయ దొడ్డ రాజకార్య మర్మజ్ఞుడు. తీరస్థాంధ్రమును మరల సాధింప డిల్లీశ్వరుడు మరల ప్రయత్నింపకపోడనియు, నాతని సైన్యములన్నియు నేకమై పైకొనిన తానొక్కడె ఎదురొక్కని నిర్వహించుటకు శక్తుడు గాడనియు గ్రహించి కర్ణాటకదేశాధిపతియైన ముమ్మడి బల్లాలరాయనితో సఖ్యము జేసికొని దాక్షిణాత్య హిందూప్రపంచమున కతని నధినాయకునిగ నేర్పఱచి దేశ సంరక్షణభారము నతనిపై మోపెను. చిరకాలమునుండియు బల్లాల రాయడు కంపిలిరాజ్యమును గబళింపదలపెట్టి యుండినవాడగుటచేత కంపిలిప్రజలకును సోమదేవరాజునకును దోడ్పడునెపమున సైన్యముతో గూడ తుంగభద్రాతటమునకు వచ్చియుండెను. హరిహరుడును బుక్కడును అతని దారసిల్లి యుద్ధమొనర్చి పరాజయమునందిరి. తరువాత హంపీ విరూపాక్ష పుణ్యక్షేత్రమున విద్యారణ్య యతీశ్వరుడు తపము గావించుచున్నాడని యెఱిగి యచటికిబోయి యతని నాశ్రయించిరి. విద్యా రణ్య యతీశ్వరుడు పూర్వాశ్రమమున మాయణ మాధవుడనుపేర జగత్ప్రసిద్ధినందిన విద్వద్వరేణ్యుడు; సాయణభోగనాథులతని సోద రులు. హరిహర బుక్కభూపాలుర కీ మాధవాచార్యులు ముందు కుల గురువైయుండిన కారణమున నతని సలహాకొని యవ్వలి కార్యక్రమము నిశ్చయించుకొనవచ్చునని యెంచి యచటికేగి యతని నిహితమడిగిరి. విద్యారణ్యులు వారు మహమ్మదీయమతమును త్యజించి మరల సనాతన ఆర్యధర్మమును స్వీకరించిన జయము చేకూరుననియు నట్లు వారుసేయు నెడల వారికి దాను తోడ్పడి రాజ్యస్థాపనకు మార్గము చూపెదనని యాన తిచ్చెను.

నిర్బంధముచే మహమ్మదీయ మతము నవలంబించిన వారగు టచే హరిహర బుక్కరాయలా మతమును వెంటనే విసర్జించి కులక్రమా గతమైన సనాతన హిందూధర్మమును మరల స్వీకరించిరి. అంతట విద్యారణ్యులవారు దక్షిణభారతభూమి కొడయుడు పంపా విరూపాక్ష స్వామియనియు నాదేవుని పక్షమున హరిహర బుక్క భూపతులు ప్రతి

నిధులుగ నియమింపబడిరనియు ప్రకటించి రాజ్యాభిషేక మొనర్చెను. తదనంతరము వారికి శ్రీ విరూపాక్ష స్వామివారి శ్రీ భండారమునుంచి ధనమునిచ్చి శత్రువుల జయించుటకు నియోగించెను. వారు దళములను మరల కూర్చుకొని సోమదేవరాజును, ముమ్మడి బల్లాళరాయని యుద్ధము నందోడించి పాకదోలి కంపిలిరాజ్యమును స్వాధీనముజేసికొని ఆనెగొంది రాజధానిగ విరూపాక్షస్వామిపేర రాజ్యము సేయగడగిరి. స్వామివారికి తాము ప్రతినిధులమని తెలుపుటకు రాజశాసనాది, రాజకీయ పత్రికములలో నెల్ల 'శ్రీ విరూపాక్ష'యని సంతకము సేయఁదొడగిరి.

అదిమొదలు హరిహరరాయలు స్వతంత్రుఁడై అంతకు పూర్వము ఓరుగల్లు, ద్వారసముద్రము, దేవగిరి, కొంకణదేశము మొదలయిన దేశపురాజుల యొద్దనుండి మహమ్మదీయులు తీసికొనిన రాజ్యములో ననేక భాగములను ఆక్రమించి తన రాజ్యవిస్తారము గావించెను. క్రమక్రమముగా మహిశూరు, కన్నడదేశము, వనవాసి (బన్వాసీ) నాగర ఖండము మొదలయిన ప్రదేశములను జయించి రాజ్యమును అభివృద్ధిచేసెను. బాదామికోటను బాగు చేయించెను. కన్నడదేశమందలి జైనప్రభువుల వశపఱచుకొనెను.

## హరిహరరాయల తమ్ములు.

శాసనములనుబట్టి చూడఁగా హరిహరరాయలకు నలుగురు తమ్ములున్నట్టు కానవచ్చుచున్నది. పెద్దతమ్ముఁడు కంపభూపతి. ఇతఁడు తూర్పు రాజ్యమునకు నధికారిగానుండెను. ప్రస్తుతపు కడప నెల్లూరు మండలములుగల దేశమును అతఁడు యేలుచుండెను. రెండవవాఁడు బుక్కభూపాలుఁడు. ఇతఁడన్న ప్రభుత్వము చేయుకాలములో మంత్రిగను, యువరాజుగను, హోసల దేశమునకు మండలేశ్వరుఁడుగను ఉండెను. మూఁతవవాఁడు మారప్ప. ఇతఁడు బనవాసి దేశమును గెలిచి, చంద్రగుత్తి రాజధానిగా మహిశూరునకు బశ్చిమమునందు దేశమును

ఏలెను. నాల్గవవాఁడు ముద్దప్ప. ఇతనినిగురించి మనకేమియుఁదెలియదు. ఇట్లు హరిహరునితో వీరైదుగు గన్నదమ్ములు, సంగముఁడనువాని కొమారులు. వీరు పంచపాండవులవలె ననోన్య ప్రేమ గలవారలై వర్తించుచుండిరని శాసనములు చెప్పుచున్నవి. శూరాగ్రేసరులగు తమ్ములు రాజ్యవిస్తారము చేయుటలో హరిహరరాజునకు నెంతయో సాహాయ్యము చేసిరనుటకు సందేహములేదు. ఇతనియొద్ద బల్లప్ప దండ నాయకుఁడను గొప్ప సేనాని యొకఁడుండెను. ఒక శాసనములో నితనిని 'అళియబల్లప్ప' యన్నందున ఇతఁడు హరిహరుని అల్లుఁడేమోయని తోఁచెడిని. ఇట్టి తమ్ముల సాహాయ్యమువలనను సేనాధీశుని శౌర్యము వలనను హరిహరరాజు కొలఁది కాలములోనే బ్రహ్మాండమైన సామ్రాజ్యమును స్థాపించెను. వీరందఱికంటె హరిహరునకు నెక్కుడు సాయము చేసిన మహానుభావుఁడు —

## విద్యారణ్యులు.

సకలవిద్యలసారమును, రాజ్యనిర్మాణకర్తృత్వమును, లౌకిక వైదిక వ్యవహార నిపుణతయు, స్వధర్మరక్తియు, స్వదేశస్వజన భక్తియు, అనుపమేయవైరాగ్యమును ఏకీభవించి విద్యారణ్య స్వరూపమున నవతరించెనని చెప్పుటకు సందేహములేదు.సన్యాసమునకు పూర్వమీసత్పురుషునకు మాధవాచార్యులని పేరు. తురీయాశ్రమము స్వీకరించి శృంగేరిపీఠము నధిష్ఠించిన తరువాత నీజగద్వంద్యునకు విద్యారణ్యులనిపేరు. ఈ మాధవులు బ్రాహ్మణులు. వీరిది యజుర్వేదము, బోధాయనసూత్రము, భారద్వాజగోత్రము. వీరి యింటిపేరు సాయణవారు.తల్లి పేరు శ్రీమతి. తండ్రిపేరు మాయణుఁడు. ఇతనికి సాయణ భోగనాథులను సోదరులిద్దరుండిరి. వీరాంధ్రులనియు, నియోగులనియుఁ గొందఱు వ్రాసియున్నారు. కాని యాంధ్రబ్రాహ్మణులలో బోధాయన సూత్రులు లేరు. కావున మాధవాచార్యులవా రాంధ్రులు కారని మానిశ్చయము. వీరధిష్ఠించిన శృంగగిరిపీఠముమీఁద బ్రస్తుతమున ఆచార్యులుగా

నున్న శ్రీ సచ్చిదానంద శివాభినవనృసింహభారతీ స్వాములవారు మాత్ర మాంధ్రులు, మురికి నాఁటివారు.

మాధవాచార్యులవారు ప్రథమ హరిహర, బుక్కరాయ, ద్వితీయ హరిహరరాజుల కాలములో వారికి మంత్రిగను హితబోధకుఁడుగను వుండెను. ఇతని తమ్ముఁడగు సాయణాచార్యులవారు హరిహరరాజు యొక్కయన్నకుమారుఁడగు సంగమరాజు నొద్ద మంత్రిగానుండెను. హరి హరబుక్కరాయలను నవరాజ్య సంస్థాపనమునకుఁ బురికొల్పి యనన్య సామాన్య వైభవభూషితంబగు విజయనగరసామ్రాజ్యమును నూతన ముగా నిర్మించిన శ్రేయస్సంతయు విద్యారణ్యులదనియే యని నొక్కి వక్కాణింపవచ్చును. హరిహరబుక్కరాయలు పేరునకుమాత్రము రాజు లుగా నుండిరనియు, రాజ్యభారమంతయు విద్యారణ్యులే వహించిరనియు నైతిహ్యముకలదు. యత్యాశ్రమస్వీకారముచే నైహిక సౌఖ్యములం దెంత మాత్రమును నిచ్చలేనివారయ్యును దేశమంతయు నరాజకమగు టయు శ్రౌతస్మార్తకర్మములన్నియు నశించుటయుఁజూచి స్వదేశస్వమత ములను ఉద్ధరించుటకై కేవలనిరపేక్షబుద్ధితో నీమహానుభావుఁడు విజయ నగరమను హిందూసామ్రాజ్యమును నిర్మించుటచూడ నితఁడద్వితీయ మహాపురుషుఁడని చెవ్పవలసియున్నది.

మాధవసాయణులు సంస్కృతభాషలో నున్న యన్ని శాస్త్రముల లోను అపారపాండిత్యము కలవారు. వీరిద్దఱును రచించిన గ్రంథముల సంఖ్య నూఱును మించియున్నది. అందు శ్రౌతము, స్మార్తము, వేదాం తము, ధర్మశాస్త్రము, మీమాంస, జ్యోతిశ్శాస్త్రము, వైద్యము, వ్యాకర ణము మొదలయిన యన్నివిషయములమీఁద పీరు.ఉద్గ్రంథములుగ్రాసిరి. అందు వేదభాష్యము ముఖ్యమైనది. దానికి సాయణభాష్యమనిపేరు. నాలుగువేదముల యొక్క సంహితలకును బ్రాహ్మణములకును సంపూ ర్తిగ నీవిద్వద్వ్యరులు భాష్యము గ్రాసిరి. ఈ ఘనకార్యముచేయుటలో వీరికి మరికొందరు విద్వాంసులును సాహాయ్యము చేసిరని యైతిహ్యము కలదు. ధర్మశాస్త్రమును గురించి మాధవాచార్యులవారిచే రచింపఁబడిన పరాశరమాధవీయ మను గ్రంథము మనదేశములో మిక్కిలి ప్రఖ్యాతిని

ప్రపంచమున నీడులేదని పశ్చిమఖండవాసులచేతను పూర్వఖండవాసుల చేతను వేనోళ్ళ బొగడ్తగని,మహమ్మదీయసుల్తానుల దౌర్జన్యమునకు, దాళలేక వచ్చిన హిందూముసల్మానుల కందఱికిని రక్షకస్థానమై యొప్పు చుండెను.

హరిహరరాయడు 1336 మొదలు 1356 వరకు రాజ్యము చేసి నట్లు శాసనములవలన గానవచ్చుచున్నది. ఇతడు 1343 లోనే కీర్తి శేషుడయ్యెనని సూయెల్ ప్రాసినయంశము నమ్మదగినదికాదు. ఈ హరిహరుని పేరు శాసనాదులలో హరియప్ప, హరియప్పవడయర్ అని కూడ ప్రాయబడియున్నది.

హరిహరరాయనికాలమందే విజయనగరమునకు గర్భశత్రువైన యొకతురుష్క రాజ్యముదయించెను. 1347 లో కలుబరగీపట్టణమున సులాఖ అలావుద్దీన్ హసన్‌గంగో బహమనీ అనువాడు బహమనీ రాజ్యమనబడు మహమ్మదీయరాజ్యమును దక్షిణహిందూదేశములో స్థాపించెను. హరిహరరాయల రాజ్యకాలపు కడపట సుల్తాన్ అల్లావుద్దీన్ హసన్‌గంగు విజయనగరరాజ్యముపై నెత్తివచ్చి తుంగభద్రకు ఉత్తరమునసుండు రాష్ట్రిము నాక్రమించుకొనెనని ఫెరిష్తా ప్రాసి యున్నాడు. ఇందు కొంత సత్యముగలదు, నెల్లూరుమండలములో నొక తామ్రశాసనముగలదు. అది హరిహరరాయలతమ్ముని కుమారుడగు సంగమరాయల కాలములోనిది. క్రీ. శ. 1353 లో చెక్కింపబడినది. అందు హరిహరరాయడు సుల్తానును పరాభవించినట్లు స్పష్టముగా నుదాహరింపబడినది. అట్లతనిచేత పరాభూతుడైన సుల్తాను బహమనీరాజ్య స్థాపకుడైన అల్లావుద్దీన్‌గంగేకాని యన్యుడు కాడు. అందుచే నీత డద్వితీయపరాక్రమశాలి యనియు, గొలదికాలములోనే మహాబలవంతుడయ్యెననియు స్పష్టముగా దేలుచున్నది.

అలావుద్దీన్‌హసన్‌గంగు దండయాత్రి భావికాలమున శతాబ్దముల పొడుగున నడచిన హిందూ మహమ్మదీయ దీర్ఘద్వంద్వయుద్ధమునకంకు రార్పణగ బరగినది. అతడు హరిహరరాయలచే పరాభూతుడై పోయి నను అతనితరువాతి దక్కనమహమ్మదీయరాజులకతడు మార్గదర్శకు

డాయెను. అదిమొదలు బహమనీసుల్తానులకును విజయనగరరాజులకును ఎడతెగని యుద్ధములు జరుగుచుండెను.

## బుక్కరాయలు

హరిహరరాయలకు సంతానములేనందున అతని మరణానంతర మాతని తమ్ముఁడగు బుక్కరాయఁడు రాజ్యారూఢుఁడయ్యెను. హరిహర రాయని పెద్దతమ్ముఁడైన కంపభూపతి రాజుగాక రెండవతమ్ముఁడగు బుక్కభూపతి రాజగుటకుఁ గారణమునుగూర్చి చరిత్రకారులు చర్చించి కొన్ని విపరీత సిద్ధాంతములు జేసియున్నారు. కంపభూపాలునకును బుక్కరాయనికిని రాజ్యమును గుఱించి పోరు జరిగి, బుక్క భూపాలుఁడు బలవంతుఁడగుటచే నాతఁడు రాజ్యము నాక్రమించుకొనెనని సూయెల్ దొరగారు యూహించియున్నారు; కాని దీని కాధారమేమియు లేదు. హరిరాయలు రాజ్యము సేయుచుండగనే కంపభూపతి మృతి నందెను; కావున రాజ్యమునకు మూలస్తంభప్రాయుడైన యతని రెండవ తమ్ముడు బుక్కరాయఁడు సింహాసనము నధిష్ఠించెను. హరిహర రాయఁడుండఁగనే బుక్కభూపాలుని యువరాజుగఁ జేసినట్లు శాసనములవలనఁ దెలియుచున్నది. మొదటినుండియు హరిహరరాయలతోఁ గలిసి కష్టసుఖముల ననుభవించి విద్యానగర రాజ్యనిర్మాణము చేసినందున నితని కీ యధికారము వచ్చెననుటకు సందేహములేదు. నెల్లూరు కడప మండలములలో కంపభూపాలుని కుమారుఁడైన వీరసోవణ్ణ రెండవసంగమ భూపాలుర శాసనములు గానవచ్చుచున్నవి. కావున వారికి కడప నెల్లూరి మండలములపై నధికారమొసఁగఁ బడెననియు, బుక్కభూపాలుఁడు సార్వభౌముఁడయ్యె ననియు మనమూహింపవచ్చును.

బుక్కరాయలు శూరాగ్రేసరుఁడు, విద్వత్ప్రియుఁడు. ఈతని ప్రోత్సాహముకతననే మాధవసాయణులు వేదభాష్యములను రచించి హిందూమతము నుద్ధరించిరి. ప్రస్తుతము లోకములోని యందఱు

విద్వాంసుల చేతను పొగడ్తగన్న సాయణభాష్యగ్రంథము లీమహారాజు పేరితో నంకితములై యున్నవి. అందుచే సంస్కృతవాఙ్మయాభివృద్ధి చేసిన మహాపురుషులలో నితఁ డొకఁడని చెప్పవలసియున్నది.

ఇతఁడు రాజ్యమునకు వచ్చినతరువాత కొద్దికాలములోనే తుంగభద్రా నదికి దక్షిణముగానుండు రాజ్యమంతయుఁ దన పరాక్రమముచే నాక్రమించుకొనియె. సింహాసనమునధిష్ఠించునప్పటికె ఉభయసముద్రముల మధ్యనుండు కర్ణాటాంధ్రదేశములలో జాలభాగము రాయల యేలుబడి క్రిందికి వచ్చియుండెను. తూర్పున రెడ్డిరాజ్యమున గొన్ని సీమలను జయించినట్లు కానవచ్చెడిని; దక్షిణమున సేతుబంధ రామేశ్వర పర్యంతము వ్యాప్తమైయుండు ద్రావిడ దేశమును సమస్తమును జయించి స్వాధీనము గావించుకొనెను: ఈ విజయముల మూలమున చిన్న సంస్థానముగ బొడచూపిన విద్యానగర మత్యల్పకాలముననె విస్తారమైన సామ్రాజ్యముగ పరిణామమందెను.

బుక్కరాయల కాలములో నడచిన చరిత్రాంశములలో నెల్ల నతని దక్షిణాశా దిగ్విజయము గడుముఖ్యమైనది. అప్పుడు ద్రావిడ దేశమున రెండు స్వతంత్ర రాజ్యములు వర్ధిలుచుండినవి. అందొకటి తొండమండలమందు కంచి రాజధానిగాగల సాంబువరాయ సంస్థానము. మఱియొకటి మధుర సల్తనతు - రెండును ఢిల్లీ చక్రవర్తి ముహమ్మదు బిన్ తుఘ్లుకు కాలమున కొంచె మించుమించు విజన రాజ్యస్థాపన కాలమందె యేర్పడినవి. కాపయ నాయకుడును ముమ్మడి బల్లాళరాయలును ఏకీభవించి తొండమండలమును మహమ్మదీయ దాస్యమునుండి తప్పించి వెన్రుమణ్ కొండాన్ సాంబువరాయని క్రీ. శ. 1335లో దాని కధిపతిగజేసిరి.ఆతఁడు నాలుగేండ్ల పట్టు రాజ్యముచేసి క్రీ. శ. 1339లో కైలాస ప్రాప్తుడాయెను; అతని కుమారుఁడైన రాజనారాయణుఁడు 1362 వఱకు రాజ్యమొనర్చెను. ఇతఁడే కడపటి సాంబువరాయఁడు. ఇతని కాలమునన్నె బుక్కరాయలు దండెత్తివచ్చి తొండమండలము నాక్రమించుకొన్నది. తొండమండలము నకు దక్షిణమున సేతుబంధ రామేశ్వరమువఱకునుగల ద్రావిడదేశము సర్వమును మధుర సుల్తానుల యేలుబడిక్రింద నుండెను. వీరికే దక్షిణ

సురక్షాణులని నామాంతరము. 1323 లో ముహమ్మదు బిన్ తుఘ్లుక్ పాండ్యరాజ్యమును గూర్చిదోసి దేశము నాక్రమించుకొన్నప్పుడు, దాన్ని తన సామ్రాజ్యము నందొక మండలముగ నేర్పఱచి దానిని పాలించుట కొక మండలాధిపతిని నియమించెను. 1323 - 1334 ల మధ్య అచట సుల్తానుయొక్క అధికారము నిర్వ్యక్రమముగ సాగినది. ఆకాలమున నచట ప్రభుత్వము సల్పుచుండిన మండలాధిపతులందరు సుల్తానునెడ భయ భక్తులతో వర్తించుచు యాతని యాజ్ఞానుసారము నడచుకొనుచుండిరి. కాని షెరిఫ్ జలాల్. ఉద్దీన్ ఆహసన్‌షా అను నతడు 1338 లో సుల్తానుపై తిరుగుబాటుచేసి స్వతంత్రుడాయెను. అయిదేండ్లు రాజ్యమును పాలించినపిమ్మట అతని సైన్యాధ్యక్షులు వధించిరి. అటుపిమ్మట మఱియిద్దరు మధురసింహాసనము నధిష్ఠించి యత్యంత స్వల్పకాలము రాచరికమునను భవించిరి. తరువాత ఘయాజ్ - ఉద్ - దీన్ దామఘనీయను నతడు రాజ్యము నాక్రమించుకొనెను. ఇతడు క్రూరుడు, పాషాణహృదయుడు. హిందువులను స్త్రీ పురుష బాలవృద్ధ భేదమును పరిగణింపక అడిపి మృగమును వ్యాధునివలె వేటాడి చంపెను. ఇతనిపై హొయ్సలముమ్మడి బల్లాలదేవుడు 1343 సంవత్సరమునందెత్తిరాగా తిరుచినాపల్లి రణక్షేత్రము నతని బట్టుకొనిపోయి మధుర కారాగారమున బంధించి కొంతకాలమైన పిమ్మట హింసించి చంపెను. తరువాత నల్పకాలమునకె నితడు దుర్మరణమును పొందెను. అటుపిమ్మట మధుర సుల్తానుల చరిత్ర స్పష్టముగ తెలియదు. కాని దేశమనాయకమై పాలనపటుత్వము చెడి కలపడి యుండినట్లున్నది. 1351 లో నచటి మహమ్మదీయ సర్దారులు దౌలతాబాదుకు అచ్చట రాజ్యము అల్లా - ఉద్ - దీన్‌కడకు రాయబారమంపి తమ కో పాలకుని ప్రసాదింపవలయునని ప్రార్థించెను. ఆతడు తన యల్లుని పంపెను. ఇతనిపేరు తెలియదు. కుర్చత్ - ఇ - హసన్‌గంగూ అనగా అల్లా - ఉద్ - దీన్ హసన్‌గంగూయొక్క అల్లుడనియే చరిత్రకారులు పేర్కొనియున్నారు. ఇప్పటివఱకు ఉపలబ్ధమైన సాక్ష్యమునుబట్టి చూడగా మధురను పాలించిన సుల్తానులలో నితడె కడపటివాడని తోచుచున్నది.

ముమ్మడి బల్లాలుని మరణానంతరము విజయనగరాధీశ్వరులు హొయ్యల రాజ్యమున కధిపతులైరి. వారి రాజ్యమునకెకాక ఆశయము లకును తాము వారసులమనియెంచి హరిహర బుక్కభూపతులు దైవదుర్వి పాకమువలన భగ్నమైపోయిన ముమ్మడి బల్లాళుని దక్షిణొశా దిగ్విజయ మును జయవంతముగ కొనసాగింపవలయునని నిశ్చయించిరి. మటియు మధుర మహమ్మదీయుల దౌర్జన్యమును గాంచి సహింపక వారి యధికారమును దుదముట్టించినగాని దాక్షిణ హిందూప్రజ శాంతి సమా ధానములు గలిగి మనజాలరను తలంపు ఉత్తలపెట్టగా హరిహర రాయలు బుక్కరాయలును క్రీ. శ. 1352 వ సం॥న కుమార కంప రాయల నాకార్యము నెఱవేర్చుటకు నియోగించి సైన్యముతోగూడ దక్షిణ దేశముపై దండంపిరి. కారణాంతరములవలన నీ కార్యము క్రీ. శ. 1370 వఱకు జరుగలేదు. కాని యా సంవత్సరమున కుమార కంప రాయలు బింబినుండి బయలువెడలి శ్రీరంగమునకుబోయి యచట తుర కతాణ్యమును బారద్రోలి యా స్థలము నాక్రమించుకొని దేవాలయాదులకు సంప్రోక్షణ గావించెను; తరువాత నచటినుండి మధురపై కూబిచేసిపోయి సుల్తానును యుద్ధమునందు వధించి యా పట్టణమును స్వాధీనముజేసి కొనెను; అంతట మధుర తురకరాజ్యము మంటగలిసిపోయినది. సేతు బంధ రామేశ్వరము పర్యంతముగల తూరుపు సముద్రతీర రాష్ట్ర మంతయు విజయనగర సామ్రాజ్యమున గలిసిపోయినది. ఇతని ప్రజలంద ును ఈతనియందు భక్తి గలవారలై యాతనియాజ్ఞను శిరసావహించు చుండిరి. ఇతని కాలములోని శాసనములను బట్టిచూచినను, ఇతని ప్రభు త్వసమయమందువిజయనగరపట్టణమునువిజయనగరరాజ్యమును బొందిన యభివృద్ధిని జూచినను, ఈ రాజు అనేక పర్యాయములు తురుష్కుల నోడించి దిగ్విజయములఁ గన్నట్టు మనమూహింపవచ్చును.

బుక్కరాయలయొద్ద గొప్పసైన్యమును, ఘనతఁజెందిన దండ నాయకులును ఉండినట్లు శాసనములవలనఁ గానవచ్చుచున్నది. ఈతని సేనానాయకులలో మల్లినాథుఁడను వాఁడొకఁడు. ఈ మల్లినాథుని శాస నము లనేకములుగలవు. ఇతఁడనేక దేవాలయములకు దానములిచ్చెను.

ఇతని తండ్రిపేరు అభిషసాయన్న. అందువలన నీతడు విజయనగర రాజులకు అల్లుడని తోచెడిని. మల్లినాథుడు విఖ్యాతిజెందినసేనాని. శాసనములను బట్టిచూచగా ఇతడు యవన, తురుష్క, పాండ్యాది సైన్యముల నోడించి బహమనిసుల్తాన్ వలన గూడ మెప్పొందినట్లు గానవచ్చెడిని.

1380 సంవత్సరములోని యొకశాసనమును బట్టిచూడగా బుక్కరాయ హరిహరరాయల కాలములలో బచ్చరాజు అనుమంత్రి యొకడుండినట్లు గానవచ్చుచున్నది. ఇతడు కీర్తిరాజ కుమారుడు; బుక్కరాయసముద్రము, కీర్తిసముద్రము, నాగవ్వచెఱువు, బచ్చప్పచెఱువు, చౌడప్పకాలువ మొదలైన జనోపయోగకరములైన కార్యము లనేకములు చేసి రాజ్యములో గఱవులు లేకుండజేసెను.

## మాధవమంత్రి

బుక్కరాయని కాలములో ప్రఖ్యాతిజెందిన మంత్రిపుంగవుల లోను, దండనాయకులలోను మాధవమంత్రి ముఖ్యుడని చెప్పవలసి యున్నది. ఇతడును మాధవ విద్యారణ్యులును ఒక్కరేయని ఇదివఱకు ప్రాసిన గ్రంథకారులందఱును భ్రమపడిరి. వారిద్దఱును భిన్నపురుషులు. మాధవ విద్యారణ్యుల వారి తండ్రిపేరు మాయణుడు; గోత్రము భారద్వాజగోత్రము. మంత్రిమాధవుని తండ్రిపేరు చౌండప్ప; గోత్రమాంగీరసగోత్రము. మంత్రిమాధవుడు గౌడబ్రాహ్మణుడు. మాధవ విద్యారణ్యులు ద్రావిడబ్రాహ్మణులు. ఈ మాధవమంత్రి యొక యగ్రహారము నిర్మించి కాశ్మీరబ్రాహ్మణులకు దాన మిచ్చెనని 1368 వ సంవత్సరపు శాసనమొకటి చెప్పుచున్నది. ఆ శాసనమువలన మనకీ క్రిందియంశములు తెలియుచున్నవి.

కాశీవిలాసుడనుగురువుయొక్క బోధచే నితనికి శివభక్తి పట్టువడెను. యోగాభ్యాసముచే నితడిహపరముల సాధించెను; దుర్బోధలు చేయు నాస్తికులనెడు దుష్టసర్పములను నాశమందించి యుపనిషన్మార్గ

మును చక్క(బఱిచెను. అనేక విద్వాంసులకు గురువై యుపనిషన్మార బోధకు(డగుటచే దుస్సాధ్యమగు బ్రహ్మపదము( జూపువా(డని ఖ్యాతి వడసెను. బుక్కరాయల ప్రభుత్వకాలములో నాతనిరాజ్యముయొక్క పశ్చిమభాగమునకు నీత(డు నాయకు(డుగా నుండెను. తన ప్రభుత్వము సుఖప్రదము గావలయునని యీత(డు తనగురువగు కాశీవిలాస క్రియా సక్తి బోధవలన శైవామ్నాయ మనుసరించి లింగపూజ యొనర్చెను. ఒక సంవత్సరమైనతరువాత తనయజమానుని యాజ్ఞవడసి. నాగర ఖండ ములోని ముచ్చుండి యనుగ్రామమును దాని రెండుశివారులును కాశ్మీర బ్రాహ్మణులకు దానమిచ్చెను. నాగరఖండములో( బదునెనిమిదిమండ లము లుండెను. వాని కన్నిటికి( జంద్రకూటపుర మనునది రాజధాని. దానముచేసిన యాగ్రామము రాజు బొక్కసములోని ధనముపెట్టి కొన వలదనియు, తన సొంతసొత్తుతో( గొనవలసినదనియు నీ మంత్రి పుంగవు( డాజ్ఞాపించెను.

ఈ మాధవమంత్రికి వీరవసంతమాధవు( డనుపేరుగలదు. ఇత(డు సూత సంహితమీ(ద టీకయు, శైవామ్నాయసార మనుగ్రంథమును రచించెను.

ఈ మాధవమంత్రి గొప్ప సేనానాయకు(డు. తురుష్కుల( బరాభ వించి గోవాపట్టణమును స్వాధీనపఱుచుకొనెను. దీనిని గుఱించిన శాసన మొకటి కలదు. అది ముఖ్యమైనది గనుక దానియర్థమును మూలమును ఈక్రింద నిచ్చుచున్నారము.

'ప్రసిద్ధమయినభరతఖండ దక్షిణభాగమందు కర్ణాటకదేశమున్నది. దానిమధ్య నుత్తమమయిన తుంగభద్రానది యున్నది. అది సర్వపాపము లకు దావానలము. దానిని గంగగా భావించి శ్రీ విరూపాక్షస్వామి యా తీర్థమం దావిర్భవించెను. 1. ఆ స్వామి యాలయమునకు దగ్గఱ విజయ నగరమను పేరుగల రాజధాని రతీదేవితో( దుల్యలగుస్త్రీలతో( బ్రకా శించెను. 2. యదువంశములో నభినవ కృష్ణావతారు(డును, శ్రీ సంగమ రాజు కొడుకును, అగు శ్రీ బుక్కరాయ(డు పుట్టి శత్రుభీకరు(డై

భూలోకమును పాలించుచు, విజయనగర మందుండెను. 3. వారి యాజ్ఞాను సారముగా మంత్రియగు మాధవాచార్యులు విజయనగర సామ్రాజ్యము నొంది యరాతులకు వీరస్వర్గము నిచ్చుచుండెను. 4. దిగంతవ్యాప్తమయిన కీర్తిగల యామంత్రి జయేచ్ఛ గలవాడై కొంకణ (కెనెరా) రాజధాని యగు నొక ప్రక్క సముద్రముచే నడ్డగింపఁబడిన గోవాపట్టణమును విశేషబలముతో నరికట్టెను. అందు నాపట్టణపు రాజులగు తురకలను తన బాహుబలముచే నిర్మూలముచేసి వారిచే దఱుమగొట్టఁబడిన సప్తనాథాదియాదవరాజులను దిరిగి స్థాపించెను. 5. శా. శ. 1313 (ఎ. డి. 1391) ప్రజోత్పత్తి వైశాఖ అమావాస్య బుధవారమునాఁడు సూర్యగ్రహణకాలమందు స్వస్తిశ్రీమన్మహామంత్రిశేఖరుఁడును, ఉపనిషన్మార్గప్రవర్తకాచార్యుఁడును, అగు శ్రీమన్మాధవరాజు, కుంజరదేశమందుండెడు కుంచ్చరమను పేరుగల గ్రామమునకు మాధవాగ్రహారమను తన నామమొసఁగి దానిని విద్వద్బ్రాహ్మణులకు దానము చేసెను.

## తురుష్కులు వ్రాసిన విషయములు

ఇఁక బుక్కరాయనిగుఱించి మహమ్మదీయచరిత్రకారు లేమి వ్రాసిరో చూతము. దీనినిగుఱించి ముఖ్యముగా ఫెరిస్తాయనువాఁడు వ్రాసినాఁడు. ఇతఁడు బహమనీరాజులచరిత్ర వ్రాసియున్నాఁడు. బుక్కరాయలతో సమకాలీనులయిన బహమనీసుల్తాను లిద్దఱు; మహమ్మద్ అనువాఁడును, ముజాహిద్ అనువాఁడును. మొదటివాఁడు 1358 మొదలు 1375 వఱకును, రెండవవాఁడు 1375 మొదలు 1378 వఱకును రాజ్యము చేసిరి. కావున వీరికిని విజయనగర రాజులకును జరిగిన యుద్ధవర్ణన మనముచదివి, యది యెంతవఱకు సత్యమైనదో విచారింపవలసియున్నది. ఫెరిస్తాచే వ్రాయఁబడిన యంశము లనేకము లసత్యములనియుఁ బక్షపాతభూయిష్ఠములనియుఁ జదువరులు చూడఁగలరు.

ఫెరిస్తాగ్రంథమును జూడఁగా మహమ్మద్‌షాహ కాలములో నొక్కసారియు, ముజాహిద్ కాలములో నొకసారియు విజయనగర

రాజుతో యుద్ధములు జరిగి మహమ్మదీయులు విజయులైరి. మొదటి యుద్ధము 1366 లో జరిగెను. ఈ యుద్ధమును గుఱించి ఫెరిస్తా నసుసరించి 'జీర్ణకర్ణాటక రాజ్యచరిత్ర' మనుగ్రంథములో వర్ణించిన యంశములీ క్రిందఁ బొందుపఱుపఁబడును.

'ఒకనాటి సాయంకాలమున మహమ్మద్ శాహ ప్రమోదసాగరనిమగ్నుఁడై నిండు పేరొలగంబున్న వేళ కొందఱు సంగీత పాఠకులు వచ్చి 'అమీరు ఖుస్త్రో' అనువానిచే రచియింపఁబడిన రెండుగీతములను శ్రవణానందకరంబుగా వినిపింపఁగాఁ బరవశుఁడై మధుపానముచేసి యొడలెరుంగని చిత్తముతో విజయనగరధనాగారమునుండి ద్రవ్యమునుగొని వారలకు బహూమానము చేయవలసినదని ముఖ్యమంత్రికి నాజ్ఞ చేసెను. సారాయిమత్తువలనఁ గలిగిన యుద్రేకముతో, జెప్పిన మాట గదాయని గ్రహించి యాజ్ఞాపత్రికను వ్రాసెనుగాని విజయనగర రాజునకుఁ బంపలేదు. అయిననను మహమ్మద్ శాహ యారాత్రి యా విషయమును గుఱించి యాలోచించుచుండెను. మఱునాఁడు మంత్రిని బిలిపించి యాజ్ఞాపత్రికను బంపితివా యని యడుగఁగానే. యాతఁడు లేదని ప్రత్యుత్తరమిచ్చెను. అంతట సుల్తాను 'ఏమీ! నా పెదవులనుండి యర్థములేని వ్యర్థపుమాట జాఱఁగలదా? సురాపానప్రమత్తుఁడనై నేనాజ్ఞ యిచ్చియుండలేదు. నాకట్టి సంకల్పము కలదు' అని హెచ్చరించెను. అంతట 'మల్లెక్ సయఫ్ ఉద్దీన్' అను నతని మంత్రి, యాయాజ్ఞాపత్రికపై రాజముద్రికను ముద్రించి, శీఘ్రగామియగు నొకదూత చేతికిచ్చి విజయనగరమునకుఁ బంపెను. కృష్ణరాయ లాపత్రికను వీక్షించి కోపోద్దీపితుండై, యా పత్రికందెచ్చిన దూతను నొక గార్దభముపై నెక్కించి విజయనగర వీథులందూరేగించి పేడనీళ్ళు గొట్టించి యవమానపఱిచి యాతనిం బంపించుటయేకాకభూమినీరాజ్యముపైదండెత్తుటకై సంసిద్ధులనై యుండవలసినదని తన దండనాయకుల కెల్లరకు సమాచారములుపంపి యుద్ధమునకై యెదురుచూచుచుండెను. తన దండనాయకులెల్లరును స్వసైన్యములతో విజయనగరమునకు వచ్చినతరువాత కృష్ణరాయలు ముప్పదివేల గుఱ్ఱపుదళమును మూఁడువేల యేనుంగులును లక్షకాల్బలమును గల సైన్యముతోడ

'ఆదవాని' దుర్గము చెంతకుఁబోయి. యచటినుండి కొంత సైన్యమును సుల్తాను దేశమును బాడుచేయుటకై భామినీరాష్ట్రమునకుఁ బంపెను. వర్షాకాల మాసన్న మగుటచేత రాయలు కృష్ణవేణీ తుంగభద్రా నదుల సంగమస్థానమునకుఁ బడమట త్రికోణాకారముగా నుండి హిందూ మహమ్మదీయులకు వివాదభూమియై యుండి తరువాత రెండువందల సంవత్సరములవఱకు యుద్ధరంగముగానున్న రాయచూరు మండలము లోని ముఖ్యనగరమగు ముద్దకల్లునకుఁబోయి యా పట్టణము పట్టుకొని స్త్రీ పురుషులనుభేదము లేకుండ నెల్లరను క్రూరఖడ్గాహతిపాలు చేసి విజృంభింపఁగా నొక్కఁడు మాత్రము ప్రాణమెట్లో తప్పించుకొనిపోయి కలుబర్గకేఁగి సుల్తానున కీసమాచార మంతయుఁ దెలియఁజేసెను.....

ఈ మారణకర్మ వృత్తాంతమును మహమ్మదుశాహ విని దుఃఖాక్రాంత చిత్తుఁడయ్యును కోపోద్రేక మడంచుకొనలేక, యా దుఃఖసమాచార మును దెచ్చిన నిరపరాధియగు ఆ దౌర్భాగ్యుని తక్షణమే చంపించెనఁట! మహమ్మద్‌శాహ దర్బారులో నిలువంబడి "మహమ్మదీయ మతావలంబి కుల సంహరించినందుకు పరిహారముగా పాషండ మతాభిమానులగు విగ్ర హారాధనపరులను లక్షహిందువులను మట్టుపెట్టినం గాని మత యుద్ధమును బ్రకటించు చిహ్నాయుధమును మఱల నొరలోనికిఁ జేర్చ" ననియు "హత్యనుండి వెనుదీయ" ననియుఁ బ్రతిజ్ఞపట్టి యా దినముననే రణభేరి మ్రోఁగించి దండయాత్రకు బయలువెడలెను.

'మత యుద్ధమును బ్రకటించుచు మహమ్మదుశాహ కృష్ణానదీ తటముఁ జేరి శత్రువుల రక్తముతో ముద్దకల్లు పురమునందలి రాయల ఖడ్గముపాలఁ బడిన వారియాత్మలకుఁ దర్పణము విడిచి సంతోషపెట్టు టకై, శత్రువుల కభిముఖముగా నాసదినిదాఁటినంగాని భుజించుటయు నిద్రించుటయు నశాస్త్రీయమని నిశ్చయించి, నిద్రాహారముల మానెదనని ప్రమాణము చేసెనఁట! పిమ్మట తన కొడుకగు ముజాహీదుషాకుఁ బట్టముగట్టి మంత్రియగు 'మల్లెక్ సయఫ్ ఉద్దీను'ని పాలకునిగా నియమించి యిరువది యేనుఁగులనుమాత్ర ముంచుకొని తక్కిన యేనుఁగుల

నన్నింటిని నతనికిచ్చి బుద్ధులుచెప్పి కలుబర్గ నగరమునకుఁ బంపివేసె నఁట ; కాలవిలంబము చేయక తరువాత మహమ్మదుశాహ తొమ్మిదివేల గుఱ్ఱపు దళముతో నదినిదాఁటెనఁట ; రాయ లీవార్తవిని దిగులుపడి ధన కనక వసువాహనాదులను విజయనగరమునకుఁ బంపివేసి మఱునాఁడు పీలుగానున్న యుద్ధము చేయుటయో లేనియెడల వెనుదీయుటయో జరి గింపవచ్చునని నిశ్చయించెనఁట ; ఆరాత్రి భయంకరమగు గాలివీఁచుచుఁ గుంభవృష్టిగా వర్షము గురియుచున్నందున నేనుఁగులు మొదలగు భార వాహకములగు జంతువులు బురదలోఁ జిక్కుకొని శ్రమపడుచు, సేనా నివాసస్థానమును విడిచి నాలుగుమైళ్ళ దూరమునకైన నడువశక్తి కలవి కాకపోయినవి. మహమ్మదుశాహ యా వృత్తాంతమును విని తనస్థాన మును విడిచి తానే వారల కభిముఖుఁడయి నడువ నారంభించెను. మఱు నాఁడుదయమునకు రాయలసైన్యమును సంధింపఁగానే వారలు సామాగ్రి నంతయు వెనుకదిగవిడిచి భయపడి యాదవాని దుర్గమునకుఁ బాఱిపోయి రఁట ; మహమ్మద్‌శాహ సామాగ్రినంతయుఁ గొల్లవెట్టి శిబిసంహిత ముగా స్త్రీపురుషుల డెబ్బదివేల జనులను సంహరించెనఁట ; సుల్తాను వేసవికాలము గడచుపర్యంతము ముద్దకల్లు పట్టణమున నుండి తరువాత సేనలంగూర్చుకొని ఆదవాని దుర్గము ముట్టడించెను. రాయలు తన మేన ల్లుని దుర్గసంరక్షణార్థము కొంతసైన్యముతో నిలిపి తాను తుంగభద్రా నదికి దక్షిణభాగమునందు నిలిచి విజయనగరమునుండి యింకను సేన లను రప్పించుకొని యుద్ధసన్నద్ధుఁడై నిలిచి యుండెను. మహమ్మదు శాహ శీఘ్రకాలములోనే తుంగభద్రా నదినిఁదాఁటి విజయనగర రాజ్య భూములలోఁ బ్రవేశించెను. విజయనగరము పయి మహమ్మదీయులు దండెత్తివచ్చిన వానిలో నిదియే ప్రథమదండయాత్రయని చెప్పవలసి యున్నది. ఎందుకనిన నిదివఱకు ఢిల్లీసుల్తాను తుంగభద్రానదికి నుత్తర మునసున్న యానగొందిని ముట్టడించెనేకాని తుంగభద్రానదిని దాఁటి యీవలకు వచ్చినవాఁడుకాఁడు. మహమ్మదుశాహ సిరుగప్పను గ్రామ సమీపమున నదిని దాఁటి కౌతాళమువద్ద నున్నబయలులో రాయలసైన్య మును దాఁకెను. మహమ్మదుశాహ నదినిదాఁటి వచ్చుచున్నాఁడని చారుల

వలన విని కృష్ణరాయలు తన మంత్రులను సేనాధిపతులను రప్పించి సుల్తాను నేప్రకార మెదురొక్కనవలసి యుండునో యోచింపసాగెను.

'అప్పుడందఱును జేరి రాయల ముఖ్యసేనాధిపతియగు భోజమల్లున కాధిపత్యమునిచ్చిరి. అడఁడు సంతసించి తురుష్కరాజకుమారుని జీవ ముతో ఖైదిగాఁ బట్టికొని తీసికొని రావలసియుండునో అతని సిరస్సు బల్లెమునకు గ్రుచ్చి చూపించవలసియుండునో రాయలచిత్తమును వినఁ గోరుచున్నానని మహాగర్వముతోఁ బలికెనఁట! ప్రతికీయున్న శత్రు వేయవస్థలో నున్నను నిష్టుఁడు కాఁడు గనుకఁ జేతికందివచ్చినపుడు చక్కాఁడుటయె యుచితమార్గమని రాయలు ప్రత్యుత్తరమిచ్చెనఁట! రాయల యనుజ్ఞనుబొంది మల్లయదండనాథుఁడు నలుబదివేల గుఱ్ఱపు దళముతోడను, లక్ష కాల్బలముతోడను, మహమ్మద్‌శాహ నెదురొక్కని హిందువులచేఁ బరమ పవిత్రములుగాఁ జూడఁబడు గోవులను మహమ్మ దీయులు చంపుటను గూర్చియు, వారిదేవాలయములను నిర్మూలము చేయుటను గూర్చియు ననుదినమును వర్ణించుచు సైనికుల కుపన్యాసము లిచ్చి చంద్రధ్వజులఁ జంపుటయే పరమార్థమని తోఁచునట్లుగాఁ బౌరుష మెక్కింప వలసినదిగా బ్రాహ్మణోత్తముల కెల్లరకు నానతి యిచ్చెను. మహమ్మదుశాహ భోజమల్లుని రాకవిని తనసైన్యమున కంతకు ఖాను మహమ్మదుని నధ్యక్షునిగా నేర్పఱచి పదునైదువేల గుఱ్ఱపుదళమును, ఏఁబదివేల కాల్బలమునిచ్చి తాను పదివేల గుఱ్ఱపుదళముతోను ముప్పది వేల కాల్బలముతోను సమరసన్నద్ధుఁడై యుండెను. 1366 వ సంవత్స రము జూలై 23 వ తేది గురువారమునాఁడు సూర్యోదయ సమయమున నుభయసైన్యములును గలిసికొని సంకుల సమరంబునకుఁ గడంగెను. ఉభయ సైన్యములును సముద్రతరంగములవలె నిటునటు నూగులాడుచు నొండొరులకొఁ దీకొని సాయంకాలము నాలుగు గంటల వఱకు ఘోర యుద్ధము చేయఁగా నిరుప్రక్కలను వేలకొలఁది జనులు మృతినొందిరని చెప్పుట యతిశయోక్తి గాదు. ఖాన్‌మహమ్మదు సేనయొక్క కుడి యెడమ భాగములకు రక్షకులుగానున్న శూరాగ్రేసరులగు మూషిఖానుఁడును, ఏషీ ఖానుఁడును వీరమరణమునొందఁగా వారిసేనలు హిందువుల ప్రతాపము

నకుఁ దాళఁజాలక పలాయనముచేసెను. ఈ దురవస్థ నంతను జూచి తురుష్కసైన్యములు దిగులుపడి ధైర్యమునువదలి చెల్లాచెదరగుచుండ, మహమ్మదుశాహ మూఁడువేల గుఱ్ఱపుదళముతో వచ్చి మల్లయదండ నాథునిఁ దారొక్కనఁగానే, పాఱిపోవుచున్న తురుష్కసైన్యములు వెనకకు మఱలివచ్చుచుండెను. మక్రీబు ఖానుఁడు ఫిరంగులను గాల్చుచు శత్రుసైన్యమును జీకాకు నొందించుచు ముందుకు సాగివచ్చి శత్రువులను బాఱఁదోలుట కనుజ్ఞ యిమ్మని ఖానుమహమ్మదు నడిగెను. అతనికి మూల బలము కొంతయిచ్చి సాగుమని యుత్తరువు చేసెను. ఫిరంగులను గాల్చుటకు హిందువులకు కాలముచాలక పోయినందున, వీరావేశముతోఁ గత్తులుఁ గఠారులు దూసి తురుష్కుల కభిముఖులై పిఱికి తన మావంతయు లేక శత్రువులు సహితము మెచ్చునట్లుగాఁ బోరాడుచుండిరి. ఇట్లు ఖానుమహమ్మదునియొక్క 'పులివేఁటకాఁడను' పేరుగల యేనుఁగొకటి మావటీని యాజ్ఞకు లోఁబడక శత్రుసేనా మధ్యభాగమునఁ జొఱబడఁగా మల్లయదండనాథుని యేనుఁగులడ్డపడి నిలుపఁగా నా సందడి సమయములోఁ బులివేఁటకాని మావటీఁడు ప్రాణములను గోలుపోయెను. తదనంతరము ఖానుమహమ్మదయిదువందలగుఱ్ఱపుదళమునుదీసికొని సమరగజమును వెంబడించి పురికొల్పుచుండె. హిందూసేనలు క్రమముతప్పి చెల్లాచెదరగునట్లుగా నా యేనుఁగు ఘీంకృతులు పెట్టుచు ధ్వంసము చేయుచుండఁగా భోజమల్లుఁడు దెబ్బతిని గాయమును బొంది రణరంగమున నిలువలేక పరాఙ్ముఖుఁడయ్యెను. తదను చరులు సయితమునిలిచి యడ్డుపడలేక పోయిరి. హిందువులు తమమధ్య భాగ మిటలకలోలమగుటఁ జూచి యధైర్యపడి నలుదిక్కులకుఁ బాఱిపోయిరి. ఇఁక జెప్పవలసిన దేమున్నది? తురుష్కులు చెలరేఁగి తారసించిన యెలరను నఱికివైచుచుండిరి. గర్భిణీస్త్రీలను సయితము వదలిపెట్టక హతము చేయుచుండిరి. బిడ్డల తొమ్మ్మలమీఁదనుంచుకొని పెనఁగులాడుచున్న తల్లులనుండి బిడ్డలనులాఁగి బిడ్డలను తల్లులనుగూడ నఱకుచుండిరి. మహమ్మదుశాహ యిట్టి విజయవార్తలను తనరాజ్యమునకుఁ బంపియుఁ, దృప్తినొందనివాఁడయి తన ప్రతిజ్ఞ దీర్చుకొనుటకయి రాయలను వెంబడించి

గజపతి సేనాధీశుఁడనియు నతఁడుదయాద్రిని సాధించెననియుఁ బ్రబోధ చంద్రోయముయొక్క ప్రథమాశ్వాసములోని యీ క్రింది పదియైదవ పద్యమువలనఁ దెలియుచున్నది:—

సీ. మాధవవర్మభూ-మండలేశ్వరవంశ
జలధికి నేరాజు-చందమామ।
యేరా జుదయశైల-మెలమిని భేదించెఁ
గపటాహితమదాంధ-కార మడఁగ॥

గజపతిసురరాణి-గడిదుర్గములకెల్ల
నేరాజు వ్రజింపు-బోరుతల్పు।
మహిమచే నేరాజు-మటిపించె నల భగీ
రథపృథుశ్రీరామ-రఘురమణుల।

గీ. నట్టిగుణశాలి తమ్మరా-యనికుమార
వీరబసవక్షిమాచక్ర-విభునిచేత
మన్ననలుగాంచి మించిన-మహితుఁ డితఁడు
మనుజమాత్రుండె గంగయా-మాత్యమౌళి॥

ఈ గంగయ్యమంత్రి కశ్యపగోత్రుఁడు (1 వ ఆశ్వాసము 6 వ పద్యము) పెసరువాయ యను శాఖబ్రాహ్మణుఁడు (281) ఈతనిని సంబోధించిన పద్యాదులను బట్టిచూడఁగా లింగధారి యని తోఁచు చున్నది.

సాళువ నరసింహరాజు తన గుబ్బిపుసేనను మిగుల నభివృద్ధి పఱుచుటకై పారసీకదేశమునుండియు, అరబ్బీదేశము నుండియు నుత్తమాశ్వంబులఁ దెప్పించుచుండెను. బ్రతికినవైనను చచ్చినవైనను

తెచ్చిన గుఱ్ఱములలో గొన్ని సముద్రముమీఁద జచ్చినను, వానితోఁకలు తెచ్చినజాలును, రాజు వాని వెలనిచ్చును. ఇట్లగుటచే ననేక ప్రదేశ వర్తకు లసంఖ్యములగు నుత్తమాశ్వములఁదెచ్చుచుండిరి. అందుచే నతని యశ్వసైన్యము శత్రుభయంకరమయ్యెను.

ఈరాజు పేరు నరసింగ రాజగుటచేతను, ఈతని తరువాత రాజ్యమునకు వచ్చిన ముగ్గురురాజుల పేళ్ళను నరసింగరాజులే యగుటచేతను పోర్చుగీసు మొదలయిన పరదేశీయు లీ రాజ్యమును నరసింగరాజ్యమని వ్యవహరించుచు వచ్చిరి.

ఈరాజు న్యాయప్రవర్తనముగలవాఁడై ప్రజలను పుత్రులవలె రక్షించుచు, విద్వాంసులను మిగుల గౌరవించుచు నుత్తమ ప్రభువనివన్నె కెక్కెను. ఈ సాళువవారు తెలుఁగువారుగాఁ గానవచ్చుచున్నారు. ఎందు కనగా వీరికిఁ బూర్వపు రాజులు కన్నడపువారయినను ఈ వంశపువారు రాజ్యారూఢులయినప్పటినుండియుఁ దెలుఁగువారికి మంత్రిత్వ మొసగుటయు దెలుఁగు కవులకు నాశ్రయ మిచ్చుటయు దటస్థించెను. సాళ్వ నరసింహరాజు నొద్ద నాదేళ్ళ చిట్టిగంగనామాత్యుఁడను నియోగిబ్రాహ్మణుఁడు మంత్రిగా నుండెను. ఈతనికాలమున బిల్లల మట్టి పినవీరభద్రుఁడను విఖ్యాతకవి యీతని యాస్థాన కవిగా నుండి జైమిని భారత మను గ్రంథమును రచించి యీతనికి నంకిత మిచ్చెను.

ఈరాజు 1490 వ సంవత్సరములోనో, ఆపైగింతమునననో మరణ మొందెను. మరణ సమయము సమీపించిందని తెలిసికొని రాయలు తుళువ నరసానాయకుని బిలిపించెను. ఇతఁడు ఈశ్వర నాయకుని పుత్రుడు సేనాధిపతి. అతనిని బిలిపించి సాళ్వ నరసింహరాజు తన ఇద్దరు కొమారులను అతని కప్పగించి, తనబొక్కసమును సైన్యమును ఆతని స్వాధీనముచేసి, తనకొమారులు పెద్దవాండ్రగువరకుఁ దాను రాజ్యము నేలి వారియిరువురిలో నెవఁడు రాజ్యమున కర్హుఁడో వానికి రాజ్యమీయవలయునని చెప్పెను.

సాళ్వ నరసింహరాజు మృతినొందిన తరువాత నాతని పెద్ద కొమారుఁడగు తిమ్మరాజును రాజ్యారూఢునిఁజేసి, వాఁడు చిన్నవాడగు టచే దుళువవంశజుఁడగు నరసానాయకుడు రాజ్యముచేయఁదొడఁగెను. ఈ బాలరాజు నెవడో చంపెను. అంత నరసానాయకుఁడాతని తమ్ముఁడగు నిమ్మడి నరసింహరాయలను రాజ్యాధిపతిని గావించి యతనిపేర రాజ్యము చేయగడగెను.

అంతకుముందు ప్రథమావంశపు రాజులు రాజ్యమునకు వచ్చి విజయనగరరాజ్యమును గురించి పరదేశీయుఁ ప్రాసియుంచిన యంశము లిచ్చట నుదహరించుచున్నాను.

## విజయనగర వైభవము.

"నికోలోకోంటియను ఇటాలీ దేశస్థుఁడొకఁడు 1420 వ సంవత్సరమున నీ దేశమునకు వచ్చి విజయనగరమును జూచి ల్యాటిన్ భాషలో నీ నగర వైభవములను వర్ణించియున్నాఁడు. తొలుదొల్త నికోలోకోంటి హిందూదేశమును జేరగానే ఘూర్జర దేశమునపు రాజధానియగు కాంచియానగరమును దర్శించి యిరువదిదినముల యనంతరము బర్కూరు మొదలగు పట్టణములనుజూచి మార్గ మధ్యమునందు వింతలను వీక్షించుచు క్రమముగా రాయల రాజధానియగు విజయనగరమునకు వచ్చినవాఁడు. అతఁడీనగరమును నిట్లు వర్ణించుచున్నాఁడు:

"విజయనగర మనుమహానగరముమిక్కిలి నిర్మలముగానున్న పర్వతముల సమీపమునఁ గట్టబడినది. ఆ నగరముయొక్క చుట్టుకొలఁత యిరువది మైళ్ళుండెను. ఆ నగరమున నాయుధములనుధరింప సమర్థులగువారు తొంబదివేల భటులున్నారు." ఇతఁడు పర్వతములని యుదహరించెనేకాని రాళ్ళ గుట్టలును కొండలునేగాని గొప్ప పర్వతములులేవు. రక్షకపంక్తులయొక్క వైశాల్యమసమానమై యాశ్చర్యకరమై యున్నది.

మిక్కిలి పొడవును మందమును గల తాతిగోడలు కనుమల కడ్డముగా కొండల కొనలవరకు గట్టబడినవి. వెలుపలిపంక్తులు చెక్కు చెదర కుండునట్లు పెక్కు మైళ్ళవరకు సమభూమిలో నిర్మింపబడినవి. కొండల మధ్యమునన్న పల్లపు ప్రదేశములలో జనులు నివసించు గృహములును, మిడ్డెలును, మేడలును, నగరులును, ఉద్యానవనములు, ఫలవృక్షములు, పంటకాలువలు మొదలగునవి పెక్కులు కలవు. అచ్చటచ్చట ప్రసిద్ధములగు దేవళములును, గోపురంబులును గన్నులకు బండువు చేయుచుండునట్లుగా నుండెను. అట్టి నగరులయొక్కయు, దేవాలయముల యొక్కయు, ద్వారములయొక్కయు, శిథిలములైన భాగములనేకములు నేటికిని గన్పించు చున్నవి. ఇచ్చట మాత్రమేకాక విజయనగరమున కుత్తరముగా ప్రవహించుచున్న తుంగభద్రానది కావలనున్న ఆనగొంది పురములోని కట్టడములయొక్క శిథిలమునైన భాగములుకూడా ననేకములు నేటికిని గన్పించుచున్నవి. రెండు పెద్దభాగములుగా నేర్పడిన యీ మహానగరముయొక్క వైశాల్యమును, జనబాహుళ్యము నత్యధికమై యుండినవి. పురమునకు దక్షిణమునన్న రక్షకస్థానము మొదలుకొని యానగొంది పట్టణము యొక్క యుత్తరపు కొనవరకు గల దూరము పండ్రెండు మైళ్ళుండెను. అటులే పడమరనుండి తూర్పునకు గల దూరము పదిమైళ్లుండెను. ఆకాశమునందు ప్రత్యింపబడిన పంట కాలువలు నేటివరకును శిథిలములుగాక బహుభూములను సారవంతములగు పంటలను బండించునివిగా జేయుచున్నవి. ఆ ప్రదేశము లిపుడు పచ్చని పైరులతోను నానావిధములగు ఫలవృక్షములతోను నిండియున్నవి. కొండల పైభాగములందు శిథిలములైన దేవళముల యొక్కయు, గృహములయొక్కయు, గోడలయొక్కయు, భాగములు గనిపించుచున్న యవి. ఒక కాలమునందు మిక్కిలి సొగసుందనమును ఔన్నత్యమును గనబడిచిన చిత్రంపుంబనుల యొక్క శిథిలములైన భాగములు నేటికిని మధ్య భాగమునందు గనిపించుచున్నయవి.

మజీయు నికోలోడెయికొంటి యను నాతడు "ఈప్రాంతము లందు నివసించు జనులు తమ యిష్టము ననుసరించి బహుభార్యల బరి

గ్రహింపు చుందురు. వారలు జీవయాత్ర ముగించిన భర్త ల శవములతో గూడ దహింప బడుచుందురు. వారి ప్రభువు హిందూ దేశములోని ప్రభువులకన్న మిక్కిలి శక్తి గలవాడు. అతనికి బండ్రెండువేలభార్యలు గలరు. అందు నాల్గువేలు రాజెపటికి బోవునో యచ్చటికి గాలినడక నడచి వచ్చెదరు. మఱినాలుగువేల స్త్రీలు సుందరాలంకార భూషితలై యశ్వారూఢలై పెంటనంటి వచ్చెదరు. రెండు మూడు వేల భార్య లాతడు చనిపోయినపుడు శవముతో గూడ నగ్నిప్రవేశముచేయ నిశ్చ యించుకొన్నవారై యుండిరి. సంవత్సరములో నొకానొక కాలమునందు తమ యిలువేల్పుగా బూజించెడు విగ్రహమును రెండురథముల మధ్య నుంచి నగరవీధులం దూరేగింతురు. చిన్నపడుచులు సుందరవస్త్రాలం కార భూషితలై దేవునిగురించి పాటలు పాడుచు వెంబడించివచ్చెదరు. అనేకులు భక్త్యావేశపరవశులై స్వామివారి రథచక్రముల క్రిందబడి మరణము నొందిన భగవంతుడు ముక్తి ని గరుణించునను నమ్మకముతో నాప్రకారము చేసి ప్రాణములను గోలుపోవుచుందురు! మఱికొందరు ప్రజలురిపెట్టుకొని రథమునకు గట్టుకొని బాధనొందుచు ప్రాణములను విడిచెదరు. సంవత్సరమునకు మూడు గొప్పపండుగలను గావించెదరు. అందొకపండుగ దినములలో స్త్రీపురుషాదు లాబాలవృద్ధులు నదులలోను సముద్రములలోను స్నానము లాచరించి నూతన వస్త్రముల ధరియించి శుచివ్రతులై భజనలు, నృత్యములు, విందులు సల్పుచు త్రిరాత్రములు గడపుదురు. మరొకపండుగనాడు దేవాలయములలోపలను వెలుపలను దీపారాధనలను జేయుదురు. మూడవపండుగ నవరాత్రములు జరుప బడును. ఆదినములలో వీథులయందు దూలములను బాతించి వానికొన లకు వివిధములగు రంగులగుడ్డలను జరీగుడ్డలను గట్టుదురు. మఱియు నొక్కొక్క దినమున సమస్త భూతములను సమదృష్టితో జూచు నొక్కొక్క భక్తిపరుని నాదూలముల చివరనుంచి నానావిధములైన పండ్లతో గొట్టుచుందురు. వారలంతయు నోపికతో నోర్చుకొని యుందురు. ఈ మూడుపండుగలు గాక మఱియొకపండుగ త్రిరాత్ర

ములు జరుపఁబడును. ఆదినములలో వసంత మనుపేరితోఁ బసుపు నీళ్ళను రాజమార్గమున నడచువారలపైఁ జల్లుచుందురు. రాజులపైనిని రాణులపైనిని గూడఁ జల్లుచుందురు. ప్రజలీయది చూచి కేరింతములు గొట్టుచుందురు" అని వ్రాసియున్నాఁడు. ఈ నికోలోడెయికొంటి విదేశీయుఁడగుటవలన రాణులయొక్క పరిచారకులను గూడ రాజుభార్యలని యూహించి పొరపడి పండ్రెండువేల భార్య లుండిరని వ్రాసియుండవచ్చును. అతఁడు దెలిపిన పండుగలు నాలుగును వరుసగా సంవత్సరాది పండుగనియు, దీపావళిపండుగనియు, మూఁడవది మహానవమి పండుగనియు, నాలుగవది కామునిపండుగనియు మనము సులభముగాఁ దెలిసి కొనవచ్చును. విజయనగరము వజ్రములకు ప్రసిద్ధ కెక్కియుండెనని యాతఁడు దెలిపియున్నాడు.

తరువాత 1443 వ సంవత్సరమున "అబ్దుల్ రజాక్" అనునతఁడు విజయనగరమును జూడవచ్చి యానగరమును వర్ణించియున్నాఁడు. ఇతఁడు పారసీకదేశ రాజునొద్దనుండి కళ్ళికోటరాజగు జామొరిక్కడకు రాయబారిగా వచ్చెను. ఇపటినుండి దేవరాయలచేఁ బిలిసింపఁబడినట్లుగాఁ దెలుపుచున్నాఁడు. ఇతఁడు మంగళూరు, బెడ్నూరు మొదలగు పట్టణములగుండ ప్రయాణముచేసి విజయనగరమునకు వచ్చినవాఁడు గావున దారిపొడుగునను తాఁజూచిన దేశములయొక్కయు, ప్రజలయొక్కయు, వరనలనుజేసి విజయనగరమును గురించి యిట్లు వ్రాసియున్నాఁడు.

"1443 వ సంవత్సరము, ఏప్రియలు నెలచివరకు విజయనగరము ప్రవేశించితిమి. మమ్మాఁదోడ్కొనిపోవుటకై మాకెదురుగాఁ బరివారజనమును బుత్తెంచి మేము బసచేయుటకై మాకొక సుందరమైన గృహము రాయ లిప్పించెను. అతనిరాష్ట్రము కృష్ణానది మొదలుకొని కన్యాకుమారివరకు వ్యాపించి యుండెను. ఆ నగరమున వికృతాకారములు గలిగి పర్వతములను బోలిన వేయియేనుఁగులుగలవు. పదునొకొండు లక్షలసైన్యము గలదు. హిందూస్థానమునం దాకాలమున నిరంకుశాధి

కారము గలమఱియొక రాయలు గానరాఁడు. విజయనగరమువంటి మహా నగరమునెన్నఁడును మేముగన్నులతోఁ జూచియుండలేదు. ఆ నగర మును బోలిన మఱియొక నగరము ప్రపంచమున నెచ్చోటనైన నున్నట్టు వినియుండలేదు. సప్తప్రాకారముల చేతఁ జుట్టఁబడిన యేడుదుర్గములచే సురక్షితమై యానగరమొప్పుచున్నయది. మొదటిదుర్గముచుట్టును నిలువెఁ డెత్తుగల రాళ్ళు గుట్టములుగాని భటులుగాని నడచుటకు వీలులేనియట్లు భూమిలో నగమువరకు పాదుకొని యున్నవి. ఉత్తరముగానున్న యేడవ దుర్గమే రాజు నివసించు నంతఃపురమందిరముగా నున్నయది. మొదటి దుర్గముయొక్క దక్షిణపుకొన మొదలుకొని యుత్తరపుకొనవరకు దూర మెనిమిది మైళ్ళుగానుండెను. మొదటిదుర్గము మొదలుకొని మూఁడవ దుర్గమువరకుగల ప్రదేశమంతయు సాగుబడి చేయఁబడిన పొలముల తోను గృహములతోను ఉద్యానవనములతోను ఫలవృక్షములతోను నిండి యుండెను. మూఁడవదుర్గము మొదలుకొని యేడవ దుర్గమువరకుఁ గల ప్రదేశమంతయు నసంఖ్యాకములగు జనసంఘములచేత నిండి బజారు లతో నొప్పుచుండెను. రాజమందిరమునకు సమీపముగా నాలుగు బజారు లొకదారి కొకటెందుగా బారులు దీర్చియుండినవి. ఉత్తరమున రాయలు మందిరముయొక్క ద్వారమండపముకలదు.

ప్రతిబజారునకు పైని సొగసైన తాళ్వారముతో గూడిన యున్న తములైన కమానులు నిర్మింపఁబడినవి. అన్నిటికంటె రాయలా స్థాన మంటపము మిక్కిలి యెత్తుగానున్నది. బజారులు విశాలములును పొడు వులును గలిగి రమణీయములై యుండినవి. గులాబిపూవు లంతట నమ్మ బడుచున్నవి. ఆ ప్రజలు గులాబిపూవులను నాహారముకంటె నావశ్య కము లయినవిగా భావించుచుండిరి. ముత్యములు, కెంపులు, నీలములు, వజ్రములు మొదలగునవి బహిరంగముగా బజారులలో విక్రయింపఁబడు చున్నవి. ఈ పర్యదేశములందును రాజాంతఃపుర ప్రదేశములందును నున్నగా పాలగచ్చు చేయఁబడిన రాతిగొట్టములగుండ కాలువలు పెక్కులు జలపూర్ణములై ప్రవహించుచున్నవి. రాయల సౌధద్వార

మండపమున కెడమభాగమున రాచనగరువలెనున్న దివానుఖానా యను మందిరముగలదు. దాని కెదురుగా నొక్క సభామండపముగలదు. సభా మండపమునకు చివర చోపుదారులు నిలువంబడి యుందురు. ఆ సభా మండపము మధ్యమున దివానుగూరుచుండు పీఠముగలదు.అచట దివాను లేక దండనాయకుడు ప్రజల విజ్ఞాపనములను విమర్శించుచుండును. ఆతనితీర్పునకు పైతీర్పులేదు. పని ముగించినతరువాత దండనాయకుడు సప్తద్వారములను దాటి యంతఃపురముసొచ్చి సమస్తమును రాజునకు నివేదించును. రాజమందిరమునకు వెనుక దండనాయకుని గృహము కలదు. ఆ మందిరమున కెడమపార్శ్వమున నాణెములముద్రించు టంక సాలగలదు. దివానుఖానాకు నెదురుగా నేనుగులుండు కట్టడముగలదు. ఏనుగున కొక్కొక్కగది చొప్పున నేర్పాటు చేయబడెను. నాణెములు ముద్రించు టంకసాల కెదురుగా నగరపాలకుని గృహముకలదు. అతని క్రింద బండ్రెండువేల భటులుండిరి. టంకసాలకు వెనుకప్రక్క పదు నైదు గజములవెడల్పును రెండువందల గజముల పొడవునుగల యొక చిన్నబజారు కలదు. బజారుల కిరుపార్శ్వములయందు నిండ్లును ముఖ మండపములును గట్టబడియున్నవి. వానికెదుట సొగసైన రాళ్ళచే గట్ట బడిన యున్నతాసనములుగలవు. ఆయా గదులయొక్క గోడలమీద సింహములు, పెద్దపులులు, చిఱుతపులులు, మొదలగు క్రూరమృగముల యొక్క యాకారములు చిత్రింపబడినవి. అక్కడి యున్నతాసనములు రత్నాభరణాలంకృతులగు వేశ్యాంగనామణులచే నధిష్ఠింపబడి యుండి నవి. ఒకనాడు నన్ను జూచుటకై రాయల యంతఃపురమునుండి పంప బడిన కొందఱుదూతలు వచ్చి యాదినముననే నన్ను రాయల యాస్థాన మునకు గొనిపోయిరి. రాజకుమారుడు (ప్రౌఢదేవరాయలు)సభామండ పమున రాజకార్యధురంధరులగు మంత్రి శిఖామణులు మొదలుగాగల వారు తన్ను బలసి కొలువ సింహాసనాధిష్ఠితుండై యుండెను. వాని కిరు పార్శ్వముల జనసంఘము వృత్తాకారముగా నిలువంబడియుండెను. రాయలు పట్టుపీతాంబరమును ధరించియుండెను. సొగసగునీటిచే జేయ బడిన ముత్యాలపతకమును నమూల్యములగు రత్నాభరణములను ధరించి

యుండెను.సొగసగు నీటిచే జేయబడిన ముత్యాల పతకమును నమూల్య ములగు రత్నాభరణములను ధరించి యుండెను. పలుచనైనట్టియు పొడ వైనటియు దేహముగలిగి నలుపునుదెలుపునుగాక చామనచాయంబోలు రూపమును గలిగియుండెను. చెక్కులు మెత్తనివై పలుచగనున్నవి.

"అతనికి గడ్డమున వెండ్రుకలులేవు. చూపు మనోహరముగా నుండెను. అతనికి నేడువందలభార్యలును ఉంపుడుగత్తెలును గలరని తెలియవచ్చినది. మహానవమి పండుగనాడు రాయలు (ప్రౌఢదేవ రాయలు) తన రాష్ట్రములోనుండి తనకు గప్పము గట్టుచున్న సేనాధి పతులను ప్రభువులను దన యాస్థానమునకు రప్పించి దర్బారు తీర్చెను. వారలు మిగుల రమణీయములగు హోదాలతో నలంకరింపబడిన యేనుగులను వేయింటిని తమతోగూడ దెచ్చిరి.

"ఆనాడు నగరమంతయు శృంగారముగా నలంకరింపబడెను. ఏనుగు లొకచోటునకుజేరి సముద్రతరంగములంబోలి కనుపట్టుచుం డెను. అచటచట నాలుగై దంతరువులుగల పందిరులు నిర్మింపబడినవి. ఈ పందిరులు గుఱ్ఱమని చుట్టుదిరుగుటకు ననుకూలము లగునట్లుగా నిర్మింపబడిసవి.ఈ మైదానమున కెదుట తొమ్మిదిపందిరులతో గూడిన రాజభవనమొకటి నిర్మింపబడినది. తొమ్మిదవయంతరువులోని పంది రిలో రాయలకు సింహాసన మమర్పబడినది. అంతఃపురమునకు పందిళ్ళ కును మధ్య నాటకులును పాటకులును కథకులును నుండిరి. రాజున కెదుటనున్న తెర కావల బడుచులు సుందరవస్త్రాలంకార భూషితలై నృత్యములు సలుపుచుండిరి : గారడివాండ్రు మిక్కిలి యానంద ముప్పొంగునట్లుగా నేనుగులచే నాటలాడించుచుండిరి. మూడుదినము లీవిధముగా నాటలతోను, పాటలతోను,వినోదములతోను గడపబడినవి. మూడవనాడు నాకు మరల రాజుదర్శనము లభించెను. మిక్కిలి వైశా ల్యముగల సింహాసనము సువర్ణముతో జేయబడి యమూల్యములగు మణులచే దొడుగబడియున్నది. సింహాసనమునకెదుట జదరముగా నున్న మెత్తయొకటి గలదు. దాని కొనలయందు మూడువరుసల ముత్యములతో గుట్టబడియుండెను. రాజామూడుదినము లామెత్తపై

గూరుచుండియుండెను. ఆ మందిరముయొక్క గోడలను పైకప్పును మణులచే బొదుగఁబడిన బంగారు పలకలచే గూర్చఁబడియున్నవి. అవియును బంగారపు మేకులతో బిగింపఁబడి యున్నవి." ఈరీతిగా విదేశీయులచే వరింపఁబడిన విజయనగరము పదునాఱవ పదునేడవ శతాబ్దములయందు మిక్కిలి యౌన్నత్యమును బొందియుండెనని చెప్పుటకు లేశమాత్రము సంశయింపవచ్చునా ? *

## తుళువ వంశము.

విజయనగరమును పాలించిన తృతీయరాజవంశము తుళువ వంశము—ఈ వంశమునకు మూలపురుషుఁడు తిమ్మనాయకుడు. తిమ్మనాయకునకు నీశ్వరనాయకుఁడును నా ఈశ్వరనాయకునకు నీ తుళువ నరసానాయకుడును పుట్టిరి.

ఈ తుళువ వంశపువారు తాము చంద్రవంశపు క్షత్రియులమని చెప్పుకొను చుండిరి. వీరు శూరాగ్రేసరులు. నరసానాయకుడును అతని తండ్రియైన ఈశ్వరనాయకుడును విజయనగరరాజులనొద్ద విఖ్యాతసేనాధీశులుగా నుండి, శూరులని ప్రఖ్యాతివడసి, దేశము లనేకములు జయించిరి. ఈశ్వరరాజును గుఱించి వరాహపురాణములో నిట్లు వ్రాయఁబడియున్నది:-

సీ. ఉదయాద్రి భేదించె-హుత్తర నిర్జించె
గండికోటపురంబు-గదలఁద్రవ్వె।
బెనుగొండ సాధించె-బెగ్గులూరు హరించె
గోవెలనెల్లూరు-గుంటపఱీచె।
గుందాణి విదలించె-గొడుగుచింత జయించె
బాగూరుపంచము-పాడుచేసె।

---

* 'జీర్ణకర్ణాట చరిత్రము.'

నరుగొండ వెకలించె-నామూరు మర్దించె
శ్రీరంగపురమును-బారిసమరె।

గీ. రాయచౌహ త్తమల్లధ-రావరాహ।
మోహనము రారిబర్బర-బాహుసాళ్వ।
నారసింహ ప్రతాప స-న్నహనుఁ డగుచు।
విశ్వహితకారి తిమ్మాయ - యీశ్వరుండు ॥

## నరసానాయకుడు

ఈశ్వరనాయకుని కుమారుడు నరసానాయకుడు. ఇతఁడు తండ్రి కంటెఁ బరాక్రమ వంతుఁడు. సాళ్వ నరసింహరాజు నొద్ద నితఁడు సేనాధీశుఁడుగను, ముఖ్యమంత్రిగను నుండెను. అందువలననే యీతని కార్యఖడ్గచాతురి యసామాన్యమైనది యని మనమెఱుంగవచ్చును. సాళ్వ నరసింహరాజు మరణసమయమున నితనిఁ బిల్చి తన యిద్దరుకొమారు లను, రాజ్యమును నితనికి స్వాధీనపఱిచెను. మొదట నరసానాయకుడు స్వామిభక్తి పరాయణుఁడై యజమానునిఁ బెద్దకొమారుని రాజ్యారూఢుని జేసి వాఁడు చిన్నవాఁడగుటచే దాను రాజ్యముచేయఁగొడగెఁను. కాని యీబాలరాజును నెవ్వఁడో దుష్టుఁడుచంపి, యీనెపమును నరసానాయకునిపై మోఁపెను. కాని నరసానాయకుడా నెపమును బాపుకొనుటకై సాళువ నరసరాజుయొక్క రెండవకొమారుడగు దమ్మరాయడను నామాంతరముగల ఇమ్మడి నరసింహరాయలను రాజుచేసెను.

నరసానాయకుని ఘనకార్యములు పారిజాతాపహరణములోని ఈ క్రింది పద్యములో వర్ణింపఁబడినవి:—

సీ. కుంతలేశ్వరుఁడు చి-క్కుపడఁగ విద్యాపు
రంబుగైకొని నిజ-ప్రౌఢినెరపె।
బారసీకునకు దు-ర్భరమానవత్వంబుఁ

దొలఁగించె మానవ-దుర్గసీమఁ।
జోళవల్లభునకు-సురవధూమధురాధ
రములిచ్చి మధురాపు-రంబుగొనియె।
శ్రీరంగపట్టణ-సీమ ఖడ్గనటీ వి
నోదంబు హెయ్యనేం-ద్రునకుఁ జూపెఁ।

గీ. నతఁడు నుతికెక్కఁ రామసే-త్వంతరాళ్ళ
కలితషోడశదానవి-ఖ్యాతయఁతఁడు।
మండలీకరమేఘమా-ర్తాండబిరుదుఁ
డీశ్వరాధిప నరసపృ-థ్వీశ్వరుండు॥

ఈ పద్యమునందు సూచింపబడిన నరసానాయకుని ఘనకృత్యములను కొంచెము వివరించి చెప్పుటయొప్పును.

ఇతఁడు విద్యాపురమును గొనుటవలన చిక్కఁబడిన కుంతలేశ్వరుఁడు ఆతని ప్రభువైన ఇమ్మడి నరసింహరాయలు-ప్రభువు చర్య యతనికి నచ్చలేదు. అతఁడు తన యన్నను చంపిన ద్రోహిని గౌరవించుటవలన క్రుద్ధుడై నరసానాయకుడు వేటనెపమున విద్యానగరమునుండి వెలువడిపోయి దళములను కూర్చుకొని మరలివచ్చి పట్టణము ముట్టడించెను. ముట్టడికి నిలువజాలక ఇమ్మడి నరసింహరాయలు తనకు హితుడైమెలగుచుండిన నిజభ్రాతృహంతయొక్క తలను దఱిగి నరసానాయకునికంపెను. అంత నతఁడు పట్టణమును ప్రవేశించి ఇమ్మడి నరసింహరాయలను పెనుగొండ దుర్గమునకంపి యచట నిర్బంధమునుంచి రాజ్యమునకు దానెయొడయుఁడైనట్లు పాలింపగడగెను. మానవ దుర్గసీమ కృష్ణా తుంగభద్రల యంతర్వేది తూర్పుభాగమున గలదు. దుర్గమునబట్టి దానిక్రింది భూములకు ఆ పేరు కలిగినది. ఇచ్చట నరసానాయనిచే బరాభూతుఁడైన పారశీకుడు విజాపుర పాలకుడైన యూసఫ్‌ఆదిల్‌ఖానుఁడు. అతడు కృష్ణా తుంగభద్రల యంతర్వేదిపైనెత్తివచ్చి మానవదుర్గ నాక్రమించుకొనగా నరసానాయకుఁడు దండుతో గదలిపోయి పైదుర్గమును

ముట్టడించి యతనినోడించెననియు నతఁడు పాదాక్రాంతుఁడు కాగా నతని కాదుర్గమును మరలనిచ్చివేసెననియు సమకాలిక సంస్కృత గ్రంథములు తెలుపుచున్నవి. మహమ్మదీయ చరిత్రగ్రంథములలో మానవదుర్గ ప్రస్తావము కానరాదు;కాని యా సమయమున పరాజితుఁడైన యూసఫ్ ఆదిల్ ఖానుఁడు సంధి సంప్రతింపులకని నరసానాయకుని ఆతని పక్షపు దొరలను తన శిబిరమున కాహ్వానించి వారచ్చటికివచ్చి సమావేశమైన పిమ్మట కృత్రిమముచేసి వారిమీద పడి చేతచిక్కిన వారిని సంహరింపగా నరసానాయకుఁడు తప్పించుకొని పారిపోయెనని చెప్పియున్నది.

నరసానాయకుఁడు ఇమ్మడి నరసింహరాయలను నిర్బంధము నందుంచి సామ్రాజ్యాధికారము నాక్రమించుకొన్నందుకు కుపితులై సామంతులనేకులతనిమీద తిరుగుబాటు చేసిరి. వారిలో ద్రావిడదేశము నందు చోళపాండ్య దేశపాలకులను కర్ణాటకమున నుమ్మత్తూరు శ్రీరంగ పట్టణాధిపతులును ప్రముఖులు.వారి మదమణచి వశీకృతులను గావించు కొనుటకొరకు నరసానాయకుడు దక్షిణదిగ్విజయ యాత్ర బయలువెడలి పోయి చోళపాండ్యాది సమస్త వైరివర్గమును నిర్జించి రామేశ్వరమున జయస్తంభమును పాతుకొల్పెను. అచటి మరలివచ్చుచు పశ్చిమాభిముఖుఁడై దండు నడపుకొనుచు కావేరీ తీరమునసె ప్రయాణముచేసి కర్ణాట దేశమును ప్రవేశించి యుమ్మత్తూరు శ్రీరంగ పట్టణాధిపతులను సంగరమున నోడించి యాజాబద్ధులను గావించుకొనెను.

ఈ నరసానాయకుఁడు దండయాత్రలవలన విఖ్యాతిఁ జెందుటయే గాక, యాంధ్ర కవీశ్వరుల నాదరించి కృతులనందుకొని యజరామరుఁడయ్యెను. ఇతని యాస్థానమునందు నందిమల్లయ్య, ఘంటసింగయ్య అను కవులిద్దఱుండిరి. ప్రస్తుతపు "తిరుపతి వేంకటేశ్వర" కవులవలె వీరిద్దఱును గలిసి కావ్యరచన చేయుచుండిరి. నందిమల్లయ్యకు ఘంట సింగయ్య మేనల్లుడు. వీరాఱువేల నియోగులు. సింగయ్యకు మలయ మారుతకవి యని బిరుదునామముండెను. వీరిరువురునుగలిసి వరాహ పురాణము, ప్రబోధచంద్రోదయము, అను తెలుఁగుకబ్బములు వ్రాసిరి. అందు వరాహపురాణము నరసరాజునకుఁ గృతి యీయఁబడినది.ప్రబోధ

చంద్రోదయమునకు గంగయ్య మంత్రియనువాఁడు నాయకుఁడు చేయఁ బడెను. ఇందలి ఘంటసింగయ్య యనుకవికిఁ బారిజాతాపహరణకావ్యము వ్రాసిన నందితిమ్మన్న మేనల్లుఁడు.

నరసానాయకునకు ముగ్గురుభార్యలు: తిప్పాజీ, నాగలాంబిక, ఓబాంబిక. తిప్పాజీవలన వీరనృసింహరాయఁడు, నాగలాంబికవలనఁ గృష్ణరాయఁడు, ఓబాంబికవలన రంగరాజ అచ్యుతరాయలును పుట్టిరి.

## వీరనరసింహరాయలు

నరసానాయకుఁడు గతించినపిమ్మట నతని పెద్దకొడుకు ఇమ్మడి నరసానాయకుడు రాయలకును రాజ్యమునకును సంరక్షకుఁడాయెను. ఇతని కాలమున నటచిన చరిత్రాంశములలో ముఖ్యమయిన వానినిచట వివరించుట యుక్తము. మొట్టమొదట నెన్నదగినది ఇమ్మడి నరసింహరాయల వధ. ఇమ్మడినరసానాయకుడు నామకార్థమైనను ఇమ్మడినరసింహరాయలు రాజ్యాధిపతిగనుండ నిష్టపడక కృత్రిమోపాయముజేసి పెనుగొండ దుర్గమునందు చంపించి రత్నసింహాసనాసీనుఁడై వీరనరసింహరాయలను నామమును వహించి ప్రజాపాలనము సేయగడఁగెను. కాని నాయకులనేకులితని దుర్జయమునకు లోసి ఇతనిపై తిరుగుబాటు చేసిరి. వారిలో మొదట పేర్కొనదగినవాడు ఆదవాని దుర్గాధిపతియైన కాచప్పఒడయడు. ఆదవాని అప్పటి విజయనగరసామ్రాజ్యము యొక్క ఉత్తర సరిహద్దు ప్రాంతమునందుండు ఆయువుపట్టు స్థానములలో ప్రసిద్ధమైనది. బహమనీ సంస్థానమునుండియు తరువాత విజాపురమునుండియు బయలు వెడలివచ్చు దండయాత్రల మొదటితాకు ప్రాయికముగా నా దుర్గమునకు దగులుచుండెడివి. కావున నీ కాచప్ప ఒడయడు వీరనరసింహరాయలపై కత్తికట్టి, యతని ప్రతిఘటించుటకు విజయనగరాధిపతులకు బద్ధశత్రుఁడైన విజాపురపాలకుడగు యూసఫ్ ఆదిల్ ఖానునితో మైత్రి చేసికొని యతని సహాయమును బడసెను. మఱియు దక్షిణ కర్ణాటమున కావేరీతట మందలి యుమ్మత్తూరి దొరలతో సఖ్యము జేసికొని రాయసింహాసమునకే

ముప్పు దేసమకట్టెను. కావున వీరనరసింహరాయలు సింహాసము నాక్ర మించిన వెంటనే తన యధికారమును నిల్పుకొనుట కొరకు రాయ సామంతములతో పోట్లాడవలసి వచ్చెను.

కాచప్ప ఒడయనితో జేసికొనిన ఒడంబడిక చొప్పున యూసఫ్ ఆదిల్ ఖానుడు అతనికి తోడ్పడు నెపమున విజయనగరసామ్రాజ్యముపై దండువెడలి తుంగభద్రానది ఉత్తరించి కందనవోలు దుర్గమునకు ముట్టడి వేసెను. వీరనరసింహరాజు ఆజ్ఞానుసారము ఆ దుర్గమున తాణ్యముం డిన ఆరవీటి బుక్కరాజు రామరాజును అతని పుత్రుడగు తిమ్మరాజును నిజదళములతో కోటవెలువడి యూసఫ్ఆదిల్ ఖానుని స్కంధావారముపై నురికి యతని పరాభూతుని గావించి వెనుకొని వెన్నడచి యాదవాని పర్యంతము దరుముచుపోయి యచట మరలనతని నిర్జించి పారదోలిరి. తరువాత ఆదవానికి ముట్టడివేసి లగ్గలుపట్టి స్వాధీనము జేసికొని కాచప్ప ఒడయని మట్టుపెట్టిరి. వారు సామ్రాజ్యమునకు జేసిన మహోప కారమునకు మెచ్చుకొని రామరాజునకు కందనవోలు దుర్గాధిపత్యమును, తిమ్మరాజునకు ఆదవాని దుర్గాధిపత్యము నొసగుటయేకాక తిమ్మరాజు నకు స్వామిద్రోహ రంగడయను బిరుదునిచ్చి సత్కరించెను.

కర్ణాటకమున రాయవిద్వేషులింత సులభముగ లోబడలేదు. వారి లోనుమ్మత్తూరు శివనసముద్రప్రభువులు ప్రముఖులు, శ్రీరంగ పట్టణాధి పతివారికి మిత్రుడగుటచే వీరి మార్గమునను సరించెను. కనుమల కవ్వలి దొరలుగూడ రాయల యధికారమును సరకుగొనక స్వతంత్రులవలె వర్తింప గడగిరి. కావున వీరనరసింహరాయలు కర్ణాటకు దేశపు సామం తుల పైదండు తరలెను. యుద్ధకార్యము రెండురంగములందు నడచి నది. కనుయవ్వలి ప్రాంతమును పాలించుచుండిన తుళువ దొరలెల్ల సంగ రమున నిర్జితులై రాయలకు పాదాక్రాంతులైరి. మలసీమలును తీరదేశ మును యథాపూర్వము రాయల యేలుబడిక్రిందికి వచ్చినవి. ఈ దండ యాత్ర నడచుచుండిన కాలమున సంభవించిన విశేషాంశము నొక్కదాని నీపట్టున జెప్పదగియున్నది. అది పోర్చుగీసువారితో రాయలు చేసి

కొనిన యొడంబడిక. వీరు ఐరోపాఖండమునందు అట్లాంటిక్ మహా సముద్ర పూర్వతీర దేశములలో నొక్కటియైన పోర్చుగల్ దేశవాస్తవ్యులు. నావికాబల సంపన్నులు - సముద్ర యుద్ధములందారితేరిన నిపుణులు. వర్తకముసేయుటకును మతప్రచారము నడపుటకును క్రీ. శ. 1497 లో పోర్చుగీసువారు వాస్కోడగామాయను పీరుని యాధిపత్యము క్రింద గుడ్‌హూప్ ఆగ్రమును చుట్టి దక్షిణ హిందూదేశమునందు పశ్చిమ సముద్రతీరమున కళ్ళికోట యను రేవుపట్టణమునకు వచ్చి దిగి దానిని తమ కేంద్రవర్తక స్థానముగ జేసికొనెను. వారి రాకను సహింప కతత్పూర్వము పశ్చిమ దేశములతో జరుగు ఓడవ్యాపారమును సమస్తమును దమ చేతులమీదనే నడపుచుండిన యరబీ మహమ్మదీయ వర్తకులు వారితో కలహించిరి. కాని పోర్చుగీసుల నావికాదళముయొక్క యాటోపమునకు దాళుకొనజాలక పోకుండిగిరి. తత్కలితముగ పోర్చుగీసుల యధికారము సముద్రములపై నిర్వ్యక్రముగ సాగుటయేకాక తత్పూర్వము అరబ్బుల వశముననుండిన యోడబేరమంతయు వారికి హస్తగతమయినది. ఇందు ముఖ్యముగ నశ్వవ్యాపారము పేరొక్కన దగినది. మధ్యయుగమున భారతీయ సైన్యముల బలాబలములశ్వదళముపై నాధారపడియుండినది. అశ్వబల నధిక్యమువలననే తురుష్కులు హిందూదేశము నంతటిని జయింపగలిగిరి. ఉత్తమాశ్వముల నుత్పన్నములు గాకపోవుటచే భారతీయ ప్రభువులు తమకు వలసిన గుఱ్ఱములను అరబీపారశీ దేశములనుండి దిగుమతి జేసికొనువారు. అరబీ వర్తకులు స్వమతస్థులైన మహమ్మదీయ ప్రభువులకే విక్రయించువారు. హిందూరాజుల కది కంటకప్రాయముగ నుండెను. పోర్చుగీసువారు అశ్వవ్యాపారమును మహమ్మదీయుల కడనుండి యొడిచికొని పక్షపాతము జూపక వర్తింపగడగిరి. క్రమ క్రమముగ వారి ప్రాబల్య మతిశయించెను. పశ్చిమ సముద్రతీరము పొడవునను పెక్కుకరపట్టణముల నాక్రమించుకొని వారు తమ వర్తకస్థానములను నెలకొల్పిరి. వాస్కోడిగామా మరలి స్వదేశమునకు పోయిన వెనుక ప్రాంసిస్కోడి అల్‌మయిదా అను నతడు భరతఖండమందలి పోర్చుగీసు వర్తకస్థానముల కధిపతిగ నియమింపబడి

క్రీ. శ. 1505 మొదలు 1506 వఱకును పాలించెను. ఇతడొక నౌకా యుద్ధమున తురుష్క నౌకాదళమును పూర్తిగ నాశనమొనర్చి పోర్చు గీసువారియొక్క సముద్రాధిపత్యమును స్థాపించెను. అతనితో నొక యొడంబడిక నేర్పఱచుకొని పోర్చుగీసువారిని దనకు సుముఖులను జేసి కొను నుద్దేశముతో వీరనరసింహరాయల దన సచివుడైన సాళువతిమ్మ రసయ్యను అతనికడకు రాయబారమంపెను. తిమ్మరసయ్య పశ్చిమ సముద్ర తీరమునుజేరి యాల్మెదాను గలిసికొని యతనితో తన యజ మానునికి సఖ్యము గుదిర్చెను. దీనికి ఫలితముగ పోర్చుగీసువారు భరతఖండమునకు దిగుమతి సేయు యుత్తమాశ్వములయందొక్క దాని నైన తురకల కమ్మక రాయలకే విక్రయించునట్లు ఏర్పాటు గావింప బడెను. ఇందువలన క్రమ క్రమముగ విజయనగర ఆశ్వికబలము పెం పొంది తురకరాజులకు గుండెదిగులు గొల్ప నారంభించినది. ఇది వీర నరసింహరాయలు రాయసామ్రాజ్యమునకు గావించిన మహోపకారము.

ఇట్లు పశ్చిమ సముద్రతీర దేశమున విజయుడై యనతులైన సామంతులనెల్ల దనకు పాదాక్రాంతులను జేసికొనగల్గినను కర్ణాటకదేశ మున వీరనరసింహరాయలకు జయము చేకూడినదికాదు. ఉమ్మత్తూరు శ్రీరంగపట్టణము మున్నగు శత్రు దుర్గములను ముట్టడించియు భేదింప జాలకపోయెను. మీదుమిక్కిలి రాయరాణువ యుద్ధరంగమున శత్రుల ధాటి కాగజాలక యోటువడెను. అంతట వీరనరసింహరాయలు విజయ నగరమునకు తిరిగివచ్చి యుమ్మత్తూరు శ్రీరంగపట్టణములపై మరల దండువెట్టు నుద్దేశ్యముతో దళములను గూర్ప నారంభించెను. కాని యంతటనె దైవదుర్విపాకమువలన జాడ్యగ్రస్తుడై క్రీ. శ. 1509 వ సంవత్సర పూర్వార్ధమున స్వర్గస్థుడాయెను.

అతని కొమారుని జెఱలోనుంచి యాతని తమ్ముఁడగు కృష్ణ రాయలు రాజయ్యెను. ఫెరిస్తాచే వ్రాయఁబడిన చరిత్ర యెంతవరకు నమ్మ దగినదో చూడగోరువారు సాళువనరసింహ, తుళువనరసింహ, వీరనర

సింహరాయలులనుగురించి యాతఁడు వ్రాసియుంచిన యంశములను జూచిన జాలును. ఆతఁడు ఈముగ్గురును ఒక పురుషుఁడనియే భావించు టయేకాక కృష్ణరాయని మంత్రియగు తిమ్మరుసునుగూడ నీ ముగ్గురిలో నొక్కనిగా భావించెను ! *

## కృష్ణదేవరాయలు.

## (1509–1530)

వీరనరసింహరాయలు కాలగతినందిన పిమ్మట ఆతని సవతితల్లి నాగలాంబిక పుత్రుఁడు కృష్ణదేవరాయలు రాజ్యాభిషిక్తుడాయెను. ఇతఁడు విజయనగరరాజులలో సర్వశ్రేష్ఠుఁడని చెప్పుట యొకవింతకాదు.దక్షిణ హిందూదేశములో నింతటి వైభవపరాక్రమశాలియగు చక్రవర్తి మఱి యొక్కఁడు పుట్టలేదనుటకు సందేహములేదు. విజయనగరసైన్యము లీతని ప్రభుత్వకాలమందు నపజయమన్నమాట యొఱుఁగక మహా బలాఢ్యులగు యవనాధిపీరులనెల్లఁ జెండాడి విజయలక్ష్మిచే వరింపఁబడు చుండెను. ఈతనికాలములో విజయనగరవిభవమార్తాండుఁ డాకాశమధ్యం బుననుండి ప్రచండంబుగ వెలుఁగుచుండెను. కావుననే యీతఁడు దాక్షి ణాత్యులకు దేవసమానుఁడు; ప్రాతస్సంస్మరణీయుఁడు. ఇతనిచరిత్ర యవశ్యముగాఁ దెలిసికొనఁదగినది.

### జననము.

కృష్ణరాయలు 1465 లో జన్మించెనని యొకరును, 1487 లో జన్మించెనని యొకరును వ్రాసియున్నారు. కాని యీ మహారాజు జన్మ

---

* 'Firistah seems to have confused Narsa's and Krishna Deva Raya's Powerful minister, Saluva, Timma with Narasimha and Narsa, and made all three one person' - Sewell's Forgotten Empire, p. 113.

దిన మిదియేయని నిశ్చయముగా జెప్పుట కేమియు నాధారములేదు. ఇతడు ఈశ్వరనాయకుని కుమారుడైన నరసానాయకునకు నాగాంబిక వలన గలిగిన పుత్రుడు. ఈ నాగాంబిక భార్యగాదనియు భోగకాంత యనియు నొకవాడుకకలదు. కాని ఈవార్త నిజమని చెప్పుటకు గ్రంథాదు లలో నేమియు ప్రమాణములులేవు ; కులకాంతయనియే వ్రాయబడి యున్నది. కావున మన మదియే నమ్మవలయును. ఘనతచెందిన పురు షులనుగుఱించి వారిశత్రువులు మరేమియుజేయలేక యిట్టి యపవాద ములఁ బుట్టించుచుందురు. అవియే పరంపరగా వచ్చుచుండును. గ్రీకు వారిని నీదేశమునుండి వెడలఁగొట్టి ఈ దేశమున ప్రస్తుత ప్రభుత్వము కంటె నెక్కుడు సామ్రాజ్యమును స్థాపించిన మౌర్యచంద్రగుప్తునిగురిం చియు, దిల్లీపాదుషాను తనచేతిలో నుంచుకొనిన మహారాష్ట్రవీరుడని ఖ్యాతిచెందిన మహాదజీ శిందేను గుఱించియు, నిట్టియపవాదమేకలదు. కావున వీనిని నమ్మదగదు. ఒకవేళ నీ వార్తయే నిజమైనను, నిజసద్గుణ పుంజములచే వెలుంగుచున్న యా మహనీయుల కందఱకు నేమియు లోపము రాఁజాలదు. వారి తల్లులు కులకాంతలు గాకపోయినను వారు మాత్రము మనకు వంద్యులే, సంస్మరణీయులే.

## కర్ణాటకుడా? తెలుగువాడా?

తుళువవంశజుడగుటచే గృష్ణరాయలు "తులు" అనఁబడు దేశములోని కర్ణాటకుడని కొందఱి యభిప్రాయము. కాని యీతని తండ్రికిఁ బినతాతయగు సాళువనరసింహరాజు ఆంధ్రజైమిని భారతమును గృతినందెను. ఈతని తండ్రియగు నరసింగరాజు తెలుఁగు వరాహ పురాణమునఁ గృతికర్త యయ్యెను. ఈతఁడు మనుచరిత్ర పారిజాతా పహరణ మను కావ్యములకు భర్తయయ్యెను, ఈతని యల్లుఁడగు రామ రాజాంధ్రకవులను మన్నించెను. ఇంకొక యల్లుఁడగు తిరుమలరాయఁడు వసుచరిత్రకు భర్తయయ్యెను ; రాయలబంధువులును మధుర తంజా వూరు మొదలైన స్థలముల పాలకులును అగునాయకులును తెనుఁగు

నందు నభిమానముగలిగి యభివృద్ధిచేసిరి. కృష్ణరాయఁడు స్వయముగా నాముక్తమాల్యదయనెడి యాంధ్రకావ్యమును రచించుటయేగాక యందు "దేశభాషలందుఁ దెనుఁగులెస్స" యని తెలుఁగును బొగడియున్నాఁడు. ఇట్లు వంశపరంపరగాఁ దెనుఁగునందు, నభిమానముంచి తెలుఁగు కవులను తెలుఁగుబాసను పోషించిన వంశము తెలుఁగుదిగాక కన్నడ మెట్లగును ?

## రాజ్యాభిషేకము.

(1509)

వీరనరసింహరాయని కంత్యకాలము సమీపించినప్పు డాతనికి ఎనిమిదేండ్ల కొమారుఁ డుండెను. తాను పోయిన తరువాత దన పుత్రునకు రాజ్యమీయక కృష్ణరాయలు ఆక్రమించుకొనునని తలఁచి, తన మంత్రియగు తిమ్మరుసును బిలిపించి. కృష్ణరాయని కనులు తీసి తనకు దెచ్చి చూపుమని యాజ్ఞాపించెనట. కాని యా మంత్రిపుంగవుఁడు కృష్ణరాయని డాఁచియుంచి మేఁకకనులు రాజునకుఁ జూపెనఁట.వీరనరసింహరాయలు మరణమునొందిన తరువాత గృష్ణరాయఁడు తన తమ్ములగు అచ్యుతరంగరాయలను, అన్నకొమారునితో కూడ చంద్రగిరి దుర్గము మీఁది కంపి, యచట బందీకృతులనుజేసి తాను పట్టాభిషిక్తుఁడయ్యెను.

శా. శ. 1430 కి సరియైన ఋక్షనామసంవత్సర మాఘశుద్ధ చతుర్దశియగు 4 వ ఫిబ్రవరీ 1509 వ దినమునఁ గృష్ణరాయఁడు పట్టాభిషిక్తుఁడైనట్లు హంపీలోని పంపావతి దేవాలయములోనున్న యొక శాసనమువలనఁ దేలుచున్నది. * కావున ఈదిన మాంధ్రకర్ణాటకుల కందఱికిని శుభదినంబని యెన్నువలసియున్నది. ఈచక్రవర్తి పట్టాభిషిక్తుఁడైనప్పు డీతనియొద్దనున్న కొందఱు సరదారుల పేళ్ళు.

సీ. చక్కెరవిలుకాని-చక్కఁదనముగల్గి
చొక్కమౌనార్వీటి-బుక్కరాజు।

---

* Epig. Ind., i, 366

సాకల్యముగ గీ - సర్వదిక్తటులందు
ప్రాకటస్థితిమించు - నొకువారు।
కంటకరాజన్య - గర్వంబు లడగించి
లీలచేమించు నం - ద్యాలవారు।
ధాటీనిరాఘాట - మోటీహతవిరోధి
కోటులై వెలయు - వెల్గోటివారు।
గీ. చండతరశౌర్య లగుపెమ్మ - సానివారు
బూదహళివారు మొదలైన - భూమిపతులు
గొలువ బట్టాభిషిక్తుడై - చెలువుమీఱ
రమ్యగుణపాళి శ్రీకృష్ణ - రాయమౌళి॥

మనవాండ్రు చరిత్రలు వ్రాయనందున బైబేరొకనబడిన యార్వీటివారు, నంద్యాలవారు మొదలగు శూరాగ్రేసరులనుగుఱించి మనకు నధికముగా నేమియుదెలియదు. కాని వీరప్పటికాలపు అడ్మిరల్టోగో, జనరల్ జేయమూలని చెప్పుటకు సంశయములేదు. కావున వీరు కర్ణాటాంధ్రులకు బూజ్యులు. వీరి సహాయమువలననే కృష్ణరాయ లెడతెగని గెలుపులఁ గాంచెను.

## మంత్రి తిమ్మరుసు.

ఇక కృష్ణరాయని దిగ్విజయముల వర్ణింపవలయును. కాని యంతకు పూర్వ మాదిగ్విజయములకు గారకుడును రాయలకు గుడి భుజమును, పితృతుల్యుడును అగు మంత్రిపుంగవునిగురించి కొంచెము వ్రాయవలసియున్నది. తెలుగుదేశమున నితనికీర్తి యింతవరకును వెలుంగుచున్నది. ఇతని బుద్ధివైభవముజూపు కథలనేకము తెలుగు వారు చెప్పుకొనియెదరు. ఇతడు క్షత్రియుడా, లేక బ్రాహ్మణుడాయని తెలియక యింగ్లీషుచరిత్రకారులు కొందఱు త్రొక్కులాడిరి. కాని యీ తని యల్లుడగు నాపిండ్ల యప్పామాత్యుడాఱువేల నియోగి బ్రాహ్మణు

కృష్ణరాయలకు ప్రధమ కర్తవ్యమాయెను. అందుచే గృష్ణరాయఁడు శతఘ్నులతోను ప్రబలసైన్యములతోను వానిని సాధించుటకు వెడలెను. అతని జ్ఞాతియగు గంగరాజునకును చిక్కరాయనికిని వైరమగుటచే వానిని గలుపుకొని కృష్ణరాయలు కొండవ్రోవనుబోయి శివసముద్రపు కోటను ముట్టడించి శౌర్యముతోఁ బోరాడి వశపఱుచుకొనెను. గంగరాజు కావేరిలోఁ బ్రాణములను ద్యజించెను. అంత నుమ్మత్తూరు జయించెను. చిక్కరాయనికి ఉమ్మత్తూరు రాజ్యమునిచ్చి యాతఁడు తనకుఁ గప్పము కట్టునట్లు చేసెను. తరువాత శ్రీరంగపట్టణ దేశమంతయుఁ గర్ణాటకంబంతయుఁ గృష్ణరాజునకు లోఁబడెను. తాను జయించిన కర్ణాటదేశమున కంతటికిని శ్రీరంగపట్టణము రాజధానిగా నేర్పఱిచి, కృష్ణరాయధ్వజమనుపేర నొక విజయధ్వజము నెత్తించి యాప్రాంతమును "కెంపగౌడఁడు వీరప్పగౌడఁడు" అను పాలెగాండ్రవశమున నుంచెను.

ఇట్లు కర్ణాటకము జయించినపిదప కొడగు (Coorg), మళయాళము అను దేశములగెలిచి యచ్చటిరాజు లిచ్చుకప్పములనిర్ణయించుకొని పాండ్యాది దక్షిణదేశములను జయించుటకై లక్షసేననిచ్చి "విజయప్పనాయకుఁడు వెంకటప్పనాయకుఁడు" అనువారినిఁ బంపెను. విజయప్పనాయకుఁడు వేలూరు ప్రాంతమును జయించి వేలూరు ముఖ్యస్థానము చేసికొని యచ్చటనుండి పన్నులు వసూలుచేయుచుండెను. చిత్తూరు పాలెగాండ్రను, తొండమండలములోని పాలెగాండ్రను, జింజీదుర్గమును, చోళమండలములోని పాలెగాండ్రను, వశపఱుచుకొని వారియవలసినపన్నుల నిర్ధారణచేసి, జింజీలోఁ గాఁపురముండి కృష్ణరాయలకై పన్నులు రాఁబట్టుకొనుచుండెను. తంజావూరు, తిరుచనాపల్లి, మధుర, తిరునగరు, రాజులు విజయప్పనాయకునికి వశులై కప్పములొప్పుకొనిరి. ఇట్లు పూర్వకర్ణాట ద్రవిడదేశమంతయుఁ గృష్ణరాయలకు వశమైమూఁడు కోట్లరూక లిచ్చుచుండెను.


కటకము
మహానది
భద్రావతి
పెనగంగానది
గోదావరినది
ఇంద్రావతినది
ధాభోల్
చాకూ
కృష్ణానది
ఇంటి
కపిలవాయి
అరవపల్లి
నలగొండ
దేవరకొండ
నాగార్జునకొండ
కొండవీడు
బెజవాడ
రాజమహేంద్రవరము
సింహాచలము
శంకరగిరి
కృష్ణదేవరాయల పూర్వదిగ్విజయ యాత్రామార్గము.
నరసరాయని దండయాత్రామార్గము.
రామరాజు చినతిమ్మభూపతి మార్గము.
రాయల దండయాత్రా మార్గములు.
విజయనగరము
కందుకూరు
గోకర్ణము
పెనుకొండ
చంద్రగిరి
తుంకూరు
శ్రీరంగపట్టణము
వేలూరు
కాంచీపురము
భువనగిరి
శ్రీరంగము
నాగూరు
మదురై
రామనాదపురము
రామేశ్వరము
తిరుప్పత్తూరు
అనంతశయనము
కన్యాకుమారి
సింహళము



తుంగభద్రానదీ తీరమున హంపీ విరూపాక్ష దేవాలయము

228



228



ఉగ్ర నరసింహస్వామి విగ్రహము

## పూర్వ దిగ్విజయయాత్ర.

నెల్లూరు మండలములో ఉదయగిరి యను దుర్గము గలదు. అది మొదట విజయనగరరాజులదియే యెనను కటకపురికి రాజులయిన గజపతులు దానిని స్వాధీనపఱుచుకొనిరి. ఆకాలమందు గటకపురిమొదలు నెల్లూరు మండలము వఱకును గల తూర్పు తెలుగుదేశమంతయు ప్రతాపరుద్రగజపతి ప్రభుత్వములోనిదియై యుండెను. కావున నాభాగమును జయింపవలయునని కృష్ణరాయడు 1513 లో పూర్వదిగ్విజయయాత్రకు వెడలి యుదయగిరిని సమీపించెను. ఆ దుర్గము శత్రువులకభేద్యమై, పదివేల కాల్బలముతోను, నాలుగు వందల గుఱ్ఱములతోను సురక్షితమై యుండెను. అచ్చటియధికారి ప్రతాపరుద్ర గజపతి సోదరుడయిన తిరుమలకాంతరాహుత్తరాయుడు. కృష్ణరాయలవెంట ముప్పదివేల కాల్బలమును, ఎనిమిది నూరుల యేనుగులును ఉండెను. దుర్గమును సమీపించుటకు నొకచిన్న దారితప్ప వేఱుత్రోవ లేనందున లోనివారికి తినుబండార మందకుండజేసి వారిని వశపఱుచుకొనవలయునని కృష్ణరాయడు నిశ్చయించి పదునెనిమిది నెలలవరకును కోటను ముట్టడించి విడిసియుండెను. ఇట్లు కృష్ణరాయలు ఉదయగిరి దుర్గమును ముట్టడించి యుండగా ప్రతాపరుద్రగజపతి ముట్టడిని లేపునుద్దేశముతో నొకగొప్ప దండుతోగూడ యా దుర్గమును చుట్టువిడిసి యుండురాయస్కంధావారముపై నడచెను. కృష్ణరాయలు కొంతదండును ముట్టడిసాగించుటకచట నిలిపి తక్కిన సేనతో ప్రతాపరుద్రగజపతి కభిముఖుడైపోయి యతని యుద్ధమునన్నోడించి పారదోలి మరలివచ్చెను. తరువాత కొండలను బగులగొట్టించివిశాలమార్గములు జేయించి రాయలు దుర్గమును సమీపించి దానిని వశపఱుచుకొనెను. ఆ దుర్గాధ్యక్షుని పినతండ్రియైన ప్రహరేశ్వరపాత్రుని జెఱపట్టి విజయనగరమునకు దీసికొనిపోయెను. దుర్గాధీశుని (పితృవ్యుని) జెఱపట్టెనని న్యూనిజ్ వ్రాసియున్నాడు.

ఉదయగిరి జయించినపిదప బ్రస్తుతపు గుంటూరుమండలములో

నున్న కొండవీడుదుర్గమును జయించుటకు రాయలవారు తిమ్మరుసుతో గూడ వెడలిరి. ఈ కొండవీడుదుర్గము దక్షిణ హిందూదేశమందలి గొప్ప పర్వత దుర్గములలో నొకటి; మహాబలాఢ్యమైనది. అది ప్రస్తుతమందు శిథిలమైపడిపోయినను చూచుటకు బహురమ్యముగానుండును. ఓరుగంటి రాజ్యము పోయినతరువాత నచ్చటనున్న రెడ్డిసరదారులు స్వతంత్రులై ఈ దుర్గమునుగట్టి యిచ్చటనుండి రాజ్యముచేయుచుండిరి. 1454 లో నుత్కలదేశాధీశులగు కటకరాజు లీదుర్గమును స్వాధీనపఱుచుకొనిరి. అప్పటినుండి1515వర కది వారి స్వాధీనములోనే యుండెను. ప్రస్తుత కథా భాగకాలమందు నీదుర్గ ముత్కలదేశపు రాజయిన ప్రతాపరుద్ర గజపతి యొక్క కుమారుడగు వీరభద్రగజపతిపాలనలోనుండెను. ఇంతియ గాక కుమారహంవీరపాత్రుని కుమారుడు నరహరిదేవుడు, శ్రీనాథ రాజు రామరాజుకుమారుడు లక్ష్మీపతిరాజు, జన్యామలక సవాపాత్రుడు, సుప్రపాల చంద్రమహాపాత్రుడు, పూసపాటి రాచిరాజు, రాచూరి యల్లయఖానుడు, ఉద్దండఖానుడు మొదలగు నుద్దండ సేనా నులనే కులు సేనాసమేతులై కొండవీటిసీమను రక్షించుచుండిరి.

కృష్ణదేవరాయ లుదయగిరిదీసికొని కొండపీటి మీదికి దండెత్తి వెడలుచున్నాడని విని కటకాధీశ్వరుండగు ప్రతాపరుద్రదేవుడు పదు మూడువందల యేనుగులును, ఇరువదివేల గుఱ్ఱములును, అయిదు లక్షల కాల్బలమును వెంటదీసికొని యోధ్రదేశమునుండి బయలుదేరి కృష్ణరాయలతో బోరాడుటకు గృష్ణానదిని సమీపించెను. ఈ వర్త మానమువిని కృష్ణరాయలు కొండవీడువిడిచి తన సైన్యముతో గజపతి సైన్యముల సమీపించెను. కృష్ణకుత్తరమున గజపతి సైన్యములును, కృష్ణకుదక్షిణమున రాయలసైన్యములును విడిసి యుద్ధమునకు వేచి యుండెను. ఏఱుదాటునప్పుడు పోరాడుటవలన అనావశ్యకముగా సైని కులు మడియుదురుకావున "మీరు గృష్ణదాటి యిటువచ్చెడి యెడల మేము రెండుమైళ్ళు వెనుకకుబోయెదము. లేదా మీరుక్రోసెడు దూరము వెనుకకుంబోయి మమ్ము నావలకు రానిం"డని రాయలు గజపతికి వర్త మానమంపెను. కాని యందులకు బ్రత్యుత్తరము రానందున రాయలు

శత్రువులతోఁ బోరాడుచు గృష్ణానదిని స్వసైనికులతోడాఁటి, గజపతితో ఘోరముగాఁబోరి యాతనిఁ బారఁదోలి యెన్నియో యేనుంగులును, గుఱ్ఱం బులును ధనంబును కొల్లగొట్టెను.

ఇట్లాడంబరముతో వచ్చినగజపతిని బారఁదోలి రాయలును తిమ్మ రుసును కొండవీటి దుర్గమును మరల ముట్టడించి, రెండుమాసముల వరకుఁబోరి దుర్గమును వశపఱుచుకొనిరి. శా. శ. 1437 లో ఆషాఢ శుక్ల ఏకాదశి శనివారము (23 వ జూన్ 1515) నాఁ డీదుర్గమును తిమ్మరుసు జయించినట్లు ఈ దుర్గమువీఁద నొకశాసనము కలదు. ఈ దుర్గాధిపతియు గజపతిపుత్రుఁడును అగు వీరభద్రగజపతిని రాయలు చెఱపట్టి "కరుణామతికాచె"నని "పారిజాతాపహరణము"వలనఁ దెలియు చున్నది. ఈ దుర్గ సంరక్షణార్థమై తిమ్మరుసు తన మేనల్లుఁడగు నాదిండ్లగోపనమంత్రిని దుర్గాధీశునిగా నేర్పఱచెను. కృష్ణరాయఁ డీసమ యమునందే కొండవీటికి సమీపమునందున్న బెల్లముకొండ, నాగార్జున కొండ, అద్దంకి, అమ్మనబ్రోలు, తంగేడు, కేతవరము మొదలగు దుర్గ ముల సాధించెను.

ఈ దండయాత్రలో రాయలభార్యలు వెంటనుండిరి. అమరావతి పట్టణములోని యమరేశ్వరునకును, బెజవాడలోని శివునిదేవాలయమునకు మఱియు ననేక దేవాలయములకు దానములనేకములు రాయలును పట్ట మహిషులును కలిసిచేసిరి. పెక్కుశాసనములు వేయించిరి.

రాయలవారు బెజవాడలోఁ గొన్నిదినములుండి కృష్ణయొడ్డున నున్న శ్రీకాకుళమను క్షేత్రము దర్శింపఁబోయి యచ్చటనే "ఆముక్త మాల్యద" యను కావ్యమును రచింప నిశ్చయించిరి.

కొండ్వీటినుండి రాయలు కొండపల్లియను దుర్గమునకుఁబోయి దానిని రెండునెలలవరకు ముట్టడించి స్వాధీనపఱుచుకొని యందుఁ గట కేశ్వరుని భార్యను, కొందఱు ముఖ్యసైన్యాధీశులను జెఱపట్టి విజయ నగరమునకుఁ బంపెను.

తరువాత గృష్ణరాయలు ప్రతాపరుద్రగజపతిని వెంబడించి తఱుముచు నుత్తరమునకు బోవజొచ్చెను. అతడు కృష్ణా గోదావరీనదుల ముఖమునకు నడుమనుండు వేగిదేశముపై దండెత్తి జమ్మెలోయ, కోనసీమ, కొరాము మొదలగు మన్యసీమలజయించుచు రాజమహేంద్రవరము స్వాధీనపఱుచుకొనెను. తరువాత విశాఖపట్టణమండలములోని బాహుబలేంద్రవంశస్థులకు రాజధానియగు పొట్టునూరికడ జయస్తంభము నాటి మాడుగులు మొదలగు మన్యసంస్థానములను వడ్డాదిని వశపఱుచుకొని సింహాద్రి చేరెను. అచ్చట స్వామినిసేవించి జయస్తంభములువేయించి కటకమునకుబోయి యాపట్టణమును కాల్చి పూర్వదిగ్విజయముచేసి యా తీరాగ్రేసరుడు దిరిగి తన విజయంబులచే సార్థకనామమైన విజయనగరముజేరెను. కృష్ణరాయల పూర్వ దిగ్విజయ యాత్ర క్రీ.శ. 1513 లో ప్రారంభమై విజయపరంపరలతో నాఱేండ్లకాలము కొనసాగి క్రీ. శ. 1518 లో సమాప్తమైనది.

రాయలు నిజపురమునకు వచ్చిన తరువాత నొకనాడు చెఱసాలలోనున్న గజపతిపుత్రుని ఖడ్గకౌశలముచూడ నాతనిచే బిలిపించి వినోదము చూపుమనగా నతడాయగౌరవమునకు నోర్వలేక పొడుచుకొని చచ్చెను. తరువాత రాయలకును గజపతికిని సంధి జరిగి గజపతి తనకూతును రాయలకిచ్చి వివాహముచేసెను. అంత రాయలవారు కృష్ణానది కుత్తరమున గ్రొత్తగా సంపాదించిన రాజ్యమంతయు గజపతికిచ్చివైచెను.

1518—19లో గృష్ణరాయలు కాటూరు పాళెగారును జయించెను. తరువాత రెండు సంవత్సరముల వరకు యుద్ధములు చేసినట్లుకనబడదు. విద్వచ్చక్రవర్తి కావ్యముల రచించుటయందును, కావ్యముల నందుకొనుటయందును, ఏష్యయుద్ధసామగ్రి సేకరించుటయందును నీ కాలమును గడపినట్లు కానవచ్చుచున్నది.

## రాయచూరు దండయాత్ర.

## (1520)

రాచూరు లేక రాయచూరు అనఁబడు దుర్గము ఆదిల్ షాహయొక్క స్వాధీనమందుండెను. ఇది కృష్ణా తుంగభద్రా నదులకు నడుమనున్నది. ఈ దుర్గము మొదట విజయనగరరాజులదియై యుండెను. దీనికై రాయ సామ్రాజ్యాధిపతులకును-మహమ్మదీయులకును నెన్నియోసారులు ఘోర ములైన యుద్ధములు జరిగెను. తుదకాదుర్గమును తురుష్కులాక్రమించు కొనిరి. కావున విజయనగరసింహాసనాసీనులగు రాజులా బలాఢ్యదుర్గ మును స్వాధీనపఱుచుకొన వలసినదని సాళ్వనరసింహరాజు తన మరణ శాసనమునందు వ్రాసియుంచెను. ఈ యంశములన్నియు మనస్సులో నుంచుకొని రాచూరును గెలిచినఁగాని తన పౌరుషమునకు వన్నెలేదని తలఁచి కృష్ణరాయలు యుద్ధముచేయ నిశ్చయించి యుద్ధమున కెద్దియైనఁ గారణము దొరకునా యని రాయ లెదురుచూచుచుండెను.

అంత సయ్యద్ మర్కర్ అను తురుష్కుఁ డొకఁడు రాయల యొద్దనుండి గుఱ్ఱములు తెచ్చుటకై కొంతధనముఁదీసికొని పాతిపోయి ఆదిల్ షాహయొక్క రాజ్యములో డాఁగియుండెను. వానిని తనకు స్వాధీన పఱుపవలసినదిగా రాయలడిగినను వాఁడు తురకవాఁడగుటచే వాని నెక్కడికో పంపివేసి యాదిల్ షాహ వాఁడు లేఁడని ప్రత్యుత్తర మంపెను. అదియే కారణముగాఁ గృష్ణరాయఁ డు యుద్ధమునకు సమ కట్టెను. యుద్ధముచేయఁ దలఁచినవారికిఁ గారణము దొరకకపోవునా ?

ఈ యుద్ధముకొరకుఁ గృష్ణరాయలవారు చేసిన సన్నాహ మత్య ద్భుతకరము. తన సామ్రాజ్యములోనున్న యన్ని విధముల సైనికులను బోగుచేసెను. ప్రత్యక్షముగాను యుద్ధమును చూచినవాఁడనఁదగు న్యూనీజ్ అను పోర్చుగీజు చరిత్రకారుఁడు వ్రాసినయంశములనుబట్టి చూడఁగా నీ యుద్ధయాత్రలో రాయలవారివెంట 7, 03, 000 (ఏడు లక్షల మూడువేలు) కాల్బలమును, 3,2600 గుఱ్ఱములును, 551 ఏనుఁగులును వుండెను. వీరుగాక సైన్యసేవకు లెందరో యుండిరి: జనసంఖ్య

యంతయుఁ బదిలక్షలను మించియుండెను. ప్రస్తుతపు బొంబాయి చెన్న పట్టణములఁ గలపినయెడల నింత జనసంఖ్య యుండును.

దేశమంతటను సముద్రమువలెఁ బ్రసరించియున్న ఈ మహా సేనతో రాయ లొకశుభముహూర్తమున విజయనగరమునుండి యుద్ధము నకు బయలుదేఱెను. అప్పు డాసేనలోని రథులును మహారథులును ఏ యేక్రమమునను, ఏ యేడంబముతోను బయలుదేఱినది "న్యూనిజ్"కడు వింతగా వర్ణించియున్నాఁడు.

"విలుకాండ్రును, కత్తులు దూసికొనియున్నవారును, తుపాకులు చేతఁబట్టిన సిపాయీలును ఈరెలఁ గైకొన్నవారును గలిసి ముప్పదివేల కాల్బలమును, వేయితురంగములును పదునాఱేనుంగులును గల సేనతో సేనారక్షకులలోముఖ్యుఁడగు కామానాయకుఁడు ముందు నడుచుచుం డెను. అతని వెనుక త్ర్యంబకరావను నతఁ డేఁబదివేల కాల్బల మును, రెండువేల తేజులను, ఇరువదేనుంగులునుగల సేనతోఁబోవు చుండెను. తిమ్మప్పనాయకుఁడనువాఁ డరువదివేల కాల్బలమును మూఁడువేలయైదువందల గుఱ్ఱములును, ముప్పదేనుంగులును కల సైన్య ముతో త్ర్యంబకరావును వెంబడించి పోవుచుండెను. అతని తరువాత ఆదెప్పనాయకుఁ డరువాఁడు లక్షకాల్బలమును, అయిదువేల గుఱ్ఱ ములును, ఏఁబదేనుంగులును గల సైన్యముతోఁ బోవుచుండెను. అతని వెనుక లక్షయు నిరువదివేల కాల్బలమును, ఆఱువేల తురంగములును, అఱువ దేనుఁగులును గల సైన్యముతోఁ గొండమరసు (కొండా రెడ్డి) పోవుచుండెను. ఎనుబదివేల కాల్బలమును, రెండువేలయేఁబది గుఱ్ఱములును, నలువ దేనుంగులును గల సైన్యముతో నతని కుమారుఁ డాతని వెంబడించి పోవుచుండెను. విజయనగర పురపాలకుఁడుగా నియ మింపఁబడిన సాళువగోవిందరాజు (తిమ్మరుసు తమ్ముఁడు) ముప్పదివేల కాల్బలమును, వేయితేజులను, పది యేనుఁగులును గల

సైన్యమును గలిగి వారల వెనుకను బోవుచుండెను. అతనివెనుక రాయలకుఁ దమలం బందిచ్చు మధురనాయకుఁ డొకడు పదునైదువేల కాల్బలమును, రెండువందల గుఱ్ఱమునను గల సేనతోఁ బోవుచుండెను. కృష్ణరాయలకుఁ గూఁతునిచ్చినఁవాడును, మయిసూరు మండలాధిపతియునగు కుమార వీరయ్య (కుమార వీరశ్యామరాయలు) ఎనిమిదివేల కాల్బలమును నాలుగువందల గుఱ్ఱములను, ఇరువ దేనుంగులను గల సైన్యముతో నాతని వెనుకఁ బోవుచుండెను. తరువాత వెంగాపుర దుర్గాధ్యక్షుఁడును నరపతి వంశములోని యుత్తమ క్షత్రియులు మొదలగు వారు బహుసేనలతోఁ బోవుచుండిరి. రాయలు ప్రేమించు మూవురు ఖొజ్జాలు నలువదివేల కాల్బలమును, వేయి తురంగములును, పదునై దేనుంగులును గల సైన్యములను తీసికొని సాళ్వ గోవిందరాజు సైన్యమును వెన్నంటి పోవుచుండిరి. నలువది వేల కాల్బలమును, ఆఱు వేల తురంగములును మూఁడువందల యేనుంగులును తనకు రక్షకసైన్యముగా నుంచుకొని శ్రీకృష్ణదేవరాయలు పైనుదాహరించిన సేనలకన్నిఁటికిని నాయకుఁడై నడపించుకొని రాచూరు దుర్గముపైపునకుఁ బోవుచుండెను." *

ఇట్టి సైన్యసముద్ర మచ్చటచ్చట మార్గములో దిగుటకును, సైనికులకు గజాశ్వాదులకుఁ గావలసిన యాహారద్రవ్యములు, జలము, గడ్డి, కట్టెలు మొదలయినవి దొరకుటకును, రాయలవారు తగిన యేర్పాటులు చేయించిరి. అందుచే సైన్య మెచ్చట విడిసినను ఏమియుఁ గొఱఁతలేక యాస్థల మొక గొప్పపట్టణమువలెఁ గాన్పించు చుండెను. సైన్యమువిడిసినచోట రాజుయొక్క శిబిరము వేఱుగను, సేనానుల యొక్క శిబిరములు వేఱ్వేరుగను, బజారులుతీర్చి యంగడులు వినోద గృహములు వేఱ్వేరుగను, అమర్పఁబడుచుండెను. ఇట్లచ్చటచ్చట విడి

---

* జీర్ణకర్ణాటక రాజ్య చరిత్రము.

యుచు నా సైన్యమహాపట్టణము రాచూరు దుర్గమును సమీపించి ముట్టడించెను.

కోటలోనివారిసంఖ్య మిక్కిలి తక్కువయైనను వారు దుర్గద్వారములన్నియు మూసి బురుజులమీద ఫిరంగులు సిద్ధపఱిచి ధైర్యముతో బోరసాగిరి.

కృష్ణరాయడు రాచూరుదుర్గమును ముట్టడించెనని విని ఆదిల్ షాహ గొప్పసైన్యమును దీసికొని కృష్ణానదివరకు వచ్చెను. ఆవార్త తెలియవచ్చినంతటనె కృష్ణరాయలు తన సేనలో కొంతభాగమును ముట్టడి నడుపుటకు కోటచుట్టును నిలిపి తక్కిన దండుతో ఆదిల్ షాహు నెదురొక్కుటకై కృష్ణాతటమువైపు కూచిచేసిపోయి నదికి దక్షిణమున దండువిడిసెను. కృష్ణకు నుత్తరమునఆదిల్ షాహ సైన్యమును, దక్షిణమున రాయలసైన్యమును విడిసి కయ్యమునకు గాల్దీవ్వుచుండెను. యీయుదాటి వచ్చినతరువాత దురుష్కసైన్యముతో బోరాడవచ్చునని రాయలూర కుండెను. కృష్ణరాయలు భయపడి తనమీదికి యుద్ధమునకు రాలేదని తలచి నవాబు తనసైన్యములతో నేయుదాటి రాయల సైన్యములకు దొమ్మిది మైళ్ళదూరమున నుండెను. రాయలు తన సైన్యముతోవచ్చి శత్రువులమీదబడి పోరాడజొచ్చెను.

ఈ యుద్ధము భారత రామాయణీయ యుద్ధములవలె ఘోరముగా జరిగెను. ఉభయసైన్యములును తమ యద్భుతపరాక్రమము జూపెను. ఒకప్పుడు రాయలసైనికులలో గొందఱు తురుష్కులకోర్వఁజాలక పాఱిపోవఁగాఁజూచి రాయలవారు పఱు పాఱిపోవు వారల నటికింపఁదొడగెను. అంత పాఱిపోవు వారందఱు మరలి శత్రువులమీద బడిరి. తుదకు దురుష్కసేన పూర్తిగా బరాభవము నొంది రాయలసైన్యమునకు బరిపూర్ణమైన దిగ్విజయము కలిగెను. రాయల సైనికులు తురుష్కసేనలను తఱిమితఱిమి చెండాడిరి. సుల్తానెట్టకేలకు నేనుగెక్కియేరుదాటి పాఱిపోయెను. ఇతని ముఖ్యసేనాధీశుడు రాయలచే జెఱఁబెట్టఁబడియె. శత్రుసైనికు లెందఱో రాయలశౌర్యమున కాగలేక నదిలోకుఱికి ప్రాణ

ములు పోఁగొట్టుకొనిరి. నవాబు తప్పించుకొని పాఱిపోయెనని తెలిసిన తరువాత దీనాలాపములు పెట్టుచున్న యాతని సైనికులను సంహరించుట మానవలసినదని దయానిధియగు రాయలవారాజ్ఞాపించిరి. రాయలవారికి శత్రుశిబిరమునందు ననంఖ్యమైన ధనమును, ధాన్యమును, గుఱ్ఱములును, ఏనుఁగులును దొరకెను. ఈ యుద్ధము క్రీ. శ. 1520 వ సంవత్సరము, మేనెల 19వ తేది శనివారమునాఁడు జరిగెను.

రాచూరు దుర్గమునకు సాహాయ్యము చేయవచ్చిన ఆదిల్‌షాహ నిట్టు పాఱఁదోలి రాయలు మరల నామదుర్గమును ముట్టడించెను. కోటలో నివా రిరువదిదినములవఱకుఁ బోరాడిరి. రాయలసైన్యములును మిగుల నుత్సాహముతో యుద్ధముచేసెను. రాయలసైన్యములో పోర్చుగీసుసైని కులు కొందరుండిరి. వారినాయకుఁడు క్రిస్తోవిడిఫిగరీడో యనువాఁడు. ఈతఁడును ఈతనిసైనికులును ఈ యుద్ధములోఁ దమయుద్ధనైపుణ్య మును విశేషముగాఁ జూపి కోటను స్వాధీనముచేసికొనుటకు మిగుల సహాయభూతులయిరి. వేరువిధిలేక కోటలోనివారు ద్వారములను తెఱచి రాయలకు వశులైరి. రాయలవారు జయజయధ్వనులతోఁ బురప్రవేశము చేసెను; పురములో వారిని మిక్కిలి గౌరవముతోఁ జూచెను. వెడలి పోయెదమన్నవారిని వారిసొత్తుతోఁగూడ వెడలిపోనిచ్చెను. తనసైనికులు కొఁదఱిని దోఁచుకొనఁగా వారిని శిక్షించి యెవరిధనము వారికి నిప్పిం చెను. ఇట్టి దైవికగుణములు చూచి శత్రుజనులుకూడ రాయలను కొని యాడఁ జొచ్చిరి. ఇట్లు జయలక్ష్మినిఁగైకొన రాయలవారు రాచూరురక్ష ణార్థమై కొంతసైన్యమునుంచి, మిగిలిన సైన్యముతోఁ దాను విజయన గరమునకుఁ బోయి జయోత్సవముచేసి, సేనాధిపతులకును, సైనికులకును తగినబహుమతు లిప్పించెను.

ఆదిల్‌షాహవంటి బలాఢ్యుఁడైన ననాబుగూడ నోడిపోయెనని తెలిసి హిందూదేశమం దంతటను కృష్ణరాయలవారికీర్తి ప్రసరించెను. ఇతరతురుష్క రాజులందఱును రాయలవారితో మైత్రిచేసి యాతనియను

గ్రహమును కోరుచుండిరి. శత్రువులకీతని పేరనఁగానే గుండె జల్లను చుండెను.

అటుపరాభవముఁజెందిన ఆదిల్‌షాహ తన సేనాధీశుని నొక్కని రాయలవారి యొద్దికిఁ బంపి ఇట్లు మనవి చేసికొనెను.

"ప్రభూ! నా యజమానుఁడగు ఆదిల్‌షాహ నన్ను మీయొద్దకు బంపినాఁడు. "న్యాయముదయచేయుఁ"డని తన ప్రార్థనగా నన్ను మీకు మనవిచేయు మని చెప్పెను. ఇంక నిట్లు చెప్పమనెను : ప్రపంచములోని సత్యసంధులలోను, న్యాయప్రియులలోను, పరాక్రమవంతులలోను మీరు సర్వశ్రేష్ఠులని మీయెడ నేను సద్భావము కలిగియున్నాఁడను. ఎన్నియో తరములనుండి మీకును మాకును గల స్నేహమునకును, సంధికిని మీరు నిష్కారణముగ భంగము కలిగించితిరి. మీరేల మీ రాజ్యమునువిడిచి మారాజ్యముమీఁదికి యుద్ధమునకు వచ్చితిరో తెలియకున్నది.మీరు రాయ చూరును ముట్టడించితిరనియు, చుట్టుననున్న దేశమును బాడుచేసితి రనియుఁ దెలియువరకు నట్లగునని మేమెన్నఁడును తలంపలేదు.అంతట మేము రాయచూరుదుర్గరక్షణార్థమై కదలి వచ్చితిమి. మాసరదారులంద రును మీచేఁ జంపఁబడిరి;మా శిబిరమంతయుఁ దోచుకొనఁబడెను,నాశము చేయఁబడెను; అచ్చటజరిగిన యసన్నిత కృత్యముల కన్నిఁటికిని మీరె సాక్షి. కావున మీరు మాగుట్టములను, ఏనుఁగులను, గుడారములను మాకీయవలసినది. రాయచూరుదుర్గము మా స్వాధీనము చేయవలసినది. అట్లయిన నేను మీకు నవ్యాజస్నేహితుఁడుగ నుండఁగలను. అట్లీయని యెడల మీపని మీకెంతబాగున్నను అది దుష్కృత్యమని యెంచఁ బడును."

అందుకు "ఆదిల్‌షాహవచ్చి మాకు పాదాక్రాంతుడైనయెడల మీరు కోరినవన్నియు మీ కిచ్చివేయుదు" మని రాయలు ప్రత్యుత్తర మిచ్చెను. వేరువిధిలేక యాదిల్‌షాహ యందులకు నొప్పుకొనియెను. ఇద్దరురాజులును తమ రాజ్యములపొలిమేరయొద్దఁ గలియునట్లేర్పాటు చేసికొని రాయలు సైన్యముతోఁ గదలి ముద్గల్లుకువెళ్ళెను.కాని యాదిల్‌ షాహకు ధైర్యములేనందున నతఁడు వచ్చి రాయలనుగలియఁడయ్యెను.

అంత రాయలవారు ఆదిల్‌షాహయొక్క రాజధానియగు బిజాపురము వఱకుఁ బోయి యాపట్టణమును రాజధానిని ధ్వంసముచేసి, మంత్రి లాపైని పోవలదన్నందునఁ దిరిగిరి.

ఈ దాడిలోనే రాయలు కలబరిగి దుర్గమును ధ్వంసముచేసి, వశ పరుచుకొనెను. ఇందు ఆదిల్‌షాహ బహమనీవంశజులయిన ముగురు రాజపుత్రులను చెరలోనుంచెను. కృష్ణరాయలు వారిచెరవిడిపించి,యందు బెద్దవానికి రాజ్యముకట్టెను. రాయలభయముచే నందరును అతనిని బహమనీ రాజని యొప్పుకొనిరి. మిగిలిన యిద్దరు రాజపుత్రులఁ దనవెంటఁ దీసికొనిపోయి వారికిఁ దనయొద్ద ఘనమైన యుద్యోగము లొసఁగెను. రాయలు కలబర్గి గెల్చిన సంగతి ఆముక్తమాల్యదలోని యీక్రింది పద్యమునందుఁ జెప్పఁబడి యున్నది.

గీ. తిరుగుహరిపురి సురతరు-సురలమరిగి
బహుళహళహళిభరితక-ల్బురగినగర
సగరపురవరపరివృఢ-జవనయవన
పృతన భవదసి ననిఁదెగి-కృష్ణరాయ॥

ఈ యంశమే మనుచరిత్రలోని ఈ క్రింది పద్యార్థములో వర్ణింపబడినది.

కవిరాజవిరాజితము.

ప్రళయఘనాఘన ఘోషజయానక
ధ్వంకృతిభీమ చపేటలుతఁ॥
కలుబరగీకటకక్షితిరక్షక!
కన్నడరాజ్యరమారమణా!॥

## మహమ్మదీయ వృత్తాంతము.

ఇనివఱకు వ్రాయఁబడిన విజయవర్ణనలన్నియుఁ గృష్ణరాయలతో సమకాలీనుఁడగు న్యూనీజు గ్రంథమునుండి గైకొనఁబడినవి. ఇతఁడు

సమకాలీనుఁడగుటచేతను, పక్షపాతమునకుఁ గారణములేని పరదేశీయుఁడగుటచేతను ఇతనిగ్రంథ మితరగ్రంథములకంటె నెక్కుడుగా నమ్మఁదగియున్నది. ఇఁక దరువాతికాలపు రాఁగు మహమ్మదీయ చరిత్రకారులేమిత్రవాసిరో చూతము.

కృష్ణరాయల యప్రతిమపరాక్రముఁ జూచి భయపడి కాఁబోలును ఫెరిస్తా ఈ ప్రకరణములోఁ గృష్ణరాయని పేరైనను ఉచ్చరించినవాఁడు కాఁడు. అట్టి చరిత్రకారునితోఁ బోరాడిన నేమిలాభము? ఇఁక నింకొక పేరుతెలియని మహమ్మదీయ చరిత్రకారుఁడు వ్రాసెనని "బ్రిగ్స్ ఫెరిస్తా" యను గ్రంథమునుండి స్యూయేల్ దొరగారు కొన్ని యంశములను ఉదాహరించియున్నారు. * అందు రెండు సమాచారములుమాత్రము రాయలనుగుఱించినవి కలవు. గోలకొండకు మొదటి సవాబయిన కులీకుతుబ్ షాహ కృష్ణదేవరాయలను పానగల్లు దుర్గమునొద్ద నోడించి దానిని తీసికొనెనఁట: రాయలసైన్యములను కొండవీడువద్ద నోడించి యా దుర్గమునుగూడ వశపఱచుకొనెనఁట. ఈ రెండంశములును నసత్యము లనుటకు నాకు నాధారములు దొరకినవి.

కుతుబ్ షాహ పానగల్లుదుర్గమును రాయలయొద్దనుండి తీసికొనియె ననిగదా ఈ చరిత్రకారుఁడు వ్రాయుట. మల్కిభరాముఁకు నంకితము చేయఁబడిన "తపతీ సంవరణ" మనుకావ్యములో అద్దంకి గంగాధర కవి కులీకుతుబ్ షాహను వర్ణించుచు నతఁడు పానగల్లుదుర్గమును దమిదిమిల్లాఖానుఁడను తురుష్కునియొద్దనుండి తీసికొనెనని స్పష్టముగా వ్రాయఁబడియున్నది.

సీ. పడమటను సవాయి-బసవనిగాఁజేసి
యపట గొయ్యలకొండ-నావరించె।
దమదిమిల్లాఖాను-దక్షిణంబునఁగొట్టి
హరియించెఁ బానుగ-ల్లాదిగిరుల।

---

* Sewell's Forgotten Empire, pp. 132-134.

నుత్తరంబున బరీ-దోడిపాటఁగఁదోలి
మెతుకుదుర్గం బాక్ర-మించి మించెఁ।
బ్రథమదిక్కు-ననొడ్డి-పాత్రసామంతుల
దట్టించి కంబిము-మెట్టుగొనియె।

గీ. నతనిఁ బొగడంగఁదగదె యా-చతురసీతి
రూఢిగిరిదుర్గలుంఠన-ప్రౌఢతేజు
వాహశిఖరాధిరోహరే-వంతమూర్తి
కుతుబుశాహినిష్కోపాలు-గుణవిశాలు॥

దమిదిమిల్లాఖానుఁ డెవ్వఁడో తెలియదు. కాని యాతఁడు తురుష్కుడనుటకు సందేహములేదు. ఆదిల్‌షాహయొక్క సేనానియై యుండనోపు. కావునఁ గుతుబ్‌షాహ పానగలును రాయలయొద్దనుండి తీసికొనియె నన్నవార్త కల్ల.

ఇంకఁ గొండవీటికడ రాయలసైన్య మోడెనన్నమాట యబద్ధమును టకు సమకాలీనుఁడగు న్యూనీజే సాక్షి. కొండవీడు గెల్చినతరువాత నది మంత్రియగు తిమ్మరుసునకు జాగీరొసఁగబడెను. రాయలతో నాతఁడు విజయనగరమునకుఁబోయి కొన్నిదినములకు నాతఁడు కొండవీటికి గొప్పసైన్యముతో వెడలెను. అతనిని కొండవీటికడఁ గుతుబ్‌షాహ యొక్క సేనాధిపుఁడగు మదార్‌మేల్‌ఖానుఁడనువాఁ డరువదివేల సైన్యముతో నెదిరించెను. ఆ యుద్ధములోఁ దిమ్మరుసు మంత్రీశ్వరుఁడే విజయుఁడై తురుష్క సేనానిని, అతని భార్యను, పుత్రునిఁ జెఱఁబెట్టెను. అసంఖ్యధనమును, రత్నాదులును, గుఱ్ఱములును, ఏనుఁగులును గొల్ల గొట్టి విజయనగరమునకుఁ బంపెను. సేనాధిపతి మొదలగు వారందఱును విజయనగరములో చెరసాలలోనే మరణముఁ జెందిరి. తిమ్మరుసు తనజాగీరులోని పనులన్నియుఁ దీర్చుకొని రాయచూరు యుద్ధమునకుఁ గొంతకాలము పూర్వము విజయనగరమునకుఁ బోయి రాజుచే మిక్కిలి మన్ననవడసెను. ఇది సమకాలీనుఁడును, పరదేశీయుఁడును గావుననే

నిష్పక్షపాతుఁడును, అగు చరిత్రకారుఁడు వ్రాసినయంశము. దీని ముందటఁ దురుష్కులవ్రాఁత లేమి పనికివచ్చును?

ఇదియుఁ గాక కొండవీటికడ నోడిపోయినది కుతుబ్‌షాహయేగాని హిందువులగారనియు, ఆ యుద్ధములోఁ గుతుబ్‌షాహతో స్వయముగాఁ బోరాడి యాతని నోడించినవాఁడు ఆర్వీటి నారపరాజనియుఁ గళా పూర్ణోదయములోని యీ క్రిందిపద్యమువలన స్పష్టపడఁగలదు.

చ. వదలక యుత్కలేంద్రుని స-వాయిబరీదు నడంచుదుర్జయుం
గుదుపనమల్కఁ దల్లడిలఁ-గొట్టె మహాద్భుతసంగరంబులో
నెదిరిచి కొండపీటికడ-నెవ్వరుసాటి విచిత్రశౌర్యసం
పదపస నారసింహవిభు-పట్టికి నారన్నృపాలమౌళికిన్.

ఇంతవరకుఁ గృష్ణరాయల దిగ్విజయములు వర్ణింపఁబడినవి. ఇఁక నాతని విద్యావైభవమును, రాజ్యవ్యవస్థయు నెట్టివియో చూచెదము.

## రాయల విద్యామహిమ.

ఈ రాజు సంస్కృతాంధ్రములందు నసామాన్యపాండిత్యము గలవాఁడు. విష్ణుచిత్తీయమను నామాంతరముగల "ఆముక్తమాల్యద" యను ఆంధ్రకావ్య మొకటి యీతఁడు రచించెను. ఈకావ్యముయొక్క శైలి కష్టతరమైనను నూతన వర్ణనాంశములచే శోభిల్లుచు నుద్గ్రింథమని పేరు వడసినది. ఈ కావ్యమువలన నితనికి నాంధ్రగీర్వాణములలోఁగల ప్రజ్ఞ వెల్లడియగుచున్నది. మదాలసచరిత్ర, సత్యభామాప్రీణనము మొదలయిన సంస్కృతప్రబంధము లీచక్రవర్తి రచించినట్లు విష్ణుచిత్తీయమునుబట్టి తెలియుచున్నది.

ఇట్లు తాను కవియుఁ బండితుండును అగుటయేగాక యీ నృపపుంగవుఁడు సంస్కృతాంధ్రకర్ణాటకవుల నాదరించి దిగంతవిశ్రాంతయశుఁడయ్యెను. ప్రతిసంవత్సరమును వసంతోత్సవకాలమందు నానాదేశములనుండి కవులనురావించి వారిని వారియోగ్యతానుసారముగా

మన్నించుచుండెనని పారిజాతాపహరణములోని, ఈ క్రిందిపద్యమువలన దెలియుచున్నది :

క. ప్రతివర్ష వసంతోత్సవ
కుతుకాగతసుకవినికర-గుంభితవాక్య
స్మృతిరోమాంచవిశంకిత
చతురాంతఃపురవధూప్ర–సాదనరసికా.

ముఖ్యముగా నీ రాజపుంగవుని కారుణ్యవశంబున మహోన్నత పదవిని జెందినది మన తెలుఁగుబాస. అందువలన నితనికి "ఆంధ్ర భోజుఁ" డన్న సార్థకనామమువచ్చెను. ఈతని యాస్థానమునందు "అష్ట దిగ్గజము" లను పేరిట నెనమండ్రు తెలుఁగుకవు లుండిరనినమాట పరం పరగా వచ్చుచున్నది. అల్లసాని పెద్దన్న,నంది తిమ్మన్న, అయ్యలరాజు రామభద్రుడు, ధూర్జటి, మాదయగారిమల్లన్న, పింగళి సూరన్న, రామ రాజభూషణుఁడు, తెనాలి రామకృష్ణుడు అనెడి యెనమండ్రును అష్ట దిగ్గజములని వాడుకకలదు. ఇందు మొదటి యేవురును రాయల సమ కాలీనులనుటకు సందేహములేదు. పింగళి సూరన్నయు, రామరాజ భూషణుఁడును కృష్ణరాయల యల్లుఁడగు రామరాజు కాలములో నున్నట్టు మనకు స్పష్టముగాఁ దెలియును. గావున వారు రాయలవారికి సమకాలీను లయినను గావచ్చును. అట్లగుట యసంభవమనియు వారు రాయల కాల ములో లేరనియు బ్రహ్మశ్రీ వీరేశలింగము పంతులుగారు తమ యాంధ్ర కవుల చరిత్రలోను, బ్రహ్మశ్రీ చిలుకూరు వీరభద్రరావుగారు తమ కృష్ణ రాయచరిత్రలోను చర్చించిరి. కాని రాయలమంత్రియైన తిమ్మరుసునకు నల్లుఁడైన నాదెండ్ల యప్పామాత్యునకుఁ దనకావ్య మంకితముచేసిన మాదయ్యగారిమల్లన రాయలవారి యాస్థానములోని వాఁడుకాఁగా,రాయల యల్లుఁడగు రామరాజుయొక్క సభలోను కాలములోను ఉన్న రామరాజ భూషణ పింగళి సూరన్నలు రాయలయాస్థానములో నేలయుండఁగూడదో తెలియకున్నది. తెనాలి రామలింగకవి తాను రచించిన యుద్భటారాధ్య చరిత్రను కృష్ణరాయల పక్షమున కొండవీటిదుర్గాధ్యక్షుఁడై యుండిన

దేసటి యామాత్యున కంకిత మొనర్చెను. మఱియు నతని పాండురంగ మాహాత్మ్యకృతిభర్తయైన విరూరి వేదాద్రిమంత్రియొక్క యజమాను డయిన గురవరాజు పెదసంగరాజు క్రీ. శ. 1549 ప్రాంతమున వర్ధిల్లె నని యొకశాసనమువల్ల తెలియవచ్చుచున్నది. కావున రామలింగకవి రాయలకాలమువాడని నిస్సంశయముగ జెప్పవచ్చును.

సంస్కృతభాషకు భోజవిక్రమ ప్రభుత్వములును, ల్యాటిన్ భాషకు ఆగష్టస్ చక్రవర్తి పాలనయు, ఇంగ్లీషునకు ఎలిజబెత్ రాణి యొక్క రాచరికపు దినములును, ఎట్టు శుభప్రదములో తెలుఁగునకుఁ గృష్ణరాయనికాలమట్టిదియే. అప్పుడు తెలుఁగులో స్వతంత్రప్రబంధ రచన ప్రారంభింపఁబడెను. అంతకుఁ బూర్వపు తెలుఁగుకవులు సంస్కృత గ్రంథములను తెలిఁగించుటయే తమపని యని తలఁచిరి. ఈ కాలపుకవులు సంస్కృత గ్రంథములోనుండి కొంచెము కథ గ్రహించి దానిపై స్వతంత్రకావ్యరచన చేయసాగిరి. రసపోషణమే యీ కాలపు కావ్యముల ముఖ్యలక్షణము. ఈ కాలపు కవులలో నొక్కఁడగు మాదయ గారిమల్లన కావ్య ముండవలసిన విధము నిట్లు వర్ణించి యున్నాఁడు.

క. చెప్పఁదగుఁ గవిత రసము
లిప్పిల నప్పప్ప బిబి-శీయన లేదా
యెప్పుడు చెప్పక యుండుఁ బె
యొప్పు సుమీ సుకవి యెంత-యుచితజ్ఞుఁడొకో.

ఇదియే యా కాలపు కవిత్వముయొక్క సామాన్యలక్షణము. రాయల యాస్థానమందలి కవులను సంగ్రహముగా వర్ణించెదను. రాయల యాస్థానములోని కవీశ్వరులలో నగ్రగణ్యుఁడల్లసాని పెద్దన. ఇతనికి "ఆంధ్రకవితాపితామహుఁ" డన్న బిరుదు కలదు. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు. చొక్కనామాత్యుని పుత్రుఁడు. దోపాడు పరగణాలోని దొరాలగ్రామ మీతనిజన్మస్థలము. ఇతనిని రాయలవారు మిగుల గౌరవించుచుండిరి, ఇతఁడు "మనుచరిత్ర" మనుకావ్యమును రచించి కృష్ణరాయలకు నంకితము చేసెను. ఈ కావ్యమందుకొనువేళ రాయలు

రాయలుకవీశ్వరుని బల్లకిలో గూర్చుండబెట్టి తనచేత బల్లకియెత్తెను. కవిగండపెండెర మీతనికాలికి రాయలు స్వయముగాదొడిగెను.ప్రబంధములలో మనుచరిత్రము మొదటిది. శైలి మధురమైనదియు సులభమైనదియుగా నున్నది. ద్రాక్షాపాకమున కీది మార్గదర్శి. రాయలవారీకవికి కోకటగ్రామ మగ్రహారముగ నిచ్చిరి. ఇతడు రాయల తరువాత 1535 ప్రాంతమున గాలధర్మము నొంది యుండును.

## నంది తిమ్మన్న.

ఇతనినే ముక్కు తిమ్మన్న యనియెదరు. రాయల కీతనియందును మిక్కిలి గౌరవముకలదు. ఇతడు "పారిజాతాపహరణ"మను కావ్యము రచించి రాయల కంకితమిచ్చెను.ఇత డాఱువేల నియోగి బ్రాహ్మణుడు; కౌశిక గోత్రుడు, నంది సింగన్నకును తిమ్మాంబకును పుత్రుడు. "ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు" అను వాక్యములో నీతనికవిత్వ లక్షణము చక్కగజెప్పబడియున్నది. ముఖ్యముగా నితనికావ్యములోని ప్రథమాశ్వాసము ముద్దులు గులికెడిమాట లనెడు తేనియతో నిండియున్న రసమంజరి.

## అయ్యలరాజు రామభద్రుడు.

ఇతడు కృష్ణరాయలవారి యనుజ్ఞ ననుసరించి సకలకథాసార సంగ్రహమను తెలుగుకావ్యము రచించెను. రాయల మరణానంతర మితడు నలువది యేబది సంవత్సరములవఱకు బ్రతికి యుండెను. రామాభ్యుదయమను కావ్యమును రచించి రామరాజు నల్లుడగు గొబ్బూరు నరసరాజున కంకిత మిచ్చెను. * మొదటికావ్య మంతరస

---

* కృష్ణరాయని యల్లుని యల్లునకు గావ్యమిచ్చిన రామభద్రుడు రాయల కాలములోనుండుట స్పష్టముగా గానవచ్చుచుండగా రాయల యల్లుని కాలపువారగు రామభూషణుడును పింగళి సూరన్నయు రాయల కాలములో లేనే లేరని కొంద ఱెట్లువాదించెదరో తెలియకున్నది.

వంతముగా లేదు. కాని ఈ రెండవకావ్యముగు రామాభ్యుదయము మిక్కిలి ప్రౌఢకావ్యము, శబ్దార్థాలంకారములచే శోభితమైయున్నది. ఇత డాఱువేల నియోగి బ్రాహ్మణుడు.

## ధూర్జటి.

ఇతడు పాకనాటి యాఱువేల నియోగిబ్రాహ్మణుడు. ఇతనిది కాళహస్తి కాపురము. ఇతడు కాళహస్తి మహాత్మ్యమను నాలుగాశ్వాస ములుగల కావ్యముయొక్క చక్కదనమున కాశ్చర్యపడి రాయలవారు

చ. స్తుతమతియైన యాంధ్రకవి–ధూర్జటిపల్కుల కేల గల్గెనో
యతులిత మాధురీ మహిమ?

అని యడిగిరని చెప్పెదరు.

## మాదయగారి మల్లన.

ఇతడు శైవ బ్రాహ్మణుడు. కొండపీటిపురవాసుడు. రాజశేఖర చరిత్రమను మూడాశ్వాసముల కావ్యము రచించి తిమ్మరుసు నల్లుడగు నాదింట్ల యప్పామాత్యున కంకితముచేసెను. సుకవి యగువాడు కవి త్వము జెప్పినచో రసము లుప్పతిల్లునట్లుగా జెప్పవలయును, లేదా యూరకుండవలయు నని ఈ కవి ప్రతిజ్ఞచేసి యాలాగుననే కావ్యమం తయు నల్లెను. కావ్యము చిన్నదైనను ఇదియొక యద్వితీయగ్రంథము. * జాతీయ పదములజక్కగ యోగ్యమైనచోట నుపయోగించి రస భావము లొలికించు శక్తి యితనికున్నట్లితరులకు లేదనవచ్చు. ఇందుల

---

* ఈ కావ్యము మొన్న మొన్నటి వరకు దెనుగువారికి లభించి నదికాదు. బ్రహ్మశ్రీ వీరేశలింగము పంతులవారు కొలదికాలముక్రిం దట తంజావూరు పుస్తకాలయములోనుండి దీని ప్రతియొకటి సంపా దించి యచ్చువేయించిరి. కావున దెనుగువారు దీనిని జక్కగా జదివి నట్టు కానరాదు.

కిప్పట నొక చిన్న పద్య ముదాహరించుచున్నాను. ఇది యత్తవారియిం టికిఁ బోవు మానినికిఁ జేసినబోధ :—

క. మూసినముత్యము పైకడు
వాసియు వన్నెయును గలిగి-వరుఁ డౌ ననఁగా
నీసకలబంధుకోటికి
బూసలలో దారమగుఁ-బొసఁగి మెలఁగుమీ.

## పింగళి సూరన్న.

ఇతఁడు రాఘవపాండవీయాది మహాకావ్యములను రచించిన మహాకవి. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు. ఇతనిది మొదటఁ గృష్ణా మండలములోని పింగళిగ్రామమైనను ఇతఁడు దక్షిణమునకుఁ బోయి కందనూలు (కర్నూలు) మండలములోని నంద్యాల, ఆకువీడు మొద లగు సంస్థానముల నాశ్రయించియుండెను. ఇతఁడు కృష్ణదేవరాయలకు సమకాలికుడు కాడని తోచుచున్నది. ఏలనగా నితనిచే రచింపబడిన కళా పూర్ణోదయ కృతిపతియైన నందేలకృష్ణమరాజు 16వ శతాబ్ధ్యుత్తరార్ధమున వర్ధిలినాడు. 1597–98 వ సంవత్సరమున ఈ కృష్ణమరాజు అప్పుడు రాయసామ్రాజ్యమును పాలించుచుండిన ఇమ్మడి వేంకటపతిరాయలపై తిరుగుబాటుచేసి యతనిచే పరాజితుఁడై రాజ్యమును గోల్పోయి బందీ కృతుడై జీవితశేషమును చంద్రగిరి చెరసాలలో గడపెను. కావున నా కృష్ణరాజున కాశ్రితుడైన పింగళి సూరనము నప్పటివాడే కాదగి యున్నాడు. ఈ మహాకవిచే రచింపఁబడిన కావ్యములు ప్రస్తుతము మూఁడు గానవచ్చుచున్నవి. రాఘవపాండవీయము, కళాపూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నము. రాఘవపాండపీయములో రామాయణ భారత కథలు వర్ణింపఁబడినవి. క్లిష్టాన్వయములు లేకుండ సులభపదములతో నింతటి సులభశైలిని సంపూర్ణశ్లేషగర్భ యిట్టి ద్వ్యర్థికావ్యమును రచించుట యొక యలౌకికసామర్థ్యమని చెప్పవలసి యున్నది. కళాపూర్ణోదయ మను కావ్యమంయ విచిత్రమయిన కల్పితకథకలదు. తెలుఁగులో విట్టి

నూతనకథా చమత్కారమును మటియేకవియుఁ గల్పించినవాఁడుకాఁడు. కథానకవై చిత్ర్యమునందు దీనిని బాణభట్టకృతకాదంబరితోఁ బోల్పవచ్చును. ప్రభావతీ ప్రద్యుమ్నము "చక్కని స్వభావోక్తులను గలదయి లలితపదఘటితమై కథాచమత్కృతి గలిగి చదువువారికిఁ గర్ణరసాయనముగా నుండెడు ప్రౌఢకావ్య" మని విద్వాంసుల యభిప్రాయము. తిక్కన్న సోమయాజికిఁ దరువాత నింతప్రౌఢకావ్య రచనయందు సర్వతోముఖపాండిత్యముకల కవి యితఁడుతప్ప మటియొకఁడు లేఁడు.

## రామరాజ భూషణుఁడు.

ఇతఁడు వసుచరిత్ర మహాకావ్యకర్త. బిట్టుమూర్తి యనునది యితనికిఁ బేరనియు రామరాజభూషణుఁడన్నది రామరాజు సభలోనున్నందున వచ్చిన బిరుదనియుఁ జెప్పెదరు. ఇతఁడు హరిశ్చంద్రనలోపాఖ్యానము నరసభూపాలీయము అను గ్రంథములఁ గూడ రచించెను. ఇతఁడు కృష్ణరాయలకాలములో నుండిన నుండవచ్చును. రాయల యల్లుఁడగు రామరాజు కాలములోఁ బ్రసిద్ధుఁడయ్యెను. ఈతనిచే రచింపఁబడిన వసుచరిత్రయను కావ్యము (కృష్ణరాయల రెండవ యల్లుఁడగు) తిరుమలరాయలకు నంకితము చేయఁబడినది. ఇది 1570 వ సంవత్సరమునకుఁ దరువాత రచింపఁబడెను. ఇ య్య ది శబ్దార్థాలంకారశోభితంబగు న ద్వి తీ య మహాప్రబంధము. యమకచ్ఛేకాను ప్రాసాంత్యనియమాదులను బోనీయకుండ గ్రంథమునం దంతటను శ్లేషసాధింపఁబడినది. పాకము నారికేళపాకమైనను పద్యములు చెవుల కెంతయు నింపుగను అర్థము తెలిసినతరువాత నాత్మకెంతయు సొంపుగను నుండును. అందుచేతనే ఈ కావ్య మద్వితీయమని మూఁడువందల సంవత్సరములనుండి తెలుఁగుదేశములోఁ బొగడ్తఁగన్నయది. తరువాత కవులందఱును తమకావ్యములను "పిల్లవసుచరిత్రము" లనిపించుకొనుటఘనతగా నెంచుకొనిరి. హరిశ్చంద్రనలోపాఖ్యానము ద్వ్యర్థికావ్యము. నరసభూపాలీయ మలంకార గ్రంథము.

## తెనాలి రామలింగకవి.

ఇతఁడు ప్రథమశాఖబ్రాహ్మణుఁడు. ఇతఁడు పాండురంగ మాహాత్మ్యమనుకావ్యమును రచించెను. ఇతని గ్రంథములుమూడు లభ్యమైనవి. ఉద్భటారాధ్య చరిత్ర మొదటిది. ఇది క్రీ. శ. 1525 రచింపఁబడియుండవలయును.పాండురంగ మాహాత్మ్యము రెండవది;ఇది క్రీ.శ. 1540 ప్రాంతమున రచింపబడి యుండవచ్చును. ఘటికాచల మహాత్మ్యము-ఇది రామలింగని చరమకావ్యము. దీనిరచనాకాలము నిర్ణయించుటకు సాధనసామగ్రి చాలదు - నిర్దుష్టమైన కవిత్వము - పాండురంగ విభుని పదగుంభన జగత్ప్రసిద్ధముగదా.

పైని వర్ణింపఁబడిన తెలుఁగుకవులుగాక తిమ్మణార్యుఁడను కర్ణాట కవి కన్నడములో భారతమును రచించి రాయల కంకితము చేసెను.

## శిల్పకళాభివృద్ధి.

రాయలవారు తన రాజ్యములో నూతన దేవాలయములను, నూతన మందిరములను,పట్టణములను,కాలువలను నిర్మించి శిల్పకళను మిక్కిలి యభివృద్ధి చేసిరి. రాయలు రాజ్యమునకు వచ్చినతోడనే యాతఁడు హంపీవిరూపాక్షములోని పంపాపతి దేవాలయమునకు గోపురముకట్టించెను. ఈ దేవాలయము మాధవాచార్యులకాలమందుఁ గట్టింపఁబడెనఁట. పూర్వ దిగ్విజయయాత్రకుఁ బోయి వచ్చిన తరువాత నీ రాజుచే కృష్ణస్వామి దేవాలయమను గొప్పగుడి యొకటి కట్టింపఁబడెను. (1513). ఆ సంవత్సరముననే రాయలు తన ప్రాసాదపుటావరణములో ఉగ్రనారసింహ రామస్వామివారి యాలయమును గట్టించెనని చెప్పుదురు.

ఇదే విఠలస్వామి యాలయముగూడ నీతడే నిర్మించెనని చరిత్రకారుల యభిప్రాయమై యున్నది. కాని ఇది వాస్తవముగాదు, ఈ రెండు దేవాలయములును కృష్ణరాయలకంటె బాల పూర్వమునుండి యుండినట్లు శాసనములును తెనుగువాఙ్మయము సాక్ష్యము పలుకుచున్నవి. కృష్ణ

రాయల యనుచరులలో నొక్కడు హజారరామస్వామి యాలయమునం దొక మంటపము గట్టించెను;అతనిదేవేరులు తిరుమలదేవీ చిన్నాదేవులు విఠలస్వామి యాలయమునకు చెరియొక దిక్కున గోపురములను గట్టించిరి. అందువలన గృష్ణరాయలే ఈ దేవాలయములనుగట్టించెననుట తగదుగదా.రాయల తరువాతిరాజులును ఈయాలయమును నభివృద్ధిచేసిరి. 1529 లో గృష్ణరాయ డొకయుగ్రనరసింహమూర్తిని జెక్కించెను. ఆ విగ్రహము మిక్కిలి పెద్దది. భయంకరముగా నుండును. తురుష్కులచే నెన్ని చోట్లనో పగులగొట్టబడినను ఈ విగ్రహమిప్పటికిని దర్శనీయమై యొప్పుచున్నది.

సస్యసమృద్ధికొఱకు గృష్ణరాయలు 1521 లో కొట్టగల్లునొద్ద నొకగొప్ప యనకట్ట కట్టించి యందుండి యొక కాలువయును మఱియొక కాల్వయు ద్రవ్వించెను. అవి యిప్పటివఱకును జనులకు మిక్కిలి యుపయోగకరములుగా నున్నవి. ఈ రాజు తన రాజధానిలో పెద్దచెఱువొకటి త్రవ్వించెను. దాని నిమిత్తమై పోర్చుగీసు ఇంజినియరొకడు గోవానుండి రప్పింపబడెను. ఈ చెఱువు త్రవ్వుటకు నిరువదివేల జనులు పనిచేయుచుండిరి. ఈ చెఱువులోని నీరు సస్యసమృద్ధికి నుపయోగించుచుండిరి. మొదట దొమ్మిదిసంవత్సరముల వఱకును చెఱువు క్రింది భూములు రైతులకు శిస్తులేకుండ నీయబడెను. తరువాత నా చెఱువువలన నిరువదివేల పరడావుల యాదాయము వచ్చుచుండెను. ఈ రాజు ప్రియురాలగు తన భార్యపేర "నాగలాపుర"మను చక్కని పట్టణ మొక్కటి కట్టించెను అని వ్రాసియున్నాడు-కాని అది పొరబాటు."నాగలాంబ"రాయల తల్లిగాని భార్యకాదు. ఇది విజయనగరమునకు సమీపమున బ్రస్తుతము హంపేయున్న స్థలమందుండెను. ఈ నగరములో జక్కని సౌధములు గట్టుకొనవలసినదిగా రాజాజ్ఞాపించినందున రాజ్యములో ఘనతజెందిన సరదారులును, వర్తకులును ఆ పురములో

జక్కని మందిరముల నిర్మించిరి. కావున నది సౌందర్యమునకుఁ బుట్టి నిల్లయ్యెను.

## రాజధాని వర్ణన.

1520 లో ఫిగెరిడో యను పోర్చుగీసు రాయబారి విజయనగరమునకు వచ్చెను. అతనివెంట పెయిస్ అనువాఁడొకఁడు కలఁడు. ఇతఁడు తాను విజయనగరములోఁ జూచిన యంశములన్నియు వ్రాసి యుంచినాఁడు. అందుండి ఈ క్రింది యంశములు గ్రహింపఁబడుచున్నవి. అందువలన నాకాలమందలి విజయనగర వైభవము తెలియఁగలదు :—

"....ఆ రాజ్యమునకు విజయనగరము రాజధాని. అందు రాజెల్లపుడును నివసించుచుండును. నగరమున కాఱుమైళ్ళ కీవలనే యడ్డముగా గొండలవరుస గలదు, దానిలోనుండి మార్గములుగలవు. వానికే ద్వారములనిపేరు. ఆ ద్వారములగుండ పోవలయునేగాని నగరములోనికిఁ బోవుటకు వేఱుమార్గములులేవు. ఈ కొండల వరుస డెబ్బదిరెండు మైళ్ళ పొడవుగలిగి యా మహానగరమును జుట్టి యున్నది. ఈ పర్వత పంక్తికి లోపలనంటి చుట్టుకొనియున్న యితర పంక్తులనేకములు గలవు. ఈ పంక్తులలో నెచటనయిన సమభూమియున్న యెడల నచట బలాఢ్యమగు గోడ కట్టబడియున్నది. ఈ రీతిగాఁ గోడలన్నియు మూసి వేయఁబడియున్నవి. జనులు నడుచుటకు బాటలేర్పఱుపఁబడి యాబాట లీ ద్వారములగుండ పోవును. ఈ ద్వారములకడఁ జిన్నగుహలు కలవు. అందుఁగూర్చుండి రక్షకభటులు ద్వారములను రక్షించుచుందురు. ఈ యావరణముల లోపల వరి మొదలగు ధాన్యములు పండునట్టి బయళ్ళును, నిమ్మలు, నారింజలు, పనసలు, మామిళ్ళ మొదలగు ఫలవృక్షములతోనున్న తోటలును గల సారవంతములయిన భూములును గలవు. ఈ కొండల వరుసలకు మధ్యమున జలాశయములు పెక్కులు గలవు. వాని యాధారములవలననే పై నుదాహరించినభూములు సాగుబడి చేయఁబడుచున్నవి....గోవా నగరమునుండి వచ్చిన బాటయొకటి మొదటికొండ వరుసలోఁగల ద్వారములలో నొకద్వారముగుండ నగరములోఁ ప్రవే

శించుచున్నది. పడమటి ప్రక్క నిదియే ప్రధానమైన ద్వారమగుటచేత గోడలచేతను బురుజులచేతను సురక్షితమై యొప్పెడు పట్టణమొకటి (నాగలాపురము) రాజుచే మొదటి పంక్తిలోపల గట్టబడినది. ఈ ద్వారమున కుండతలుపులును బురుజులును మిక్కిలి బలాఢ్యములయి నవి. ఇతర నగరములలోని గోడలవంటివిగాక ఈ గోడలు పాలగచ్చు చేయబడి వేపెచ్చటను గానరానట్టివిగా నున్నవి. లోపల మిద్దెటిండ్లవలె బల్లపఱుపుగానున్న కప్పులుగల సొగసయిన కట్టడములచే నిరుపార్శ్వ ములయం దలంకరింపబడి వీథులపంక్తులు రమ్యముగా నున్నవి.

"....నాగలాపురమునుండి విజయనగరమునకు నొకవీధి పోవు చున్నది. ఆ వీధికి నిరుప్రక్కను ఇండ్లవరుసలు చక్కగా దీర్చి యున్నవి. బాటసారులకు నీడనిచ్చుటకై వృక్షములు రెండుప్రక్కలను నాటింపబడి యున్నవి. ఈ వీధిలో సమస్తవస్తువులను విక్రయించు నంగడులు గలవు. ఈ వీధిలో రాజు సుందరమైన యనంతశయనదేవా లయమును గట్టించెను. ప్రభువులును సేనానులును గట్టించిన దేవళములు గూడ గలవు. ఈ నగరముచుట్టును బరువుగల పెద్దరాళ్ళతో గట్టబడిన గోడ కలదు. అదిమిక్కిలి బలాఢ్యమైనది గాని ప్రస్తుతము కొన్ని చోట్ల శిథిలమైనది. అందు సురక్షితము లైయున్న దుర్గములు గలవు. ఈ గోడకు ప్రక్కను నచ్చటచ్చట పల్లపు ప్రదేశములందు నీటిచే నిండింపబడిన కందకములు గలవు. దానికి వేఱుగా నట్టిదే మఱియొక గోడ గలదు. మనుష్యుని తొమ్మిదాకునంతయెత్తు గలిగి మొనలు తేలియున్న ఱాళ్ళు పాతబడి యున్నవి. ఈగోడ కొండలకు మధ్య నున్న పల్లపు ప్రదేశములం దెత్తుగా బెట్టబడి కొండలవఱకు వ్యాపించి యున్నది. ఈ గోడ మొదలుకొని నగరము ప్రవేశించుటకు మధ్యమున నెక్కువదూరముగలదు గనుక నా ప్రదేశములయందు వరిపొలములును కోటలును దొడ్లును నీళ్ళకాలువలును గలవు. ఈ గోడయొక్క మొదటి పంక్తిగుండ నీరు ప్రవహించుచున్నయది. ఏళ్ళు పాఱుచుండుటవలన జెఱువులు జలపూర్ణములై యున్నవి. ఇచట ఫలవృక్షములతో గూడిన తోటలును, ఒక చిన్న తాళ్ళగుంపును, అనేక గృహంబులును గలవు.

నగరముయొక్క మొదటిద్వారముకడకు వచ్చుటకుముందు మీరొకనీటి కాల్వనుదాటి మలుపుతిరిగిన బలాఢ్యమగు నొక పాతిగోడవద్దకు వచ్చెదరు. ఈ ద్వారమున కీరుప్రక్కలనుండు రెండు బురుజులును దానిని గాపాడుచున్నవి. ఆద్వారము మిక్కిలి సొగసయినట్టియు, పెద్దదగు నట్టిదియునై యున్నది. ద్వారమునుదాటి లోపలకు బోవగానే రెండు చిన్న దేవళములు గానిపించును. ఒక దేవాలయపు ప్రాకారములోపల వృక్షములును మఱియొక దేవాలయపు ప్రాకారములోపల నిండ్లును గలవు. ఈ మొదటిద్వారమునగల కుడ్యము నగరమునంతను జుట్టి వచ్చుచున్నది. మఱి కొంత దూరము పోయిన తోడనే మఱియొక ద్వారమును గోడయు గానుపించును. ఈ గోడయును నగరమునంతను జుట్టి వచ్చుచున్నది. ఇచటనుండి రాజభవనాంతఃపురమువఱకు గల మధ్యభూమియందు వీధులును, ఇండ్లవరుసలు, సేనానులయొక్కయు ప్రభువులయొక్కయు నందములగు మందిరములును గిలవు, చూచుటకు వినోదకరములగు విగ్రహములతో నలంకరింపబడిన యిండ్లవరుసలు మనోజ్ఞములై యొప్పుచున్నవి. ముఖ్యమయినదగునట్టి పెద్ద వీధిగుండ వెళ్ళునపుడు రాయల యంతఃపురభవనమున కెదుటనున్న గొప్పమైదానమునకు గొనిపోవు ద్వారముగల ప్రధానమైనట్టి మార్గమొకటి కలదు. దీని కెదురుగా మఱియొక మార్గము నగరముయొక్క రెండవ భాగమునకు బోవుచున్నది. నగర మధ్యమున నుండి మిక్కిలి యుపయోగము గలది యగుటచేత నా మైదానముగుండ సరకులు మొదలగు వాని నెక్కించుకొని బండ్లు నడపబడుచుండును. లిస్బాను(Lisbon)నగర దుర్గము (పోర్చుగల్ దేశపు రాజధాని) ఎంతస్థల మాక్రమించుకొనెనో యంతకంటె నెక్కువస్థల మాక్రమించుకొని రాయల మందిరము బలాఢ్యమై సురక్షితమైయున్న ప్రాకారము గలిగి యున్నది.

"ఇంకను గొంతదనుక నడచి యావలి ద్వారముకడకు బోయిన దానితో సంబంధించిన యిరుపార్శ్వముల రెండు దేవళములు గలవు. ఈ రెంటిలో నొకదానిద్వారముకడ ప్రతిదినమును గొట్టెలను బెక్కిం

టిని జంపుచుందురు. ఈ దేవళములకు దాపున జిత్తరువులు చెక్కి బడినట్టియు విగ్రహములతో నలంకరింపబడినట్టియు జయసూచకమయిన రథ మొకటి గలదు. సంవత్సరమున కొకసారి దేవతోత్సతము నాడు నగర వీథులగుండ రథము నూరేగింతురు. అది మిక్కిలి పెద్ద దగుటవలన మూలల దిరుగనేరదు. ఇంకను ముందు నడవ విశాలతయు సొగసునుగలదై, యిరుపార్శ్వములందు సుందరములగు గృహములవరుసలను గలిగియున్నదై, నే నిదివఱకు నుదాహరించి పర్ణించిన వీధులంబోలిన యొక వీధిగలదు. ఆ వీధులలోని గృహములు భాగ్యవంతులకు నివాసములయి యొప్పుచున్నవి. ఈ వీధిలో వణిజులు పెక్కండ్రు నివసించుచున్నారు. ఇందు పెక్కురకముల కెంపులు, వజ్రములు, నీలములు, పచ్చలు, ముత్యములు మొదలగు రత్నములును, వస్త్రములును, ఇంకను ప్రపంచములో దొరకునట్టి ప్రతివస్తువును విక్రయింపబడుచుండును. ప్రతి సాయంకాలము నొక సంతజరుగును. అచట సామాన్యములయిన గుట్టములు, గుట్టపుతట్టులు మొదలగు జంతువులు మాత్రమేకాక దబ్బపండ్లు, నిమ్మపండ్లు, నారింజపండ్లు, ద్రాక్షపండ్లు మొదలగు ఫలవర్గమును విక్రయింపబడుచుండును.

"ఆ వీధికొనయందు మరల నొకద్వారమును గోడయును గానిపించును. ఆద్వారములోనుండి పోయినయెడల నావల నొకపీధి గానుపించును. అచట కర్మకరులు (పంచాణులు) పెక్కండ్రు నివసించుచున్నారు. వార లనేకవస్తువులను విక్రయించెదరు. ఇచట రెండు చిన్న దేవళములు గలవు. ప్రతివీధి యందును దేవాలయములు గలవు గాని ప్రధానములయినవియు గొప్పవియునగు దేవాలయములు నగరమునకు వెలుపలిప్రక్కనే కలవు.

"వజ్రములు మొదలగు నమూల్యమణులయొక్కయు నితర వస్తువులయొక్కయు వర్తకము విరివిగా జరుగుచుండుటచేత నామహా నగరమున నన్ని జాతుల మనుష్యులును గలరు. ఈ నగరవిస్తీర్ణతను గుఱించి నేనువ్రాయను. ఏలన నయ్యది యొక ప్రదేశమున నుండి చూచుటకు గానరాదు. నే నొక కొండనెక్కి యొక్కవభాగమును జూడగలిగితిని గాని పెక్కుకొండల పంక్తులకు మధ్యమున నగరమం

తయు నిమిడియుండుటచేత గొంతభాగము గానుపింప లేదు. అచటి నుండి చూడగా నాకు గనుపట్టిన భాగము రోమకపురి (Rome, the Capital of Italy in Europe) యంత పెద్దదిగానుండి చూపు నకు మిక్కిలి సుందరముగా గానుపించినది. దానిలోపల జెట్లగుంపు లనేకములు గలవు. ఇండ్లకు జేరినతోటలలో నీళ్ళకాలువలును నటట చటగ జెఱువులును గలవు. రాజు తన యంతఃపురమందిరమునకు సమీ పమున దాళ్ళవనమును, నానావిధ ఫలవృక్షములతో గూడిన తోపు లను గలిగి యుండెను. తురుష్కుల నివాసభూమికి దిగువ నొకచిన్న నదియును, మామిడితోటలు, పోకతోటలు, పనసతోటలు, జాంబితోటలు, నిమ్మతోటలు, నారింజతోటలు మొదలగు తోటలు దట్టముగానుండి పెఱు గుచు మహారణ్యమువలె నల్లుకొనియున్నవి. తెల్లద్రాక్షలుకూడ విశేష ముగా గలవు. నగరములోనికివచ్చు నీరంతయు మొదటిప్రాకారమునకు వెలుపలనున్న, పయి నే నుదాహరించిన, చెఱువులనుండి తేబడు చున్నది. ఈ నగరములోని జనసంఖ్య లెక్కించుట కలవిగానిదిగా నుండుటచేతను నే నుదాహరించిన గల్పితముగాను నతిశయోక్తిగాను నుండుననుభీతిచేతను నుదాహరింప మానినాడను.

"ఇయ్యది (విజయనగరము) ప్రపంచములో సమస్త వస్తుసము దాయముచేతను నిండియున్న మంచినగరముగా నున్నయది. గోధుమలు, వడ్లు, అనుములు, పెసలు, కందులు, ఉలవలు మొదలగు ధాన్యములును ప్రజల కాహారమై ఈ దేశములో ఫలించు నితర ధాన్యములును సమృ ద్ధిగా జేర్పబడి యిక్కిరి చౌకగా విక్రయింపబడుచున్నవి. ఇతర ధాన్యములవలె గోధుములు మూరులచే దక్కి తదితరులచే నంతగా భుజింపబడుచుండలేదు. అందువలన దక్కువగా నుండును. తప్పించు కొని పోవుటకు వీలులేనంత దట్టముగా బరువులు వేయబడిన యెడ్లు వీధులలోను బజారులలోను లెక్కింప శక్యముగాక క్రిక్కిఱిసి యుండును. కోళ్ళు మొదలగుజంతువులు పెక్కులుగలవు.

"ఉత్తరమున నగరప్రాకారములకు వెలుపల సుందరతమంబు లగు మూడు గొప్ప దేవళములుగలవు. అందొకటి విఠలస్వామి యాల యము. ఆనెగొండి పురమున కెదురుగా గట్టబడియున్నయది. రెండవది

హంపిదేవాలయమని సుప్రసిద్ధిగాంచిన విరూపాక్షాలయము. యాత్రికులచేనిది మిక్కిలి మహిమ గలిగినదిగా జూడబడుచున్నది. ఈ దేవాలయములలో దూర్పుగానున్న ముఖద్వారమున కెదురుగా మిక్కిలి సుందరమై యింపుగా గట్టబడిన యిండ్లును వసారాలును గలిగి రమ్యమైనట్టివీధి యొకటి కలదు.

"ప్రధానపర్వదినము రా దటస్థించిన కాలమున రాయలీ క్రొత్త నగరమునుండి (నాగలాపురము) విజయనగరమునకు వచ్చి యయ్యది రాజ్యమున కంతకు రాజధాని గావున నచట సమావేశమై యెల్లరతో గలసి యాచారవిధుల ననుసరించి విందులు మొదలగు వినోదములను జరిగించును. ఈ యుత్సవదినములకు రాజ్యములోనుండెడు నాటకత్తియలెల్లరను రప్పించెదరు. మఱియు రాజులను, మహాప్రభువులను, సేనానులను వారలరాణువలతోడను, పరివారముతోగూడను రప్పించెదరు. యుద్ధముచేయుటకై పంపబడినట్టియు, రాజ్యములో దూరముగా నున్నట్టియు, ఉత్కలరాజ్యము యొక్కయు బీజపురరాజ్యముయొక్కయు సరిహద్దులకడ నున్నట్టియు సేనానులుమాత్రము రప్పింపబడరు. ఆ యుత్సవములలో జేరిన నవరాత్రోత్సవములు (దశరాపండుగ) నేనా నగరమున నుండినపుడు రాజభవనమున మిక్కిలి వైభవముతో జరుపబడినవి. రాజభవన మీతీరున నున్నది. రాజభవనమునకు నేనిదివఱకుబై నుదాహరించిన బయలునకు బోవుటకై ద్వారమొకటి తెరవబడియున్నది. ఈ ద్వారముపై నితరగోపురములకు వలెనే వసారాలు కలిగికొంచెమెత్తుగల గోపురము గలదు."

## రాజ్యవిస్తారము; రాజ్యవైభవము.

కృష్ణానదికి దక్షిణమునననున్న దక్షిణ హిందూదేశమంతయు నీ రాజేకచ్ఛత్రాధిపత్యముతో నేలెను. ఇదిగాక తూర్పున కటకమువరకును పశ్చిమోత్తరదిక్కుల విజాపురాది పట్టణములవఱకును దాడిపోయి ప్రబలశత్రుల నందఱిని గెలిచెను. ఇతడపజయమన్నమాట యెఱుగడు. అందుచే నితనిజీవిత కాలమువరకు దురుష్కరాజు లెవరును తలయెత్తి

నవారుకారు. ఇతని రాజ్యమునందు దొమ్మిదివందల మైళ్ళ సముద్ర తీరము గలదు.

ఈ రాజుయొక్క సైన్యాది వైభవములను గుఱించి పెయిస్ ఇట్లు వ్రాయుచున్నాడు:— "ఈ రాజునకు యుద్ధము చేయుటకుగాను పదిలక్షల సైన్యములు గలవు. వానిలో గవచధారణము గలిగియున్న ముప్పదియైదువేల గుఱ్ఱపుదళము గలదు. ఈ సేనలకన్నిటికి రాజు జీతము లిచ్చుచుండును. అగత్య మైనప్పుడు అతడే ప్రవేశమునకు బంపదలచి నను పోవుట కే సమయమందయినను సిద్ధముగానుండును. అతనివద్ద సామజము లనేకములు గలవు. తన రాజ్యము చుట్టునుండు శత్రురాజు లకు దనపరాక్రమమును జూపవలసి పచ్చినప్పు డిరువదిలక్షల సైన్య మునయినను యుద్ధభూమికి రప్పింపగల సామర్థ్యముగలవాడని చెప్పు దురు. ఆ కారణమువలననే యీ రాజును జూచి శత్రురాజులును వెల్ల వారును భయపడుచుందురు. ఇంత సైన్యమును రాజు దీసికొనిపోయి నపుడు దేశమున బ్రజలు లేరని తలపరాదు. దేశము జనభూయిష్ఠమై యుండుటచేత నే వ్యాపారములకును భంగము కలుగనేరదు. వృత్తు లకు భంగము లేకుండ జేయువారనేకులు గలరు. ఇంకను నీ రాజ్య మున బ్రాహ్మణు లనేకులుగలరు. వారలు చావును గలిగించెడు నే పని కిని దూరముగానుందురు. వార లాయుధములను ధరించి యుద్ధము చేయరు. "ఈ రాజునకు వచ్చునాదాయమెంత? ఇంత సైన్యమునకు జీతమిచ్చుటకీతని ధనాగారమెంతటిది?" అనియే రయిన నడుగవచ్చును. అధికముగా నాదాయములు వచ్చెడు ప్రభువు లనేకు లీతనికి లోబడిన వారలయి కప్పముగట్టుచున్నవారలు పెక్కండ్రు గలరు.

"ఈ ప్రభువులకు నగరములు పట్టణములు పల్లెలు మొదలగునవి పెక్కులుగలవు. పది పదునైదులక్షల పర్డావుల యాదాయమురాగల సేనాధిపతులున్నారు. నూఱువేల పర్డావుల యాదాయము గలవారు కొంద రును, రెండు, మూడు, నాలుగు, అయిదు నూర్లవేల పర్డావుల వచ్చు బడికలవారు కొందరును గలరు. రాజు నియమించిన ప్రకారము కాల్బ లమును, గుఱ్ఱపుదళమును, సామజములను బోషించుచు రాజున బన్నులుగూడ గట్టుచుందురు. ఈ సేనలెప్పుడును సిద్ధముగానుండి

యెట్టికాలమునం దెక్కడకు బంపినను బోవలయును. ఈ రీతిగా రాజు పదిలక్షల సైన్యము యుద్ధము చేయుటకు నెల్లప్పుడును సిద్ధముగానుండు నటుల జేసికొనెను. ప్రతి సేనాధిపతియు దనక్రిందనుండు సైనికులకు దానే జీతములిచ్చును గావున మంచివారిని ధైర్యశాలులను జేర్చుకొండును. ఈ సేనలలో నాకెక్కడను నొక్క పిఱికివాడయినను గాని పించలేదు. ఈ సేనలను బోషించుటయే కాక ప్రతిసంవత్సరము రాజునకు సేనాధిపతులను ప్రభువులు కప్పము గట్టుచుండవలయును. ఇవిగాక రాజు సొంతసైన్యము నుంచుకొని వారలకు జీతబత్తెములు దానే యిచ్చుచుండును. ఎనిమిదివందల యేనుగులను, అయిదువందల గుఱ్ఱములను సొంతముగా నుంచుకొని వానికొఱకు నగరములోనే వారిచేగైకొని బడు పన్నులను వెచ్చపెట్టుచుండును. ఈ జంతువులకును వీనిసౌకరుల కును నెంతసొమ్ము వ్యయమగునో మీకుదెలియును. దీనిని బట్టియే ఈ మహానగరము చెల్లించెడు పన్నెంతయుండునో సులభముగా నూహించు కొనవచ్చును. ఈ రాజునకు గొడుకుగాని కూతురుగాని జన్మించుట తటస్థించినపుడు రాజునకులోబడిన ప్రభువులు విశేషద్రవ్యమును, ఆభ రణములను కానుకలుగా సమర్పింతురు. ఈ యుత్సవదినములు ముగిసిన తరువాత ననగా బదునొకొండుదినములు గడచినతరువాత బ్రజలును ప్రభువులును విందులుచేసికొని నూతన వస్త్రములను ధరించుకొని వినో దించుచుందురు. సేనాధిపతులు తమ సైనికులకు మంచిబట్టలు బహు మానముజేసెదరు. ఆ రోజునకే యీ ప్రభువులు రాజునకు విశేష ద్రవ్యదానమును జేయుదురు. ఆరోజున రాజునకు జెల్లింపబడు మొత్తము పదునయిదు లక్షల బంగారు పర్దావులుండునని చెప్పుదురు."

## రాయల మనశ్శరీరంబులు.

కృష్ణరాయలు మికిలి పొట్టివాడు గాడు. పొడువు వాడును గాడు. సామాన్యమైన యెత్తు గలవాడై చక్కని ముఖవర్చస్సును, సుందరాకారమును దృఢశరీరమును గలిగియుండెను. రాయలముఖము మీద స్ఫోటకపుమచ్చలు కలవు. పూర్ణసూచకమగు ముఖవికాసము చూచినవారికి నాతని యెడ బూజ్యభావము పుట్టించును. శరీరమును గట్టిపఱచి యుద్ధమునకు దగినంతసుదృఢముగ నుంచుటకునై యాతడు

ప్రతిదినమును శరీరసాధనముచేయుచుండెను. అన్నివిధముల సాము లును, కుస్తిపట్లును రా జెరుంగుటయేకాక దినదినమును అభ్యసించు చుండెను. విలువిద్యలోను ఖడ్గవిద్యలోను నాతఁ డారితేఱియుండెను. ఈ తని విజయ కథలు పైనివర్ణించిన తరువాత నితఁడు శూరాగ్రేసరుఁడని మేము వేరుగఁ జెప్పవలయునా ? ఇతఁడు పవిత్రా చరణమునందుఁ బర మనిపుణుఁడుని చెప్పవలయును. "గొల్లయిల్లాండ్రతో గోడగించుటఁ జేసి పరకామినీ సహోదరతఁ జూప"నని "పారిజాతాపహరణము" లోఁ జెప్పఁబడుటచే నీ రాజు పరస్త్రీయెడ సోదరీభావము కలవాఁడని చెప్ప వచ్చును. ఇతఁడు వైష్ణవుడు. ఇతఁడు విష్ణుభక్తాగ్రేసరుఁడని యితనిచే రచింపఁబడిన విష్ణుచిత్తీయము చెప్పుచున్నది. విష్ణువునందు భక్తిగల వాఁడయినను శివద్వేషికాఁడు. శైవవైష్ణవుల నందరిని సమానముగాఁ జూచెను. ఇతఁడు దయామయుఁడని రాయచూరుయుద్ధమే చెప్పుచున్నది. ఈతనికప్పుడప్పుడు కోపము విశేషముగా వచ్చుచుండెనఁట.

## రాయల కుటుంబము.

ఆంధ్రగ్రంథాదులనుబట్టి చూచినను పోర్చుగీసు గ్రంథములను బట్టి చూచినను రాయలకు ముగ్గురు పత్నులున్నట్టు కానవచ్చుచున్నది. చిన్నాదేవి, అన్నపూర్ణాదేవి, తిరుమలదేవి అని వారినామములు. ఇందు చిన్నాదేవికే యన్నపూర్ణాదేవి యని నామాంతరమని కొందఱు వ్రాసిరి. కాని యందు కేమియు నాధారములేదు. చిన్నాదేవి యొక వేశ్యాంగన యనియుఁ, గృష్ణరాయలు రాజగుటకుఁ బూర్వమీమెయెడ ననురాగము గలవాఁడై "నేను రాజ నగుదు నేని నిన్ను వివాహమాడి పట్టపురాణిని జేయుదు" నని మాట యిచ్చి తాను రాజ్యమునకు రాఁగానే యామెను వివాహమాడెననియు న్యూనిజ్ వ్రాసియున్నాఁడు. తిరుమలదేవి ముందరి విజయనగరరాజ కుటుంబమునకు జెందినదని న్యూ ని జ్ వ్రాసి యున్నాడు. కావున ఆమెసంగమవంశముననో సాళువంశముననో పుట్టి యుండవలయును. వీరుగాక మరికొందఱు భార్యలుండినట్లు సమకాలిక గ్రంథములవలన తెలియుచున్నది.అందొకతెప్రతాపరుద్రగజపతి కూతురు —ఈమె పేరేమో నిశ్చయముగ తెలియదు."భద్ర"యనినాదెండ్లగోపయ్య చెప్పినాడు. కాని పెదవెంకటపతి రాయల అవశ్థణాధికారులు తయారు

చేసిన విజయనగరసామ్రాజ్యమును పాశెగాండ్రలెక్కలో నామె పేరు "లక్ష్మీదేవి" యని యున్నది. కుమారధూర్జటి తన కృష్ణరాయపేరులు ఖాయని తెలిపినాడు. కృష్ణరాయలు తనకుకమలాదేవి యన్నపూర్ణాదేవు లను మఱియిరువులు భార్యలుండినట్లు ఆముక్తమాల్యదయందు చెప్పి యున్నాడు. వీరి వృత్తాంతమేమియు తెలియదు తిరుమలదేవి యందు రాయల కొకపుత్రుడు కలిగి యతడా పేండ్లుమాత్రము బ్రతికి మృతినొందెను. రాయలకు స్త్రీసంతానము కలదు. తిరుమలాంబిక యను రాయలకూతురు నరపతి వంశజుడగు రామరాజు వివాహమాడె. మఱి యొకకుమార్తె మట్లివంశజుడైన వరదరాజునుపెండ్లాడెను.రాయలకింకను బిడలున్నట్లు గానవచ్చుచున్నది. కాని వారిపేళ్ళు తెలిసికొనునుపాయము లేదు.

## చరమదశ.

కృష్ణరాయలు చరమదశయందు నా పేండ్లవాడగు తనకుమా రునికి పట్టాభిషేకముచేసి, తానుమంత్రిగాను, తిమ్మరుసు కార్యదర్శి గాను, తిమ్మరుసు పుత్రుడు సేనాధిపతిగను నుండి రాజ్యము చేయుచుం డెను. కాని యెనిమిది నెలల తరువాత నాకుమారుడేదోకారణమువలన మృతుడయ్యెను. తిమ్మరుసుకొమారుడు విషముపెట్టి తనకుమారుని జంపెనని తలచి రాజుతన్నుబుత్రునివలెగాచిన తిమ్మరుసును,అతని తమ్ముని, పుత్రుని జెఱబెట్టించెను. తిమ్మరుసు పుత్రుడు తప్పించుకొని పోయి రాయలమీద ధ్వజమెత్తెను. రాయలబలము లాతనితో బోరాడి యాతనిని పట్టుకొనివచ్చెను. అంత దిమ్మరుసుయొక్కయు,నతని కుమా రుని యొక్కయు, తమ్మునియొక్కయు నేత్రము లతిక్రూరుడై రాయలు తీయించెను. తిమ్మరుసు పుత్రుడు చెరసాలయందె మృతినందెను. తిమ్మరసును అతని సోదరుడైన గోవిందరాజును చెఱయందెయుండిరి.

ఇట్లు విజయనగరములో నంతఃకలహము గలిగినందున నిది మంచిసమయమనితలచి విజాపుర సుల్తానగు ఇస్మాయిల్ ఆదిల్‌షాహ రాచూరు దుర్గమును తీసికొనవలయునని దండెత్తి రాచూరుసమీపించెను. ఈ వార్త తెలిసినతోడనే రాయలు గుఱ్ఱమునెక్కి మహాకోపముతో రాచూరుమార్గమున బోవసాగెను. సైన్యములు వెనుకనుండిపోయెను.

4062



రాజవీధిలోని ఒక దృశ్యం



2408



మహార్ణవమి దిబ్బ విజయదశమి సింహాసనము

2600

# జీర్ణవిజయనగరము.



రాయలు వచ్చుచున్నాడనిన వార్త వినినతోడనే యంతకు బూర్వము దెబ్బతిన్నవాడు గనుక ఆదిశాహా యదరిపడిలేచి పాఱిపోయెను. అంత రాయ లాసుల్తానునకిట్లు వర్తమానమంపెను: "రెండుసారులు మాట తప్పితివి. ఇంకను నీవు నాకాళ్ళను ముద్దిడెదననిన నీ వాగ్దత్తమును నెఱవేర్పనందున నీతో యుద్ధముచేసి నిన్ను చెఱపట్టి నీయొద్దనుండి బెల్గాము దుర్గమును స్వాధీనపఱుచుకొనియెద." ఇట్లు మరల డాడివెడలుటకు గృతనిశ్చయుడై యుద్ధసన్నాహము చేయుచుండెను. కాని ఇట్లు యుద్ధ ప్రయత్నములు సేయుచుండగనే కృష్ణరాయలకు దేహారోగ్యము చెడి మంచముపట్టెను. తనకు మరణకాలమాసన్నమగుచున్నదని గ్రహించి తాను గతించిన వెనుక రాజ్యపాలనమున కచ్యుతరాయలె తగిన వాడని యెంచి యతని చెఱనుండి విడుపింపనాజ్ఞాపించి రాయపట్టమునకధిపతిని గావించెను. మఱియు నచ్యుతరాయలు చంద్రగిరినుండి విజయనగరము నకు వచ్చిచేరువరకును రాజధాని సంరక్షణకార్యమును సాళువనరసింగ రాయ బిరుదాంకితుడైన చెల్లప్పయను ద్రావిడ బ్రాహ్మణ మంత్రిపుంగవున కప్పగించి 1530 లో గీర్తిశేషుడయ్యెను.

## అచ్యుత దేవరాయలు.

## (1530—1542)

ఇతడు కృష్ణరాయలకు సవతి తమ్ముడు. ఇతడు కృష్ణదేవ రాయలంతటి పరాక్రమశాలి కాడు. కాని చరిత్రకారులు కొందఱు తలచునట్లు రణభీరువుగాడు. పూర్వార్జిత రాజ్యమున గూర్చుండి యనుభవించిన వైభవశాలియుగాడు. రాజ్యాధిపత్యము వహించినప్పటినుండియు నామరణాంతమును శత్రువుల దుస్తంత్రముల మూలమున నిరంతరము ఇడుమల గుడువవలసివచ్చెను. రాజ్యపాలనకొఱకు కృష్ణరాయలు జేసిన యేర్పాటులతని కుటుంబమునకు వచ్చలేదు. మరణకాలమప్పుడతనికి అష్టాదశమాసవయస్కుడైన పుత్రుడొకడుండెను. కృష్ణరాయలు రాజ్య మేలుననే దృష్టియందు ఉంచుకొనియుండుటచేత ఆబాలుని వారసత్వపు హక్కును పరిగణింపక ఆతనికంటె సర్వవిధముల సమర్థుడని తమ్ముని

నికి రాజ్యాధిపత్యమొసగెను. కృష్ణరాయలకు పట్టమహిషియైన తిరుమల దేవియందు తిరుమలాంబయను నొక కుమారిత కలదనియు నామెను నరపతి వంశజుడైన రామరాజునకిచ్చి యుద్వాహము గానించెననియు ముందు వక్కాణించి యున్నాము. ఇతనికె అళియరామరాజనియు పేరు. రామరాజు అతి సమర్థుడు, శూరుడు, నయశాస్త్ర విశారదుడు, మహా మేధావి. ప్రభుమంత్రోత్సాహశక్తిత్రయ సంపన్నుడు — కృష్ణరాయల యనంతరము సామ్రాజ్యాధికారము తనకు సంక్రమించునని యతడెంచి యుండెను. అట్లు కాకపోవుటవలన అతనికి అత్యంతము ఆశాభంగము కలిగెను. అయినను అతడు తనదృష్టిని సింహాసనముపైనుండి మరల్చి కొనజాలక యెట్టైన తన యభీష్టమును నెరవేర్చుకొనవలయునని నిశ్చయించి. కృష్ణరాయల పుత్రుడైన పదునెనిమిది నెలల ప్రాయపుటర్భకుని రాజ్యాధిపతియని ప్రకటించి యతనిపేర రాజధానిని రత్నసింహాసనమును నాక్రమింప దలపెట్టెను. కాని సాళువ నరసింగరాయని జాగరూకతవలన నతని కడక నిర్విఘ్నముగ సాగలేదు. విజయనగరపరిస్థితులిట్లు కలతవడియుండగా తమ పగదీర్చుకొనుటకు అదియె మంచితరుణమని యెంచి కృష్ణరాయలచే పూర్వముపరాజితులై యుండిన గజపతి కుతుపనమలకయేదులఖాన ప్రభృతులు కొంచెమించుగ నేక కాలమున రాయసామ్రాజ్యముపైనెత్తి వచ్చిరి. నష్టమైపోయియుండిన కొండవీటి దండపాటను మరల సాధింపవలయునని గజపతియు. తనరాజ్యమును తీరాంధ్రములోనికి విస్తరింపజేయునుద్దేశముతో కుతపనమలకయు, కృష్ణా తుంగభద్రలనడిమి యంతర్వేదిని మరల స్వాధీనముజేసికొనవలయు ననుతలంపుతో నేదులఖానుడును నొక్కపెట్టున నురవడించిరి.

అప్పటికింకను అచ్యుతదేవరాయలు విజయనగరమును జేరలేదు. రాజధానియందు రామరాజును నతని పక్షమువారును దలపెట్టుచుండిన కుతంత్రములవలన నచట తన పట్టాభిషేకమునకు భంగము కలుగవచ్చునని శంకించి తిరుమలలో దన యిష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధియందు పట్టాభిషేకము జేసికొని యటుపిమ్మట విజయనగరమునకు బయలువెడలిపోయెను. మార్గమధ్యమున గజపతికుతుపనమలకల

దండయాత్ర సమాచారము తెలియవచ్చినది; అంతట అచ్యుతరాయలు విజయనగరమునకు బోవుటమాని సైన్యముతోగూడ నుత్తరాభిముఖుడై కొండవీటివంక నడచెను. గజపతిని అచ్యుతరాయలోడించి పారదోలి నట్లు శాసనములందును సమకాలిక ప్రబంధములు కొన్నిటియందును జెప్పియున్నను అల్లసాని పెద్దనగారి గంటముపోటే గజపతినిష్క్రమణమునకు గారణమని యొకయైతిహ్యము గలదు—కృష్ణరాయలు మృతినొందినవెంటనే గజపతి విజయనగరసామ్రాజ్యముపైనెత్తిరాగా, పెద్దనగారు క్రోధదందహ్యమానసుడై యతనిని చీవాట్లు వెట్టుచు నీ క్రింది సీసపద్యమును వ్రాసి పంపెనట.

రాయరావుత గండరాచయేనుగువచ్చి
యారట్లకోట గోరాడునాడు
సంపెటనరపాలసార్వభౌముడువచ్చి
సింహాద్రి జయశిలజేర్చునాడు
సెలగోలు సింహంబుచేరి ధిక్కృతికించు
తల్పులగరుల డీకొల్పునాడు
ఘనతరనిర్ఝరగండ పెండెరమిచ్చి
కూతురాయలకును గూర్చునాడు

ఒడలెఱుంగవొ చచ్చితొయుర్వ్విలేవొ
చేరజాలక తలచెడి జీర్ణమైతొ
కన్నడంబెట్లు చొచ్చితి గజపతీంద్ర
తెఱచినిలుకుక్క జొచ్చిన తెఱగుదోప.

ఈ పద్యమును జదువుకొని సిగ్గుపడి గజపతి తనదేశమునకు మరలిపోయెనట. ఇందెంత సత్యముగలదో చెప్పుటకు వీలుకాదు.

కుతపనమలక క్రీ. శ. 1530 ప్రాంతమున కొండపల్లిరాజ్యమును జయించెను. అప్పుడె యతని బలము కొండవీటినిగూడ నాక్రమించుట కునుసమకట్టెను. ఆసులకకాల్బలములను అచ్యుతరాయల సేనాధిపతులలో నొక్కడైనగని తిమ్మానాయడు గడిదాటి రానీయక వెనుకకు తిరుగ

గొట్టెను. ఇట్లు సామ్రాజ్యంపైకెత్తివచ్చిన గజపతి కుతపనములకలను పరాజితులను గావించి పాఱదోలి తన యధికారమును కొండవీటి రాజ్యమున బాదుకొలిపి యచ్యుతరాయలు విజయుడై విజయనగరమునకు బోయి చేరెను. కృష్ణరాయల నిర్దేశానుసారము సాళువ నరసింగరాయ దండనాయకుడు అచ్యుతరాయలకు రాజధానిని సింహాసనమును అప్పజెప్పెను. కాని యందువలన నతని యధికారము నిరవధికసాగలేదు. రామరాజును నాతని పక్షమువారును కంటకప్రాయులై బాధింపగడగిరి. వారివలని యుపద్రవమును దొలగించుకొనుటకు రామరాజుతో సమాధానము చేసికొనెను. తత్ఫలితముగ నచ్యుతరాయలతోపాటు అర్భకుడైన కృష్ణరాయల పుత్రుడుగూడ సామ్రాజ్యాధిపతియని ప్రకటింపబడెను. ఆ బాలుని పక్షమున రామరాజ్య పరిపాలనము గావింపవలయునని యేర్పాటు సేయబడెను.

ఇట్లు రామరాజుతో రాజీకుదిరనను అచ్యుతరాయలకు శాంతముగ రాజ్యము ననుభవించుటకు సాధ్యపడదాయెను.రామరాజును ప్రతిఘటించి యచ్యుతదేవరాయలు విజయనగరమునకు వచ్చునందాక రాజధానిని సింహాసనమును సంరక్షించుచుండిన సాళువ నరసింగరాయ దండనాయకుడు పై రాజకారణముగ దనప్రాధాన్యమును గోల్పోవుటచేతనేమొ కోపించి రాజధానిని విడిచి తన నాయంకరమైన చోళమండలమునకు బోయి రాయలపై తిరుగుబాటు చేసెను. అతనిచే పురికొల్పబడి మధుర ప్రాంతమందు పాలించుచుండిన తుంబిచ్చి నాయకుడును, తిరువాంకూరు దేశమునేలుచుండిన తిరువడియు రాయలయధికారమును దొలగద్రోసి స్వతంత్రులవలె వ్యవహరింపగడగిరి. తిరువడి దండెత్తిపోయి తెంకాశి తిరునెల్వేలి సీమలనేలుచుండిన పాండ్యరాజును బాఱదోలి యతని రాష్ట్రము నాక్రమించుకొనెను. ఇదే తమ స్వాతంత్ర్యమును నెలకొల్పుటకు మంచి యదననియెంచి యుమ్మత్తూరు నాయకులు రాయలకు విముఖులైరి. ఇట్లు సామ్రాజ్యమున చెలరేగిన యంతఃకలహములమూలమున అచ్యుతరాయలకు ఉత్తరమున కృష్ణా తుంగభద్రలయంతర్వేదిపై నెత్తివచ్చి రాయచూరు ముదుగలు దుర్గములను వానిక్రింది రాష్ట్రమును

నాక్రమించుకొని యుండిన ఇస్మాయిల్ ఆదిల్ ఖానుని నిగ్రహించి స్వాధికారమును మరల ప్రతిష్ఠించుటకు వలనుపడకపోయెను.కావున అచ్యుతరాయలు రామరాజుతో సంధిగావించుకొనిన పిమ్మట నతని రాజధాని రక్షణకై యచట నిలిపి మొదట దక్షిణ దిగ్విజయ యాత్రకై బయలువెడలెను రాయరాణువ చోళమండలమును ప్రవేశించెను. సరసింగరాయ దండనాయకుడు పరాభూతుడై పాటిపోయి మిత్రుడైన తిరువడి నాశ్రయించెను. అంతట నచ్యుతరాయలు తుండీరచోళమండలములను మరల వశ యధికారముక్రిందికి తెచ్చుకొని శ్రీరంగమునకు బోయి యచ్చట విడిసి శ్రీరంగనాథుని సేవించుచు గొంతకాలముండెను. రాయలచట నుండగనే రాజ్యభ్రష్టుడై పాఱుతెంచి వచ్చిన పాండ్యరాజు తన కూతు గాన్కవెట్టి సాయము నర్థించెను. అంతట రాయలు తుంబిచ్చి నాయక తిరువడులను గూలద్రోయుటకును పాండ్యరాజును నిజరాజ్యమున పునఃప్రతిష్ఠితుని గావించుటకును సాళువ నరసింగరాయ దండనాయకుని బట్టి తెచ్చుటకును సైన్యమును దనబావమరదియైన సలకరాజుచినతిరుమలరాజు నాయకత్వముక్రింద నంపెను. చినతిరుమలరాజు ధైర్యసాహసములుగల యోధుడు,నేరర్పుయైనదండనాయకుడు;కావున నతఁడు రాయల యాజ్ఞాసారము దండునడపుకొనిపోయి మధుర రాజ్యమును ప్రవేశించి తామ్రపర్ణీతీరమునుజేరి యచటజయస్తంభమును నిల్పెను.అందాక శత్రులెవ్వరతనినెదుర్కొనలేదు.అచటినుండి కొంతసైన్యముతో నొక దళనాయకునతడు తిరువడిరాజ్యముమీదికంపెను. ఈదళనాయకుఁడు కొండకనుమలను సమీపించునప్పటికి తిరువడి దళములను కూర్చుకొనివచ్చి యెదిర్చెను. కాని రణమునపరాజితుఁడాయెను.ఈలోపలనె చినతిరుమలరాజచటికిరాగా తిరువడి తనచెంత తలదాచుకొని యుండిన సాళువ నరసింగరాజ దండనాయకు నతనికి బట్టియిచ్చి శరణువేడెను. ఇట్లు దండయాత్రిను జయవంతముగ కొనసాగించి యనంతశయనమునకు బోయి పద్మనాభస్వామిని సేవించి మరలి శ్రీరంగమునకువచ్చి రాయలవారిని దర్శించి దండయాత్ర వృత్తాంతమును నివేదించి. తాను బట్టితెచ్చిన తిరువడి మున్నగు బందులను సమర్పించెను. రాయల తిరువడిని పాండ్యరాజ్యము నాక్రమించినందులకు తగురీతిని శిక్షింప నాజ్ఞాపించి పాండ్యుని కూతు

నుద్వాహముజేసికొని యతని రాజ్యము నతనికిప్పించి తుంబిచ్చినాయక సాళువ నరసింగరాయ దండనాయకుల తప్పును సైచిమన్నించి దండును గదల్చుకొని కావేరీతీరమునకే కూచిచేసి యుమ్మత్తూరిపైనడచెను. ఇచ్చటనడచిన యుద్ధవృత్తాంతమేమియు దెలియదు. కాని రాయలకెమరు దిరిగిన నాయకుడు నిహతుడాయెననుటకు సంశయములేదు. ఏలనగా నచ్యుతరాయలుమ్మత్తూరునందు మల్లరాజును నెలకొల్పినట్లును, నుగ్గిహళ్ళి రాయణరాజు మున్నగువారిని సంరక్షించినట్లు శాసనము దెల్పుచున్నవి. పై వివరింపబడిన విజయములు క్రీ. శ. 1532 జూలై 27 వ తేదీ నాడు వ్రాయించిన కాళహస్తిశాసనమున బేర్కొనబడియుండుటవలన నప్పటికే ఈ దండయాత్ర ముగిసెనని విదితమగుచున్నది.

దక్షిణాశా దిగ్విజయమును జయవంతముగ జేసికొని యచ్యుత దేవరాయలు రాజధానికి మరలివచ్చి యచ్చట కొంతకాలముండెను తరువాత సమయమనుకూలముగ గన్పింపగా 1534 వ తుదను కృష్ణా తుంగభద్రల యంతర్వేదిని జయించుటకు దండువెడలెను. కృష్ణరాయల మరణానంతరము 1530 లో విజాపురాధిపతి ఇస్మాయిల్ ఆదిల్‌ఖానుడు దండెత్తివచ్చి రాయచూరు మున్నగు దుర్గములను సాధించి వశపరచుకొని యుండెను. విజయనగరరాజ్యములోని యంతఃకలహముల మూలమున నచ్యుతరాయలకు వెంటనే యాదుర్గములను మరల స్వాధీనపఱచుకొనుటకు వలను పడదాయెను. 1534 సెప్టెంబరు మాసప్రారంభమున ఇస్మాయిల్ ఆదిల్‌ఖానుడు కాలగతినందెను. అనంతరమతని జ్యేష్ఠపుత్రుడైన మల్లూ ఆదిల్‌ఖానుడు విజాపుర సింహాసనము నధిష్ఠించెను. కాని యతనికి బెల్గాము దుర్గాధిపతియగు అసద్‌ఖాను మున్నగు నమీరులు పెక్కండ్రు అనతులై తిరుగుబాటు చేసిరి. మఱియు తమ్ముడైన ఇబ్రాహీము సింహాసనము నాక్రమించుకొను నుద్దేశముతో లోలోపల కుట్రలు సేయదొడగెను. ఇట్లు విజాపురరాజ్యము కలగుండువడి యుండుటను కృష్ణా తుంగభద్రలను జయింప నదియుతరియని యెంచి దండువెడలెను.

మొట్టమొదట నచ్యుతరాయలొక ముఖ్య దుర్గమునకు ముట్టడివేసి లగ్గలవట్టియందు తాణ్యముండిన సేనానికాయమును బిలుకు మార్చెను.

తరువాత ఆదిల్‌ఖానుని రాష్ట్రమునుపైబడి సర్వనాశము గావించు రాయ చూరు దుర్గమువంక కూచిసేయగడఁగెను. ఈ సమయమున అసాద్ ఖాన్‌లారీ తన యజమానునిపై ద్రోహముదలపెట్టి అచ్యుతరాయలకడకు రాయబారమంపి సంధిచేసికొని నిజపరివారముతో గదలివచ్చి యతని గూడెను.ఆ సమాచారము దెలియగనే మల్లూఖానుఁడు సేనను సమ కూర్చుకొని వచ్చెను. ఉభయ సైన్యములును రాయచూరు పైపు నడువ సాగెను.రాయచూరును గైవసము గావించుకొనవలయుననిఅచ్యుతరాయలు సమయముచూచి యతనిపైబడి పాఱదోలవలయుననిమల్లూఆదిల్‌ఖానుఁడు ఈలోపల అసాదుఖానులారీరాయలశిబిరమునుండిరహస్యముగబాఱిపోయి ఆదిల్‌ఖానునితో రాజీచేసికొని యాతని గూడెను. తరువాత ఉభయసైన్య ములునుదారసిల్లగా ఘోరసంగరము పొసగినది.మల్లూఖానుదోడిక్రిష్ణానది నిదాటిపోయెను. అచ్యుతరాయలాతని యశ్వములను గజములను బట్టుకొని స్కంధావారమును చూఱగొని యతని యుద్ధసన్నాహములను ఆలోకిం చుట కొరకు కృష్ణాతీరమునకు బోయి విడిసెను. మల్లూఖానుఁడు అచ్యుతరాయలతో మరల యుద్ధముసేయుటకొరకు క్రొత్తగదళములను గూర్చుకొన్నను యుద్ధప్రయత్నమును మానుకొని సంధిచేసికొనెను. అసాద్‌ఖానుఁడు ఆదిల్‌షాహి రాజ్యములోని యమీరుప్రముఖులతో మల్లూఖానుని పదచ్యుతుని గావించి యాతని తమ్ముడగు ఇబ్రాహీమును సింహాసనమునెక్కించు నుద్దేశముతో కుట్రలు సేయదొడగెను. తత్కా రణమువలన నచ్యుతరాయలకు రాయచూరునకు బ్రత్యామ్నాయముగ మఱియొక రాష్ట్రమునిచ్చి యతనిని సమాధానపఱచి పంపి నిజరాజధానికి మరలిపోయెను. కాని యిచిరకాలమునకే విజాపురమున విప్లవము సంభ వింప మల్లూ ఆదిల్‌ఖానుఁడు పదచ్యుతుడగుటవలన అచ్యుతరాయలతనితో జేసికొన్న సంధిని పాటింపక రాయచూరు దుర్గమును జయించి స్వాధీన పరచుకొనెను.

మహమ్మదీయులను జయించి రాయచూరును స్వాధీనముజేసికొని అచ్యుతరాయలు విజయనగరమునకు మరలివచ్చెను. కాని గుత్తి దుర్గ ప్రాంతమున హావళిరేగుటవలన సైన్యముతోగూడ వెంటనే యచటికి

తరలిపోయెను. విప్లవకారుల జిమగగొట్టి యా దుర్గమును కైవశముజేసి కొని 1535 తుదను తన ఇష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరుని సేవించు కొరకు తిరుపతికి బోయి చేరెను. అచట కొన్ని దానధర్మములు జేసి వెనుదిరిగి 1536 ప్రారంభమున మరల విజయనగరమునకు విచ్చేసెను.

ఇంతటితో అచ్యుతరాయల ప్రభుత్వములో ప్రథమదశ సమాప్తమైనది. తరువాత సామ్రాజ్యాధిపత్యముకొరకు మరల రాజధానిలో నంతఃకలహములు సంప్రాప్తమైన తత్కారణమున నతని యధికారము సన్నగిలెను.

కృష్ణరాయల నిర్వాణానంతరము అతని పుత్రుని అర్భకుని ముందుంచుకొని రామరాజు రాజ్యాధిపత్యమునకు పోరాటము ప్రారంభించె ననియు నచ్యుతరాయలతనితో సంధిచేసికొని తనతోపాటు కృష్ణరాయల పుత్రుడుగూడ సామ్రాజ్యాధిపతియని యొప్పుకొని యతనికి ప్రతినిధియైన రామరాజుతో నేకీభవించి సామ్రాజ్యపాలనము సేయగడగెనని మీద చెప్పియున్నదికదా. తరువాత రెండు మూడేండ్లు గడచినపిమ్మట ఆ నిసుగు వ్యాధిగ్రస్తుడై పరమపదించెను. తరువాత అచ్యుతరాయలు రామ రాజుతో సఖ్యము పాటింపవలసిన యావశ్యకతలేకపోవుటవలన అతని యెడ నౌదాసీన్యము జూపుచు దనబావమరదియైన సలకరాజు తిరుమల రాజును సహాయునిగ జేసికొని సామ్రాజ్యమున కంతటికి యేకాధిపతియై పాలింపగడగెను. రామరాజందులకు గినిసి యచ్యుతరాయల మీద ప్రతీ కారముసేయ నిశ్చయించి సమయము పేచియుండెను. 1535 లో నచ్యుత రాయలు సైన్యముతోడను అమరనాయకులతోడను మొదటి గుత్తికిని యు తరువాత తిరుపతికిని బోవుటవలన విజయనగరమున తగు రక్షణ లేక యుండుటవలన రామరాజునకు తన పూనికెను నెరవేర్చుకొనుటకు సమయమనుకూలముగ నుండునట్లు తోచినది. మఱియు విజాపురపాలకు డైన ఇబ్రాహీము ఆదిల్‌షాహు సింహాసనము నధిష్టించినవెంటనే తన సైన్యమునుండి వైదేశిక మహమ్మదీయులను దరిమివేసెను. వారిలో మూడువేలమందికి రామరాజు ఆశ్రయమిచ్చి తన కొలువులో జేర్చు కొనెను.

తిరుపతియాత్ర ముగించుకొని అచ్యుతరాయలు 1536 లో విజయ నగరమునకు వచ్చి చేరెను. తరువాత నేమి నడచెనో విస్పష్టముగా దెలి యదు. కాని రామరాజు అతనినెటో చిక్కించుకొని చెఱయందువైచి స్వయము పట్టాభిషేకమొనర్చుకొనుట కుద్యమించెను. కాని యది నిర్విఘ్నముగ సాగలేదు. పెక్కురు సామంతులును నాయకులును విముఖులగుటచే నతడాయత్నమును మానుకొని యచ్యుతరాయల యను జన్మ్మైన రంగప్ప పుత్రుని సదాశివుని తన యండజేర్చుకొని యతడె రాయసామ్రాజ్యమునకు వాస్తవమైన యధిపతియని ప్రకటించి యతని పరప్రభుత్వము సేయగడగెను. కాని దాక్షిణాత్య సామంతులిందుకొప్పు కొనక తిరుగుబాటుచేసిరి. వారి నడచి సామ్రాజ్యమునందెల్లయెడలను తన యధికారమును నెలకొల్పుటకొరకు రామరాజు సైన్యముతో దక్షిణ దేశమునకు దండు చేయవలసివచ్చెను. ఈ దండయాత్రలో నతనికి విజయము చేకూడి యా ప్రాంతమును పాలించుచుండిన అమరనాయకు లనేకు లాతనికి నమ్రులైరి. కాని ప్రబలుడైన ఒక నొక సామంతు డాతని ప్రతిఘటించి యుద్ధమున పరాభూతుని గావించెను. ఈ పరాభవ మునకుతోడు విజయనగరమున సంభవించిన విప్లవము అతని స్థితిని మతియును కష్టభూయిష్టము గావించినది. అతడు రాజధానిని కాపుదల సేయుటకై నియమించివచ్చిన యధికారి స్వామిద్రోహమును దలపెట్టి యచ్యుతరాయల చెఱను మాన్పి మరల సింహాసనాసీనునిజేసి యతని పేర రాజకార్యములను నిర్వహింపగడగెను. వానిని సంహరించి రాయల పావమరదియైన సలకరాజు రాజధానిని రాయలను గైవసముజేసికొని ప్రధానామాత్య పదవిని వహించి సర్వమునకు దానె యధికారియాయెను. ఈ వృత్తాంతము తెలియవచ్చినంతటనె రామరాజుతన్ను పరాభూతుని గావించిన సామంతునితో సంధిచేసుకొని యెకాయెకి పర్యాణములమీద విజయనగరమునకు బయలుదేరెను. అతడు విజయనగరమును చేరునప్ప టికి అచ్చటి నూతన సంఘటనలవలన విషమతరముగ బరిణామమంది

దుర్భేద్యమై కన్పట్టినది. అంతఃకలహముల మూలమున దేశమున గలి
గిన కలవరపాటును సందుచేసికొని రాయరాజ్యమునకు సహజశత్రువైన
విజాపురసుల్తాను ఇబ్రాహీం ఆదిల్‌శాహు ఘనసైన్యముతో నెత్తివచ్చి
విజయనగరమును ముట్టడించి యుండెను. ఆ సన్నివేశము బహు చిత్ర
మైనది. యుద్ధసన్నద్ధులై రణక్షేత్రమునకు వచ్చి నిలిచినను వారిలో
నెవ్వరికిని పోరుచేయ ధైర్యము లేకపోయినది. కోటలో ముట్టడి నిలచి
యుండిన యచ్యుతరాయలకడ తురకలను చించి చెండాడజాలిన బల
ముండెనని న్యూనిజు చెప్పియున్నాడు. కాని యతడు యుద్ధమున కనుజ
నీడాయెను. తనచేయి ముందు మించిన యాదిల్‌శాహు రామరాజుతో
నేకీభవించి తనపై నురువణింప వచ్చును. అప్పుడు తనకు జయము
కలుగుట సంశయాస్పదము. శత్రుదుర్భేద్యమైన దుర్గమును వెలువడి
బయలు మెరసి బహిరంగ యుద్ధమునకు దలకొనుట శ్రేయస్కరము
గాదని యచ్యుతరాయలును నతని కార్యఖడ్గములకు కర్తయైన సలకరాజు
తిరుమలరాజును మిన్నకయుండిరి. కోటముట్టడియం దురవడిచూపి
సాధించుటకు ప్రయత్నించిన ఇరువాగుల హిందువులును నేకమై వెనుక
నుండియు ముందరినుండియు తనపైబడి తన్ను పరాభవింప వచ్చునని
శంకించి యాదిల్‌శాహు చురుకుదనముమాని యూరకయుండెను; ఆదిల్
శాహు స్కంధావారమునుదాకిన నతడచ్యుతరాయలతో సంధిచేసికొని
యతని సాహాయ్యముతోదన్ను పూర్ణాహుతి గావింపవచ్చునని భయపడి
రామరాజు ఔగాముల జింతించుచు భవిష్యము నెదురు చూచుచుండెను.
ఈ సందిగ్ధావస్థలో ఆదిల్‌శా మంత్రియైన అసాద్‌ఖానులారియొక్క
స్వామిద్రోహచింత యాసంస్తంభ వాతావరణమును స్పందింపజేసెను.
అతడేలనో తన యజమానునిపై గలుషము వహించి కుట్రలుచేసి విజా
పురరాజ్యమునం దచటనచట నల్లరులను రేపెను. రామరాజుతో మంత
నముజేసి యతనిని ఆదిల్‌శాహు దళములపై గవయమని పురికొల్ప
నారంభించెను. అతని రహస్యప్రవర్తన యంతయు నాదిల్‌శాహునకు
దెలియవచ్చినది. అంతట నతడు అచట నటుమీదనుండుట శ్రేయస్కర
ముగాదని నిశ్చయించి ముట్టడి లేపుకొని సైన్యముతో దరలిపోవనుద్యు

కుడై యచ్యుతరాయలకును రామరాజునకును నొడబాటు గల్గించి వార లతో సఖ్యముజేసికొని నిజరాజ్యాభిముఖుడై పోయెను. ఈ యొడంబడిక ప్రకారము రామరాజు నధికారముక్రింద నుండిన రాష్ట్రమునతడు స్వతంత్రముగ పాలించునట్లును తక్కిన సామ్రాజ్యమంతయు నచ్యుత రాయల యేలుబడిక్రింద నుండునట్లును ఏర్పాటుగావింపబడెను. యేర్పాటు అచ్యుతరాయల మరణపర్యంతము అమలులో నుండినది. అంతఃకలహ ములు శమించుటవలన రాజ్యమునందొక్కించుక శాంతి భద్రతలు నెల కొనెను. కాని రాయలరాజ్యపాలనా పద్ధతి క్రూరమై మారి ప్రజలమనికి దుర్భరమాయెను. పైరు పచ్చలలోబడిన చీడపురువునుబోలి యతడు కలవారి ధన సంపదలనపహరించుచు జనకంటకుడై ప్రవర్తించెను. అతనినేవగించి గర్హింపనివారు లేరాయె. ఇట్లు రెండు మూడేండ్లపర్యం తము ప్రజలను పీడించి క్రీ. శ. 1542 లో అచ్యుతరాయలు కాలగతి నందెను.

ఈ రాజు తిన్నెవెల్లివఱకుగల దక్షిణదేశమును గెలిచెనని కాంచీ పట్టణములోని రెండుశాసనములు చెప్పుచున్నను ఈతనిప్రవర్తన మం తయుఁ జూడ నితఁడు పిటికివాఁడనియు, దూరదృష్టి లేనివాఁడనియుఁ జెప్పవలసి యున్నది. రాజ్యమునకు రాఁగానే యీతఁడు మంత్రులమాట వినక తనబావ మఱఁదుల మాటలు విని స్వేచ్ఛాచారపరుఁడై వర్తింపఁ జొచ్చెను. ఇట్లు రాజులకును మంత్రులకును మనస్తాపముకలిగెనని తెలిసి కొని విజాపుర నవాబు మటికొందటిని వెంటఁబెట్టుకొని విజయనగరము మీఁదికి దండెత్తివచ్చెను. ఈ నవాబు కొలఁదిసైన్యములతో వచ్చినందున ఆతనిని పరాభవించుట యచ్యుతరాయలకు సులభమైయుండెను. సేనాధీ శులుగూడ యుద్ధమున కనుజ్ఞ యిమ్మనివేఁడిరి. కాని తురుష్కులు నాగలా పురమును ధ్వంసముచేసినను రాయలు తన సైన్యములకు యుద్ధమునకు సెలవిచ్చినవాఁడు కాఁడు. ఇంతియకాదు. సైనికులు వలదు వల దను చుండఁగా నవాబునకుఁ గొంతధనమును, రాయచూరు ముద్గలు దుర్గములు నిచ్చి సంధిచేసికొనెను. రాయచూరుదుర్గమును మూఁడు నెలలవఱకు

ముట్టడించి యాదిల్‌షాహ దానిని స్వాధీన పఱుచుకొనెనని పెరిస్తా వ్రాసి నాఁడు.

అచ్యుతరాయలు తాను నవాబున కిచ్చిన ధనమంతయుఁ దనప్రజ లను బాధపెటి వారియొదనుండి రాఁబట్టెను.అందుచే లోకు లీతని మిగుల ద్వేషింపసాగిరి.

ఈ రాయలు గుళ్ళు గోపురములకు దానములు విశేషముగాఁ జేసి శాసనములు వేయించెను. ఈ రాయలు తంజావూరుపాలకుఁ డగు చెవ్వ రాజునకుఁ దోడియల్లుఁడని విజయవిలాసములోని యీ క్రిందిపద్యము వలనఁ దేటపడుచున్నది.

గీ. తీవి నచ్యుతరాయల - దేవియైన
తిరుమలాంబకుఁ జెలియలై - తేజరిల్లు
మూర్తి మాంబను బెండ్లియై - కీర్తి వెలసెఁ
జెవ్వవిభుఁడు మహోన్నత - శ్రీచెలంగ.

ఈ రాయలకాలమందుఁ గొండవీటిలో రామయామాత్య భాస్కరుఁ డను మంత్రిపుంగవుఁడు అధికారిగా నుండెను.తిమ్మరుసువలెనే యితఁడు నియోగి బ్రాహ్మణుఁడు. అసంఖ్య యవనవీరుల గెలిచిన వీరుఁడనియుఁ గర్ణునివంటి దాతయనియు నితఁడు విఖ్యాతిఁజెందెను. కొండవీటిలోని గోపీనాథస్వామివారిదేవాలయ ద్వారముమీఁద నీ మంత్రిపుంగవుని గుఱించిన యీ పద్యమున్నది:—

సీ. నిర్మించె నేమంత్రి నిరుపమప్రాకార
నవకంబుగా గోపి - నాథపురము।
గెలిచినాఁడేమంత్రి - లలితవిక్రమమునఁ
ప్రబలుఁడై యవనుల - బలమునెల్ల।
నిలిపినాఁడేమంత్రి - నియతవైభవమున
గోపికావల్లభుఁ - గూర్మివెలయఁ।

బాలించెనేమంత్రి - ప్రకటధర్మఖ్యాతి
మహిమమీఱఁగ నాంధ్ర - మండలంబు।
గీ. నతఁడు భూపాలమంత్రీంద్రి - సతతవినుత।
ధీవిశారదుఁడచ్యుత - దేవరాయ।
మాన్యహితవర్తనుఁడు శౌర్య - మహితయశుఁడు।
భానుతేజుండు రామయ - భాస్కరుండు॥

ఈ మంత్రిపుంగవుని దానగుణమును వర్ణించుచాటుధార యొకటి కలదు.

మ. సరిబేసైరిపుఁడేల భాస్కరులు భా - షానాథపుత్రావసుం
ధరయందొక్కఁడు మంత్రి యయ్యెవినుకొం - డన్ రామయా
మాత్య భా
స్కరుఁడా? యౌ నతఁడే సహస్రకరశా - ఖల్ లేవవే యున్నవే
తిరమైదానముఁ జేయుచోరిపులహేతిన్ వ్రేయుచో వ్రాయుచోన్.

ఈ యచ్యుతదేవరాయఁడు మహారాజ్యవైభవమును అనుభవించెను. ఈతని యంతఃపురములో వాడఁబడు పాత్రలన్నియు బంగారముతోఁ జేయఁబడెను. పరుపులు పట్టుదోను దోమతెరలు వెండితీగెతోను చేయఁబడినవి. ఈతని యంతఃపురసంబంధమైన సేవకు లేఁబదివేలవఁకుండిరి. ఇతని కైదువందల భార్యలుండిరఁట ! అంతఃపురమునుగూర్చి నన్నిన్ ఇట్లు వ్రాసియున్నాఁడు:— "అంతఃపురములోని యాదాయవ్యయము లను గూర్చినలెక్కలు వ్రాయుస్త్రీలు గలరు. రాచరికపువ్యవహారములను గూర్చిన చరిత్రములను వ్రాయుస్త్రీలు కొందఱుగలరు. సంగీతమునేర్చిన స్త్రీలును పెక్కండ్రుగలరు. రాయల భార్యలగు రాణువసైతము సంగీత విద్యయందుఁ బ్రవీణురాండ్రైయుండిరి." "ఇతని కాలమున రాజ్యమంతయు రెండువందల సామంతప్రభువులకు భాగింపఁబడి వారల యధికారమునకు లోఁబఱుపఁబడి వారలచేఁ గప్పములు గైకొనఁబడుచుండెను. వారిలోఁ బ్రధానులగువారిని గొందఱిని న్యూనీజు పేర్కొనియున్నాఁడు.

వారిలో ముఖ్యుడును ప్రధానియునగువాడు సలకము తిమ్మయ. ఇతడు చోళమండలము, నాగపట్టణము, తంజాపురి, దేవిపట్టణము, తిరుకోవెలూరు మొదలగు ప్రదేశములకు ప్రభువుగా నుండెను. ఈ పట్టణము లన్నియు సింహళద్వీపమునకు సమీపముననున్నవి. వీనివలన నాతనికి బదునొకండు లక్షల బంగారపు పర్దావులరాబడి వచ్చుచుండెను. ఇందులో మూడవభాగము రాయలకు గప్పము గట్టుచుండును. ఇతడు రాయల కొఱకు ముప్పదివేల కాల్బలమును, మూడువేల గుఱ్ఱపుదళమును, ముప్పదియేనుగులును బోషింపవలసియుండును.తనరాబడిలో గప్పము పోగా రెండువంతులలో నీ సైన్యమునకగు వ్యయమంతయును బోగా మిగిలినది మాత్రమే యాతని యాదాయముగా బరిగణింపబడును.రాయలకు నాగ్రహము వచ్చినయెడల నీ యాస్తినంతయును స్వాధీనముజేసికొనగలడు. ఉదయగిరి, కొండవీడు, పెన్నకొండ, కనిగిరి, సిద్ధవటము మొదలగు ప్రదేశముల కధికారియగు తిమ్మప్పనాయకునకు నెనిమిదిలక్షల పర్దావులయాదాయము వచ్చుచుండెను. ఇరువదియైదువేల కాల్బలమును, పదునైదువేల గుఱ్ఱపు దళమును, నలువదియేనుంగులును బోషించుచు రాయలకు మూడులక్షల పర్దావులపన్ను గట్టుచుండెను. బీజపురసరిహద్దు భూముల కధికారిగానున్న గోపనాయకునకు నాఱులక్షల పర్దావులరాబడి కలిగియుండెను. ఇరువదివేల కాల్బలమును రెండువేల యేనూఱు గుఱ్ఱపుదళమును, ఇరువదియేనుగులును బోషించుచు రాయలకు లక్షయునేబదివేల పర్దావులు గప్పముగట్టుచుండెను. వెంగాపుర దుర్గమున కధికారియగు లేపప్పనాయకునకు మూడులక్షల పర్దావుల యాదాయము వచ్చుచుండెను. ఇరువదివేల కాల్బలమును పండ్రెండు వందల గుఱ్ఱపుదళమును, ఇరువదియెనిమిది యేనుగులను బోషించుచు రాయలకు నెనుబదివేల పర్దావుల గప్పముగట్టుచుండెను. విజయనగర సమీపదేశమున కధికారిగానున్న నరవరనాయకునకు నాలుగులక్షల పర్దావుల యాదాయమురాగా బండ్రెండువేల కాల్బలమును, ఆఱువందల గుఱ్ఱపుదళమును, ఇరువదియేనుగులను బోషించుచు రాయలకు రెండు లక్షల పర్దావులు గప్పముచెల్లించుచుండును. కొచ్చి మొదలగు దేశముల

కధికారిగానున్న చిన్నప్పనాయకునకు మూఁడులక్షల పర్దావుల యాదా
యము వచ్చుచుండెను. పదివేల కాల్బలమును ఎనిమిదివందల గుఱ్ఱపుదళ
మును బోషించుచు రాయలకు లక్షపర్దావుల గప్పముగట్టుచుండెను.
కృష్ణప్పనాయకుఁ డనువానికి నిరువదివేల పర్దాపుల రాబడి కలిగి
యుండెను. ఏడువందల కాల్బలమును, అయిదువందల గుఱ్ఱపుదళమును
బోషించుచు రాయలకు నేడువేల పర్దావులు పన్ను చెల్లించుచుండును.
మళయాళదేశమున కధికారిగానున్న వాజప్పనాయకునకు మూఁడులక్షల
పర్దావుల యాదాయము వచ్చుచుండెను. పదివేల కాల్బలమును, ఎనిమిది
వందల గుఱ్ఱపుదళమును, పదునైదేనుంగులను బోషించుచు పదివేల
పర్దావులు రాయలకుఁ గప్పము గట్టుచుండును. కోలారుమండలములోని
ఆవతిదుర్గమున కధికారిగానున్న మల్లప్పనాయకుఁ డనువానికి పదునైదు
వేల పర్దావుల యాదాయము వచ్చుచుండెను. ఆఱువేల కాల్బలమును,
నాలుగువందల గుఱ్ఱపుదళమును బోషించుచు రాయలకు నయిదువేల పర్దా
వుల గప్పము చెల్లించుచుండెను. గుత్తిమండలమున కధికారిగానున్న ఆ
దెప్పనాయకుఁ డనువానికి మూఁడులక్షలపర్దావు లాదాయము వచ్చు
చుండెను. ఎనిమిదివేల కాల్బలమును, ఎనిమిదివందల గుఱ్ఱపుదళమును,
ముప్పదియేనుఁగులను బోషించుచు నలువదివేల పర్దావులు రాయలకుఁ
గప్పము గట్టుచుండెను. ముద్గల్లుదుర్గమున కధికారిగానున్న పుటీయొక
వాజప్పనాయకునకు నాలుగులక్షల పర్దావు లాదాయము వచ్చుచుండెను.
పదివేల కాల్బలమును, వేయిగుఱ్ఱపుదళములు, ఏఁబదియేనుఁగులను
బోషించుచు లక్షయునేఁబదివేల పర్దావులను రాయలకుఁ గప్పము గట్టు
చుండును.

"ఈ రీతిగా రెండువందల ప్రభువులకు దేశము పంచిపెట్టఁబడి
వారల క్రిందనుండు భూములయొక్క వైశాల్యమునుబట్టియు, ఫలస్థితిని
బట్టియుఁ గప్పములును వారలు పోషింపవలసిన సైన్యములయొక్క
సంఖ్యయు నిశ్చయింపఁబడి యీ బలముయొక్క యౌన్నత్యమువలన
విజయనగరరాష్ట్రము రాయలనెడు నీ హిందూచక్రవర్తులచేఁ బరిపాలిం
బడుచు వచ్చినది. ఈ నిర్ణయప్రకారము ప్రభువులు కప్పములుగట్టక

యుపేక్షించినయెడల వారల యాస్తులు గైకొనఁబడును. ఈ రాయలకు నిరువదివేల తమ్ములును పల్లకులును గలవు."*

## మొదటి వేంకటపతిరాయలు—

## సలకరాజు తిరుమలదేవ మహారాజు

## (1542—1543)

అచ్యుతదేవరాయల మరణానంతరమతని పుత్రుఁడు వెంకటపతి సామ్రాజ్యపీఠమునధిష్ఠించెను. ఇతఁడు బాలుడు. 1532 లో నచ్యుతరాయలితని యౌవరాజ్యాభిషిక్తుని జేసియుండుటవలన తండ్రిమరణకాలమప్పుడతడు పండ్రెండేండ్ల ప్రాయమువాడై యుండవచ్చును. రాజ్యకార్యములను నడుపనతడు స్వయముశక్తుడు గాకపోవుటచే నతనికతని మేనమామయు నచ్యుతరాయలకు సర్వశిరఃప్రధానియునై యుండిన సలకరాజు తిరుమలరాజు ప్రాపై యతని పక్షమున రాజ్యమును పరిపాలింపగడగెను. ఇతఁడు స్వభావముచే గడు క్రూరుడు. కావున సామంతామరనాయకులలో బెక్కండ్ర కితనియెడ నమ్మకము లేక సామ్రాజ్యవ్యవహారముల నడపుటకొక మంత్రాగసభ నేర్పఱచి తన్మూలమున రాజ్యపాలన జరుపవలయునని కోరిరి. కాని సలకరాజు తిరుమలరాజునకది నచ్చలేదు. కావున తనపక్షము బలపరచుకొనుటకు దగిన ప్రయత్నములు సేయదొడగెను. అంతట వారందఱును అతనియెడ వైరస్యమునంది తమ తమ నాయంకరములకు బోయి స్వతంత్రులవలె వ్యవహరింప గడగిరి. వేంకటపతిరాయల జననియగు మహారాజ్ఞి వరదరాజమ్మకు దన సోదరుని ప్రవర్తన అనుమానాస్పదముగ గన్పట్టెను. అతఁడు దన పుత్రుని శ్రేయోభివృద్ధిని గోరక ద్రోహము దలపెట్టుచున్నాడను శంకగలిగినది. ఎట్లైన తిరుమలరాజు బారినుండి తన కుమారుని తప్పించి యతని రాజ్యపదమునందు సుప్రతిష్ఠితుని జేయుట తన విధియని తలపోసి విజాపుర సుల్తాను ఇబ్రాహీము ఆదిల్‌ఖాహు సహాయమును వేడినది. రాయరాజ్య

---

* జీర్ణకర్ణాటరాజ్య చరిత్రము.

రాజకీయములలో ప్రవేశించుట కవకాశము గలిగినందులకు సంతసించి ఇబ్రాహీమ్ ఆదిల్ శాహు తక్షణమె దండు గదలించుకొని విజయనగరమునకు బయలువెడలెను. అతడువచ్చుచున్నాడని తెలియవచ్చినంతటనె సలకరాజు తిరుమలరాజతని కడకు రాయబారులనంపి విశేషధనమిచ్చి యతనిని వెనుకకు మరల్చెను. కాని యంతట తిరుమలరాజుయొక్క అధికారము సుప్రతిష్ఠితము గాలేదు! రామరాజతనితో ప్రతిఘటించి,గుత్తి దుర్గమున చెఱలోనుండిన సదాశివరాయలను విడుదలచేసి యతడె సామ్రాజ్యమునకధిపతియని ప్రకటించి యుద్ధప్రయత్నములు సేయగడగెను. ఇంతియకాక తనకుతోడైవచ్చి సదాశివరాయలను వజ్రసింహాసనముపై నెక్కింపవలయునని యాదిల్ శాహును ప్రార్థించెను. అది యతనికాహ్లాదకరమే. రామరాజు ప్రార్థన నంగీకరించి యాదిల్ శాహు విజయనగరమును సమీపింపగనే పట్టణప్రజలు దమ్మాపట్టున సంరక్షింప సలకరాజు తిరుమలరాజె దక్షుడని యెంచి వెంకటపతిరాయలను విస్మరిస్తూ నతనిని రాయలుగ నెన్నుకొని వజ్రసింహాసనమునెక్కించిరి. ఆలోపలనె ఇబ్రాహీము ఆదిల్ శాహుడుకాగా తిరుమలదేవ మహారాజు సైన్యముతోగూడ పురము వెలువడిపోయి యుద్ధరంగమున నతనినెదిరించి పరాభూతుని గావించి పారదోలెను. విజయముజేకొని మరల రాజధానికి తిరిగివచ్చిన పిమ్మట వేంకటపతిరాయలు సజీవుడై యున్నంతకాలమును దనకు రాచరికము దక్కదని యెంచి మేనల్లురను బంధుత్వమును సరకుగొనక నిర్దాక్షిణ్యముతో నతని హత్యచేసి చంపెను. కాని తిరుమలదేవ మహారాజు స్థితి యంతట నిర్బాధకముగాలేదు - రాయలను హత్యచేసి చంపినందున సామ్రాజ్య ప్రజ కతనిపై నేవగింపు కలిగినది. ఆ దురాత్ముని నెట్లైన కడతేర్చిన చాలునని యమరనాయకులు కొందఱు ఆదిల్ శాహునాహ్వానించిరి: వారి కోరికప్రకార మతడు మరల విజయనగరముపైనెత్తి వచ్చెను; కాని ప్రజలు విముఖులై ద్వేషభావము జూపుటవలన నచట నిలువజాలక వెనుదిరుగవలసిన వాడాయెను. దేశమందు ప్రబలుచుండు సంక్షోభము రామరాజుయొక్క యెత్తుగడకు అనుకూలపడెను.

సహాయుడై వచ్చిన యాదిల్‌శాహు పరాజయము పొంది పాఱిపోయినను ధైర్యము వీడక నాయకులను సామంతరాజులను పెక్కండ్ర సహాయులను జేసికొని గుత్తి దుర్గమునుండి బయలు వెడలి మొట్టమొదట రాయ సామ్రాజ్యమున ద్వితీయ దుర్గమని ప్రఖ్యాతి పొందియుండిన పెనుగొండను సాధించెను;తరువాత తిరుమలరాజుయొక్క అనుచరులలో ప్రధానులయిన సలకయ చింతగుంట రఘుపతి మున్నగువారిపై దండెత్తిపోయి జూటూరు బేడరబెడగల్లు బేతంచర్ల యుద్ధములయందు వారి నోడించి, విజయనగరముపై కూచిచేసిపోనుద్యమించి యుండగా నొక యవాంతర సంఘటనవలన నాయత్నమును దాత్కాలికముగ మానుకొనవలసి వచ్చెను. రామరాజు సామంతామరనాయకు గూడబెట్టుకొని వారి బలములతో విజయనగరము మీదికి వచ్చుచున్నారని తెలియవచ్చినంతటనె తిరుమలదేవ మహారాజునకు దిగ్భ్రమ జనించినది. మాతొడ్డి యతని నిలువరించుటకు తనకు శక్తి చాలదని గ్రహించి ఆదిల్‌శాహును తోడురమ్మని ప్రార్థించెను. తన్ను రామరాజు బారినుండి కాపాడి తాను ఆదిల్‌శాహున కరిగాపై కప్పుజెల్లింతునని యొప్పుకొనెను.తక్షణమె ఆదిల్‌శాహు దండు తరలి నిజయనగరమునకు వచ్చి చేరెను. తిరుమల రాజతని నెదుర్కొని తోడ్కొనిపోయి సభాభవనమున వజ్రసింహాసనముపై గూర్చుండబెట్టి బహువిధ సత్కారములచే నతని సంతృప్తుని గావించెను. ఈ యుపద్రవమునుండి దేశమును హిందూ స్వాతంత్ర్య ధర్మములను గాపాడుటకై రామరాజాదు లొకయుక్తిని పన్నిరి. తాముచేసిన తిరుగుబాటునకు దాము బహుళముగ పశ్చాత్తాప పడుచున్నారమనియు దిరుమలదేవ మహారాజెచెన ఆదిల్‌శాహునకు వీడికోలిచ్చి నిజదేశమున కంపివేసిన దామందరతనికి నమ్ములై యతని ననవరతము భక్తిశ్రద్ధలతో గొలిచియుండెదమని సందేశమంపిరి. రామరాజు తిరుమలదేవ మహారాజున కటుమీద నెన్నడును ద్రోహము దలపెట్టక స్వామిభక్తిగలిగి హితమొద గూర్చుచుండెదనని ప్రత్యేకమొక పత్రమును వ్రాసి యంపెను.

వారిమాటలు బూటకములని గ్రహింపక సత్యమని విశ్వసించి యాదిల్‌శాహున కపారధనమునిచ్చి యతని రాజ్యమున కంపివేసెను. ఆదిల్‌శాహు మరలిపోయిన వెంటనె రామరాజును తదనుచరులును తిరుమలదేవ మహారాజును రూపుమాప నిశ్చయించి తామంతకుముందు చేసిన బాసలను లెక్కింపక విజయనగరముపై నడచిరి. తిరుమలదేవ మహారాజు వారి ద్రోహమును గుర్తించి ధైర్యమును గోలుపోక తన దళముల సమకూర్చుకొని నగరువెలువడి వారి నెదుర్కొనెను. తుంగభద్రా తటమున భీకర సంగ్రామము సంఘటిల్లినది. తిరుమలదేవ మహారాజు శక్తిసామర్థ్యములతో పోరుసల్పినను రణనిహతుడాయెను. విజయలక్ష్మి రామరాజును వరించెను. తిరుమలదేవ మహారాజు మరణమునుగూర్చి ఫెరిష్తా యొక చిత్రమైన కథను చెప్పుచున్నాడు: ఆదిల్‌శాహు స్వదేశమునకు బోయినతోడనె రామరాజును ఇతరులయిన సరదారులును తిరుగబడిరి. ఇకదాను బ్రతుకు దుర్లభమని తెలిసికొని తిరుమలదేవ మహారాజు రాజభవనములోని గుఱుముల తోకలగోయించియు, చెవులు కోయించియు, రత్నములను విసుఱుళ్ళలో వేయించి విసరించియు, సొత్తును తన చేతనైనంతవఱకు పాడుచేయించి తానును పొడుచుకొని చచ్చిపోయెను. కాని ఈ కథ యంత విశ్వాసపాత్రమైనదికాదు. సమకాలిక గ్రంథాదులలో నతడు రణక్షేత్రమున పోరుచు జచ్చినట్లే చెప్పియున్నది. తరువాత రామరాజు శతాబ్దము 1465 శుభకృతు కార్తిక శు 11 నాడు జయ జయధ్వానములు మిన్నుముట్ట విజయనగరమును ప్రవేశించెను. తానే స్వయముగ సింహాసనము నధిష్ఠింప ధైర్యముచాలక సదాశివరాయలను గద్దెనెక్కించి పట్టాభిషేకమును గావించి కార్యఖడ్గములకెల్ల కర్తయై యతనిపేర సామ్రాజ్యమును పాలింపదొడగెను.

సదాశివరాయలు సమర్థుడుగాడు; కేవలము అంబేద. శాసనములలో నతడు సామ్రాజ్యమును పాలించుచుండినట్లున్నను నిజముగా రాజ్యముచేసినవాడు రామరాజు. ఇకమీద విజయనగరచరిత్ర యనగా నితనియొక్కయు నితనితమ్ములగు తిరుమలరాయ వెంకటాద్రిల యొక్కయు జరిత్రయే గావున వీరి పూర్వవృత్తాంతము కొంచెమిచ్చట

దెల్పవలయును. వీరు చంద్రవంశపు క్షత్రియులమనియు, పాండవులు తమ పూర్వులనియు, జెప్పుకొనుచుండిరి. చాళుక్యవంశజుడును కల్యాణ పురాధీశుడును బసవనిచే జంపబడినవాడును అగు బిజ్జలుడు వీరి పూర్వపురుషుడట. ఈవంశమునకు మొదట నరపతివారని పేరున్నను వీరు ఆర్వీటిలో, ప్రభుత్వముచేయుచున్నందున వీరికి నార్వీటివారని గృహనామము కలిగెను. వీరి పూర్వులలో నార్వీటి బుక్కరాజు శూరాగ్రేసరుడను ఖ్యాతి వడసెను. సాళువనరసింహరాయలకు నీతడు కుడిభుజముగానుండెనని రామరాజీయములో నితనికీయబడిన 'సాళువ నరసింహరాయరాజ్య ప్రతిష్ఠాపనాచార్య' అను బిరుదువలన దేలుచున్నది. ఈ బుక్కరాజునకు నిద్దఱుభార్యలు. బళ్ళాదేవి; అబ్బళదేవి. బళ్ళాదేవి వలన నితనికి సింగరాజు మొదలయిన పుత్రులు పుట్టిరి. వారి కీతడు నంద్యాల (Nandyal) రాజ్యమిచ్చినందున వారిచ్చటనేయుండి 'నందేలవా'రైరి. కళాపూర్ణోదయమును కృతినందిన కృష్ణరాజీవంశములోనివాడే. బుక్కరాజు రెండవభార్యయగు బళ్ళాదేవివలన రామరాజనుపుత్రునివడసెను. ఇతడు మన రామరాజునకు దాత. ఈరాజు కందనోలు పట్టణమును గెలిచి దానిని తన రాజధానిజేసికొనినట్లు రామరాజీయములోని యీ క్రింది పద్యమువలన దెలియనచ్చుచున్నది.

సీ. మదకరికొకటి కి - ర్వది గుఱ్ఱములు గుఱ్ఱ
మునకును విలుకాండ్రి - ముగురు పిచ్చు।
కత్తులవా రీటి - కాండ్రిట్ల వర్తిల్ల
నిట్టి యేనుగులును - జుట్టు మూడు।
వేలయేనూఱు ను - ద్వృత్తితో నడవంగ
గందనోల్ సాధింప - గాదలంచి।
మొనగ్రుంచి గట్టిగా - ముట్టడి దిగి సవా
బిబ్బిని మిక్కిలి - యుబ్బణంచి।

గీ. ప్రకటసప్తాంగములగొని - రామవిభుడు।
కందనోల్ రాజధానియు - గాగ వసుమ।

తియును నేలి మహాహవ - దీక్షఁబూనె।
బలిమి కలిమి నాశావనీ - పకులఁబెనుప॥

రామరాజీయమునందు నీ రాజునకు "హలిసనే నోలాసిత సప్తశత సైంధవ గ్రహణపరాయణ, దుర్వారతరసవ్వాయి సైనికహరణ సవా బిబ్బిరాజ సప్తాంగహరణ మార్గచరణ, నిరవపాదవనీ దుర్గనివాసికాస పుడయ దుర్మదఖలనిర్మథన" అను బిరుదులుకలవు. ఇతడు వీరనర సింహరాయల కొలువునందుండి యాతని పక్షమున విజాపురాధిపుడైన యూసుపు ఆదిల్‌ఖానునితోడను నతని మిత్రుడును నాదవని దుర్గాధిపతి యైన కాసప్ప ఒడయనితోడను యుద్ధములుజేసి జయించినందున నతనికి బిరుదులు గల్గెను. ఈరాజు భార్యపేరు లక్కమాంబ. ఈ దంపతులకు తిమ్మరాజు, కొండరాజు, శ్రీరంగరాజు లని ముగ్గురుపుత్రులు కలిగిరి. అందఁ దిమ్మరాజు అవుకు అనుగ్రామమునకు నధిపతియై, 'అవుకువా'రికిఁ బూర్వజుఁడయ్యెను. కొండరాజు ఆదవానికిఁ బతిగా నుండెను. మూఁడవవాఁడగు శ్రీరంగరాజు మన రామరాజునకుఁ దండ్రి. ఈతనిభార్యపేరు తిమ్మాంబ. ఈ దంపతులకు నైదుగురుపుత్రులు పుట్టిరి. కోనరాజు, తిమ్మరాజు, కృష్ణరాయల యల్లుఁడగు అళియ రామరాజు, వసుచరిత్ర కృతినందిన తిరుమలరాజు, వేంకటాద్రి. ప్రస్తుతకథానాయకుఁడగు రామరాజు శ్రీరంగరాజునకు మూఁడవకొమారుఁడు. ఈతని యన్నలగు కోనరాజు తిమ్మరాజులను గుఱించి మనకంతగా నేమియుఁ దెలియదు. రామరాజీకమీఁద దక్షిణాములోని నవాబులను దిద్దిమ్మని జంత్రపుబొమ్మలవలె నాడించిన మహానుభావుఁడు. అతనివలన విజయనగర వైభవలక్ష్మి మహోన్నతదశకెక్కి యతనితో నశించెను. ఇఁక ముందు ముందు మేము వ్రాయఁబోవు విజయనగరచరిత్ర యంతయు నాతనిదె. కావున నిచ్చట నెక్కడు వ్రాయనక్కఱలేదు. అతనిజన్మాదికములను గుఱించి వ్రాసినఁ జాలును. ఇతఁడు 1565 లో తొంబదియాఱేండ్లవాఁడని కీటోయను చరిత్రికారుఁడు వ్రాసియున్నాఁడు. ఈ మాటయే నిజమైన యెడల నితఁడు 1469 లో జన్మించియుండును. ఇతనికి నలు

గురు భార్యలున్నట్టు రామరాజీయమువలన( దెలియుచున్నది. కృష్ణ రాయల పుత్రికయగు తిరుమలాంబ, జిల్లేళ్ళ పెదనందిరాజు కూ(తురగు అప్పలాంబ, పోచిరాజు తిమ్మరాజు సుతలగు కొండలమ్మ లక్ష్మమ్మలు. రామరాజునకు వీరికో( దిరుమలాంబికవలన( గృష్ణు(డు, పెదతిమ్మరాజు అను కొమారులును, కొండమాంబవలన కొండరాజు, రాచూరుదుర్గాధ్య క్షు(డగు చినతిమ్మరాజు అనుపుత్రులును,లక్ష్మాంబవలన శ్రీరంగరాజును వడసెను. వీరందఱును తండ్రివలెనే రణశూరులయి తండ్రికి యుద్ధము లలో( దోడ్పడుచుండిరి.

## రామరాజుప్రభుత్వము

## (1541 - 1565)

ఇట్లు సదాశివరాయలను పేరునకు రాజునుజేసి రామరాజు ప్రభు త్వము చేయ(దొడ(గెను. శూరాగ్రేసరులగు తమ్ము(ను పుత్రులును జ్ఞాతులును తనకు( దోడైయుండ నిరువదియైదు సంవత్సరములవఱకును నేకాధ్వరముగ( బరాజయమన్నమాట యెఱు(గక ప్రజాపరిపాలనము జేసెను; ఆతడు పాలించిన ఇరువదిరెండేండ్లును తెఱపిలేక యుద్ధములు సాగుచునేవచ్చినవి. సదాశివరాయలకు పట్టాభిషేకమహోత్సవమును జరి పినవెంటనే యతడు కన్యాకుమారివఱకు వ్యాప్తమైన దక్షిణదేశముపై నొకదండయాత్ర నంపవలసివచ్చినది. ఇందుకు ముఖ్యమైనకారణములు రెండు. దాక్షిణాత్యసామంతులును అమరనాయకులును రామరాజుయొక్క అధికారమున కొప్పుకొనక తిరస్క(రించుట యొకటి - అప్పటి పోర్చు గీసు రాజప్రతినిధియైన మార్టిన్ అఫాన్సొడిసుబో అనువాని దుండగము మఱియొకటి. అతడు ప్రబలమైన నావికాదళమును సమకూర్చి తూర్పు సముద్రతీరప్రాంతములలోని ధనసంపన్నములయిన దేవతాయతనము లను దొపిడి కొట్టుటకు దగు పన్నాగములు సేయుచుండెను. ఇంతేకాక పోర్చుగీసు ఫాదిరీలు పాండ్యదేశ తీరప్రాంతమున నివసించుచుండిన 'పరవ'లను చేపలపట్టు జాతివారిని క్రైస్తవమతము నిప్పించుటయేకాక వారికి అధిపతి హింమూమతప్రవర్తకుడైన రాయలుగాడనియు క్రైస్తవు

డైన పోర్చుగీసు రాజేయనియు బోధింపుచు రాజద్రోహమును విస్తరింప జేయుచుండిరి. అనతులయిన సామంతాదుల నాజ్ఞాబద్ధులను గావించుటకు పోర్చుగీసుల యహంకారము నణగగొట్టుటకును తన పెదతండ్రియగు నాకు తిమ్మరాజుపుత్రులయిన చినతిమ్మ విఠలరాజులనిద్దరిని నియోగించి గొప్ప దండునిచ్చి దక్షిణదేశముపై దండుసేయనంపెను.

చినతిమ్మరాజును విఠలుడు దండు తరలించుకొనిపోయి మొట్ట మొదట చంద్రగిరి దుర్గమును ముట్టడించి స్వాధీనముజేసికొనిరి. అటు పిమ్మట తొండమండలమును జొచ్చి భువనగిరిని జయించిరి; తరువాత చోళమండలమందలి నాగూరిపై నడచి యచట శత్రువులను, పోర్చు గీసులను కావచ్చును. పరాభూతులనుగావించి వారికడనుండి హరించిన నవమౌక్తికములను దమ యాశ్రితులకు బంచిపెట్టిరి. తరువాత శ్రీరంగము నకుబోయి రంగధాముని సేవించి, శత్రుహస్తగతమైయుండిన యతని సంపదను వారియొద్దనుండి గ్రహించి మరల యాదేవునికి సమర్పించిరి. ఆవల దక్షిణముగ కూచిచేసిపోయి తన్నరసునాటి ప్రభువులను దండించి కప్పముగొనిరి. తరువాత పాండ్యమండలమును బ్రవేశించి యచట సనతులైయుండిన ప్రభువులకడ కప్పముగొనిరి. ఆకాలమున పాండ్య దళముయొక్క దక్షిణప్రాంతముల నేలుచుండిన బెట్టు పెరుమాళ్ళను నతడు బహుపరాక్రమవంతుడు, యుద్ధకార్యములందారితేరిన శూరుడు. ఆతడు విజృంభించి తెంకాశిప్రాంతమును పాలించుచుండిన పాండ్య రాజును దరిమివేసి యతనిరాజ్యము నాక్రమించుకొనియుండెను. పద చ్యుతుడైన పాండ్యుడువచ్చి చినతిమ్మ విఠలరాజుల నాశ్రయించెను. వారు బెట్టు పెరుమాళ్ళను యుద్ధమున పరాజితునిగావించి పాండ్యుని యతని కులక్రమాగతమైన రాజ్యమునందునిల్పిరి. తెంకాశిమొదలు కన్యా కుమారివఱకుగల రాష్ట్రము నాకాలమువారు తిరువడిదేశమని పిలుచు చుండిరి. ఈ రాష్ట్రము ఒక యేలుబడికిందనుండక తిరువడులను బిరుద నామముగ యేవురు చిన్న చిన్న సంస్థానాధిపతుల యాధిపత్యముకింద నుండెను. వీరిలో నెల్ల తిరువాంకూరు పాలకుడు ప్రసిద్ధుడు. ఆతడు తక్కిన తిరువడులను జయించి తనరాజ్యమును పెంపొందింపనెంచి

వారితో యుద్ధములు సల్పుచుండెను. వీరినందఱిని జయించి, వారిపై సదాశివరాయల యధికారమును స్థాపించుటకొఱకు చినతిమ్మ విఠలభూపతులు తిరుపతిదేశముపై దండువెడలిరి. పంచతిరువడులును, దళములను సమకూర్చుకొని యేకమై తిరువాళఘట్టకను మద్దరాయసైన్యమునెదిర్చిరి. కాని యుద్ధమున యౌత్తరాహుల ధాటికాగలేక విజితులై రాయలకు గప్పముగట్టనీయకొని సంధిచేసుకొనిరి. అంతట చినతిమ్మ విఠలాధిపులు తమ దక్షిణదిగ్విజయమును జయవంతముగ కొనసాగించి యనంతశయనకుబోయి పద్మనాభునిసేవించి విజయనగరమునకు మరలిరి. ఈ విజయవృత్తాంతము దెలియవచ్చినంతటనె రామరాజు మిక్కిలియు సంతసించి దక్షిణరాజ్యమును సమస్తమును పాలించుటకు విఠలరాజును రాజప్రతినిధిగా నియమించెను. విజాపురాదినవాబులందఱును గజగజవడఁకునట్లు ప్రతాపమును గనఁబఱిచెను. ఇతఁడీనవాబులలో నొక్కొక్కప్పుడొక్కొక్కని వశపఱుచుకొని యితరులను సాధించుచుండెను. ఆకథాభాగమును వర్ణించుటకుఁ బూర్వము చదువరుల సౌకర్యార్థమై యప్పటి తురుష్కనవాబుల వివరము తెల్పెదను.

విజయనగరరాజ్యమునకు నుత్తరమున నాలుగు తురకరాజ్యములుండెను. మొదటిది ఆదిల్‌శాహి యనఁబడు విజాపురరాజ్యము. దీనికి ఇబ్రాహిం ఆదిల్‌శాహ యనువాఁడు సుల్తానుగానుండెను. రెండవది నిజాంశాహి యను పేరుగల అహమ్మదనగర రాజ్యము. ఈ రాజ్యము యొక్క యప్పటియధిపతిపేరు బుర్‌హాన్ నిజాంశాహ. మూఁడవది కుతుబ్‌శాహి యనిపేరుగల గోలకొండరాజ్యము. జమ్‌షీద్ కుతుబ్‌శాహ దీని కధిపుఁడు. నాల్గవది బరీద్‌శాహి యనఁబడు బేదర్‌రాజ్యము. దీని నప్పుడు అలీబెరీద్ పాలించుచుండెను. ఫెరిస్తాచరిత్రమును బట్టి చూచినను మొదటి ముగ్గురు నవాబులను, రామరాజును నతని తమ్ములును ఓడించినట్లును తమచేతులలో నుంచు కొన్నట్లును గానవచ్చుచున్నది. బరీదుశాహనుగూడ రామరాజు తమ్ముఁడైన వేంకటాద్రి యోడించెనని వసుచరిత్రలోని యీక్రింది పద్యమువలనఁ గానవచ్చుచున్నది.

తే. అనుచుఁగడుమెచ్చి జయలక్ష్మి - యాజిరంగ
కాతరబరీదుకేతన - ఘటితభద్ర
కఖశమెదురుగఁ బూనియే — ఘనునిఁజెందె
నతఁడు సామాన్యఁడేవేంక - టాద్రివిభుఁడు.

రామరాజు రాజ్యమునకు వచ్చినతోడనే తమ్ములును తానును బోయి ఆదవాని దుర్గమును సాధించినట్లు వసుచరిత్రవలనఁ గానవచ్చు చున్నది (1542). ఇది మొదట వీరికిక్రిందనేయున్నను నడుమ తురకలు వశపఱుచుకొనిరి కాఁబోలును.

## ఆదిల్‌షాహాతోఁ వైరము

1543 లో బుర్‌హాన్ నిజాంషాహా రామరాజుతోను జమ్‌షీద్ కుతుబ్‌షాహాతోను స్నేహముచేసి యాదిల్‌షాహామీఁదికి యుద్ధమునకుఁ బోయెను. రామరాయలు తనతమ్ముఁడగు వేంకటాద్రిని విజాపురరాజ్యము మీఁదికిఁబంపి రాయచూరుదుర్గమును, కృష్ణాతుంగభద్రా నదులనడుమ నున్న యంతర్వేదిని సాధింపుమని యాజ్ఞాపించెను. కుతుబ్‌షాహాయును విజాపురము వానితోఁ బోరఁజొచ్చెను. ఇట్లు విజాపురరాజ్యమును ముగ్గురు రాజులు మూఁడుదిక్కులనుండి దోఁచుకొనసాగిరి. విజాపురనవాబంత భయపడి నిజాంషాహాతోను రామరాజుతోను సంధిచేసికొనెను.

1544 లో రామరాజు ప్రేరేపణవలన నిజాంషాహా మరల విజాపురముమీఁదికిఁబోయెను. కాని పరాభూతుఁడయ్యెను.

## పోర్చుగీసువారితోసంధి

1547 లో సదాశివరాయలకును పోర్చుగీసువారికిని సంధిజరిగెను. ఈ సంధివిషయిక మైన కాగితములో సదాశివరాయల పేరున్నను నిజముగా నిదియంతయు రామరాయలపనియె యనుటకు సందేహములేదు. ఈ సంధిలోని యంశము లిట్లుండెను. 1. ఈ యుభయులలో నొకరి

మిత్రులు మఱియొకరికి మిత్రులుగను, ఒకరిశత్రులు మఱియొకరి శత్రువులుగను నెంచవలయును. హిందూదేశములోని యేరాజుతో(బోరాడవలసివచ్చినప్పుడును ఒకరికొకరు సైన్యమంతయు(బంపి సహాయము చేయవలయును. 2. గోవాపట్టణమునకు వచ్చెడి యరబ్బి పారసీకదేశముల గుఱ్ఱములన్నియు విజయనగర రాజునకే యీయవలయును. బీజాపురమునకు ఒకటైనను బంప(గూడదు. విజాపురరాజు తగినవెల యీయవలయును. 3. విజాపురవర్తకులందఱును పోర్చుగీసువారిరేవులలో పోవునట్లును, విజాపురమువారిరేవులకు(బోకుండ(గను విజయనగరరాజు ఏర్పాటుచేయవలయును. 4. ఇనుము,సురాకారములు విజయనగరరాజ్యములోనివారు విజాపురరాజ్యములోనుండి తే(గూడదు. పోర్చుగీసువారియొద్దనే కొనవలయును. 5. బట్టలు, రాగి, పట్టు మొదలగునవియు పోర్చుగీసువారియొద్దనుండియే కొనవలయును. 6. ఇద్దఱునుగలిసి యాదిల్‌షాహతో(బోరాడి వచ్చినరాజ్యమంతయు విజయనగరరాజులు తీసికొనవలయును. సముద్రపుబొడ్డు రేవులు మాత్రము పోర్చుగీసువారికీయవలయును. విజయనగరరాజ్యములోని రేవులలోనికి( దురకలయోడలు వచ్చెనేని వానిని పట్టుకొని పోర్చుగీసువారికి నొప్పగింపవలయును.

## తురుష్కుల కాశ్రయమిచ్చుట

తురకరాజ్యములలోనుండి పాఱిపోయివచ్చిన యవనులకు నభయమును నాశ్రయమును నిచ్చి రామరాజు తన రాజధానిలో నుంచుచుండెను. అట్టివారి కొక వీధి కట్టించి దానికి 'తుర్‌కీమోహల్లా' అన(గా( 'దురకల వీధి'యని పేరుపెట్టెను. వారికి మసీదు కట్టించియిచ్చెను. జమ్‌షీద్ కుతుబ్‌షాహయొక్క తమ్ముఁడగు ఇబ్రాహిం అనువాఁడు అన్న తన్ను( జంపునేమోయని భయపడి పాఱివచ్చి విజయనగరములోనుండెను. రామరాజాతనికి నొకజాగీరిచ్చి గౌరవముతో( జూచుచుండెను. ఇత(డె తరువాత 1550 లో ఇ'బ్రాహింకుతుబ్‌షాహ' (మల్కిబరాం) అనుబిరుదుతో గోలకొండకు రాజయ్యెను.

## ఆదిల్‌శాహాతో మరల బోరుట

నిజాంశాహ రామరాజుకు గట్నములును గానుకలును బంపగా వాని నతడందుకొనెను. ఈ సమాచారము తెలిసి యాదిల్‌శాహా కోపోద్దీపితుడై తన సభలోనున్న విజయనగరపు రాయబారులను నగౌరవపఱచెను. అందుమీద రామరాజునకు మిక్కిలి కోపమువచ్చి యతడు నిజాముశాహాను విజాపుర సుల్తానయిన ఆదిల్‌శాహామీదికి ప్రేరేపించెను. వాడు రాయలసైన్యసహాయమునుబొంది కల్యాణదుర్గమును వశపఱచుకొనెను. అంత నాదిల్‌షాహా నిజాముషాహాయొక్క యొక దుర్గమును వశపఱచుకొనగా 1561 లో నిజాముశాహాయును రామరాజులుసుగలిసి రాయచూరుదుర్గమును ముట్టడించి సాధించుటయెగాక ముద్గల్లును కైవసముచేసి కృష్ణాతుంగభద్రలనడుమ నున్న యంతర్వేది యంతయు గెలిచిరి. ఇట్లుమరల నీయంతర్వేది హిందువుల స్వాధీనమాయెను. ఈతడవ రాయచూరుయుద్ధములో రామరాజునకు నాల్గవకుమారుడయిన చినతిమ్మరాజు మిక్కిలి పరాక్రమముజూపినట్లును, అతడు తరువాత నాదుర్గమునకు నధిపతిగా నేర్పఱుపఁబడినట్లును రామరాజీయములో నీ క్రింది పద్యములవలన గానవచ్చుచున్నది.

క. రాచూరి విభుడు తనదుక
రాచూరిని రిపుల దునుమ - రంజిలు శుభసం
సూచకములు దోడ్తోడను
రీచయమునకును బ్రమోద - వృద్ధి దలిర్పన్.

ఉ. నారదవింటె చిత్రమిది - నారకవాసులు గాక దేవతా
వారిజగంధులం గలిసి – వత్తురు నన్నొలువంగ ధేనుసం
హారులు మ్లేచ్ఛులన్న వి - మా సురవల్లభ యాజిభూమి రా
చూరి పురీశు తిమ్మవిభు - నుగ్రకరాసిని బ్రుగ్గఁగాఁజుమా.

## తమ్ములు తిరుగఁబడుట

ఈ కాలమందనఁగాఁ 1551 వసంవత్సర ప్రాంతమున రామరాజు రాజధానిలోలేనప్పు డతని తమ్ములగు తిరుమలరాయవేంకటాద్రులు తిరుగఁబడి యాదవానీదుర్గమును వశపఱుచుకొనిరనియు నంత రాము రాజు ఇబ్రాహింకుతుబ్‌శాహయొక్క సాహాయ్యమును దీసికొని యాఱు నెల లాదుర్గమును ముట్టడించి సాధించెననియుఁ, దమ్ములు శరణువేఁడఁగా వారిని రామరాజు క్షమించెననియు మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు.

## నిజాముతో వైరము; ఆదిల్‌శాహాతో స్నేహము

బుర్‌హాన్‌నిజాంశాహ 1553 లోఁ గాలధర్మమునొందెను. హుసేన్ నిజాంశాహ యనువాఁడు నవాబయ్యెను. కొంతకాలమువఱకు నహమ్మదు నగర విజాపురనవాబులు స్నేహితులుగా నుండిరి. కాని విజాపురనవాబు రామరాయలతో స్నేహముచేసి నిజాముమీఁదికి దండెత్తిపోయి షోలాపురమునొద్దఁ బరాభవముచెందెను.

విజాపురనవాబు రాజ్యములోని సరదారుఁడగు సైఫ్‌అయిన్ ఉల్‌ముల్క్ అనువాఁడు తిరుగఁబడి నవాబునోడించెను. అంత నవాబు రాజధానికిఁ బాఱిపోయి రామరాజుసాహాయ్యముఁగొని యేడులక్షల పర్దావులు బహూమతిగా నిచ్చెను. ఆ దుష్టునిశిక్షించి నవాబును గాపాడుటకు రామరాజు తనతమ్ముఁడైన వేంకటాద్రినిఁబంపెను. ఆతనిని మోసపుచ్చి యెకాయికి మీఁదఁబడవలెనని చోర్‌హియగు ఐన్‌ఉల్‌ముల్క్ యత్నించెను. కాని వేంకటాద్రి జాగరూకతలోనుండి యాతనినోడించి నైజాము రాజ్యములోనికిఁ దఱిమెను. అచ్చట నతఁడు చంపఁబడియెను (1555).

విజాపురనవాబుతో వైరమున్నందున పోర్చుగీసువారు అబ్దుల్లా యను రాజపుత్రునికి దొండాయపుచోట విజాపురరాజ్యమునకు నవాబుగాఁ బట్టాభిషిక్తునిఁజేసి యా రాజ్యములో నతనికై పన్నులు రాఁబట్టఁదొడఁ

గిరి. కాని యాదిల్‌శాహ విజయనగరపువారి సాహాయ్యమువడసి పోర్చు గీసువారితో( బోరాడి యబ్దుల్లాను స్వాధీనపఱుచుకొనెను (1555 - 1556).

1557 లో విజాపురనవాబగు ఇబ్రాహిం ఆదిల్‌శాహ మరణము నొందెను. అతని జ్యేష్ఠకుమారు(డగు అలీఆదిల్‌శాహ నవాబయ్యెను. ఈ నవాబు రాజ్యమునకురా(గానే తనతండ్రివలెనే రామరాజుతో మైత్రి చేసి తనతండ్రి కాలములో(బోయిన రాజ్యమును మరల సంపాదింప నిశ్చయించెను. రామరాయల కుమారు(డొక(డు మరణమునొంద(గా నీ యాదిల్‌శాహ యదియే స్నేహము దృఢపఱుచుకొనుటకు( దగిన సమయమని తల(చి రాయలదుఃఖో పశమనము( జేయుటకై నూఱుగుఱ్ఱ ములను మాత్రము వెంట(దీసికొని నిజయ నగరమునకు(బోయి దుఃఖో పశమన వాక్యములు పలికి నన్ను మీపుత్రునిగా( జూచుకొమ్మనియెను. రామరాజుభార్య ఆదిల్‌శాహను పుత్రభావమున( బెంచుకొనెను. అప్పటి నుండియు రామరాజును ఆదిల్‌శాహయును పితృపుత్రులవరుసతో నొక రినినొకరు పిలుచుకొనుచుండిరి. ఈ పుత్రు(డే తుదకు( దాళికోటలో( దండ్రిని మోసపుచ్చిచంపించెను. ఆ కథాభాగమటుండనిండు. రామరాయ లును నవాబును మిక్కిలి గౌరవించి మూ(డుదినములవఱకు విందులు వినోదములు సల్పిపంపెను. రామరాజు నవాబును బంపునపుడు పట్టణము వెలుపలవఱకును వెంట(బోనందున నవాబునకు( గోపమువచ్చెను. గాని యది వెలుపలికి( జూప(డయ్యె నని ఫెరిస్తా వ్రాసియున్నా(డు.

1558 లో రామరాజు ప్రస్తుతము చెన్నపట్టణమునొద్దనున్న మైలా పురిమీ(దికి దాడివెడలెను. అప్పుడారాజ్యమంతయు విజయనగరపురాజుల ప్రభుత్వములోనిది. అచ్చట( పోర్చుగీసువారు 'సెంట్‌థోం' అను రోమన్ క్యాతొలిక్ దేవాలయముకట్టి, నాగపట్టణము మొదలు మైలా పూరువఱకు( దమతమబోధను చేయుచుండిరి. అప్పటికింకను ఇంగ్లీషు వారు రాలేదు. అప్పుడు ప్రస్తుతపు చెన్నపట్టణము పుట్టనేలేదు. మైలా పురిలోనున్న క్రైస్తవగురువులయొద్ద మిక్కిలి ధనముకలదనియు, వారు హిందూదేవాలయములను బాడుచేయుచున్నారనియు బ్రాహ్మణులు చెప్పి

నందున రామరాజు మైలాపురిమీఁదికిఁ బోయెను. కాని యచ్చటికిఁ బోయిన తరువాత నచ్చటి పాద్రీలందఱును తనకులోఁబడి వినయవిధేయతతో నున్న రాజభక్తులని తెలిపినందున నాతఁడు వారిని బాధపెట్టకయె తిరిగి వెళ్ళెను. ఈ సమాచారము కౌటోయసు ఇతిహాసలేఖకుని గ్రంథమునుండి గైకొనఁబడినది.

విజాపురనవాబు విజయనగరముండి తిరిగి రాఁగానే, తన పూర్వులయొద్దనుండి తీసికొనిన 'కల్యాణీ' 'షోలాపుర్' పట్టణములు తనకిచ్చివేయవలసినదని, నిజాంషాహకు వర్తమాన మంపెను. ఆ వర్తమానము తీసికొనిపోయిన దూతను నిజాంషాహ యగౌరవించి చెప్పుటకు వీలులేనట్టి యశ్లీలపు ప్రత్యుత్తరమంపెను. అంత రామరాజును విజాపురి నవాబునుగలిసి అహమ్మదనగర రాజ్యముమీఁదికి దండెత్తిపోయి దేశము సంతయు ధ్వంసముచేసిరి. అహమ్మద్‌నగరము మొదలు దౌలతాబాదువఱకును, పొరండె మొదలు ఖిబర్వఱకును, నొక్క గ్రామమైననులేకుండఁ బాడుచేసిరి. ఈ యుద్ధములో హిందువులు తమకు ముసల్మానులయెడఁగల కోపమంతయుఁ దీర్చుకొనిరి. తురుష్కస్త్రీలను నగౌరవపఱిచిరి. మసీదులనుఁబడఁగొట్టిరి. కురాన్ ధర్మగ్రంథములను జించివేసిరి అని ఫెరిస్తా వ్రాసియున్నాఁడు. ఫెరిస్తా సమకాలికులగు ఇతర మహమ్మదీయ చరిత్రకారులెవ్వరును నీ యంశములను బేరొక్కనరు; కావున ఫెరిస్తా వాక్యములు వాస్తవమని విశ్వసించుట సమంజసముగాదు. ఇట్లు రామరాజును ఆచిల్‌ఖాహ యుఁ దనరాజ్యమును గాల్చివేయఁగా విధిలేక నిజాముశరణువొచ్చి సంధివేఁడెను. నిజాము స్వయముగా రామరాయల శిబిరమునకు వచ్చి కల్యాణమర్గమునొక్క తాళపుచెవి యిచ్చునట్లొడఁబడి, యదేప్రకారము చేసెను. ఇట్లు రామరాజు విజాపురనవాబుసైన్యములు తన్నుఁగొల్వ నిజాము నొద్దనుండి కల్యాణపట్టణమును బడసెను. ఈ చరిత్రాంశములు తెలిసికొని వసుచరిత్రలోని రామరాజు గుఱించిన యీ క్రింది పద్యమును చదువరులు చూతురేని యిందు స్వభావోక్తితప్ప మఱేమియులేదని తెలిసికొనఁగలరు.

శా. విశ్వామిత్రుని గొల్చి రాము డతడు-ర్వీం జెందెడు గల్యా
ణమున్

విశ్వామిత్రులు గొల్వ రాము డితడు-ర్వీం జెందెడు గల్యా
ణమున్

శశ్వత్కీర్తులు రాము లయ్వీరువురున్ - సాధించుకల్యాణలా
భైశ్వర్యంబులు ధర్మనిర్మథనధ - ర్మాలంబనవ్యక్తముల్.

ఇట్లు కల్యాణదుర్గమును తనదత్తపుత్రిడైన యాదిల్‌శాహ కొఱకు సాధించి రామరాజు విజయనగరమునకు వెడలెను. కాని నిజాము డు కల్యాణ దుర్గమును వదలలేక వెంటనే ఇబ్రాహింకుతుబ్‌శాహతో సంధిచేసికొనెను. ఇద్దఱునుబయలుదేఱి కల్యాణదుర్గము మీదికి బోయిరి. కాని రామరాజును ఆదిల్‌శాహయు దమసైన్యములతోబోయి వారిని నెదిరించిరి. ఈ తడవ రామరాజువెంట నేబదివేలగుఱములును, నసంఖ్య కాల్బలమునుగలదు. దీనిని జూచి భయపడి ఇబ్రాహీం (ఇభరాం) కుతుబ్‌శాహ తనస్నేహితుడగు నిజామునువిడిచి రామరాజుతో జేరెను. ఇట్లు వీరుముగ్గురునుజేరి తఱుమగా బాఱిపోయి నిజాము తన రాజధానిజేరెను. ఈ కథాభాగమును మనస్సులో నుంచుకొనియె రామ రాజభూషణుడు రామరాజును వర్ణించుచు నిజామునుగూర్చి యిట్లు వ్రాసినాడు.

సీ. ప్రబలావలేపవి - గ్రహజాయమానాగ్ని
హము డించి బహుధావ - నాప్తిగాంచు ।

* * * *

రతినిభరామాను - గతమైత్రిపై రోసి
కలనైన గల్యాణ - కాంక్షియిడడు ।

* * * *

మానక నిజాము డపవర్గ - మార్గవృత్తి
బెరయు పరబుద్ధి నెవ్వాని - పేరుతలచి ।

యత(డు శ్రీరాము( డఖిలస - న్నుతికి( దగ(డె
సేతుకాశీతలాంతర - ఖ్యాతయఁ(డు ॥

శ్లేషసాధించి చరిత్రాంశములింత చక్క(గా( జెప్పుట దుర్లభము కదా!

నిజాము తనరాజధానియగు అమహమ్మద్‌నగరములో డా(గెను. ముగురురాజులును ఆ నగరమునకు ముట్టడివేసిరి. లోనికి రస్తుసామ్రగులు పోనీందున లోనివారికి నిబ్బందికలుగ(జొచ్చెను. కాని గోలకొండసవాబు కొంతవఱకు లోపాయికారిగా నిజామునకు ధాన్యముపంపిన(దున వర్షాకాలమువఱకు లోనివారు వశులుగాకపోయిరి. అంతముట్టడివారులేచి తమ తమ తావులకు( జనిరి. ఈ తడవయు రామరాజు సైనికులు తురుష్కులకు( గోపమువచ్చినట్లుగా( బ్రవర్తించిరి. మసీదు లనేకములు పడ(గొట్టి దేవాలయములు చేసిరి. అందువలన మిక్కిలి శత్రువైన నిజాముకేగాక మిత్రులైన విజాపురమువారికిని హిందువులయెడ ద్వేషముకలిగెను.

నిజాముతోజరిగిన యుద్ధములలో రామరాయలవెంట నాతనికొమారులగు పెదతిమ్మరాజు కొండరాజులనువా రుండి పరాక్రమము(జూపినట్లు రామరాజీయములోని ఈ క్రింది పద్యములవలన మనమూహింపవచ్చును.

ఉ. ధ్యేయు(డు రామరాజ పెద-తిమ్మవిభుం డని వాజి(దోలి లో(
బాయని భీతిచేత మొన - భగ్నముగా యవనుల్ దొలంగ నా
చాయ నిజాము( డడ్డపడ-సామజయూథము( ద్రుంచె( జూప
ఱుల్
వాయజు(డంచు నెంచ(గ న-వార్యసముజ్జ్వలబాహుశౌర్యు(డై.

క. పెదతిమ్మనృపతి మఱియును
మదకరిహరివీరభటస - మాజముతోడం
గదసమున( గదియు తురకల
సదమదముగ( దునిమెబాహు - సంరంభమునన్.

ఉ. మావులు నేను(గుల్ భటస-మాజము పీను(గుపెంట గా(గ గం
గావలినుండి కృష్ణదను - కానొసరించి నిజాము( దోలిరా

మావనినాథుకొండవిభుఁ-డాహవకేళిఁ జరించెఁ జూచి యా
దేవత లెల్ల నీఘనుఁడు - దేవవరాత్మజుఁ డంచు నెంపఁగన్.

తురుష్కరాజుల నగౌరవించుట.

ఇట్లెటుచూచినను తనకు దిగ్విజయములే కలుగు చున్నందునను తురకరాజులు తన సాహాయ్యమునే యెప్పుడును కోరుచున్నందునను రామరాజునకు గర్వముహెచ్చి తురుష్కరాజు లన నొక లెక్కయా యని యనుకొనఁజొచ్చెను. క్రమముగా అహమ్మదనగర విజాపుర రాజ్యములలోనుండి కొంతదేశమును తీసికొనెను. గోలకొండ రాజ్యము లోని గనుపూరు, పానగల్లు లనుదుర్గములను స్వాధీనపఱుచుకొనెను. క్రమముగాఁ దురుష్కరాజ్యములన్నిటిని క్రమింగివేయ నిశ్చయించెను. ఇంతియకాదు.ఆ నవాబులయొద్దనుండి వచ్చెడి రాయబారులను పూర్వము వలె మన్నించుటమాని తనయెదుట వారు నిలిచియుండునట్లును తనతోఁ బ్రయాణము చేయునపుడు తనయాజ్ఞలేనిది గుఱ్ఱమెక్కఁగూడదనియు నాజ్ఞాపించెను. తమ రాయబారుల నగౌరవించుటయు దమరాజ్యమును నాక్రమించుకొనుటయుఁ జూచి తురుష్క నవాబులు మేల్కొంచి తమ ప్రక్కనున్న యీ హిందూరాజ్యమను శల్యమును :పెఱికివేయ నిశ్చయించిరి.

నవాబులందఱును నేకమగుట

మొదట నాదిల్‌శాహా రామరాజుతోఁ బోరనెంచెను.కాని యందఱు తురుష్కరాజు లేకమైనఁగాని విజయనగరరాజును సాధించుట దుర్లభమని యెంచి యాతఁడు గోలకొండ నవాబునకు వర్తమాన మంపెను. అతఁడందులకు సమ్మతించుటయేగాక నిజామునకును ఆదిల్‌శాహాకును తరతరములనుండిగల వైరమునూన్పి వారికి మైత్రికల్పించెను. వారి స్నేహము దృఢముగా నుండుటకై నిజాము తనకూఁతురైన చాంద్‌బీబీని అలిఆదిల్‌శాహాకిచ్చి వివాహముచేసెను. ఆమెకు షోలాపురదుర్గ మరణ

ముగానిచ్చెను. ఆదిల్‌శాహయొక్క చెల్లెలిని నిజాము పెద్దకుమారుడైన మర్తుజాయనువాడు వివాహమాడెను. ఇట్లు బంధువులై అహమ్మదనగర విజాపుర నవాబులు గోలకొండ నవాబుతో జేరి యుద్ధసన్నాహము చేయదొడగిరి. బిదర్‌నవాబయిన బరీద్‌శాహగూడ వీరిలోజేరెను.

ఆదిల్‌శాహ యిట్లు రామరాజు వినాశమునకై యత్నముచేసి పైకి మాత్రము "నేను మీ కుమారుడను. తండ్రికి ద్రోహముచేయుదునా? నేను మీదికి వారిలో గలిసియుండెదను. యుద్ధసమయమున వారికి ద్రోహముచేసి మీలోగలిసెదను"అని రామరాజు వర్తమానమంపినప్పుడు ప్రత్యుత్తరమంపుచుండెను! ఈ యంశము ఫెరిస్తా వ్రాయలేదు. ఒక మరాటీబఖరులో నున్నది.

పైని వర్ణించినట్లు నలుగురు నవాబులు సైన్యసమేతులై యుద్ధమునకు గాల్గివ్వుచు విజాపురమునొద్ద మైదానములో విడిసిరి. యుద్ధమునకు గారణము వలయును గాన నాదిల్‌శాహ "నారాజ్యములోనుండి మీరుతీసికొన్న దుర్గముల నిండు" అని రామరాజునకు వార్తబంపెను. రామరా జావార్తదెచ్చిన దూతను నగౌరవించి పంపివేసెను. అంత నా నలుగురు నవాబులును తమసైన్యములతో దక్షిణదిక్కునకు బయలుదేరిరి (25 వ డిసెంబరు 1564). ఈ సముద్రమువంటి సైన్యసమూహము, గుట్టముల కేనుంగులకును మేతదొరకునట్టి దక్షిణదేశపుమైదానములు దాటుచు దాళికోటదుర్గమును సమీపించెను. తాళికోట ద్రోణనది యొడ్డున నున్నది. ద్రోణనది కృష్ణలోగలిసిన చోటికి బదునాఱు మైళ్ళమీదను ప్రస్తుతము చెన్నపట్టణమునుండి బొంబాయికిబోవు నినుప దారికి గృష్ణానది యెచ్చట నడ్డమువచ్చునో యచ్చోటినుండి పశ్చిమమున నరువదియైదు మైళ్ళమీదను నీ తాళికోటదుర్గము కలదు.

అచ్చోట నీ మహమ్మదీయసైన్యములు కొన్నిదినములు నివసించి యది యాదిల్‌శాహరాజ్య మగుటజేసి యాతని యాదరాధిక్యమును బొందుచు యుద్ధమునకుదగిన వ్యూహములను గుదుర్చుకొనుచుండెను. కృష్ణానది దాటుట కెచ్చట వీలయినదేవు కలదో చూచివచ్చుటకు వేగుల వారిని బంపిరి.

## హిందూసైన్యముల రాక

అటు రామరాయల కీవర్తమాన మంతయు, దెలిసినందున నతడును యుద్ధమునకు, దగిన ప్రయత్నము చేసియుంచెను. రాజ్యము లోని యన్నిభాగముల నుండియు సైన్యముల రావించి యాఱులక్షలకాల్బ లమును లక్షగుఱ్ఱములును చేర్చెను. తనచిన్న తమ్ముడగు తిరుమల రాయనికి లక్షకాల్బలము నిరువదివేల గుఱ్ఱములు నైదువందల యేనుంగు లును నిచ్చి ముందుబంపి శత్రువులు కృష్ణానదిని దాటకుండ నన్నిచోవు లను గాపాడుమని యాజ్ఞాపించెను. తిరుమలరాజు వెనువెంట రామరాజు తనయింకొక తమ్ముండగు వేంకటాద్రిని గొప్ప సైన్యముతో బంపెను. తుదకు రామరాజును మిగిలిన సైన్యముతో యుద్ధభూమికి వెడలెను. అప్పుడా రామరాజు తొంబదియాఱు సంవత్సరముల వాడని చరిత్ర కారులు వ్రాసియున్నారు.

## తాళికోట మహాయుద్ధము.

(1565)

వేగులవాండ్రు వచ్చి కృష్ణానది పొడుగున నున్న రేవులన్నియు హిందువులచే రక్షింపబడుచున్నవనియు, నప్పుడు నవాబు సైన్యము లున్నస్థలమునకు నెదుటనుండు రేవుననే పోపుట మంచిదనియు నవాబు లతో జెప్పిరి. వారట్లు చేయనిశ్చయించిరి. కాని యా రేవునకు నెదుటను హిందువుల సైన్యములు ఫిరంగులతో గాచియుండెను. కావున వారిని మోసపుచ్చుటకై నవాబు సైన్యము లచ్చటనుండి కదలి కొంతదూరము వటకు బోయెను. తురుష్క సైన్యములు నదికి నావల నెల్లెటునడిచెనో హిందూసైన్యములు నదికి నీవల నట్లెల్లెనడిచి వారెచ్చట నేఱుదిగ యత్నించిన నచ్చట నెదిరించుటకు సిద్ధముగానుండెను. కాని నవాబు సేనలు మరల వచ్చి శిబిరముచేరెను. ఇట్లు రెండుమూడు దినములు శిబిరమును విడిచి నది పొడువువ బోయినట్లు నటించి యా దేవునొద్ద నున్న హిందూసైన్యము లింకొక చోటకు బోవునట్లునేసి మూడవదిన

మెకాయెకి వెనుకకుఁ బోయి యా రేవుననే తురుష్క సైన్యములునదిని దాఁటెను.

ఇట్లు వారుదాఁటిన మఱునాఁడు అనఁగాక్రీ.శ. 1565వ సంవత్సర మందు జనవరి నెల 23వ తేది మంగళవారమునాఁ డుభయ సైన్యముల కును ఘోరమైన యుద్ధముజరిగెను. దానికి తాళికోట యుద్ధమనిపేరు. తాళికోటఁ గృష్ణానదికి ఉత్తరమున నున్నది. ఈయుద్ధమానదికి దక్షిణ మున జరిగెను. అయినను తొలిదినమువఱకు నవాబు సైన్యములు తాళికోట సమీపమున నుండి నందునిఁ దురుష్కచరిత్రకారు లీ యుద్ధమునకు తాళి కోట యుద్ధమని పేరుపెట్టిరి. ఈ యుద్ధము రాక్షసనేర్ అనుచోట జరిగె నని మరాటి బఖరీలో వ్రాయఁబడి యున్నది.

మహమ్మదీయుల సైన్యము దక్షిణపుపైపు ముఖముచేసి నిలువఁ బడెను. హిందువు లుత్తరపుపైపుముఖముచేసి యుండిరి. తురక సైన్య ముకోఁ గుడిపైపున అలీ ఆదిల్ షాహయును, నడుమ హుసేన్ నిజాంషా హయును, ఎడమపైపు అలీ బరీద్ షాహయు, ఇబ్రాహిం కుతుబ్ షాహ యును తమతమ సైన్యములతో యుద్ధసన్నద్ధులై యుండిరి. వీరికి నెదుట హిందూసైన్యములకోఁ గుడిపైపున ననఁగా మహమ్మదీయ సైన్యములో నెడమ పైపుననున్న బిదర్ గోలకొండల నవాబులకు నెదురుగా వేంక టాద్రియు, నడుమ రామరాజును ఎడమపైపున ననంగాఁ దురుష్క సైన్యములోఁ గుడిపైపుననున్న విజాపురనవాబునకునెదురుగాఁ దిరుమల రాయఁడును తమతమ సేనలతోఁ గయ్యమునకు సంసిద్ధులై యుండిరి. తురకసైన్యమునకు వెనుకపైపు ఉత్తరదిక్కునియు హిందువులకు వెనుక పైపు దక్షిణ దిక్కునియు ఆదిల్ షాహ తిరుమలరాయలెదురెదురుగానున్న పైపు పశ్చిమ మనియు, కుతుబ్ షాహ బరీద్ షాహలను వేంకటాద్రి యెది రించినపైపు తూర్పనియు చదువరులు దిశలుజ్ఞప్తినుంచుకొనియెదరు గాత. తురుష్క సైన్యముయొక్క మధ్యభాగమందు ఫిరంగులుండెను. మధ్యనున్న నిజాంషాహకు నెదుట మూఁడు వరుసలుగా నాఱువందల ఫిరంగులును జజాయిలును అమర్పఁబడెను. ముందు వరుసలోఁ బెద్ద ఫిరంగులుండెను, రెండవ వరుసలోఁ జిన్న ఫిరంగులుండెను; వాని

వెనుక జిజాయి అనఁబడు పెద్దతుపాకు లుండెను. ఫిరంగు లిట్లమర్చిన సంగతి శత్రువులకుఁ దెలియకుండ వాని యెదుట రెండువేల పరదేశీయులగు విలుకాండ్రను నిలువఁ బెట్టిరి.

విలుకాండ్రు మొదట యుద్ధము ప్రారంభించిరి. హిందూసైన్యము యొక్క మధ్యభాగముమీఁద నీ విలుకాఁడ్రు శరవృష్టి కురిపించిరి. అంత హిందువులు వారితోఁ బోరను వారిని సమీపింపఁగా నావిలుకాండ్రు తొలఁగిరి. శతఘ్నులు హిందువులపై నగ్నివర్షమును గురిపింపసాగెను. అంత హిందువులాఁగలేక యెక్కువ జనమును గోలుపోయి వెనుకకుఁ బోయిరి. కాని కుడియెడమ వైపులనున్న హిందూసైనికులు మిక్కిలి పరాక్రమముఁజూపి ముసల్మానులను వెనుకకు ద్రొబ్బిరి. ఇట్లుభయపార్శ్వములను హిందువులే విజయులైనందున మధ్యభాగమును కొంచెము శ్రమపడి సాధించిన జయలక్ష్మిమనదేయని యెంఁ హిందువు లపూర్వ శౌర్యముతోఁ బోరసాగిరి. తనసైనికులకుఁ బ్రోత్సాహము కలుగుటకై రామరాజు మేనాలోనుండి దిగి యొత్తుగ రత్నమయమైన యొకగద్దియపై గూర్చుండెను. ఈ సింహాసనము మీఁద బంగారపు జరీతోను ముత్యపు జాలరులతోను నలంకరింపఁబడి కెంపువన్నె మకమలుబట్టతోఁ జేయఁబడిన ఛత్రముండెను. అప్పటికిఁ బళ్లెరములతో రత్నములు వజ్రములు ముత్యములు వరహాలు రూపాయలు మొదలయిన ధనమెంతయో తెప్పించి తన చుట్టును పళ్ళెరములలోఁ బెట్టుకొని యుద్ధముకోఁ బౌరుషము కనఁబఱిచిన శూరులకు వారివారి శౌర్యముయొక్క యోగ్యతను బట్టి బహుమతులొసంగెను. హిందువులు తురుష్కుల మధ్యభాగములోని ఫిరంగుల మీఁదికిఁ బోయిరి. కాని వారు సమీపింపఁగనే ఫిరంగులలో రాగి డబ్బులువేసి తురుష్కులు కొట్టిరి. అంత నైదువేల హిందువులు ఫిరంగుల యెదుటఁబడి మరణమొందిరి. మిగిలినవారు చిందరవందరైరి. ఇంతలో నిజాము సైన్యములోనుండి యైదువేల గుఱ్ఱపురౌతులు హిందూసైన్యములోనికిఁ జొరఁబడిరి.

ఇట్లు భయపార్శ్వముల హిందూసైనికులు విజయులగుటయు నడిమి వారుమాత్రము ఫిరంగుల నెదిరింపలేక మరలుచుండుటయుఁజూచి

రామరాజుతాను స్వయముగా వెళ్లి సైనికుల బ్రోత్సాహపఱుప వలయు నని మేనాయెక్కి బయలుదేఱెను. కాని యతని దురదృష్టదేవత యెదురు పడెనో యననొక యేనుగు బెదరివచ్చి రామరాజెక్కిన మేనామీద బడెను. బోయీలు భయముచే మేనాను విడిచివేసిరి. క్రిందబడిన రామరాజు లేచి గుఱ్ఱమెక్కబోవగా నిజాముషాహా సైనికులువచ్చి యాతనిజేజి పట్టి నిజాముషాహా యొద్దకు గొంపోయిరి. ఆతడురామరాజు మస్తకము వెంటనే తునిమి దానిని బల్లెమునకు దగిలించి యెత్తి హిందూసైన్యము నకు జూపెను. రామరాజు పడినతోడనే హిందువులు గతధైర్యులై యెచ్చటివారచ్చట బాఱిపోసాగిరి. తురుష్కులు వెంటదగిలి హిందువు లను వారిమనసు వచ్చినట్లు సంహరించిరి. నటకబడిన హిందువుల సంఖ్య లక్షకుదక్కవ యుండదు. ఇంతటితో ఆంధ్రులవైభవమంతయు నంతరించెను. వారెన్నడును మరల గొప్పరాజ్యము సంపాదింపలేదు. అది యట్లుండెను.

మీదివర్ణనమంతయు పెరిస్తాగ్రంథములో నుండి గ్రహింపబడి నది. ఆదిల్‌షాహా తుదవటకు రామరాజునకు మీలోవచ్చి కలిసెదనని చెప్పుచు యుద్ధములో నాలాగుననె వచ్చుచున్నానని తెలిపి మోసముచేసి వచ్చి రామరాజును అనగా దాను తండ్రియని పిలిచిన వానిని జంపె ననియు, నందుమీద హిందువులకు బరాజయము కలిగెననియు నొక మరాటీ బఖరులో వ్రాయబడియున్నది. ఇందేదినిజమో మనము నేడెట్లు చెప్పగలము?

## విజయనగర వినాశము.

ఇట్లోడిపోయిన హిందువులు మరల గుమిగూడి తురుష్కుల నెది రింప యత్నించినవారైనయుగారు. వెంటనే విజయనగరమునకుబోయి తమకుటుంబమును ధనధాన్యములను వీలయినంతవఱకు దీసికొని పాఱిపోయిరి. రామరాజు తమ్ములలో వేంకటాద్రి యుద్ధమునందుబడెను. తిరుమలరాజు మాత్రము బ్రతికి వెంటనే రాజధానికి వచ్చి పేరునకు రాజుగానున్న సదాశివరాయలను రాజభవనములోని సంపత్తిని దీసికొని

పెనుగొండకుఁ బాఱిపోయెను. ఇతఁడైదు వందల యేఁబది యేనుఁగుల మీఁదఁగట్టి బంగారు రత్నములు మాణిక్యములు మొదలైన యపార సంపత్తినిఁ దీసికొనిపోయెనఁట. ఇట్లురాజును సైనికులును లేని యా పట్టణము నిరాధారమై యుండెను. అదివఱకు భయమన్నమాట యెఱుఁగని యచ్చటి జనులు దిక్కుమాలిన వారైరి. పాఱిపోయెదమనినను ధన ధాన్యములు తీసికొని పోయెదమనినను వాహనములులేవు. ఎడ్లు గుఱ్ఱములు మొదలైనవి యుద్ధమునకుఁ బోయియచ్చటనే మడిసెను. అందుచే జనులు చేయునదిలేక ధనాదుల విడిచి పాఱిపోయిరి. బలాఢ్యులకును సాధ్యముకాని విజయనగరము దొంగలపాలయ్యెను. యుద్ధము జరిగిన రెండవదినము చుట్టు పట్టుననున్న లంబాడి యానాది మొదలగువారు పట్టణమును ఆఱుసారులు దోఁచుకొనిరి. మూఁడవ దినమునకుఁ దురుష్కసైన్యములన్నియు వచ్చిచేరెను. ఆఱునెలలవఱకు నీసైన్యము లాపట్టణమందుఁజేసిన ఘోరకృత్యము లింతంతయని వర్ణించుటకు వీలు కాదు. నిరపరాధులగు నసంఖ్యజనులను సంహరించిరి. రాజప్రాసాదము లను భవ్యదేవాలయములను సుందరమందిరములను గాల్చి కూల్చి పడఁ గొట్టి ధ్వంసముచేసిరి. సులభముగాఁ బట్టణమంతయు శ్మశానముగా మార్చి తురుష్కులు వెడలిపోయిరి. ఒక్కొక్క సైనికుఁ డపరిమితమైన ధనమును దోఁచుకొనిపోయెను. బీదసైనికుఁడు గూడ లక్షాధీశుఁడయ్యెనని ముసల్మానులె వ్రాసియున్నారు.

## ఆరవీటివంశము

## (1570 - 1648)

తాళికోటయుద్ధముతో విజయనగరరాజ్య భాస్కరుడస్తమించెనని చరిత్రకారు లనేకు లభిప్రాయమును వెలిబుచ్చియున్నారు. ఈ యభి ప్రాయమే మన విద్యావంతులలోను ప్రబలియున్నది. కాని ఇది సత్యము గాదు; తాళికోట యుద్ధమైన తరువాత విజయనగరసామ్రాజ్యము దాదాపు నూరేండ్లకాలము వర్ధిల్లినది. అడుగడుగున కునుతుఫాను కెరటములవలె పొంగివచ్చుచుండు మహమ్మదీయ వాహినుల నడ్డగించి ఆరవీటి వంశ

జులు నరపాలుకు హిందూస్వాతంత్ర్యమును సంరక్షించుచు విజయవంత ముగ ప్రజాపాలనము సాగించిరి. వీరొనర్చిన సేవ విస్మరింపరానిది.

ఆరవీటివంశజులలో సామ్రాజ్యపీఠము నధిష్ఠించినవారిలో ప్రథముడు ఆళియరామరాజు తమ్ముడైన తిరుమలరాజు. ఇతనికి ఎఱితిమ్మరాజని నామాంతరముగలదు. తాళికోట పరాజయానంతరమితడు విజయనగరమునకు పారుతెంచివచ్చి యచ్చటి రాజభండారమున సేకరింపబడియుండిన ధనరాసులను, రత్నసంచయములను, వస్త్రభూషణాదులను గొని దూరమునందుండిన పెనుగొండదుర్గమునకుబోయి చేరెను. తిరుమలరాజు రణభీరుడుగాడు; పెక్కురణరంగములలో నారితేరినశూరుడు. అట్టి పరాక్రమశాలి రాజధానియైన విజయనగర సంరక్షణకార్యమునకు బూనుకొనక శత్రువులబారికి విరిచి పెనుగొండను చేఱుటకెవ్వియో ప్రబలకారణములుండి యుండవలయును. ఇంతవఱకు దెలియవచ్చిన చరిత్రాంశములనన్నిటిని సమీక్షించిచూడగా రెండుకారణములు గానవచ్చుచున్నవి. ముఖ్యమైనది కుటుంబకలహము: రాయలకు ప్రాపై సామ్రాజ్యమును పాలింపవలసిన వారెవ్వరు? అను సమస్య రాజకుటుంబమున యాందోళనకలిగించినది. ఆళియరామరాజు పుత్రులలో గతించినవారుపోగా మిగిలినవారిలో జ్యేష్ఠుడైన పెదతిమ్మరాజు తండ్రియధికారము దనకురావలెనని కోరెను. అందుకు తిరుమలరాజొప్పుకొనక పూర్వము తన యన్నగారికి దక్షిణప్రాయుడై సామ్రాజ్యకార్యములను నిర్వహించుచుండిన వారగుటచేత యన్నగారిస్థానమున దానె సర్వాధికారియై రాయలను రాష్ట్రమును దనచేతిక్రింద పట్టుబెట్టెను. పెదతిమ్మరాజునకు స్వయముగ దనకోర్కె నీడేర్చుకొనదగిన శక్తిలేదు. కావున నతడు విజాపురసుల్తానగు ఆలీఆదిల్‌షాహా నాశ్రయించెను. ఆ తురుష్కప్రభువు విజయనగరసామ్రాజ్యమును గబళింపవలయునని యుద్దేశము గలవాడగుటచేత పెదతిమ్మరాజునకు సాయముచేయు నెపమున విజయనగరము పైనెత్తివచ్చెను. ఒకవేళ పెదతిమ్మరాజును ఏకాకియై యెదుర్కొని గెలువజాలనను విజాపురసుల్తానుతో నేకీభవించి వచ్చిన నాతనితో పోరాడిజయించుట సాధ్యముగాదనియెంచి విజయ

నగరమును విడనాడి పెనుగొండకుపోయి యుండవచ్చును. కాని యపట
గూడ నతనికి శాంతముగ సామ్రాజ్యకార్యములను జక్కఁబెట్టుటకు వీలు
కలుగదాయె. అచటినుండి యతనిని వెడలగొట్టి యాప్రాంత దేశమునంత
టిని ఆక్రమించుకొను నుద్దేశముతో అల్లీఆదిల్‌శాహా పెనుగొండుపై
రెండుమూడుపర్యాయము లెత్తిపోయి ముట్టడివేసెను. కాని యా దుర్గా
ధ్యక్షుడైన సవరము చెన్నప్పనాయకు డతనికి శృంగభంగము గావించి
పారదోలెను. మహమ్మదీయుల దండయాత్రలతోపాటు అమరనాయకుల
హడావుడి దేశమున చాల సంక్షోభముగలిగించినది. రాక్షసతంగడి యుద్ధ
ఫలితముగ విజయనగరమున కేంద్రప్రభుత్వముగడు హీనసత్వమైపోవుట
వలన సామ్రాజ్యమునం దరాజకము ప్రబలి యమరనాయకుల యభి
వృద్ధికి సహకారియాయెను. ప్రతి సామంతుడును నాయకుడును నిష్ప
యముగ దన పరిసరప్రాంత రాష్ట్రము నాక్రమించుకొని స్వతంత్రరాజ్య
నిర్మాణమునకు శంఖుస్థాపనమొనరించెను. ఈ కారణమున నాయకులలో
నంతర్యుద్ధము పొసగి దేశమునందు గళవళమును ప్రోదిచేసెను.వీరి
నణగద్రొక్కి వశవర్తులను గావించుకొనుట తిరుమలరాజునకు ముఖ్య
కర్తవ్యమాయెను. ఈ కార్యమును పరిపూర్తియగుటకు ఆరేండ్లకాలము
పట్టినది. హిందూధర్మమునకును దాక్షిణాత్య హిందూప్రజలకును తిరు
మలరాజుచేసిన సేవ యమోఘమైనది. రాక్షసితంగడి యుద్ధకారణమున
సంధులుప్రీతి పతనోన్ముఖమైన విజయనగరసామ్రాజ్యమును పునరుజ్జీవి
తను గావించి దాదాపు మఱియొక శతాబ్దికాలము యవనవార్ధినిబడి మును
గనీయక నిలబెట్టిన మహనీయుడు తిరుమలరాజు మనకు చిరస్మరణీ
యుడుగదా ! ఆతడొనర్చిన ఘనకార్యమును ప్రశంసించుచు సమకాలిక
ప్రబంధచక్రవర్తి రామరాజ భూషణమహాకవి "ఏకచ్ఛత్రాధిపత్య
స్సృష్టి" గావించెనని చెప్పిన వాక్యమెంతయు నిక్కువము. కర్ణాటక
సామ్రాజ్యమంతయు దనచేతిక్రిందికి వచ్చినపిమ్మట సదాశివదేవమహా
రాయలింకను సజీవుడైయుండినను క్రీ. శ. 1570 సం॥ నా రాజ్యాభిషే
కము జేసికొనెను. ఈ కారణమువలన ఆరవీటివంశజులు ఆఖరి విజయనగర
చక్రవర్తులలో నితడు ప్రథముడని చరిత్రకారులు చెప్పుచున్నారు.



V. R. NARLA MEMORIAL LIBRARY
V. R. I.
Acc. No.

పట్టాభిషేకకాలమునాటికి తిరుమలరాజు కడువృద్ధుఁడు; కావున నతని ప్రభుత్వము స్వల్పకాలముమాత్రమే సాగినది. పట్టాభిషేకము జేసికొనిన పదునొకండుమాసముల కతడస్తంగతుడైనట్లు తోచుచున్నది. ఈ పదునొకండుమాసములలో సామ్రాజ్యపాలనమున నొకగొప్ప మార్పును ప్రవేశపెట్టెను. దేశములో వాడుకయందుండిన ఆంధ్రకర్ణాట ద్రావిడభాషల ననుసరించి సామ్రాజ్యమును మూడుభాగములుగా విభజించి యందు తెలుగుదేశమును పెనుగొండరాజధానిగ పెద్దకుమారుడైన శ్రీరంగరాయలును గర్ణాటమును శ్రీరంగపట్టణము రాజధానిగ రెండవ కుమారుడైన రామరాయలును ద్రావిడదేశము సమస్తమును చంద్రగిరి రాజధానిగ మూడవకుమారుడైన వేంకటపతిరాయలును యేలునట్లేర్పాటు గావించెను. ఈ విభజన తాత్కాలికముగ యుక్తముగ గన్పట్టినను కేంద్ర ప్రభుత్వ బలక్షయమునకు దారిచూపి తుదకు సామ్రాజ్యవిచ్ఛిత్తికి కారణ భూతమాయెను.

## మొదటిశ్రీరంగరాయలు

## (1572 - 1585-86)

తిరుమలరాయల యనంతరమతని ప్రథమపుత్రుడు శ్రీరంగరాయ లధిపతియాయెను. సామ్రాజ్యము కంతటికిని నితడు నామకార్థ మధిపతి యైనను వాస్తవముగ నితని యేలుబడిక్రిందనుండినది తెలుగుదేశమొక్క టియే. ద్రావిడకర్ణాటకరాజ్యములను పాలించుచుండిన నితని సోదరులిరువురును స్వతంత్రులవలె వ్యవహరించుచు కష్టముల కాదుకొనకపోయినందున యేకాకీయై తరతరము పైకొనివచ్చు మహమ్మదీయ వాహినుల నెదురొక్కనవలసివచ్చెను. అమరనాయకులు పెక్కండ్రు స్వార్థపరులై జాతిదేశ స్వామిద్రోహములకు వెనుదీయక శత్రులను గలయుచువచ్చిరి.

శ్రీరంగరాయలు పరాక్రమశాలియైన నరపాలుడుగాడు. అప్పటి విషమపరిస్థితులలో శత్రుభంజనముగావించి రాజ్యమును భద్రముగ పరిపాలింపగల శక్తిసామర్థ్యములతనికిలేవు. శ్రీరంగరాయలకాలమున మహమ్మదీయ దండయాత్రలు రెండు విజయనగరసామ్రాజ్యముపై

వచ్చినవి. ఇందు మొదటిది విజాపురసుల్తానగు ఆలీఆదిల్‌శాహు పక్షము నుండి వచ్చినది; తిరుమలరాయలకాలములో నతడు పెనుగొండను సాధింప సమకట్టి రెండుమూడుపర్యాయము లెత్తివచ్చెనని ముందు చెప్పియున్నది. ఆయుద్దేశమునంతటితో త్యజింపక శ్రీరంగరాయలు గద్దెనెక్కినపిమ్మట మునుపటికంటె సమయమనుకూలమని తలంచి గొప్ప సైన్యమును గూర్చుకొని హండేవారు మున్నగు స్వామిద్రోహ పరులైన రాయసామంతులు తోడునడువ పెనుగొండమీదికెత్తిపోయి యా దుర్గమునకు ముట్టడివేసెను.

దండయాత్ర వచ్చుచున్నదనువార్త వినగానే శ్రీరంగరాయలు దుర్గసంరక్షణమును సవరము చెన్నప్పనాయకుని కప్పగించి రాయ భండారమునందలి ధనరాసులను అనర్ఘ్య భూషణాంబరవస్తు సమస్తమును వెంటదీసికొని చంద్రగిరిని చేరెను. రాయలు త్యజించిపోయినను చెన్నప్పనాయడు దుర్గసంరక్షణమున దన యావచ్ఛక్తి వినియోగించి యాదిల్‌శాహు సైన్యమును యుద్ధరంగమున చించిచెండాడి పంచబంగాళ ముగావించెను. చెన్నప్పనాయకుడిట్లు ఆదిల్‌శాహు పంపులతో బోరు చుండగా శ్రీరంగరాయలు రాజనీతిని ప్రయోగించి దండయాత్రకు అవ ష్టంభనము గావించెను. హొండేవారికి లంచమిచ్చి ఆసచూపి వారిని ఆదిల్‌శాహు పక్షమునుండి వేర్పఱచుటయేకాక విజాపురసైన్యములను దాక్కొని హింసపెట్ట బురికొల్పెను. ఆదిల్‌శాహునకు శత్రువైన ఇబ్రా హిం కుతుబ్‌శాహుతో సంధిచేసికొని యతనిని విజాపురరాజ్యముమీది కెత్తిపోవునట్లేర్పాటుగావించెను. ఇట్లు పరిస్థితులు ప్రతికూలమై మారగా యాదిల్‌శాహిక విజయనగరరాజ్యము మీదాడి సాగించుట సుసాధ్యము గాదని గుర్తెఱిగి దండును మరల్చుకొని నిజరాజ్యమునకు తిరిగి పోయెను.

ఆదిల్‌శాహు నిష్క్రమణమువలన శ్రీరంగరాయల కష్టము లీ డేరలేదు. కుతుబ్‌శాహుతోడి మైత్రి ముల్లుపుచ్చి కొట్టడచినట్లాయెను. ఇబ్రాహింకుతుబ్‌శాహు రాజ్యతృష్ణాతురుడైన ప్రభువు; కృష్ణ కివ్వలి తెలుగుదేశమును దనయేలుబడిక్రిందికి దెచ్చుకొన నుద్యమించి సమ

యము వేచియుండెను. కావున విజయనగరరాజ్యమున దినదిన ప్రవర్ధమానమై యభివృద్ధినొందుచుండు నరాజకస్థితులను గమనించి దాని జయించుట కదియె యదనని గ్రహించి గొప్పసైన్యము నొకదానిని 1578 - 79 లో విజయనగరసామ్రాజ్యాంతర్గతములయిన కొండవీడు ఉదయగిరి రాజ్యములను జయించుటకంపెను. ఇట్లు కుతుబ్‌షాహీ దండయాత్రకు గురియైన రాజ్యములను రెంటిని సంరక్షించుటకు శ్రీరంగరాయ లెట్టి ప్రయత్నమును జేసినట్లగపడదు. వెల్లోటివారు మున్నగు రాయసామంతులును దొరలును స్వామిద్రోహపరులై కుతుబ్‌షాహుకడ లంచములు పుచ్చుకొని కొండవీడు మొదలైన ముఖ్యదుర్గములను శత్రువుకు గైవసముజేయుటవలన పైబేర్కొనిన రెండురాజ్యములు రెండును అల్పకాలమునసె తురకాణ్యమున గలసిపోయినవి. కాని యీదండయాత్రసందర్భమున సర్వత్ర గోలకొండవిజయము చేకూరలేదు. క్రీ.శ. 1578 - 79 లో గోలకొండ సైన్యాధిపతియైన రాయరావను మహారాష్ట్ర బ్రాహ్మణుడు హొండేవారితో నేకీభవించి యహోబళనరసింహస్వామి దేవాలయమును దోచుకొని యాప్రాంతసీమల నాక్రమించుకొనగా శ్రీరంగరాయల నియోగమున తెలుగుచోళవంశజులైన కొండాగ్రిజువారు గోలకొండదళములను యుద్ధముననోడించి యహోబళస్వామి యాలయమున యథాపూర్వము పూజాపురస్కారములు సాగుటకు తగిన యేర్పాటుజేసిరి. మఱియు వేంకటపతిరాయల పంపున సైన్యము చంద్రగిరినుండి బయలు వెడలి యుదయగిరిపై నడచి గోలకొండతాణ్యములను బారదోలి దుర్గమును తదాశ్రయ రాష్ట్రమునుజయించి స్వాధీనముజేసికొనెను. ఈ విజయము చేకూరినపిమ్మట కొన్నిదినములకె శ్రీరంగరాయలు క్రీ. శ. 1585 - 86 లో స్వర్గస్థుడాయెను.

## రెండవ వేంకటపతిదేవరాయలు

(1585-86 — 1614)

శ్రీరంగరాయలకు సంతతిలేదు. వారసత్వహక్కునుబట్టి చూడ శ్రీరంగరాయల యనంతరము సింహాసనము నధిష్ఠించవలసిన వాడతని

తమ్ముడు రామరాజు. అతడు అన్నకుముందె లోకాంతరగతుడాయెను. అతనికి తిమ్మరాజు శ్రీరంగరాజు అను పుత్రులిరువురు కలరు. వీరు బాలురగుటచేత వీరికప్పటి విషమరాజకీయ వాతావరణమున రాజ్యపాలనము సేయదగిన శక్తి సామర్థ్యములులేవు. కావున సామ్రాజ్యశ్రేయస్కాములైన సామంతభూపాలురందఱును వారిని ద్రోసిపుచ్చి యౌవ్వనవంతుడును శూరాగ్రేసరుడునునైన శ్రీరంగరాయల కడపటితమ్ముని వేంకటపతిదేవరాయలను రాయసామ్రాజ్యమున కధిపతిగ నెన్నుకొనిరి.

వేంకటపతిదేవరాయల రాజ్యమొక మహమ్మదీయ దండయాత్రతో ప్రారంభమైనది. గోల్కొండసుల్తాను ఇబ్రాహీమ్ కుతుబ్‌షాహు క్రీ.శ. 1580 లో కాలగతినందెను. ఆతనివెనుక గోలకొండ సింహాసనమునధిష్ఠించిన యతని కుమారుడు మహమ్మద్‌కుల్లీకుతుబ్‌షాహు పితృమార్గమునననుసరించి రాజ్యమును విస్తరింపదలపెట్టెను. మొట్టమొదట నతడు శ్రీకాకొలను పర్యంతవ్యాప్తమైన తీరాంధ్రదేశమును జయించి వశపఱచుకొనెను. తరువాత క్రీ. శ. 1590 ప్రాంతమున విజయనగర సామ్రాజ్యము జయింపనుద్దేశించి గొప్పసైన్యముతో కర్నూలు మండలములోని ముసలిమడుగుకడ కృష్ణనుదాటి కందనవోలు రాజ్యమును ప్రవేశించెను. హఠాత్తుగ నీ దండయాత్ర రాయసామ్రాజ్యముపై బడినట్లున్నది. వేంకటపతిదేవరాయలు దానినెదుర్కొన నెట్టిప్రయత్నమునుజేసినట్లగపడదు. కందనవోలు, నంద్యాల, గండికోట, గుత్తి మొదలగు ప్రబలదుర్గములన్నియు నచిరకాలమున కుతుబ్‌షాహునకు హస్తగతములాయెను. చిటచివరకాతడు పెనుగొండపై నడచి యాదుర్గమునకు ముట్టడివేసెను. వేంకటపతిరాయలు స్వయముగ దుర్గసంరక్షణ కార్యమునను నిర్వహించినను కోట కాపుబలమును వస్తుసామగ్రియు చాలకపోవుటచే నాయాపద గడవబెట్టుటకు మాయోపాయము నవలంబించెను. తాను కుతుబ్‌షాహునకు లోబడి యతనికి పెనుగొండను కైవసముగావించుటకు సంసిద్ధుడెయున్నాననియు, నుభయరాజ్యములకును స్థిరమైన సంది కుదిరినపిమ్మట యాకార్యమును నెరవేరుననియు, సంధిసంప్రతింపుల సాగించుటకు గొంతవ్యవధి వలసియున్నదనియు, నంతదనుక యుద్ధము

నాపవలసినదనియు రాయబారులమూలమున వర్తమానమంపెను. హిందువుల పరాజయము సంపూర్ణమైనదనియు వారిక తలయెత్త జాలరనియు విశ్వసించినవాడగుటచేత మహమ్మదుకుల్లీకుతుబ్‌షాహు వేంకటపతిదేవరాయలు కోరికమేరకు ముట్టడిలేపి పెనుగొండకు కొంతదూరముపోయి దండు విడిచియుండెను. అంతట వేంకటపతిదేవరాయలు రహస్యరహస్యముగ సామ్రాజ్యముయొక్క నాలుగుచెరగులనుండియు సామంతనాయకుల బలములను కోటలోనికి రప్పించి వలయువస్తుసామగ్రిని సమస్తమును పుష్కలముగ సమకూర్చి కోటను శత్రుదుర్భేద్యముగా నొనరించి మహమ్మదీయులపై బహిరంగముగ కత్తులు నూరనారంభించెను. అంతట కుతుబ్‌షాహు రాయల కృత్రిమమునకు గినిసి యతని శిక్షించుటకు వీడు గదల్చుకొనిరాగా నిరువాగువారికిని భీకరసంగ్రామము పొసగినది. యుద్ధరంగమున మట్లి అనంతరాజు తంజావూరు రఘునాయకుడు వెలుగోటి కస్తూరిరంగప్పనాయకుడు మున్నగు శూరులు ప్రళయకాల రుద్రమూర్తులపైకొని విజృంభింపగా కుతుబ్‌షాహీదళములు తాళజాలక వెన్నిచ్చి పాతిపోయిరి. వేంకటపతిదేవరాయలు శత్రువులను వెన్నంటి తరుముచుపోయి తురకలకు హస్తగతములై గుత్తిగండికోట మున్నగు దుర్గముల ననేకములను స్వాధీనపఱచుకొనెను. కడపప్రాంతమున పినాకినీతీరమున ఉభయపక్షమువారికిని మరల భీకరసంగ్రామము సంఘటిల్లెను. తురకఫౌజు చత్రాతిమీది పోకలవలె చిదిగిపోయినని. హతశేషులు ప్రమకుజీవుడాయని పరువిడి కృష్ణానది యవ్వలిగట్టుచేరి తిరిగిచూచిరి. పినాకినీ రణరంగమున వేంకటపతిరాయలకు సంపూర్ణ విజయమబ్బుటవలన తురకల హావిడి తొలగి రాజ్యములోని కంటకములను నిర్మూలముగావించి శాంతిభద్రతలను నెలకొల్పుట కవకాశమగ్గలైను.

క్రీ. శ. 1595 - 1596 ప్రాంతమున రాయలసీమలో సామంతులనేకులు వేంకటపతిదేవరాయల యాధిపత్యము నంగీకరింపక తిరుగుబాటుచేసిరి. ఇప్పటి కడపమండలములోని సిద్ధవటమును రాజధానిగ జేసికొని యాచుట్టుసీమలను బాలించుచుండిన కొండ్రాజువారును నంద్యాల

గండికోటదుర్గముల కధిపతియైన నంద్యాల కృష్ణమరాజును మొరసునాటి ప్రభువైన తిమ్మపగౌడును వీరిలో ప్రముఖులు. వీరి తిరుగుబాటునకు వాస్తవమైనకారణమేమొ తెలియదు. కారణమెద్దియైనను రాయలకు గప్పమునీయక స్వతంత్ర ప్రభువులవలె ప్రవర్తింపగడగిరి. వేంకటపతి రాయలు పట్లివారు వెలుగోటివారు దామెల్వారు మొదలగు మన్నె సామంతులు నిజబలముల తోడునడువ విప్లవకారులపై దండువెడలెను. మట్లియెల్లమరాజు స్వభూతపరాక్రమముచే కొండ్రాజువారి జయింపగా వేంకటపతిరాయలు కొండ్రాజువారిదైన సిద్ధవటరాజ్యము నతనికిచ్చెను. తరువాత క్రీ. శ. 1597 - 1598 లో జంబులమడుగువద్ద జరిగిన ఘోర సంగ్రామమున నంద్యాల కృష్ణమరాజును నతనికి బాసటయై వచ్చిన కందనవోలు గోపాలరాజును పరాభూతులై వేంకటపతిరాయలకు పట్టు వడిరి. అతడు వారిని వధింపక బందీకృతులనుగావించి చంద్రగిరికి గొంపోయి యచటి కారాగారమును నిర్బంధముననుంచెను. వెలుగోటి కస్తూరిరంగపనాయకుడు తమ్మపగౌరని తారసిల్లి యుద్ధమున నోడింపగా నతడు శరణువేడి రాయలకు గప్పముకట్టనొడబడెను.

వేంకటపతిదేవరాయలు ఉత్తరప్రాంత యుద్ధములందు నిమగ్నుడై యుండగా దాక్షిణాత్యనాయకులు దమ వాంఛితార్థసిద్ధికి చక్కని యవకాశము లభించెనని యెంచి స్వాతంత్ర్యస్థాపనోద్యోగ నిరతులై రాయలను సరకుగొనక కప్పముగట్ట మానుకొనిరి. వీరిలో ముఖ్యుడు వేలూరి లింగమనాయకుడు. ఇతనికి చెంచి మధురనాయకులు బలసహాయులై నిలచిరి. వెలుగోటివారు పెమ్మసానివారు మట్టివారు మొదలగు నాయకసామంతులు నిజదళములతో వెంటనడువ వేంకటపతిదేవరాయలు క్రీ. శ. 1601 లో దండువెడలి మొదట వేలూరు లింగమనాయని మిన్నలి బయలున యుద్ధమున నోడించి యతని యేలుబడిక్రింది సీమలను స్వాధీనపఱచుకొని వేలూరును తనకు రాజధానిగ జేసికొనెను. అదిమొదలు వేలూరునకు రాయవేలూరను పేరు రూఢియాయెను. తరువాత దక్షిణదేశముపై కూచిచేసిపోయి తంజావూరునాయకునిగూడ లాత్తూరుకడ యుద్ధపరాభూతుని గావించెను. అటుపిమ్మట కావేరి నుత్తరించి పాండ్య

మండలమును ప్రవేశించి మధురరాజ్యమును పాడుచేసెను. దాక్షిణాత్య నాయకులు సర్వత్ర పరాజితులయి రాయరాణువ ధాటికాగజాలక తాము రాయభండారమునకు చెల్లించవలసిన కప్పముగట్టి సంధిచేసికొనిరి. వేంకటపతిదేవరాయలు తాను రాజ్యమును పాలించిన ఇరువదియెనిమి దేండ్లును యుద్ధములందు నిమగ్నుడై యుండినను దేశపాలననుండి దృష్టిని మరల్పక ఆర్థికపరిస్థితులను బాగుచేసి దేశాభివృద్ధికి పాటు పడెను. రాక్షసితంగడి యుద్ధానంతరము మహమ్మదీయుల హావిళ్ళమూల మున కలిగిన యర్థిక వినాశనమును చక్కబెట్టి రాజ్యమున సంపదాభి వృద్ధిసేయుటకు ఘనప్రయత్నము గావించెను. దేశమునుండి పాతిపోయి యుండిన కృషీవలులను మరల రప్పించి పాడుపడియుండిన యూళ్ళను మరల జనావాసములు గావించి బీడుపడియుండిన భూములను సాగుబడి క్రిందికితెచ్చి పైరుపంటలకు బెంపొందించెను. ఇంచుమించున దేశము మరల ధనధాన్యము కిరవై యలరారెను. దేశమున కొంతకుకొంత శాంతి భద్రతలు నెలకొనుటవలన వర్తకవ్యాపారములు రెక్కొనుట కవకాశము గల్గెను.

విజయనగరసామ్రాజ్యమును పాలించిన యారెవీటి వంశజులలో నెల్ల వేంకటపతిదేవరాయలు కడు గొప్ప ప్రభువు. శ్రీరంగరాయల దౌర్బల్యకారణమున విజయనగరసామ్రాజ్యముపై పొంగి పొరలివచ్చిన మహమ్మదీయవాహినికి చెలియలికట్టవలెనడ్డుపడి దాని పొంగణచి మేర పట్టిన పరాక్రమశాలి. కేంద్రప్రభుత్వముయొక్క సత్యహీనత నవకా శము చేసికొని చక్రవర్తిని సరకుసేయక స్పర్ధాళువులై మన్నాసచే యొండొరులతో బెనగులాడుచుండిన సామంతామరనాయకాది యంత ర్వైరివర్గముయొక్క దర్పమడచి సామ్రాజ్యపు నాలుగు చెఱగుల దన యధికారమును నెలకొల్పిన శూరశిఖామణి. బాహాబలయుతోపాటు ధీశక్తియు నయవిజ్ఞానమునుగలిగి రాజ్యతంత్రమును నేర్పుమీర నిర్వ ర్తించుచు రాయసామ్రాజ్యముయొక్క కీర్తిని దేశాంతర ఖండాంతరము లందు బాదుకొల్పిన ప్రజ్ఞాధికుడు. వేంకటపతిదేవరాయలు దన పూర్వి కుల మార్గము ననుసరించి హిందూధర్మమును పోషించెను: సంస్కృతిని

బెంపొందించెను. కళావిదుల కాశ్రయమిచ్చి సంగీతనాట్య చిత్రలేఖనాదుల యభివృద్ధికి దోహదమిచ్చెను. వేంకటపతిదేవరాయలు వీరవైష్ణవుడు. తిరుపతి వేంకటేశ్వర పెరుమాళ్భక్తుడు; కోటికన్యాదానము లక్ష్మీ కుమార తాతాచార్యులవారి శిష్యుడు. రాయల యాశ్రయమున వీరవైష్ణవము ప్రబలి దేశమునందెల్లయెడల వ్యాపించెను.

వేంకటపతిదేవరాయలప్పటి సాంఘికాచారము ననుసరించి పెక్కురు రాజకన్యలను వివాహమాడినను అతనికి సంతానము కలుగ లేదు. కావున నతడు తన యనంతరము సింహాసనాధిపత్య మెవ్వరికి చెందవలెనను సమస్యను తీర్మానించుకొనవలసివచ్చెను. అతనికి సన్ని హితవారసులు అతనియన్న కర్ణాటప్రాంత రాజప్రతినిధియైన రామరాజు పుత్రులగు తిరుమల శ్రీరంగరాజులను వారలిరువురు. వేంకటపతిదేవ రాయ లేకారణమువల్లనో తిరుమలుని ద్రోసిపుచ్చి యతని తమ్ముడగు శ్రీరంగని తనకు వారసుడని ప్రకటించి తనయనంతరము సింహాసనాధి పతియని నియమించెను. కాని యతడు చేసిననియమము రాణీవాసమునను బంధువర్గమునందును సామంతామంత్రామాత్య నాయకులలోను పెక్కం డ్రకు నచ్చలేదు. రాయల బావమరదియగు గొబ్బూరుజగ్గరాజును నతని కోవవారును వీరిలోముఖ్యులు.

వేంకటపతిరాయలకు సంతానముకలుగలేదని మీద చెప్పియున్నాము గదా ! కాని యతని రాణులలోనొక్కతె గొబ్బూరివారింటి యాడబడుచు బాయమ్మయనునామె కైవికముగ సంప్రాప్తమైన వంధ్యత్వమునకు మనో వ్యధనంది యాకారతను దాపుకొనుటకై తాను గర్భవతినని ప్రకటించి తదనుగుణమైన వేషమును ధరించిన మాసములు నిండినపిమ్మట నప్పుడే జననమందిన బ్రాహ్మణశిశువును రహస్యముగ నగరిలోనికి దెప్పించుకొని తనకు పుత్రుడు కలిగెనని ప్రకటించెను. ఈ గుట్టు వేంకటపతిదేవరాయ లెఱుగనిదికాదు; కాని బాయమ్మయందతనికిగల ప్రేమాతిశయమువలన నామెమదిని నొప్పింపనొల్లక తానేమియు నెఱుగ నట్లు నటించుచు నాకృత్రిమపుత్రుని వాస్తవపుత్రునివలె జూచుచు రాజ

కుమారునకు దగినరీతిని పెంచి పెద్దవానినిజేసెను. జగ్గరాజు ఈ కృత్రిమపు పుత్రుని రాయలనుజేసి యాతని ముందుంచుకొని సామ్రాజ్యాధికారమును హస్తగతముగావించుకొనుటకు నిశ్చయించెను. రాయసంద ర్శన నెపమున నతడు సపరివారుడై వేలూరికివచ్చి వంచనచేసి శ్రీరంగ రాయలను బందీకృతునిగావించెను. తరువాత నతని పదచ్యుతునిజేసి, కృత్రిమపుత్రుని రాయసింహాసనము నెక్కించి యాతనిపేర సామ్రాజ్య పాలన సేయదొడగెను.

ఈ విప్లవమును సామంతామర నాయకులెల్ల నంగీకరించి మిన్నక యుండిరి. కాని వెలుగోటి ఏచమనాయడు మాత్రము మెండొడ్డి జగ్గ రాజును ప్రతిఘటించెను. ఏచమనాయడు వెలుగోటి కస్తూరి రంగప్ప కుమారుడు; రణశూరుడు; రెండవ వేంకటపతిదేవరాయలకు దక్షిణ భుజమై వేలూరి లింగమనాయనికి చుక్కవాలై యతని రాజద్రోహకృత్య ములను సాగనీయక విఘ్నముగావించి వాసికెక్కెను. వేంకటపతిదేవ రాయల యెడల నాతనికిగల భక్తివిశేషమువల్లను, రెండవ శ్రీరంగ రాయల పట్టునగల కూరిమి పెంపునను నతడు జగ్గరాజునకును నతనివంక వారికిని ప్రతికక్షియై నిలచి శ్రీరంగరాయల నెట్లయిన బంధవిముక్తుని గావించి సింహాసనముపై పునరధిష్ఠితుని గావింతునని ప్రతిజ్ఞగావించెను. తన ప్రతినను నెఱవేర్చుకొనుట కీతడుచేసిన ప్రయత్నములెన్నియో కలవు. వానిలో ముఖ్యమైనవానిని మాత్రమిచట పేర్కొనినచాలును. శ్రీరంగరాయల పుత్రులలో నొక్కడైన రామరాజును చాకలిమైల మూట లలో దాచి కారాగారమునుండి వెలుపలికి దెప్పించి తనయండ జేర్చు కొనెను. కాని రాయలను కుటుంబముతోగూడ విడిపించుటకత డొనర్చిన ప్రయత్నము వితయగుటయెకాక యనర్థకారియాయెను. జగ్గరాజు కుపితుడై శ్రీరంగరాయలును నతనిసంతతియు మనియుండిన తన మేన ల్లుని యాధిపత్యము స్థిరముకాజాలదని నిశ్చయించి వారినందరిని కారా గారమునందె వధించెను. రాయలు సకుటుంబముగ సంఘాతమరణము నందెననువార్త సామ్రాజ్యప్రజలలో గొప్ప సంక్షోభముగల్గించెను. జగ్గ రాజుపై నందఱికేనగింపు జనించెను. అతని దారుణకృత్యమునకు రోసి

యందాక నతనికి సహాయులై యుండిన నాయకులనేకులతని ద్వజించి యేచమనాయని పక్షమవలంబించిరి. అంతట ఏచమ తన సంరక్షణయం దుండు శ్రీరంగరాయల పుత్రుడు రామరాజు సామ్రాజ్యాధిపతియని ప్రక టించి బలములగూర్చుకొని జగ్గరాజుపై యుద్ధమునకు నడచెను. జగ్గరాజు రణరంగమున పెకు్కపర్యాయముల పరాజయమునంది యేచమనాయని ధాటికాగజాలక ద్రావిడదేశమునకు బారిపోయి చెంజి మధురనాయక రాజుల సహాకారమును బొంది మరల ఘనమైన యుద్ధప్రయత్నములు జేయదొడగెను. కాని యేచమ యతడు తనపై నెత్తివచ్చువరకును వేచి యుండలేదు. తంజావూరు పాలకుడైన రఘునాథనాయకునితో సఖ్యము జేసికొని తన పౌజుతోగూడ గదలిపోయి యతనితో నేకీభవించి తోపూరుగ్రామముకడ జగ్గరాజుపై కూచిచేసిపోయెను. ఉభయబలములును దారసిల్లినపిమ్మట ఘోరసంగ్రామము పొసగెను; ఇరువాగులవారును పట్టుదలతో కొన్నిగంటలకాలము పోరాడిరి. తుదకు ఏచమనాయని పక్షమే జయమునందెను. జగ్గరాజును అతని ముఖ్యసహాయులైన మాక రాజాదులును యుద్ధమునసమ్మసిరి.పాండ్యతుండీర మండలాధిపతులు పరా జితులై పారిపోయిరి. అంతట ఏచమనాయడును తంజావూరి రఘునాథ నాయకుడును రామరాజును రాయపీఠమునెక్కించి పట్టాభిషేకము గావిం చిరి. రామదేవరాయలను నభిషేకనామమును వహించి యతడు రాజ్య పాలన మారంభించెను.

## రామదేవరాయలు

## ( 618 - 1629)

తోపూరుయుద్ధముతో నంతకుపూర్వము నాలుగు సంవత్సరముల నుండి రాయసామ్రాజ్యమును కలగుండువెట్టుచుండిన యంతఃకలహము సమసిపోలేదు; జగ్గరాజు మృతినొందినను యెవ్వరిపేర నతడు కలహ మును రేపెనో యా కృత్రిమపుత్రి డింకను సజీవుడై యుండెను, జగ్గరాజు సోదరుడగు యతిరాజుయొక్క కుమారిత నాత డుద్వాహము జేసికొని యుండిన కారణమున యతిరాజాతని పక్షమునవహించి యుద్ధకార్య

ముల నడుపగడగెను. కాని క్రీ. శ. 1518 లో గృతిమపుత్రుడుగూడ లోకాంతరగతుడాయెను. తరువాత యతిరాజు రామదేవరాయలతో సంధి కుదుర్చుకొని యతనిపక్షమున రాజకార్యములను నిర్వహింపగడగెను.

రామదేవరాయల రాజ్యపరిపాలన నిష్కంటకముగ సాగినదికాదు. అంతఃకలహము నవకాశముజేసికొని నాయకులనేకులు రాయల యధికారమును ధిక్కరించి స్వతంత్రులగుటకు ప్రయత్నములు సేయగడగిరి. యతిరాజుతో మైత్రిజేసికొనినపిమ్మట తత్పూర్వము రామదేవరాయలకు ప్రాపై నిల్చియుండిన యేచమనాయకాదు లతనికి విముఖులై తిరుగు బాటుగావించిరి. కావున రాజ్యమున శాంతిభద్రతలు నెలకొనలేదు. తాను రాజ్యపాలనమొనర్చిన పదిపండ్రేడులును రామదేవరాయలకు అనతులైన నాయకులతో పోరాటమును తుదకు వారిని లోబఱచుకొనగల్గెను. ఇంతటనే నతనికి నూటేండ్లును నిండి క్రీ. శ. 1629 లో కాలగతినందెను.

రామదేవరాయలకాలమున మరల మహమ్మదీయ దండయాత్రలు ప్రారంభమైనవి. రెండవ వేంకటపతిదేవరాయల పరాక్రమమునకు దాళ లేక రాయసామ్రాజ్యముపై యుద్ధములను మానుకొనియుండిన దక్కను మహమ్మదీయరాజులు జగ్గరాజు విప్లవమువలన గలిగిన సంక్షోభము నవ కాశముచేసికొని మరల దండెత్తివచ్చి దేశము నాక్రమించుకొనగడగిరి. విజాపురసుల్తానుడగు రెండవ అలీఆదిల్‌షాహు అబ్దుల్‌వహాబ్‌ఖానను హబిసీసర్దారుని యాధిపత్యముక్రిందికొంతసేనను కందనవోలు రాజ్య ముపైనంపి క్రీ. శ. 1624 ప్రాంతమున నారాజ్యమును జయించి స్వాధీ నముజేసికొనెను. నాయకులతో పోరాటమున నిమగ్నుడైయుండిన కార ణమున రామదేవరాయలు విజాపురసుల్తాను నెదురొక్కనుటకై యెట్టి ప్రయత్నమును జేయలేకపోయెను.

## ముమ్మడి వేంకటపతిదేవరాయలు

## (1629 - 1642)

రామదేవరాయలకు సంతులేమ; కావునతడు దన మరణకాల మప్పుడు అళియరామరాజు మనుమడైన పెద్దవేంకటపతిని తనకు వారసు

నిగ నంగీకరించి సామ్రాజ్యాధిపతిగ నియమించి మృతినందెను. వేంకట పతిదేవరాయలకు సామ్రాజ్యపీఠము పూసెజ్జగాక కంటకశయ్యయై పరిణమించినది. భాండాగారమున ధనములేదు; రాజ్యసంరక్షణకు దగిన బలములేదు. సామంతులును అమరనాయకులును నతని యాధిపత్యము నొప్పుకొనక స్వతంత్రులైరి. వీనికితోడు రెండవ శ్రీరంగరాయల యన్న తిరుమలరాజు సామ్రాజ్యపీఠము నధిష్ఠించుటకు హక్కులేదనియు ధర్మశాస్త్రానుసారము సామ్రాజ్యాధిపత్యము తనకు చెందవలసియున్నదనియు ప్రకటించి యల్లరులను లేపెను. నాలుగైదేండ్లకాల మీయల్లరులమూలమున దేశము కల్లవరపడియుండెను. క్రీ. శ. 1635 లో క్రుద్ధుడైన యమరనాయకుడొక్కడు తిరుమలరాజును యుద్ధమున నోడించి వధించెను. అంతట దేశమున కొంతశాంతి యేర్పడి వేంకటపతిదేవరాయలకు తనపదమును స్థిరపఱచుకొనుటకు కొంతయవకాశము చిక్కినది; కాని పశ్చిమమునుండి విజాపురమువారును ఉత్తరమునుండి సముద్రతీర మాగాణములగుండ గోలకొండవారును ఏకకాలమున పైనెత్తివచ్చిరి. స్వశక్త్యనుసారము వేంకటపతిదేవరాయలు రాజ్యమును సంరక్షించుటకు గొంత ప్రయత్నముజేసెను. కాని సర్వత్ర రణరంగమున పరాజయమే కలుగుటవలన శత్రులపరాక్రమమున కోర్వనేరక పర్వతప్రాంతములకు బాయన మొనర్చి యచటనే మృతినందెను.

## మూడవ శ్రీరంగరాయలు

(1642 - 1648)

మువ్వడి వేంకటపతిదేవరాయలుకు చిక్కరాయలను పుత్రుడుండినను అతడు తండ్రియనంతరము సింహాసనము నధిష్ఠింపలేదు. అతని పినతండ్రియగు చినవేంకటపతిరాయల కొమరుడును అళియరాయల కడగొట్టు తమ్ముడగు వేంకటాద్రియొక్క మనుమడయిన కందనవోలు గోపాలరాజునకు స్వీకారపుత్రుడునైన శ్రీరంగరాజు రాయసామ్రాజ్యమున కధిపతియాయెను. విజయనగరసామ్రాజ్యమును పాలించిన శ్రీరంగనామధారులైన ప్రభువులలో నితడు మూడవవాడగుటవలన నితనిని

చరిత్రకారులు ముమ్మడి శ్రీరంగరాయలని పేర్కొందురు. ఇతడు శక్తిసామర్థ్యములుగల ప్రభువే. కాని కాలవైపరీత్యమువలన సామ్రాజ్యమును నిలబెట్టుట కితడొనర్చిన ప్రయత్నములన్నియు విఫలములై పోయినవి.

శ్రీరంగరాయలు సింహాసనమెక్కినప్పుడు విజయనగరసామ్రాజ్యము శత్రుసముద్రమున బ్రుంగిపోవ సిద్ధమెయుండెను. స్వయమతని యేలుబడిక్రింద రాష్ట్రమునందు చాలభాగము శత్రుహస్తగతమెయుండెను. కర్ణాటపశ్చిమాంధ్రములను విజాపురసుల్తాను తీరాంధ్రదేశమును గోలకొండసుల్తానును ఆక్రమించుకొనియుండిరి. సామంతులు ఇతని యాధిపత్యము నంగీకరింపక యసతులైరి. నాయకులు స్వామిద్రోహపరాయణులై శత్రువులతో గుట్టులుసేయుచు నితని పదభ్రష్టునిసేయ ప్రయత్నములు సల్పుచుండిరి. ఆనతుల నణచి వశంవదుల గావించుకొనుటకు దగిన సైన్యములేదు. దళములను గూర్చుటకుగాని రాయభండారమున చిల్లిగవ్వయైనలేదు. ఈ పరిస్థితులలో నెట్లో యాతేడేండ్లకాలము బహిరంతర శత్రులతో బోరాడుచు రాయపీఠమును గూలిపోనీయక కాపాడెను. కాని తుదకతని శత్రులందరును ఏకీభవించి యతని పాటుదోలి యతనియేలుబడిక్రింది రాష్ట్రమును కర్ణాట పశ్చిమాంధ్ర పశ్చిమ తుండీరమండలములను విజాపురమువారును తీరాంధ్రపూర్వ తుండీరదేశములను గోలకొండవారును స్వాధీనపఱచుకొనిరి. చెంజి తంజాపుర మధురనాయకులు స్వతంత్రులైరి. తనరాజ్యము సమస్తమును పరహస్తగతముకాగా శ్రీరంగరాయలు కాలూది నిలువ తావులేక పూర్వమతని కరిగాపులైన నాయకులలో నొక్కడైన మైసూరు ప్రభువేలు రాష్ట్రమునుజేరి కొన్నియేండ్లకాల మచట నివసించియుండి మృతినందెను. శ్రీరంగరాయల పర్యవసానముతో రాయసామ్రాజ్యము సమాప్తినందినది. విద్యారణ్య యతీంద్రుని సహాయముచే హరిహరబుక్క భూమీశ్వరులు క్రీ. శ. 1336 లో నిర్మాణమొనర్చిన హిందూ సంస్థానము మూడువందల వర్షముల మించినకాలము దాక్షిణహిందూ స్వాతంత్ర్యమును గాపాడి తుదకిట్లు రూపుమాసిపోయినది.

విజయనగరసామ్రాజ్య పతనమునకు పెక్కుకారణములుగలవు. అందు ముఖ్యమైనది దాక్షిణాత్యాంధ్ర నాయకప్రభువుల స్వార్థపరాయణతయే చిరకాలము రాయసామ్రాజ్యముచే సంరక్షింపబడుచుండినందున దాక్షిణాత్య హిందూప్రజలును నాయకులును మహమ్మదీయోపద్రవమును విస్మరించిరి. కేవలము జాత్యైక్యమత్యముపై నాధారపడియుండెనని గ్రహింపక తురకలతో కుట్రలు సలిపి వారిని రాయలపై బురికొల్పి సామ్రాజ్యనాశనమునకు కారణభూతులైరి. కాని స్వామిద్రోహమువలన సంపాదించిన స్వతంత్రమును చిరకాలమనుభవింప నేరక యొకరిపిమ్మట నొకరు మహమ్మదీయ ప్రతాపాగ్ని కింధనమైపోయిరి. విజయనగర సామ్రాజ్య మెన్నడో నశించి కాలగర్భమున జీర్ణమైపోయినను రాయపీఠాధిపతులు దాక్షిణాత్య హిందూప్రజకొనర్చినమేలు స్థిరమైనిల్చినది. నేటివఱకును దక్షిణభారతమందు హిందూధర్మ సంస్కృతు లన్యసంపర్కముచే సంకరమంద కవి ఋద్ధస్థితి యుండగలుగుట వారి కృషిప్రభావమువల్లనే; తత్కారణమున హిందూజాతి మనియుండునంతకాలమును వారి చరిత్ర కీర్తనీయమై యొప్పారగలదు.

## పరిశిష్టము

గ్రంథమంతయు బూర్తియైన తరువాత "అచ్యుతరాయాభ్యుదయమ్" అను సంస్కృత కావ్యము నేను చూచుట తటస్థించినది. ఈ కావ్యము పండ్రెండుసర్గములు గలదియైనను నా కాఱుసర్గలు మాత్రము లభించినవి. ఇందు గృష్ణరాయని సవతితమ్ముఁడును, అతనికిఁ దరువాత విజయనగరరాజును అయిన అచ్యుతరాయల శౌర్యాదికములు వర్ణింపఁబడినవి. ఈ కావ్యము రాయలకు సమకాలీనుఁడగు శ్రీ రాజనాథ మహాకవిచే రచింపఁబడినది. కావున నమ్మఁదగిన చరిత్రాత్మకగ్రంథమైయున్నది. ఇది కావ్యమగుటచే నిందు వర్ణనాత్మకభాగ మెక్కుడుగానున్నను కష్టపడి వెతకినయెడలఁ జరిత్రాంశములును దొరకఁగలవు. నేను చూచినంతవఱకు దొరకిన చరిత్రాంశముల నిందుఁ బొందుపఱుచుచున్నాఁడను.

కృష్ణరాయులత్తల్లి కులకాంతయే :
భోగకాంతకాదు.

ఈ విషయమై కృష్ణరాయ చరిత్రలో మేము వ్రాసియున్నాము. ఆయంశమే ఈ గ్రంథమువలన స్పష్టపడుచున్నది. ఇందు నరసరాజు భార్యలలో ముగ్గురు పట్టమహిషులుండిరనియు, వీరందఱును రాచకన్నియలనియు, వీరిలో దిప్పాంబకు వీరనృసింహరాయడును, నాగాంబికకు కృష్ణరాయడును, ఓబాంబికకు నచ్యుతరాయడును పుట్టిరనియు స్పష్టముగా వ్రాయబడియున్నది. ఆ శ్లోకములను ఇచ్చట నుదాహరించుచున్నాను. ఈ శ్లోకములు ప్రథమస్థానములోనివి.

ఆద్యైరపి క్షోణిపతిప్రకాణ్డై
రాకాజనీయస్వయశోఽవతారః।
వసన్నతస్యాం వసుధాపతీనాం
కన్యామణీః కాశ్చన పర్వణీషిత్॥ 51

అర్థము—పూర్వపు రాజశ్రేష్ఠులుగూడ మనసుపడునట్టి నిజకీర్తి ప్రసారముకలిగి యా నరసరా జానగరములో వసించుచు, ననేక వసుధాధిపతుల కన్యారత్నములను వివాహమాడినవాడాయెను.

తిస్రోన్వపస్యే త్యభవన్నభీష్టా
స్తిప్పాంబికా తాసుచ నాగమాంబా।
పట్టాభిషిక్తాః పతిదేవతానా
ముత్తంసభూపామణిరోబమాంబా॥ 52

అర్థము—ఆభార్యలలో దిప్పాంబిక, నాగాంబిక, పతివ్రతలకు శిరోభూషణమగు ఓబమాంబ లను ముగ్గురా రాజునకు ప్రియులుగను పట్టపురాణులుగను నుండిరి.

తిప్పాంబికాయాం ద్విజసంప దేఽభూ
ద్విఖ్యాతిమా న్వీరనృసింహరాయః।
నాగాంబికాయాం నరసావనీన్ద్రోః
కీర్త్యాకరోఽజాయత కృష్ణరాయః॥ 53

అర్థము....ఆ నరసరాజునకుఁ దిప్పాంబ వలన బ్రాహ్మణుల సంపదకొఱకుఁ గీర్తిమంతుఁడగు వీరనృసింహరాయలును, నాగాంబిక యందు యశోనిధియగు కృష్ణరాయలును జన్మించిరి.

ఇవి యన్నియుఁ గృష్ణరాయఁడు పోయిన పదునేను సంవత్సరములలో వ్రాయఁబడిన యంశములు. వీనిముందర పుక్కిటిపురాణము లేమి పనికివచ్చును? కావున నాగమాంబ రాజపుత్రియనియుఁ బట్టమహిషియనియుఁ గృష్ణరాయలు సద్వంశజాతుఁడనియు నిశ్చయింప వలయును. రాయలు దాసీపుత్రుఁడనువార్త కలలోని వార్తగా నిశ్చయింప వలయును.

## సలకము తిమ్మాయ

ఈ గ్రంథమువలన సలకము తిమ్మాయ యచ్యుతరాయల బావ మఱఁదియని కానవచ్చుచున్నది. ఇందుఁ 'దిమ్మాయ' యను పేరులేదు. కాని సలకరాజ పుత్రుఁడని యున్నది. అచ్యుతరాయల భార్యయగు వరదాంబిక, సలకరాజునకుఁ గూతురయినట్లు ఈకింది శ్లోకములో వర్ణింపఁబడినది.

## మూఁడవసర్గము

మహత్తరే మానవలోకశాసితు
ర్మనోఽనుకూలా మహిషీపదేతదా।
కృతాభిషేకా సలకక్షితీశితు
ర్వరాత్మ జాసీద్వర దాంబికావధూఃll 48

ఈ సలకముతిమ్మరాజు రాయలయొద్ద సైన్యాధిపతిగా నుండెను.

## అచ్యుతరాయచరిత్రలోని కొన్నివిశేషాంశములు

అచ్యుతరాయలకు జిన్న వేంకటాద్రియని కుమారుడుండెను. పెదవెంకటాద్రియని రామరాజు తమ్మునికి బేరుండినందున గాబోలును ఇతనికి జినవెంకటాద్రియని పేరువచ్చెను. ఇతడు యువరాజ పట్టాభిషిక్తుడయ్యెను.

కేరళ దేశపురాజయిన తిరువచేశ్వరుడు విజయనగరపు రాజుల కంకితుడగు పాండ్యరాజుయొక్క రాజ్యమును హరించి, విజయనగర రాజుల శత్రుడగు చోళరాజునకు నాశ్రయమిచ్చెను. అందువలన గోపమువచ్చి యచ్యుతరాయలు యుద్ధయాత్రకు వెడలెను. దక్షిణ మార్గమున బయలుదేఱి చంద్రగిరి, తిరుపతి, కాళహస్తి, కాంచి, తిరువన్నామలై అనుస్థలములదాటి శ్రీరంగము చేరెను. అచ్చట దానుండి, సలకము తిమ్మయను తిరువచేశ్వరునిమీదికి బంపెను. ట్రావన్‌కూరు రాజులకు తిరువచేశ్వరులని బిరుదు నామము. సలకము తిమ్మయ మధుర మీదుగా బోయెను. తిరువచేశ్వరునకును, సలకము తిమ్మయ సైన్యములకు దామ్రపర్ణి నదియొడ్డున ఘోరమైన యుద్ధముజరిగి విజయనగర సైన్యమునకే జయముకలిగెను. తిరువచేశ్వరుడు శరణు చొచ్చెను. తిమ్మయ యాతని గాచి యతనికి నాతని రాజ్యమును, పాండ్య చోళ రాజులకు వారివారి రాజ్యములు నిచ్చెను.



BCZ

# MAHAMMADEEYA MAHAYUGAM PART I

BC

AOUA102B139



ADARSA GRANDHA MANDALI,
VIJAYAWADA-2.

Wrapper Printed at
Swatantra Art Printers
Vijayawada - 4

## మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| పుస్తకం సంఖ్య | AOUA102B139 |
|---|---|
| పుస్తకం పేరు | మహామ్మదీయ మహాయుగము01 |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | |
| వెనుక అట్ట | |
| మొత్తం పేజీలు | 323 |
| పెద్ద పైజా పేజీలు | No |
| ఖాళీ పేజీలు | CZBCZ |
| లేని పేజీలు | 1-4 |
| తయారు చేసినది | Bhargav Bhargav Lovaraju |
| పేజీలు విడదీసినది | |
| స్కాన్ చేసినది | |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |